www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శుక్రవారం | 19-1-2018 | పేజీలు: 20 + 16 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 188 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: విదియ మ. 12.22 తదుపరి తదియ; నక్షత్రం: ధనిష్ఠ తె. 3.28 తదుపరి శతభిషం; వర్జ్యం: శేషం ఉ. 7.12 వరకు; దుర్ముహూర్తం: ఉ.9.07-9.51; మ.12.49-1.33; అమృతఘడియలు: సా.4.01-5.47; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.00 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



మాదాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని పర్వత్‌నగర్‌లో పాత నేరస్థుడి నుంచి వివరాలు సేకరిస్తున్న డీజీపీ మహేందర్ రెడ్డి

2.18 లక్షలు!

తెలంగాణలో నేర చరితుల సంఖ్య ఇది

రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన సమగ్ర సర్వే.. ట్యాబ్‌లలో వివరాల నమోదు 2

టీఎస్‌కాప్ యాప్‌తో సంధానం.. కరుడుగట్టిన నేరగాళ్ల ఇళ్లకు జియో ట్యాగింగ్

పాత నేరగాళ్లకు పోలీసు సాయం.. పూర్తి వివరాలు సేకరించే వరకూ సర్వే: డీజీపీ



రూ.6 లక్షలు మించి నగలు కొంటే నిఘా! 10

నల్లధన కట్టడికి మరిన్ని చర్యలు

ప్రైవేటుతో కుమ్మక్కు!

ఆరోగ్యశ్రీ ట్రస్టులో కాసుల కక్కుర్తి

ఎం ప్యానల్లో చోటుకు ఒక రేటు.. తనిఖీలకు, బిల్లుల చెల్లింపులకు మరో రేటు

ఆస్పత్రుల నుంచి అధికారుల వసూళ్లు.. సౌకర్యాలు లేని ఆస్పత్రులూ జాబితాలో

నాలుగు నెలలుగా ప్రభుత్వం దృష్టి.. ఇప్పటికే 9 మంది అధికారులు ఔట్ 3

పైసా వసూల్- 2



ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న టీడీపీ నేత మోత్కుపల్లి

టీడీపీని టీఆర్ఎస్‌లో కలిపేద్దాం

పార్టీ పతనమవుతోందని అనిపించుకోవడం కన్నా విలీనమే మంచిది

చంద్రబాబుకు సలహా ఇస్తున్నా.. ఎన్టీఆర్ ఆత్మకూ శాంతి కలుగుతుంది

ఎన్టీఆర్‌కు నివాళి కోసం చంద్రబాబు హైదరాబాద్ వచ్చి ఉండాల్సింది

తెలంగాణలో పార్టీని అధినేత పట్టించుకోవడంలేదు: మోత్కుపల్లి

ఇది అమానుషం

తెలుగు ప్రజలున్నంత వరకూ టీడీపీ ఉంటుంది: రమణ

టీడీపీ శ్రేణులకు మోత్కుపల్లి క్షమాపణ చెప్పాలి: రేవూరి

పార్టీని చీల్చే కుట్ర: కొత్తకోట

ఓపిక అవసరం: లోకేశ్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో టీడీపీ పతనమవుతోందని అనిపించుకోవడం కంటే టీఆర్ఎస్‌లో విలీనం చేయడం మంచిదన్నారు. లేదంటే చంద్రబాబునాయుడు తెలంగాణలో గ్రామగ్రామానికీ పర్యటించి ఇతర పార్టీలకు దీటుగా

మిగతా 3వ పేజీలో...

కోటా బాట

రిజర్వేషన్ల పెంపుపై మా మాటే కరెక్ట్

మమ్మల్ని అనుసరించని వాళ్లకు డేంజరే

సీఎం కేసీఆర్ స్పష్టీకరణ

90% ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతమేనా?

దీనిపై పార్లమెంటు సమావేశాల్లో పోరాటమే

ఏపీ కంటే మేం చాలా చాలా ముందున్నాం

మేం 1,25,000 కోట్లు ఖర్చు చేస్తున్నాం

ఏపీలో 15-20 వేల కోట్లు దాటలేదు

రాష్ట్ర విభజన తప్పిదం కానే కాదు

తెలుగుకు అసలు గుర్తింపే లేదు

రెండో రాజధానిగా హైదరాబాద్ ఓకే

ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తులుండవు: సీఎం



హైదరాబాద్‌లో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్‌లో సీఎం కేసీఆర్, జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల పెంపు విషయంలో తన బాటలోకి రాని వాళ్లు డేంజర్‌లో పడతారని ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించారు. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఉండాలని ఆయన చెప్పారు. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు 90% ఉంటే వారికి 50 శాతం రిజర్వేషన్లు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. రిజర్వేషన్ల పెంపునకు పార్లమెంటు సమావేశాల్లో పెద్దఎత్తున పోరాటం చేస్తామని పునరుద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్‌తో తమకు

మిగతా 8వ పేజీలో...

తెలంగాణ పన్నుల రాబడిలో 40% ఆంధ్రావారిదే 8



వారంతా వస్తే ఏపీకి ఆర్థిక సమస్యలే ఉండవు

హైదరాబాద్‌ను కోల్పోవడంతో ఏపీ ఆదాయం తగ్గింది

నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్ వ్యాఖ్యలు



29 వస్తువులపై తగ్గిన జీఎస్టీ

ఈ నెల 25వ తేదీ నుంచి అమలు

జీఎస్టీ పరిధిలోకి పెట్రో ఉత్పత్తులు, రియల్టీపై వచ్చే భేటీలో నిర్ణయం 10

వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ

వస్తుసేవల పన్ను భారాన్ని కేంద్రం మరోసారి కొంతమేర తగ్గించింది! మెహెందీ కోన్ల నుంచి విభూతి దాకా.. 20 లీటర్ల బాటిళ్లలో నీళ్ల నుంచి వజ్రాల దాకా.. మొత్తం 54 విభాగాల్లో 29 వస్తువులపై పన్ను రేటును తగ్గించింది. అదే సమయంలో.. సిగరెట్ ఫిల్టర్ రాడ్లపై, నూనె తీయని తవుడుపై పన్ను రేట్లను పెంచింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నాయకత్వంలోని జీఎస్టీ మండలి గురువారం ఈ మేరకు నిర్ణయాలు తీసుకుంది. సవరించిన పన్ను రేట్లు ఈ నెల 25 నుంచి అమల్లోకి వస్తాయి. అలాగే.. పెట్రోల్, డీజిల్, రియల్ ఎస్టేట్ వంటివాటిని వస్తుసేవల పన్ను పరిధిలోకి తెచ్చే అంశాన్ని వచ్చే సమావేశంలో పరిశీలించేందుకు జీఎస్టీ కౌన్సిల్ సిద్ధమైంది.

జడ్పీటీసీల పునర్విభజన!

మండలం ప్రాతిపదికకు చెల్లు?.. సగటు జనాభాతో నియోజకవర్గాలు

550 జడ్పీటీసీల ఏర్పాటు?.. త్వరలోనే సర్కారు నిర్ణయం 2

3500 సగటుతోనే ఎంపీటీసీలు.. 30కి పెరగనున్న జిల్లా పరిషత్‌లు

3 ఏళ్లకే ఎన్‌పీఎస్ ఉపసంహరణ

నిబంధనల సడలింపు.. విత్‌డ్రాయల్ పరిమితి 25% 12

సీజేతో రెబెల్ జడ్జిల భేటీ

14

రోస్టర్‌పై ప్రతిపాదనలిచ్చిన నలుగురు న్యాయమూర్తులు

సహకార బ్యాంకుల ద్వారానే నోట్ల మార్పిడి?

12

ఈశాన్యంలో నగారా

త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్‌కు ఎన్నికల షెడ్యూల్ విడుదల

వచ్చే నెల 18, 27న పోలింగ్ 14

లంకయే శరీరం.. సాగరం సంసారం





శ్లో. దర్వోదగ్ర దశాననేంద్రియ మనోనక్తంచరాధిష్ఠితే
దేహేస్మిన్ భవ సింధునా పరివృతే దీనాం దశమాస్థితః
అద్యత్వే హనుమత్సమేన గురుణా సంబోధితార్థః సుధీః
లంకారుద్ధ విదేహరాజ తనయా న్యాయేన లాలప్యతే

ఈ శ్లోకం వేదాంత దేశికాచార్యుల 'సంకల్ప సూర్యోదయః' అనే నాటకంలోనిది. ఇందు 'సుందరకాండ' పరమార్థం సులభసుందరంగా బోధింపబడింది. లంకయే శరీరం. సాగరం సంసారం. రావణ కుంభకర్ణులు అహంకార మమకారాలు. ఇంద్రజిత్తు, అకంపన, అతికాయాది రావణ పరివారం కామక్రోధాదులు. విభీషణుడు వివేకం. లంకలో రావణునిచే నిర్బంధింపబడిన సీతాదేవి చేతన (జీవ) స్వరూప. హనుమరూప ఆచార్యుని ద్వారా లంకారూప శరీర (దేహాత్మ బుద్ధి) విధ్వంస పూర్వకంగా భగవానుడే జ్ఞానోపదేశం చేయించి చేతనుని (జీవుణ్ణి) ఉద్ధరిస్తాడు. సీతాదేవి లంకలో పతివియోగంతో పరితపిస్తూ సంసారం (జగత్తు)లోని జీవుని దీనస్థితిని తెలియజెప్పింది. సీత లంకా సంబంధమే జీవునికి దేహసంబంధం. వికృత రూపాలతో ఎందరో భయంకర రాక్షసస్త్రీలు ఆమెను చుట్టుముట్టి భయభ్రాంతం చేస్తున్నట్లుగానే అహంకార - మమకార, కామక్రోధ, రాగద్వేషాది అసురభావాలు జీవుణ్ణి పీడిస్తూ బాధిస్తూ ఉన్నాయి. మాయా మారీచుని కారణంగా సీతకు పతివియోగం జరిగినట్లుగా జీవునికి శబ్దస్పర్శాది మాయిక విషయ భోగాసక్తి వలన భగవద్వియోగం కల్గింది. విషయాసక్తుడు భగవద్విముఖుడవుతాడు. మైథిలికి మారుతి దర్శనం వలెనే జీవునికి ఆచార్య-దర్శనం. ఆంజనేయుని రామగుణానువాదం, రామకథాగానం వంటివే భక్తులకు, సాధకులకు పరమ భాగవత - భగవచ్చరిత్ర వర్ణనా ప్రధానాలైన గ్రంథాలు, కథలు, గాథలు, వ్యాఖ్యలు. సీతామాతకు హనుమ ద్వారా రామనామాంకిత ముద్రికా ప్రదానం లాంటిదే జీవులకు గురు కృపాపూర్వక తిరుమంత్ర - రామ మంత్రోపదేశం. వైదేహి లక్ష్మణ దూషణ కారణంగా రామవియోగం పొందినట్లు జీవునికి భాగవత అపచారమే భగవద్వియోగ హేతువు. భగవంతుడు రావణాది శత్రుసంహారం చేసి జానకి చెర విడిపించి అయోధ్యకు తెచ్చినట్లు, తనను శరణన్న భక్తుల వాసనామయ ప్రకృతి బంధాలను తొలగించి వారిని కూడా వైకుంఠధామానికి చేర్చుతాడు. అలా వారికి నిత్యసేవా కైంకర్య భాగ్యం కల్గిస్తాడు. శ్రీ సంప్రదాయ రీత్యా ఈ పరమార్థాలను గ్రహించి అనుభవించు విష్ణు భక్తులకు వారి వారి వాసస్థానమే వైకుంఠధామం.

-తంగిరాల రాజేంద్రప్రసాదశర్మ

Paramjyothi పరంజ్యోతి

లోకం తీరు



నిజంగానే రాయిలాగా మారిందయ్యా.. కావాలంటే చూడు...!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	7.8	30.5
రామగుండం	13.5	31.6
వరంగల్	14.0	31.0
హైదరాబాద్	15.4	31.5
ఖమ్మం	16.0	31.0





మ్యూజియంలోని చిరంజీవి ఫొటో వద్ద మంత్రి కేటీఆర్

జపాన్‌లో మన మెగాస్టార్ ఫొటో: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'జపాన్‌లోని ఓ చిన్న పట్టణం.. ఆ పట్టణంలోని మ్యూజియంలో మన మెగాస్టార్ చిరంజీవి ఫొటో.' అంటూ ట్విట్టర్ వేదికగా రాష్ట్ర ఐటీ, మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్.. చిరంజీవి ఫొటో చూపిస్తూ ట్వీట్ చేశారు. జపాన్ పర్యటనలో ఉన్న మంత్రి.. అక్కడి షిజ్వోకా ప్రావిన్సులోని హమామట్సు అనే చిన్న పట్టణంలో ఉన్న సుజుకి మ్యూజియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆ మ్యూజియంలో మెగాస్టార్ ఫొటో ఉండటం చూసి ఆశ్చర్యపోయారు. 'సుజుకి మ్యూజియాన్ని సందర్శించాను. పర్యటన చాలా అద్భుతంగా ఉంది, అయితే, ఇక్కడ ఎవరి ఫొటో చూశానో ఊహించగలరా? మన మెగాస్టార్ చిరంజీవి. మన మాతృభూమికి చెందినవారి ఫొటోను హమామట్సు లాంటి చిన్న పట్టణంలో చూడటం గర్వంగా అనిపించింది.' అని పేర్కొన్నారు.



బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో తల్లిదండ్రులు ఎన్టీఆర్-బసవతారకం విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న బాలకృష్ణ

60వ ఏట రామానుజాచార్య సినిమా చేస్తా

- నందమూరి బాలకృష్ణ

హైదరాబాద్, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన తత్వవేత్త, పదకొండో శతాబ్దానికి చెందిన రామానుజాచార్య జీవిత విశేషాలతో సినిమా చేయనున్నట్టు ప్రముఖ హీరో నందమూరి బాలకృష్ణ ప్రకటించారు. తన 60వ ఏట ఈ సినిమా చేస్తానని ఆయన తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో 'జై సింహా' చిత్రం సక్సెస్ మీట్‌లో, ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో బాలకృష్ణ పాల్గొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయనను గుర్తుచేసుకుంటూ తెలుగుజాతి ఆత్మాభిమానాన్ని కాపాడిన ధీరుడిగా అభివర్ణించారు. పేద ప్రజల కోసం ఎన్నో విప్లవాత్మక పథకాలను తెచ్చారని, ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం దక్కేలా కృషిచేస్తామన్నారు. కాగా ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఆయన కుటుంబ సభ్యులు, పలువురు టీడీపీ నాయకులు హాజరై నివాళులర్పించారు.

2,18,000

తెలంగాణలో నేరగాళ్ల సంఖ్య ఇది.. రాష్ట్రంలో ప్రారంభమైన సమగ్ర సర్వే

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చిన్నాచితక నేరాలు మొదలుకొని భారీ కుంభకోణాల వరకు పోలీసు రికార్డుల్లోకి ఎక్కిన నేరగాళ్ల సంఖ్య తెలంగాణలో 2.18 లక్షలుగా తేలింది. తెలంగాణను నేరరహితం చేయడంతోపాటు పోలీసింగ్‌లో టెక్నాలజీ వాడకాన్ని పెంచేందుకు నిర్వహిస్తున్న 'నేరగాళ్ల సమగ్ర సర్వే' గురువారం ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సర్వేలో హోంగార్డు నుంచి డీజీపీ వరకు పాల్గొన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో డీజీపీ మహేందర్‌రెడ్డి స్వయంగా పాల్గొని సర్వే తీరును పరిశీలించారు. 2 లక్షలకుపై గా నేరగాళ్లు ఉండడంతో ఒక్కరోజులో సర్వే పూర్తి కాలేదు. రికార్డుల్లో ఉన్న ప్రతి నేరగాడి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచే వరకు సర్వేను కొనసాగించనున్నారు.

నేరం తీరు ఆధారంగా నమోదు

ఎవరెవరు ఎటువంటి నేరాలు చేస్తారు!? ఎలా చేస్తారు? తదితర వివరాలను సర్వేలో సేకరిస్తున్నారు. ఉదాహరణకు, దొంగతనాన్ని ఒక్కో నేరగాడు ఒక్కో విధంగా చేస్తుంటాడు. కిటికీ ఊచలు తొలగించి ఇంట్లోకి ప్రవేశించడం.. తాళం విరగొట్టి, స్క్రూతో తలుపు తెరిచి.. ఇలా ఇంట్లోకి ప్రవేశించడంలో ఒక్కొక్కరిది ఒక్కో తీరు. భవిష్యత్తులో ఎక్కడైనా దొంగతనం జరిగితే, ఘటనా స్థలంలో లభించిన ఆధారాల మేరకు దర్యాప్తు అధికారి టీఎస్‌కాప్ యాప్ ను ఉపయోగించి వెంటనే గుర్తించడానికి వీలుంటుంది. జియో ట్యాగింగ్ కారణంగా పెట్రోలింగ్‌లో నేరగాడి గురించి ఆరా తీయడానికి వీలుంటుంది. తెలంగాణను నేరరహితంగా చేయడానికి ఈ సర్వే కీలకంగా మారనుంది.

నేరం చేయాలంటే భయపడాలి: డీజీపీ

రాష్ట్రవ్యాప్తంగా నేరగాళ్ల సమగ్ర సర్వే చేపట్టామని, దీనికి ప్రజల నుంచి మంచి సహకారం లభిస్తోందని డీజీపీ చెప్పారు. సత్ప్రవర్తనతో ఉన్న పాత నేరగాళ్లకు జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తివివరాలు సేకరించే వరకు సర్వే కొనసాగుతుందన్నారు. తెలంగాణలో సర్వే పూర్తి చేసిన తర్వాత ఇతర రాష్ట్రా ల నేరగాళ్ల వివరాల్ని సేకరి స్తామన్నారు. తెలంగాణలో నేరం చేసేందుకు భయపడటమే కాదు.. నేరం చేస్తే నూరు శాతం శిక్ష పడుతుందనే భయం అందరిలో కలిగించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాగా, నార్త్ జోన్ పరిధిలో 51 వేల మంది నేరగాళ్లు ఉన్నారని నార్త్ జోన్ ఐజీ వై.నాగిరెడ్డి చెప్పారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో 23,940 మంది నేరగాళ్లు ఉన్నారని వరంగల్ సీపీ చెప్పారు.



సమగ్ర నేరగాళ్ల సర్వేలో భాగంగా బోరబండ పర్వతనగర్‌లో నేరగాడి నుంచి వివరాలు సేకరిస్తున్న డీజీపీ

ఇతర రాష్ట్రాల్లోనూ...

ఇరానీ గ్యాంగ్, రామ్‌జీ నగర్ ముఠా, బవరియా గ్యాంగ్, చంపారన్ ముఠా, పటక్‌పూర్ గ్యాంగ్, టట్లు బాజీ గ్యాంగ్.. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ఇటువంటి రకరకాల ముఠాలు, గ్యాంగులు తెలంగాణలో నేరాలకు పాల్పడుతున్నాయి. బస్సు, రైలు, విమానంలో వచ్చి నేరాలకు పాల్పడి పోలీసులకు చిక్కకుండా వెళ్లిపోతున్నాయి. బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి నేరగాళ్లు తెలంగాణ ప్రాంతానికి వచ్చి వెళ్లినట్లు పోలీసు రికార్డుల్లో ఉంది. దాంతో, సర్వేలో భాగంగా తెలంగాణలో నేరాలకు పాల్పడ్డ అంతరాష్ట్ర ముఠాలు, నేరగాళ్ల సమాచారాన్ని కూడా సేకరించనున్నారు.

రాజకీయ నేరగాళ్ల సంగతేంటి!?

పోలీస్ శాఖ నిర్వహిస్తున్న నేరగాళ్ల సమగ్ర సర్వే పలువురు ప్రజా ప్రతినిధుల్లో వణుకు పుట్టిస్తోంది. నేరాలు చేసి ప్రస్తుతం ప్రజా ప్రతినిధులుగా చలామణీ అవుతున్నవారు తమ జాతకాలు తిరిగి బయట పడతాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాయకులుగా చలామణీ అవుతున్న పలువురిపై కేసులున్న విషయం తెలిసిందే. దాంతో, వారి వివరాలు ఎంత వరకు సేకరిస్తారనే సందేహాలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. అయితే, సర్వేలో ఎవర్నీ వదిలేది లేదని, పోలీస్ రికార్డుల ప్రకారం ప్రతి ఒక్కరి సమాచారం సేకరిస్తామని పోలీస్ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

సర్వే జరుగుతోందిలా..

పోలీస్ రికార్డులో ఉన్న చిరునామా ఆధారంగా తమ పోలీసు స్టేషన్ పరిధిలోని నేరగాడి ఇంటికి పోలీసులు వెళుతున్నారు. నేరగాడు ఇప్పుడు ఏం చేస్తున్నాడు? ఎక్కడున్నాడు? జీవనోపాధి ఏంటి? నేర ప్రవృత్తి కొనసాగిస్తున్నారా ? తదితర వివరాల్ని ప్రత్యేకంగా రూపొందించిన ప్రొఫార్మాలో నమోదు చేస్తున్నారు. నివాస ధ్రువీకరణ కోసం విద్యుత్ బిల్లు, పాన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్సులను; తాజా పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకుంటున్నారు. ఫోన్ నంబరు, ఈ-మెయిల్, ఫేస్‌బుక్ ఖాతా వివరాల్ని కూడా సేకరిస్తున్నారు. పాత నేరగాళ్లు అయితే, ఇప్పుడు ఏం చేస్తున్నారనే వివరాలు సేకరించి, పని చేస్తున్న సంస్థకు సంబంధించిన గుర్తింపు కార్డు కాపీ తీసుకుంటున్నారు. సర్వేలో సేకరించిన వివరాల్ని ట్యాబ్‌లో పొందుపరిచి, డేటాబేస్‌లో ఉంచుతారు. డేటాబేస్ నుంచి టీఎస్‌కాప్ యాప్‌కు అనుసంధానం చేస్తారు. కరుడుగట్టిన నేరగాళ్లు, మళ్లీ మళ్లీ నేరాలకు పాల్పడే వారి ఇంటిని జియో ట్యాగింగ్ చేస్తారు.

పాక్‌వి అబద్ధాలు.. మోసాలే

పాకిస్థాన్‌వి అబద్ధాలు, మోసాలు అంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు సరైనవే. పాక్ భూభాగంలో ఉన్న ఉగ్రవాద స్థావరాలపై చర్యలు తీసుకునేలా ఒత్తిడి పెంచేందుకు ఆ దేశానికి రక్షణ సహాయం నిలిపివేత సరైన నిర్ణయమే.

- వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి సారా శాండర్స్



అమెరికా సహాయం లేకున్నా బతకగలం

అమెరికా సహాయం లేకున్నా పాకిస్థాన్ బతకగలదు. దేశ సమగ్రత విషయంలో ఏమాత్రం రాజీపడబోం. అయితే, అమెరికాతో సమతుల్య సంబంధాలకు పాక్ ప్రయత్నిస్తోంది. ఇక నుంచి ఆఫ్ఘనిస్థాన్ నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పించం.

- పాక్ విదేశాంగ మంత్రి ఖవాజా ఆసిఫ్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.78	పాత ధర 67.63
కొత్త ధర రూ.75.92	కొత్త ధర 67.84
పెరిగింది : 14 పైసలు	పెరిగింది : 21 పైసలు

40 వేల టీచర్ పోస్టులు ఎక్కడున్నాయి?

- కె.లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్యలను ప్రశ్నించిన కడియం
- మోత్కుపల్లి వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాం: డిప్యూటీ సీఎం



హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్కూళ్లలో 40 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఎక్కడున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యలను మంత్రి కడియం శ్రీహరి ప్రశ్నించారు. రాష్ట్రంలో మొత్తం 1.22 లక్షల ప్రభుత్వ టీచర్ పోస్టులు ఉన్నాయని, అందులో ప్రస్తుతం 13 వేల ఖాళీలు మాత్రమే ఉన్నాయన్నారు. పదోన్నతుల కోసం కొన్ని పోస్టులు ఖాళీగా ఉంచి మిగిలిన 8,792 పోస్టులను టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్నామన్నారు. విద్యాశాఖలో అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలపై కడియం గురువారం సచివాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలను ప్రశంసించిన కేంద్రం ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేయాలని సూచిస్తుంటే రాష్ట్ర బీజేపీ నేతలు మాత్రం విమర్శిస్తున్నారన్నారు. తెలంగాణలో విద్యాశాఖలో చేపడుతున్న పథకాలపై తాను ఢిల్లీలో ఇటీవల జరిగిన కేబ్ సమావేశంలో ఇచ్చిన ప్రజెంటేషన్‌ను కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్ ప్రశంసించారన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ పాఠశాలలు, డైట్స్ ఏర్పాటు చేయాలని జావడేకర్‌ను కోరానన్నారు. ఐఐఎం, ట్రిపుల్ ఐటీ, ట్రైబల్ యూనివర్శిటీ, రీజినల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లను కూడా తెలంగాణలో ఏర్పాటు చేయాలంటూ సీఎం కేసీఆర్ స్వయంగా ప్రధానికి లేఖలు రాశారన్నారు. కేంద్రం నుంచి స్పందన లేకపోగా ఏపీకి 17 సంస్థలు కేటాయించారన్నారు. మోదీ హయాంలో విద్యకు ఏటేటా కేంద్ర నిధుల కేటాయింపులు తగ్గాయని, నిధులు పెంచాలని కేబ్ సమావేశంలో అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులు కోరిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రానికి కొత్త విద్యా సంస్థలు ఇవ్వాలంటూ కేంద్రానికి కేసీఆర్, విద్యాశాఖ రాసిన లేఖలను బీజేపీ నేతలు కె.లక్ష్మణ్, కిషన్ రెడ్డి, దత్తాత్రేయలకు పంపిస్తున్నామని, పలుకుబడి ఉపయోగించి ఆయా సంస్థలను రాష్ట్రానికి తీసుకొస్తే మంచిదన్నారు. కాగా, టీడీపీ-టీఎ్‌ను టీఆర్‌ఎస్‌లో విలీనం చేయాలన్న టీడీపీ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు వ్యాఖ్యలను స్వాగతిస్తున్నానని కడియం అన్నారు. నాడు తనలాంటి ఎందరో ఉద్యోగాలకు రాజీనామా చేసి తెలుగువారి ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీలో చేరారని.. నేడు కేసీఆర్ ఇచ్చిన పిలుపునకు స్పందించి చాలా మంది టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు.

జడ్పీటీసీల పునర్విభజన!

- మండలం ప్రాతిపదికకు చెల్లు?

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న జిల్లా ప్రాదేశిక నియోజకవర్గాల (జడ్పీటీసీ)ను విభజించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఒక్కో జడ్పీటీసీ పరిధిలోని జనాభాకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించి, సగటుకు కాస్త అటుఇటు జనాభాతో కొత్తవి ఏర్పాటు చేయనుంది. పునర్విభజనతో పలు జడ్పీటీసీల పరిధి 2 మండలాలకు విస్తరించే అవకాశం ఉంది. తెలంగాణలో జిల్లాల పునర్విభజనకు ముందు 10 జిల్లాలుండగా ఇందులో 9 గ్రామీణ జిల్లాలున్నాయి. వీటి పరిధిలో 438 మండల పరిషత్‌లు ఉండేవి. ప్రతి మండల పరిషత్ పరిధిని ఒక్కో జడ్పీటీసీగా ప్రభుత్వం గుర్తిం చింది. ఇక ఈ విధానానికి స్వస్తి పలకనుంది. రాష్ట్రంలో ఇప్పుడున్న 31 జిల్లాల్లో 30 గ్రామీణ జిల్లాలు. అంటే తదుపరి ఎన్నికలు నిర్వహించే నాటికి 30 జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేస్తారు. జిల్లాలతోపాటు మండలాలను విభజించారు. ఈ నేపథ్యంలో జడ్పీటీసీలను పునర్విభజించాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించింది. ప్రస్తుతమున్న మండలం యూనిట్ స్థానంలో సగటు జనాభా ఆధారంగా విభజన చేయనుంది. ఇప్పుడున్న ప్రకారమైతే 541 జడ్పీటీసీలు ఏర్పాటు కావాలి. ఇలా చేయడం వల్ల సమతుల్యత లోపించడం, జనాభా పరంగా భారీ వ్యత్యాసం చోటుచేసుకోనుంది. ఉదాహరణకు ఒక మండలంలో కేవలం 15 వేల జనాభా ఉంటే మరికొన్ని మండలాల్లో 50 వేలకు పైగా ఉన్నారు. ఇంతటి వ్యత్యాసం లేకుండా సగటు జనాభాతో జడ్పీటీసీలను ఏర్పాటు చేయాలని సర్కారు భావిస్తోంది. 541 మండలపరిషత్‌ల పరిధిలోని మొత్తం జనాభాను 541 జడ్పీటీసీలకు సమానంగా విభజించనుంది. సగటు జనాభాకు 10% ఎక్కువ లేదా తక్కువ ఉన్నా పరిగణించేలా విభజన చేయనున్నారు. లేదా మండల పరిషత్‌ల సంఖ్యతో సం బంధం లేకుండానే సంఖ్యను నిర్దేశించుకుంటా రు. ఈ సంఖ్యకు సమానంగా జనాభాను విభజిస్తారు. జనాభా సగటుతో విభజిస్తే అనేక జడ్పీటీసీల పరిధి 2 మండలాలకు విస్తరించనుంది.

3500 జనాభాతో..

మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల(ఎంపీటీసీ) పునర్విభజన కూడా అనివార్యమే. మండలాల విభజన జరిగిన నేపథ్యంలో కొత్త మండల పరిషత్‌ల పరిధిలో ఎంపీటీసీల విభజన జరగనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 6441 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. గతంలో ఎంపీటీసీ ల ఏర్పాటుకు సగటున 3500 జనాభాను ప్రామాణికంగా తీసుకున్నారు. 10% తక్కువ లేదా ఎక్కువ జనాభాను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సారి కూడా ఈ విధానాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా కొత్త జిల్లా పరిషత్‌లు, కొత్త మండల పరిషత్‌లు, త్వరలో ఏర్పాటు చేయనున్న జడ్పీటీసీలు, ఎంపీటీసీలను జిల్లా, మండల పరిషత్‌ల పాలకమండళ్ల పదవీ కాలం ముగిసిన తర్వాతే గుర్తించనున్నారు.

విభజన జరిగేది ఇలా... (అంచనాలు)

మొత్తం రాష్ట్ర జనాభా(గ్రామీణ)	2.20 కోట్లు సుమారు
500 జడ్పీటీసీలుగా విభజిస్తే సగటు జనాభా	45 వేలు
10 శాతం ఎక్కువ లేదా తక్కువ ప్రకారం	40500-49500
జడ్పీటీసీ జనాభాను 40 వేలుగా నిర్దేశిస్తే	550 స్థానాలు
10 శాతం తక్కువ లేదా ఎక్కువ ప్రకారం	36-44 వేల వరకు
మండల పరిషత్‌ల సంఖ్య ప్రామాణికమైతే	541 స్థానాలు
సగటు జడ్పీటీసీ జనాభా	40665
10 శాతం తక్కువ లేదాఎక్కువ ప్రకారం	36600-44730

కాళేశ్వరానికి 10 వేల కోట్లు ఇవ్వండి

- ప్రీ బడ్జెట్, కౌన్సిల్ సమావేశాల్లో ఈటల రాజేందర్
- సూక్ష్మ సేద్య పరికరాలపై జీఎస్టీ 12%కు తగ్గింపు

న్యూఢిల్లీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వచ్చే బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కోరారు. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అధ్యక్షతన విజ్ఞాన్ భవన్‌లో గురువారం జరిగిన 2018-19 బడ్జెట్ సన్నాహక సమావేశంలో, జీఎస్టీ కౌన్సిల్ మీటింగ్‌లోనూ ఆయన తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మీడియాతో మాట్లాడుతూ.. నీతి ఆయోగ్ సిఫార్సుల ప్రకారం మిషన్ భగీరథకు రూ.19,200 కోట్లు, మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్లు కేటాయించాలని కోరామన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న రైల్ కోచ్, గిరిజన యూనివర్సిటీ, స్టీల్ ప్లాంట్, ఎయిమ్స్ వంటి హామీలకు నిధులు కేటాయించాలని, హైదరాబాద్ మినహా 30 జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా గుర్తించి నిధులివ్వాలని అభ్యర్థించినట్లు తెలిపారు. పంట పెట్టుబడి చేయూత కింద రాష్ట్రం ఇస్తున్న ఆర్థికసాయం సమయంలో నగదు నిల్వలు బ్యాంకులో అందుబాటులో ఉండేట్లు చర్యలు తీసుకోవాలని అడిగామన్నారు. జీఎస్టీ కౌన్సిల్‌లో బీడీలపై సిగరెట్లతో సమానంగా 28% పన్ను విధించడం సరికాదని, దాన్ని తగ్గించాలని కోరినట్లు చెప్పారు. సూక్ష్మ సేద్యం పరికరాలను 18% శ్లాబు నుంచి 12శాతానికి తగ్గించేందుకు అంగీకరించారన్నారు. గతంలో 95శాతంగా ఉన్న పన్ను వసూలు ప్రస్తుతం 83 శాతానికి పడిపోయిందని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చామన్నారు. పన్ను ఎగవేత లేకుండా ఈ-వే బిల్లు అమలు చేయడం, మానవ ప్రమేయం తగ్గించి ఎగవేతలు లేకుండా కీలక నిర్ణయాలు తీసుకోవాలని కోరామన్నారు. పెట్రోల్, డీజిల్ ఉత్పత్తులపై కౌన్సిల్‌లో చర్చ జరగలేదన్నారు.




జైట్లీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక మంత్రుల సమావేశంలో ఈటల



జన్యు లోపాలకు రోబో చికిత్స

వాషింగ్టన్, జనవరి 18: కొంతమంది శిశువుల్లో పుట్టుకతో వచ్చే అన్నవాహిక లోపాన్ని సరిచేసేందుకు శాస్త్రవేత్తలు ఒక ఇంప్లాంట్ రోబోను సృష్టించారు. అన్నవాహిక రంధ్రం మూసుకుపోతే పిల్లలు పాలు తాగడానికి ఇబ్బందులు తలెత్తుతాయి. ఆ సమయంలో ఈ రోబోను లోపల అమర్చితే.. సెన్సర్ల సాయంతో కణజాలాన్ని లాగి కణజాలాలు ఉత్తేజితమయ్యేలా చేస్తుంది. కణాలు ఉత్తేజితమైతే కణజాలం పెరిగి అన్నవాహిక రంధ్రం వెడల్పు అవుతుందన్న మాట. ఈ సరికొత్త రోబోను అమెరికాలోని బోస్టన్ చిల్డ్రన్స్ హాస్పిటల్, హార్వర్డ్ మెడికల్ స్కూల్ పరిశోధకులు రూపొందించారు.



అతి చిన్న మెమరీ డివైజ్!

వాషింగ్టన్, జనవరి 18: తొలి హార్డ్ డిస్క్ మెమరీ సామర్థ్యం.. 5ఎంబీల కన్నా తక్కువే. కానీ, దాని పరిమాణం ఒక చిన్న గది అంత ఉండేది. సాంకేతికత అభివృద్ధి చెందిన కొద్దీ.. పరిమాణం తగ్గుతూ, మెమరీ సామర్థ్యం పెరుగుతూ వచ్చింది. పెన్‌డ్రైవ్‌లుగా, గోరు సైజు మెమరీ కార్డులుగా మారిపోయాయి. వందల జీబీల మెమరీ సైజు అరచేతిలో ఇమిడిపోయాయి. తాజాగా, కంప్యూటర్ సామర్థ్యాన్ని పెంచేందుకు అత్యాధునిక సాంకేతికతను వాడుకొని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ శాస్త్రవేత్తలు అతి చిన్న మెమరీ పరికరాన్ని అభివృద్ధి చేశారు. ఒక పలుచని అణుపొరపై సూక్ష్మ మెమరీ కణాలను చొప్పించి 'ఆటమ్‌రిస్టర్స్' అనే మెమరీ పరికరాన్ని తయారు చేశారు. దీనిలో ఒక్కో మెమరీ కణం కేవలం 1.5నానోమీటర్(1 మీటర్=100కోట్ల నానోమీటర్లు) మందం ఉంటుందట.

సర్పంచ్ ఎన్నికపై ఏం చేద్దాం?

- సర్కారు సమాలోచన
- రెండు మూడు రోజుల్లో నివేదిక!
- ఆ తర్వాతే కేసీఆర్ స్పష్టమైన ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను ఫిబ్రవరిలో నిర్వహించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిక విధానంపైనా కసరత్తు చేస్తోంది. సర్పంచ్ ఎన్నికను ప్రత్యక్షం నుంచి పరోక్షానికి మార్చాలని ప్రభుత్వంయోచిస్తోంది. వార్డు సభ్యుల్లోనే ఒకరిని సర్పంచ్‌గా ఎన్నుకోవాలని సీఎం కేసీఆర్ సంకేతాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్నిక ఎలా నిర్వహిస్తే బాగుంటుందనే విషయంలో క్షేత్ర స్థాయి స్పందనను అంచనా వేసి నివేదిక ఇవ్వాలని అధికారులను కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. నివేదిక 2, 3 రోజుల్లో అందుతుందని.. ఆ తర్వాత సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తారని విశ్వసనీయ సమాచారం. ఇక గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీల గుర్తుపై నిర్వహించాలా? పార్టీరహిత విధానాన్నే కొనసాగించాలా? అన్న విషయంపైనా కొందరు ముఖ్యులతో కేసీఆర్ సమాలోచనలు చేస్తున్నట్లుతెలుస్తోంది. కాగా, పరోక్ష ఎన్నిక విధానంతో పదవిని కాపాడుకోవడంపైనే ఎక్కువ దృష్టి సారిస్తారనే భావన కూడా ఉంది. పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్‌ను రొటేషన్ పద్ధతిలో అమలు చేస్తున్నారు. దీంతో ఐదేళ్లకోసారి రిజర్వేషన్ మారుతుంటుంది. దీనివల్ల చాలా మంది ప్రజాప్రతినిధులు బాధ్యతలను సరిగా నిర్వర్తించడం లేదన్నది ప్రభుత్వ భావన. రెండోసారి పోటీ చేసే అవకాశం ఉంటే బాధ్యతగా వ్యవహరిస్తారని, కొంతైనా పారదర్శకత ఉంటుందని యోచిస్తోంది. అయితే రెండుసార్లు ఒకే రిజర్వేషన్‌ను కొనసాగించేందుకు అవకాశం ఉంటుందా? అన్నది పరిశీలించాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మరోవైపు పంచాయతీల్లో నియమించే కో ఆప్షన్ సభ్యులకు ఓటు హక్కు కల్పించాలా? వద్దా? అన్నదానిపైనా సర్కారు తర్జన భర్జన పడుతోంది. కాగా పదవీకాలం ముగియకుండా పాలకమండళ్లను రద్దు చేయడం అసాధ్యమని పలువురు పేర్కొంటున్నారు.

ప్రైవేటుతో కుమ్మక్కు!

ఆరోగ్యశ్రీ ట్రస్టులో కాసుల కక్కుర్తి.. ఆస్పత్రుల నుంచి ట్రస్టు అధికారుల వసూళ్లు



పైసా వసూల్ 2

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చాలంటే పైసలు! ఆరోగ్యశ్రీ బిల్లులు రావాలంటే పైసలు! ఆస్పత్రుల నుంచి ఆరోగ్యశ్రీ ట్రస్టు వసూళ్ల తీరు ఇది! కనీస సౌకర్యాలు కూడా లేని కొన్ని ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ జాబితాలో చేరాయి. ప్రైవేటు ఆస్పత్రులతో కుమ్మక్కైన ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులు పైసలపైనే దృష్టి సారిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలందించే జాబితాలో 320 ఆస్పత్రులున్నాయి. వీటిలో చాలా ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు లేవన్నది బహిరంగ రహస్యం. ఆస్పత్రిలో పరికరాలు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన తర్వాతే ఎంప్యానల్ లిస్టులో చేర్చాలి. కానీ, తనిఖీలు నిర్వహించి జాబితాలో చేర్చిన ఆస్పత్రులు కొన్నే. మిగిలినవన్నీ మరో దారిలో ఎంప్యానల్ జాబితాలో చేరాయన్న ఆరోపణలు ఉన్నాయి. కనీస పార్కింగ్ లేని వాటికీ జాబితాలో చోటిచ్చారు. ఫైర్, ఎన్‌వోసీ లేని ఆస్పత్రులు, కాల పరిమితి ముగిసిన ఆస్పత్రులను జాబితా నుంచి తొలగించాలి. రెండేళ్లలో ఒక్క ఆస్పత్రిపైనా చర్యల్లేవంటే ప్రైవేటు ఆస్పత్రులతో ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులు ఏ మేరకు కుమ్మక్కయ్యారో అర్థం చేసుకోవచ్చు. జాబితాలోని పది ఆస్పత్రులు ఒక్క సర్జరీ కూడా చేయకున్నా చర్యల్లేవు.

జాబితాలో చోటుకూ ఆమ్యామ్యా

ఆరోగ్యశ్రీ జాబితాలో ఏదైనా ఆస్పత్రికి చోటు దక్కాలంటే ట్రస్టు అధికారులకు భారీ మొత్తంలో ముట్టజెప్పక తప్పదన్న ఆరోపణలున్నాయి. కాసులు కక్కుర్తికి బాగా అలవాటు పడిన అధికారులు ఇష్టారాజ్యంగా జాబితాలో చేర్చారు. అవసరం ఉన్నచోట కంటే లేని చోటే ఎక్కువగా అనుమతులిచ్చారు. కోటి మంది ఉండే జంటనగరాల పరిధిలో 154 ఆరోగ్యశ్రీ ఆస్పత్రులుంటే రాష్ట్ర జనాభాలోని మిగిలిన మూడు కోట్ల మందికి 176 ఆస్పత్రులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్‌కు చాలా దూరంగా ఉండే ఆదిలాబాద్(13), ఖమ్మం(18), నిజామాబాద్(18), మహబూబ్‌నగర్ (19) జిల్లాల్లో ఎంప్యానెల్ ఆస్పత్రులు చాలా తక్కువగా ఉన్నాయి. అవసరానికి మించి ఉన్న కరీంనగర్ (24), వరంగల్(47), హైదరాబాద్ నగరాల్లో అనుమతుల కోసం ఆరోగ్యశ్రీ ట్రస్టు చుట్టూ ఇంకా కొన్ని ఆస్పత్రులు తిరుగుతున్నాయి. ట్రస్టు అధికారులకు ముందుచూపు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. ఇక తనిఖీల తంతు మరో మాయ. ఫలానా రోజు తనిఖీ అని ముందే సమాచారం అందుకునే ఆస్పత్రులు సమయానికి యంత్రాలను సమకూర్చుకుంటాయి. తర్వాత మామూ లే. నాలుగైదు నెలల కిందటి వరకు ఆరోగ్యశ్రీ ట్రస్టులో పైసలివ్వందే ఏ పనీ జరగదన్న మాటలు బహిరంగంగానే వినిపించాయి.

వసూల్ పర్వంలో 3 నెలల్లో 9 మంది అవుట్

ఆరోగ్యశ్రీ ట్రస్టులో 3-4 నెలల్లో 9 మంది అధికారులు బయటకు వెళ్లిపోయారు. వాళ్లపై ప్రైవేటు ఆస్పత్రులతో కుమ్మక్కై ఎంప్యానెల్ జాబితాలో ఇష్టారాజ్యంగా చోటు కల్పించారన్న ఆరోపణలున్నాయి. బిల్లుల చెల్లింపుల్లో, తనిఖీల్లో బాగా వెనకేశారన్నది బహిరంగ రహస్యం. అవినీతిపై ప్రభుత్వం 3,4 నెలలుగా ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో అప్పటికే జేబులు నింపుకున్న వాళ్లు తమపై ఎక్కడ విచారణ జరుగుతుందోనన్న భయంతో సదరు అధికారులు స్వచ్ఛందంగా వెళ్లిపోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

బిల్లుల చెల్లింపులో వసూళ్ల పర్వం

ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించాలంటే ట్రస్టు అధికారులకు కమీషన్ ఇవ్వందే ఫైలు కదలదన్న ఆరోపణలున్నాయి. నిరుపేదలకు వైద్యం అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వహిస్తోంది. ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులు దీన్నో కామధేనువుగా మలచుకున్నారు. ఏటా ఆరోగ్యశ్రీ కింద సర్కారు దాదాపు రూ.700 కోట్లు చెల్లిస్తోంది. ఇందులో 70% నిధులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తుండగా సర్కారు దవాఖానలకు 30 శాతమే వెళ్తోంది. ప్రతినెలా ప్రాధాన్యాన్ని బట్టి నిధులు విడుదలవుతాయి. ప్రైవేటు ఆస్పత్రుల నుంచి పర్సంటేజీ తీసుకొని నిధులు విడుదల చేయడం ట్రస్టులో పరిపాటిగా మారింది. ఎంప్యానెల్ జాబితాతో చేర్చేటప్పుడు ఆస్పత్రి స్థాయిని బట్టి ఒక రేటు.. తనిఖీలకు వచ్చినప్పుడు మరో రేటు.. బిల్లుల చెల్లింపులో మరో రేటు.. ఇలా ప్రతిదానికి ఒక రేటు ఫిక్స్ చేసి బాదుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు కూడా తమ చేతి చమురు వదుల్చుకోకుండా ఆ భారాన్ని మరో రూపంలో రోగులపై వేస్తున్నాయి.

తెలుగు ప్రజలున్నంత వరకు టీడీపీ ఉంటుంది

- 2019లో అన్ని స్థానాల్లోనూ పోటీ: రమణ
- మోత్కుపల్లి వ్యాఖ్యలు అనుచితం, అమానుషం
- టీడీపీ శ్రేణులకు క్షమాపణ చెప్పాలి: రేవూరి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



తెలంగాణ తెలుగుదేశం పార్టీని టీఆర్ఎస్‌లో విలీనం చేయాలంటూ పొలిట్ బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో కలకలం రేపాయి. మోత్కుపల్లి వ్యాఖ్యలను తప్పుబడుతూ ఆయన వైఖరిపై సీనియర్లు మండిపడ్డారు. కేడర్‌కు దశ, దిశ నిర్దేశించే నేతలే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమేనని ఆరోపించారు. నిన్నమొన్నటిదాకా గవర్నర్ పదవికోసం ఆశించి, అది రాదని తెలిసిపోవడంతో, టీఆర్ఎస్‌తో పొత్తు అంశాన్ని తెరపైకి తెచ్చిన మోత్కుపల్లి, ఇప్పుడు రాజ్యసభ ఆశలూ ఫలించే అవకాశం లేదన్న సంకేతాలు రావడంతో విలీనం అంశాన్ని బహిరంగంగా వ్యక్తంచేశారని విమర్శిస్తున్నారు. గడీల పాలనపై, దొరస్వామ్యంపై దుమ్మెత్తిన ఆయనకు, ఇప్పుడు దొర సామాన్యుడిగా కనిపించారా? అని టీడీపీ సీనియర్ నేత ఒకరు నిప్పులు చెరిగారు. కాగా తెలుగు ప్రజలు ఉన్నంతవరకు తెలుగు దేశం పార్టీ ఉంటుందని టీడీపీ-టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ అన్నారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ, 17 పార్లమెంటు స్థానాల్లో పోటీ చేస్తుందని ప్రకటించారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అధికారం అందించాలనేదే టీడీపీ మూల సిద్ధాంతమని అన్నారు. కాగా మోత్కుపల్లి వ్యాఖ్యలు అనుచితం, అమానుషమని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. పార్టీని వీడినవారు కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. చేసిన తప్పును దిద్దుకొని టీడీపీ శ్రేణులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మోత్కుపల్లి వ్యాఖ్యలు శోచనీయమని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఆయనకు అధినేత చంద్రబాబుతో మంచి సాన్నిహిత్యం ఉందని, సొంతపార్టీలో ఏమైనా ఇబ్బందులుంటే పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించాలే తప్ప.. ఈ రకమైన వ్యాఖ్యలు చేయకూడదన్నారు. టీడీపీని చీల్చేందుకు పార్టీలోనే కుట్ర జరుగుతోందని ఆ పార్టీ అధికార ప్రతినిధి కొత్తకోట దయాకర్‌రెడ్డి ఆరోపించారు.

టీడీపీ శ్రేణులు కాంగ్రెస్‌కు మద్దతివ్వాలి: రేవంత్

కేసీఆర్ నుంచి తెలంగాణకు విముక్తి లభించాలంటే టీడీపీ శ్రేణులు కాంగ్రెస్‌కు మద్దతు పలకాలని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి అన్నారు. మోత్కుపల్లి నర్సింహులు వ్యాఖ్యలపై స్పందిస్తూ.. టీడీపీ క్రియాశీలక కార్యకర్తలు కేసీఆర్ నీడను కూడా భరించే స్థితిలో లేరని, ఎన్టీఆర్ ఆశయాలను నమ్ముకొని ఉన్న కార్యకర్తలు.. కేసీఆర్ వ్యతిరేక శక్తులతో పునరేకీకరణ అయితేనే వాటిని నెరవేర్చగలరన్నారు. ఏపీలో కాంగ్రెస్‌లోని బలమైన నాయకత్వం టీడీపీలో చేరినట్లే ఇపుడు తెలంగాణలో టీడీపీ నేతలు కాంగ్రెస్ వైపు కదలాలని పిలుపునిచ్చారు.

టీఆర్ఎస్ వైపు మోత్కుపల్లి చూపు?

- కీలక మంత్రితో కలిసి గుట్టుగా ప్రయత్నాలు
- కేసీఆర్ నుంచి సానుకూల సంకేతాలు!

యాదాద్రి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు టీఆర్ఎస్‌లో చేరబోతున్నారా? ఈ మేరకు ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ నుంచి ఆయనకు గ్రీన్‌సిగ్నల్ లభించిందా? అంటే.. అవుననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ టీడీపీని టీఆర్ఎస్‌లో విలీనం చేయాలంటూ చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలాన్నిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమకాలం నుంచి.. నిన్న మొన్నటి వరకు టీఆర్ఎస్‌పై, సీఎం కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేసిన మోత్కుపల్లి.. ఒకేసారి తన పంథాను మార్చుకుని అధికార పార్టీకి సానుకూలంగా వ్యాఖ్యలు చేయడం వెనుక తన రాజకీయ భవిష్యత్తుకు గట్టి హామీ లభించడమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మోత్కుపల్లి చేరికతో అధికార టీఆర్ఎస్‌కు రాష్ట్రంలో బలమైన మాదిగ సామాజికవర్గంలో పట్టు లభిస్తుందని, ఎస్సీ వర్గీకరణ ఉద్యమం నేపథ్యంలో మందకృష్ణమాదిగ ఆందోళనలకు చెక్ పెట్టే ఎత్తుగడలో భాగమే ఈ వ్యాఖ్యల వెనుక ఉద్దేశమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. తనను గవర్నర్‌గా పంపిస్తానంటూ టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేరకపోవడం, కనీసం రాజ్యసభ సభ్యత్వమైనా కల్పించాలన్న ఆయన అభ్యర్థనకు సానుకూల స్పందన రాకపోవడంతో గత కొంతకాలంగా ఆయన అసంతృప్తిగా ఉన్నారు.

టీడీపీ ఆవిర్భావ సమయంలో విద్యార్థిగా రాజకీయ అరంగేట్రం చేసి.. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించిన మోత్కుపల్లి మూడున్నర దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాల్లో తన ఉనికిని చాటుతున్నారు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో కొంత కాలంగా రాజకీయ భవిష్యత్తు కోసం ఎటువైపు పయనించాలనే ఆలోచనలో పడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని తన అనుచర వర్గంతో, టీడీపీ ముఖ్య నాయకులతో ఈ మేరకు పలు దఫాలు సమాలోచనలు సాగించారు. తెలుగుదేశం పార్టీలో తన వ్యతిరేక వర్గీయుడైన రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరడంతో.. మోత్కుపల్లిపై అధికార టీఆర్ఎస్‌లోనే చేరాలని అనుచరవర్గం నుంచి ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలోనే రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేయడంతోపాటు తాను టీఆర్ఎస్‌లో చేరడానికి గుట్టుగా ప్రయత్నాలు ప్రారంభించినట్టుగా తెలుస్తోంది. టీడీపీ హయాంలో మంత్రిగా పనిచేసి.. ప్రస్తుతం టీఆర్ఎస్ మంత్రివర్గంలో కీలక మంత్రిగా కొనసాగుతున్న ఒక మంత్రితోపాటు.. కేసీఆర్ వ్యక్తిగత సహాయకుడితో మోత్కుపల్లి మంతనాలు సాగించినట్లు, సీఎం కేసీఆర్ సంసిద్ధత కోసం గత కొన్ని రోజులుగా ఎదురుచూస్తున్నట్లు తెలిసింది. ఇదే సమయంలో.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అరెస్టుతో మాదిగ సామాజికవర్గంలో అధికార టీఆర్ఎస్‌పై వ్యతిరేకత వ్యక్తమవుతోందని, దానికి చెక్ పెట్టడానికి అదే సామాజికవర్గానికి చెందిన బలమైన నాయకుడు అవసరమని సీఎం కేసీఆర్ భావించి.. మోత్కుపల్లి చేరికకు సానుకూలత వ్యక్తం చేసినట్లు.. రాజ్యసభలో అవకాశంపై హామీ వచ్చినట్లు సమాచారం.

మోత్కుపల్లి వ్యాఖ్యలు వ్యక్తిగతం: లోకేశ్



అమరావతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్ధంతి రోజు హైదరాబాద్‌లోని ఆయన ఘాట్‌కు చంద్రబాబు రాకపోవడం సరికాదని టీడీపీ తెలంగాణ నేత మోత్కుపల్లి నర్సింహులు చేసిన విమర్శ ఆయన వ్యక్తిగతమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, లోకేశ్ అన్నారు. 'ఇక్కడ కలెక్టర్ల సదస్సు ఉండటం వల్లే ముఖ్యమంత్రి హైదరాబాద్ వెళ్లలేకపోయారు. ఇక్కడ జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నాం. ఎన్టీఆర్ స్మృతిని ప్రజల హృదయాల్లో సజీవంగా నిలిపే నిమిత్తం అమరావతిలో ఆయన భారీ విగ్రహాన్ని నెలకొల్పుతున్నాం. ఒక స్మారక కేంద్రం కూడా నిర్మిస్తున్నాం. పార్టీలో బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నప్పుడు కొంత సంయమనంతో మాట్లాడాల్సిన అవసరం ఉంది' అని అన్నారు.

టీడీపీని టీఆర్ఎస్‌లో కలిపేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

టీడీపీని నడిపించాలని కోరారు. టీఆర్ఎస్‌లో విలీనం చేస్తే ఎన్టీఆర్ ఆత్మ కూడా శాంతిస్తుందన్నారు. గురువారం టీడీపీ వ్యవస్థాపకుడు, ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా మోత్కుపల్లి.. ఎన్టీఆర్ ఘాట్‌కు వచ్చి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 'చంద్రబాబుకు ఎన్ని పనులున్నా.. ఎన్టీఆర్ ఘాట్‌కు వచ్చి నివాళులర్పిస్తే బాగుండేది. తెలంగాణలో టీడీపీ పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. పార్టీ ప్రాభవం కోల్పోతోందని అందరూ అంటుంటే మానసిక క్షోభ కలుగుతోంది. భుజాన వేసుకుందామనుకున్నా సహకరించేవారు లేరు. కేసీఆర్ మన దగ్గర్నుంచి వెళ్లిన నాయకుడే. చాలా మంది మంత్రులూ టీడీపీ నుంచి వెళ్లిన వారే. ఈ పరిస్థితుల్లో పార్టీని టీఆర్ఎస్‌లో విలీనం చేస్తే ఎన్టీఆర్ ఆత్మకు శాంతి కలుగుతుంది.. పార్టీ అంతరించిపోయిందనే అవమానం కంటే ఒక మిత్రుడికి సాయం చేయడమే గౌరవంగా ఉంటుంది. చంద్రబాబుకు వ్యక్తిగతంగా సలహా ఇస్తున్నా. ఆయన అర్థం చేసుకోవాలని కోరుతున్నా' అని వ్యాఖ్యానించారు. అంతేకాదు.. తెలంగాణలో టీడీపీని చంద్రబాబు వదిలేశారని ఆరోపించారు. ఇక్కడ తిరగాలని చెప్పినా పట్టించుకోవడం లేదని, అధినేతే రాకపోతే పార్టీ ఎలా బతుకుతుందని, పంచాయతీ ఎన్నికల్లో ఒక్క సర్పంచైనా గెలిచే పరిస్థితి ఉందా? అని మోత్కుపల్లి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. పార్టీలో 30 ఏళ్లు సేవచేసిన తనకు కనీస గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్, రాజ్యసభ పదవులను తాను ఆశించలేదన్నారు. 'అవన్నీ చంద్రబాబే చెప్పారు. రాలేదు.. మనమేం చేస్తాం. కమిట్‌మెంట్ ఉన్నప్పుడు ఓ లక్ష్యం ఉండాలి కదా! మరి ఆ లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత నాయకుడిదే కదా!' అని మోత్కుపల్లి వ్యాఖ్యానించారు. అయితే చంద్రబాబు తిరిగితే తెలంగాణలో మళ్లీ అధికారం తమదేనని చెప్పారు. తాను పార్టీ మాత్రం మారబోనని మోత్కుపల్లి స్పష్టం చేశారు.

రేపు కాళేశ్వరానికి గవర్నర్

- మేడిగడ్డ నుంచి లక్ష్మీపూర్ వరకు పరిశీలన

పెద్దపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ కాళేశ్వరం పర్యటన అధికారికంగా ఖరారైంది. ఈనెల 20న ప్రత్యేక హెలికాప్టర్‌లో సతీసమేతంగా ప్రాజెక్టును సందర్శించనున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ బ్యారేజీ నుంచి మొదలుకుని కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్ వరకు జరుగుతున్న బ్యారేజీలు, పంప్‌హౌస్‌లు, సొరంగంలో చేపట్టిన పనులను పరిశీలించనున్నారు. శనివారం ఉదయం 7.45 నిమిషాలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 8.30 గంటలకు కాళేశ్వరానికి చేరుకుంటారు. అక్కడి శ్రీకాళేశ్వర, ముక్తీశ్వర ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం మేడిగడ్డ బ్యారేజీ వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తారు. అక్కడి నుంచి జిల్లాలోని మంథని మండలంలో నిర్మిస్తున్న సుందిళ్ల బ్యారేజీ, అన్నారం, గోలివాడకు చేరుకుని పంప్‌హౌస్‌ల నిర్మాణాలను పరిశీలించనున్నారు. ఆ తర్వాత ఏరియల్ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించనున్నారు. మధ్యాహ్నం ధర్మారం చేరుకుని నంది మేడారం వద్ద 6వ ప్యాకేజీ సొరంగంలో జరుగుతున్న పంప్‌హౌస్, సర్జ్‌పూల్‌ను పరిశీలిస్తారు. అక్కడి నుంచి కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్ చేరుకుని 8వ ప్యాకేజీ పనులను పరిశీలించి సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి వెళ్లనున్నారు. రామగుండం సీపీ విక్రమ్‌జిత్ దుగ్గల్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గవర్నర్ వెంట మంత్రి హరీష్‌రావు తదితరులు ఉంటారు.

పైలెటింగ్ కేసులో ఐదుగురు కానిస్టేబుళ్ల అరెస్టు

- సీఐడీ పోలీసుల అదుపులో నిందితులు

సూర్యాపేటక్రైం, జనవరి 18: పోలీస్ కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్‌లో ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాసిన (పైలెటింగ్) కేసులో.. మరోమారు అరెస్టుల పర్వం ప్రారంభమైంది. హైదరాబాద్ సీఐడీ పోలీసులు గురువారం సూర్యాపేట జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఐదుగురు కానిస్టేబుళ్లను అరెస్టు చేశారు. 2011లో నిర్వహించిన పోలీస్ కానిస్టేబుళ్ల నియామక రాత పరీక్షలో అక్రమాలు జరిగాయని అప్పట్లో ఫిర్యాదులు వచ్చాయి. అసలు అభ్యర్థులకు బదులుగా కోదాడ, చిలుకూరు, పెన్‌పహాడ్‌తో పాటు వివిధ మండలాలకు చెందిన పలువురు వ్యక్తులు పరీక్షలు రాశారు. సదరు అభ్యర్థులు ఉద్యోగాలు సంపాదించారు. కేసు దర్యాప్తు చేసిన సీఐడీ అధికారులు పైలెటింగ్ విషయాన్ని నిర్ధారించి 2012లో జిల్లాలోని కొంత మంది కానిస్టేబుళ్లు, ఎస్ఐ, ఉపాధ్యాయులను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగింపులో భాగంగా అధికారులు తాజాగా పోలీస్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఐదుగురిని అరెస్టు చేశారు. సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అఫ్సర్, కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న గుర్వి వెంకటేశ్వర్లు, కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న బుడిగె నాగేశ్వరరావు, మఠంపల్లిలో పని చేస్తున్న మండవ నాగేశ్వరరావు, నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సందీప్‌ను అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించారు.

తొలగిన నిషేధాలు

'పద్మావతి' నుంచి 'పద్మావత్'గా మారి, సెన్సార్‌బోర్డుతో సరేననిపించుకున్న తరువాత కూడా బీజేపీ పాలిత నాలుగురాష్ట్రాలూ మొండిగా వ్యవహరించడం సుప్రీంకోర్టుకు ఆగ్రహం కలిగించడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఈ చిత్రంమీద ఈ రాష్ట్రాలు విధించిన నిషేధాన్ని తొలగించడంతో పాటు, రాబోయే రోజుల్లో మరికొన్ని రాష్ట్రాలు వాటిబాట పట్టే ప్రమాదం లేకుండా సుప్రీంకోర్టు శాసించింది. ఏ రాష్ట్రమూ నిషేధాలతో చిత్రాన్ని అడ్డుకోవడానికి వీల్లేదని చెబుతూ, శాంతి భద్రతలను కారణంగా చూపుతున్న నాలుగు రాష్ట్రాలనూ ఆ బాధ్యత సక్రమంగా నెరవేర్చమని హెచ్చరించింది. ఆదేశంతో పాటు, ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు కూడా ఎంతో ఉన్నతంగా ఉన్నాయి.

పద్మావతి విషయంలో సుప్రీంకోర్టు చొరవ కచ్చితంగా భావ స్వేచ్ఛకు, సృజనకు వెన్నుదన్నుగా నిలిచింది. మూక ఒత్తిళ్ళకు, బెదిరింపులకు లొంగిపోతూ, పరోక్షంగా వారికి ఊతాన్నిస్తున్న పాలకులకు ఇది హెచ్చరిక. పద్మావతి పక్షాన సుప్రీంకోర్టు నిలబడటం ఇది తొలిసారికాదు. సినిమా విడుదలను నిలిపివేయాలంటూ నవంబరులో కొందరు కేసువేస్తే, అర్థంలేని పిటిషన్ అని దానిని కొట్టివేస్తూ, మంచి చెడులను నిర్ధారించి అంతిమంగా ఓ నిర్ణయం చేయవలసింది సెన్సార్ బోర్డే తప్ప మరెవరూ కాదన్నది. అదే సందర్భంలో, బాధ్యతగల పదవుల్లో ఉంటూ నోటికివచ్చినట్టు ఎలా మాట్లాడతారంటూ బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను చీవాట్లు కూడా పెట్టింది. సీబీఎఫ్‌సీ సర్టిఫై చేయకముందే, ఎవరూ సినిమా చూడకముందే తీర్పులు ఎలా చెబుతారని నాయకులను నిలదీసింది. చట్టాలు, నిబంధనలకు లోబడి వ్యవహరించమని అందరికీ హితవు చెప్పింది. సుప్రీంకోర్టు అప్పటి, ఇప్పటి తీర్పుల తరువాత కూడా ఈ మాటలేవీ బీజేపీ నాయకులకు కానీ, ముఖ్యమంత్రులకు కానీ తలకెక్కలేదని అర్థమవుతున్నది. చిత్రాన్ని చూడకుండానే వీధినపడే అద్భుతమైన విన్యాసం ఇంకా సాగుతున్నది. కోర్టు తీర్పును గౌరవిస్తున్నామని అంటూనే వారు గతంలో చేసిన వ్యాఖ్యలే మళ్ళీ మళ్ళీ చేస్తున్నారు. ఈ నాలుగురాష్ట్రాల్లో కొన్ని మళ్ళీ కోర్టుకుపోయి సినిమా ప్రదర్శనను ఏదో విధంగా ఆపే ఆలోచనలో ఉన్నాయి. ఒకవేళ ప్రభుత్వాలు విజయం సాధించలేకున్నా, మందబలంతో సినిమాను అడ్డుకొనే పనిలో కర్ణిసేన ఎలాగూ ఉన్నది. కోర్టు తీర్పు తరువాత అధికారికంగా, చట్టపరంగా సినిమా విడుదలకు ఏ అడ్డంకులూ లేకపోవచ్చును కానీ, క్షేత్రస్థాయి వాతావరణంలో పెద్ద మార్పేమీ లేదు కనుక అనధికారికంగా నిషేధం అమలుకావచ్చును. గతంలో బన్సాలీ, పదుకొనే తలకు వెలగట్టిన పెద్దమనిషి ఇప్పుడు చిత్రం విడుదలైతే దేశం ఛిన్నాభిన్నమవుతుందని హెచ్చరిస్తున్నాడు. క్షత్రియ యువతుల సంఘం ఒకటి సినిమా విడుదలైతే అందులో మాదిరిగానే తామంతా సామూహిక ఆత్మాహుతికి పాల్పడుతామని భీషణ ప్రతిజ్ఞ చేసింది. దేశ సర్వోన్నత న్యాయస్థానం అండదండలు చూసుకొని, సినిమా ప్రదర్శనకు సిద్ధపడిన థియేటర్లను తగలబెడతామని రాజ్‌పుత్ గ్రూపులు హెచ్చరిస్తున్నాయి. తీర్పు వెలువడగానే కొన్ని రాష్ట్రాల్లో థియేటర్లపై దాడులు మొదలైన నేపథ్యంలో చాలామంది థియేటర్ యజమానులు ప్రదర్శన వద్దనుకుంటున్నారని వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా మల్టీప్లెక్స్ థియేటర్లు ఉండే పెద్దపెద్ద మాల్స్‌కు జరిగే నష్టం మరింత ఎక్కువ. స్వేచ్ఛలూ, హక్కులంటూ సర్వోన్నత న్యాయస్థానం సినిమాకు సరేనన్నంతమాత్రాన తమను కాదని ఎవరూ అడుగువేయలేరని ఈ ఉన్మాదులు నిరూపించదల్చుకున్నారు.

చిత్రాన్ని చూడకుండానే వీధినపడే అద్భుతమైన సంప్రదాయాన్ని రాజపుత్ర సంఘాలు ఇంకా కొనసాగిస్తున్నాయి. సినిమాలో అభ్యంతరకమైనది ఏదో ఉన్నదన్న అనుమానంతో, వాదనతో రేగిన వ్యతిరేకత, సెన్సార్‌బోర్డు సరేనన్నది కనుక ఇక సమసిపోతుందన్న విశ్వాసం లేకుండాపోయింది. ఈ వారంలో బన్సాలీ ఎంపిక చేసిన కొందరు పెద్దమనుషులకు చిత్రాన్ని చూపించి, వారిద్వారా ఈ వ్యతిరేకశక్తులను శాంతింపచేస్తారని అంటున్నారు. కోర్టు తీర్పునాడే శ్రీశ్రీ రవిశంకర్ సినిమా చూసి బాగుందన్నారు. నిజానికి బన్సాలీ ఇదే ప్రయత్నం గతంలోనూ చేశారు. కర్ణిసేన కథనాలనే మంత్రులూ, బీజేపీ నాయకులూ మీడియాముందూ, మహాసభల్లోనూ వల్లిస్తూ, కత్తులు నూరుతున్న దశలో, అర్నబ్ గోస్వామి, రజత్‌శర్మ వంటివారిని ఎంచుకొని మరీ బన్సాలీ ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పద్మావతి, రతన్‌సింగ్‌ల ఔన్నత్యాన్ని నిలబెడుతూ, ఖిల్జీని నూరుశాతం విలన్‌గా చూపుతూ, రాజపుత్రుల గౌరవానికి ఏమాత్రం భంగం వాటిల్లకుండా బన్సాలీ అద్భుతంగా తీశారని వారంతా ప్రశంసించారు. సినిమా విడుదలకు దారులు మూసుకుపోతున్న తరుణంలో, తన చర్య ఉద్రిక్తతలను చల్లార్చి మార్గం సుగమం చేస్తుందని ఆయన భ్రమపడ్డారు. ఈ పని జరగకపోగా, అదనంగా సెన్సార్‌బోర్డుకు ఆగ్రహం కలిగి, అర్థంలేని వాదనలతో సినిమాకు అడ్డుకొట్టి, తిరిగి దరఖాస్తు చేసుకోమన్నది. రాణి పద్మిని నుంచి పద్మావతి నుంచి పద్మావత్‌కు మారే క్రమంలో బన్సాలీ ఎదుర్కొన్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. అన్ని సందర్భాల్లోనూ బన్సాలీ అనవసరంగా నోరుపారేసుకోకుండా, హుందాగా, ఉన్నతంగా నిలబడినందుకు ప్రశంసించాలి. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సెన్సారు బోర్డుకు లేఖలు రాసి దాని నిర్ణయాన్ని ప్రభావితం చేయబోవడం, రాజపుత్ర సంఘాల వీరంగాలకు అండగా నిలవడం వంటి పరిణామాలను గమనించిన తరువాత, బన్సాలీ పలు సందర్భాల్లో తాను మాలిక్ మహ్మద్ జాయ్‌సీ మూలకథనుంచి ఏమాత్రం గాడితప్పలేదనీ, కొన్ని హంగులు అద్దడం తప్ప, ఖిల్జీ పద్మావతి మధ్య రాజపుత్రులకు రుచించని ఎటువంటి సన్నివేశాలు తన చిత్రంలో లేవని చెబుతూనే వచ్చారు. ఇప్పుడు సెన్సార్‌బోర్డే టైటిల్ సహా కొన్ని మార్పులతో ప్రదర్శనకు సరేనన్నది. అయినప్పటికీ, ఎవరెన్ని చెప్పినా, తాము అనుకున్నదీ, అంటున్నదే సరైనదన్న మూర్ఖపు వాదనతో ఈ విచిత్రమైన, వికారమైన వివాదం ఇంకా సాగుతూనే ఉన్నది.

ముస్లింలను మరలా వెనక్కు నెట్టవద్దు

తెలంగాణలోని ముస్లింలు 1948లో ఎన్ని బాధలు అనుభవించారో, మళ్లీ అవే బాధలు అనుభవించే వాతావరణం కనిపిస్తోంది. తెలంగాణలో ముస్లింల పతనానికి 1948 సెప్టెంబరులో పునాది పడింది. దొరలు, భూస్వాములు, నిజాం పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది. దొరలు ప్రైవేట్ సైన్యాలు ఏర్పాటు చేసుకొని చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. హైదరాబాద్ సంస్థానానికి పాలకులుగా, పోలీసుపటేళ్లుగా, అక్కడక్కడా భూస్వాములుగా ముస్లింలు ఉన్నప్పటికీ గడీలన్నీ అగ్రకులాలకు చెందినవే! అయితే నిజాం రాజుపై కోపంతో ఆ రోజుల్లో ఆర్య సమాజ్, హిందూ మహాసభలు నిర్వహించిన ప్రచారానికి జాతీయ వాది సర్దార్ వల్లభాయ్ పటేల్ కుతంత్రం తోడై హైదరాబాద్ సంస్థానంపై పోలీసు చర్య జరిగింది. శాంతియుతంగా హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ కేవలం ముస్లిం పాలకుడన్న కసితో పటేల్ సైనిక చర్యకు దిగారు. 1948 సెప్టెంబరు 13 నుంచి 18 వరకు జరిగిన పోలీసు చర్య కారణంగా దాదాపు 2 లక్షల మందికి పైగా ముస్లింలు ఊచకోతకు గురయ్యారు. నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్, రజాకార్ల నాయకుడు ఖాసీం రజ్వీతో పాటు గ్రామాల్లో ప్రజలను పీల్చి పిప్పిచేసిన దొరలు, భూస్వాములు మాత్రం హైదరాబాద్‌లో నిక్షేపంగా తలదాచుకున్నారు. నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1950 నుంచి 1956 అక్టోబరు దాకా రాజ్‌ప్రముఖ్ (గవర్నర్) హోదాను అనుభవించారు. ఈ ఊచకోతకు ప్రత్యక్షసాక్ష్యంగా సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోం ఉంది. ఆ ఊచకోతలో అనాథలైన పిల్లలంతా హోంలో ఉండగా అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఈ హోంను సందర్శించి 'దేశంలో ప్రభుత్వాలు ఉండగా అనాథలు ఉండరు' అని ప్రకటించారు. ముస్లింలను ఊచకోత కోయడం వల్లే పటేల్ ఓ రాజకీయ పార్టీకి అరాధ్యుడిగా మారాడు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని వాతావరణం నాటి పరిస్థితులను గుర్తుకు తెస్తున్నది. ఆ రోజు ఖాసీం రజ్వీ విజ్ఞప్తులను నిజాం పాటించాడో లేదో కానీ ఈ రోజు అదే రజ్వీ వారసత్వం పుణికిపుచ్చుకున్న ఓ రాజకీయ పార్టీ ఆదేశాలను మాత్రం ముఖ్యమంత్రి తూచా తప్పకుండా పాటిస్తున్నారు. ఈ పరిణామాలు క్రమంగా ముస్లిం సమాజాన్ని ఇతర సమాజాల నుంచి దూరం చేస్తున్నాయి. హైదరాబాద్‌లోని ముస్లింలు మార్పును కోరుకుంటున్నప్పటికీ వారిని ఆ రాజకీయ పార్టీ దయాదాక్షిణ్యాలకు వదిలేసి, జిల్లాల్లోని ముస్లింల మన్ననలైనా పొందాలని ముఖ్యమంత్రి చేసే ప్రయత్నం ముస్లిం సమాజాన్ని దెబ్బకొట్టడమే కాగలదు. ఏ ఎన్నికలు జరిగినా ఓడిపోయే అభ్యర్థులనే అధికారంలో ఉన్న పార్టీలు హైదరాబాద్‌లోని నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులుగా బరిలోకి దింపుతాయి. టీఆర్ఎస్ అధికారంలోకి రావడానికి ముందే పని మొదలెట్టింది. రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలిచే అభ్యర్థులనే బరిలో దింపే అవకాశం ఉన్నప్పటికీ ఆ పని చేయలేదు. బల్దియా ఎన్నికల్లో కూడా అదే జరిగింది. వెరసి, పాతబస్తీలో ముస్లింలపై పేటెంట్‌ను నాడు ఓ రాజకీయ పార్టీకి కాంగ్రెస్ ఎలాగైతే దఖలు పరచిందో నేడు టీఆర్ఎస్ కూడా అలాగే దఖలు పర్చుతోంది. ఇది క్రమంగా ముస్లింలకు గొడ్డలిపెట్టుగా మారనుంది. ఇక హామీల విషయంలో కేసీఆర్ వ్యవహరిస్తున్న తీరు కూడా ముస్లింలకు కొత్త గండాన్ని సృష్టిస్తోంది. ముస్లింలపై కేసీఆర్ వల్లమాలిన ప్రేమ కనబరుస్తున్నారని ఓ వర్గం సామాజిక మాధ్యమాల్లో ముస్లింలకు వ్యతిరేకంగా యుద్ధమే చేస్తోంది. గత మూడున్నరేళ్లుగా టీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ముస్లింలపై ఎలాంటి దాడులకు పురిగొల్పుతాయోనన్న ఆందోళనలూ లేకపోలేదు.



ముస్లింలకు కావాల్సింది చదువు, ఉపాధి మాత్రమే. చదువు దొరికితే తమంతట తామే అవకాశాలను అందిపుచ్చుకుంటారు. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ ముస్లింల కోసం గురుకులాలు ప్రారంభించడం ఆహ్వానించదగినదే.

ముస్లింలకు కావాల్సింది చదువు, ఉపాధి మాత్రమే. చదువు దొరికితే తమంతట తామే అవకాశాలను అందిపుచ్చుకుంటారు. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ ముస్లింల కోసం గురుకులాలు ప్రారంభించడం ఆహ్వానించదగినదే. ఈ గురుకులాలను వ్యతిరేకించిన పార్టీయే ఈ రోజు తెలంగాణ రాజకీయాన్ని శాసిస్తోంది. అయితే చదువుకే పరిమితం కాకుండా 'ఇస్లామిక్ రిసెర్చ్ సెంటర్'ను ప్రత్యేకంగా పెట్టాలనుకోవడం ముస్లింలకు ఇబ్బందికరమే అవుతుంది. తెలంగాణలో కొత్తగా ఇస్లామిక్ రిసెర్చ్ సెంటర్ అవసరం లేదు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో ఈ కేంద్రం ఉంది. పీజీ, ఆపై చదువుల కోసం గురుకులాలు పెట్టకుండా ఇస్లామిక్ కేంద్రాలు పెట్టాలనుకోవడం ముస్లింలను ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టడమే అవుతుంది. అలాగే, మత విద్యను బోధిస్తున్న పలు సంస్థలకు ప్రభుత్వ నిధులు ఇవ్వడం కూడా సమాజానికి తప్పుడు సంకేతాలను పంపుతోంది. ముస్లింలలో చదువుకోలేని పేద వర్గాలే మదర్సా విద్యను అభ్యసిస్తున్నాయనేది జగమెరిగిన సత్యం. ఉన్నత విద్యావంతులు, కోటీశ్వరులు ఎవరూ తమ పిల్లలను మదర్సాల్లో చేర్పించిన దాఖలాలు లేవు. ఒకవైపు ఆధునిక విద్య కోసం గురుకులాలు పెడుతూ మరోవైపు మత విద్యను ప్రభుత్వమే ప్రోత్సహించడం దేనికి సంకేతం?

ఇక రిజర్వేషన్ల విషయానికి వస్తే, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కోటాకు మించి అనుమతి ఇచ్చే అవకాశాల్లేవు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రంలో ఒక్క సీటు కూడా ముస్లింలకు ఇవ్వని బీజేపీ ముస్లిం రిజర్వేషన్లకు సహకరిస్తుందా? సాధ్యం కాని రిజర్వేషన్ల గురించి ప్రచారం చేసి, ముస్లింలకు కొత్త శత్రువులను తెచ్చిపెట్టే పనిలో రాష్ట్రప్రభుత్వం ఉందని భావించాల్సి వస్తోంది. ఇకనైనా ముస్లిం సమాజాన్ని ప్రమాదంలోకి నెట్టే చర్యలకు స్వస్తి చెప్పి ప్రగతిపథంలో నడిపించే నిర్ణయాలకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని ఆశిద్దాం.

■ డాక్టర్ సయ్యద్ మొహినుద్దీన్

ప్రతిఘటనా పోరాట రూపశిల్పి

ముప్పై మూడు సంవత్సరాల క్రితం కన్నుమూసిన చండ్రపుల్లారెడ్డి ఆచరించి చూపిన మార్గం నేడు అనేక విప్లవ సంస్థలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. రకరకాల వాదాలతో, రుగ్మతలతో కొట్టుమిట్టాడుతున్న కమ్యూనిస్టు విప్లవోద్యమానికి సరైన దారిని చూపిన గొప్ప సిద్ధాంతవేత్త కామ్రేడ్ సి.పి. ఆయన పుచ్చలపల్లి సుందరయ్య పరిచయంతో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. మహత్తర తెలంగాణ సాయుధ కాలంలో పార్టీ ఆయన్ని మహబూబ్‌నగర్ జిల్లా అటవీ ప్రాంతంలో పనిచేయడానికి పంపింది. ఆ బాధ్యతలు స్వీకరించడానికి వెళుతూ ఆయన 1949లో అరెస్టయి, 1952 ఎన్నికల అనంతరం విడుదలయ్యారు. అనంతరం, 1967లో పెల్లుబికిన నక్సల్బరీ వసంత మేఘ గర్జనను ఆయన ఆహ్వానించారు. పదునైన అంతరంగిక పోరాటం సాగించి పోరాటాన్ని అడవిదారి పట్టించారు. ఈ క్రమంలోనే 1969లో సాయుధ దళాలు నిర్మాణమయ్యాయి. గోదావరిలోయ పోరాటంగా పేరుగాంచిన ఉద్యమానికి ఆయన నాయకత్వం వహించారు. ప్రజా సంఘాల నిర్మాణానికి అవసరమైన భూమిక ఏర్పరచారు. హైదరాబాద్‌లో బలమైన విద్యార్థి ఉద్యమానికి అవసరమైన సూచనలు అందించారు. ఇప్పటి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డికి పార్టీ సభ్యత్వాన్ని చండ్రపుల్లారెడ్డే ఇచ్చాడన్నది చాలామందికి తెలియని విషయం.



విప్లవోద్యమంలో తలెత్తిన అతివాద, మితవాదాలు అనివార్యమని వాటి నుంచి త్వరగా బయటపడడమే గొప్ప మార్క్సిస్టు– లెనినిస్టు విప్లవ లక్షణమనీ ఆయన చెప్పేవారు. అందుకే, అతివాద–మితవాద తప్పిదాలు చేసిన కామ్రేడ్స్ ఎస్.ఎన్.ఎస్, కొండపల్లి సీతారామయ్య, దేవులపల్లి వెంకటేశ్వరరావు, రామలింగాచారి, అప్పలసూరి, వినోద్ మిశ్రా, నాగభూషన్ పట్నాయక్ లాంటి ఎందరో విప్లవ సంస్థల నాయకులతో ఐక్యతా చర్చలు, పునరేకీకరణ చర్చలు సాగించారు.

గోదావరి లోయలో వ్యవసాయక విప్లవోద్యమాన్ని నిర్మించేందుకు 50 సంవత్సరాల వయస్సులో ఆయన అడవుల్లోకి వెళ్లి, 17 సంవత్సరాల పాటు రహస్య జీవితం గడిపారు. ఆదివాసులకు, దళసభ్యులకు, కేడరుకు తోడునీడగా ఉంటూ పెద్దన్నగా పేరు తెచ్చుకున్నారు. జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను ప్రజలకూ, కేడరుకూ అర్థమయ్యేలా వివరించడంలో, రాయడంలో ఆయనకు ఆయనే సాటి అనిపించుకున్నారు. ఆయన విప్లవకారులకొక పాఠశాల. భారత విప్లవోద్యమంలో ఆయనొక మేరునగధీరుడు. విప్లవ ప్రతిఘటనోద్యమ సిద్ధాంత కర్త. సాయుధ పోరాట పంథా కొరకు, విప్లవకారుల ఐక్యత కొరకు కృషిచేస్తూ తన 67వ ఏట సి.పి అమరులైనారు.

— చంద్రన్న,
ప్రధాన కార్యదర్శి, సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ

(నేడు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సి.పి శతజయంతి ముగింపు సభ)

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన మెయిల్:
editpage@andhrajyothy.com

లేచి నిలబడిన న్యాయం

■ రాజ్‌దీప్ సర్దేశాయి




దీపశిఖ

'పాత్రికేయులకూ, న్యాయవాదులకూ ఒక ఉమ్మడి లక్షణం ఉన్నది. ఇతరుల గురించి గుసగుసలాడడానికి ఈ ఇరువురూ సదా అమితంగా ఇష్టపడతారని కొద్దిరోజుల క్రితం అనుభవజ్ఞుడైన న్యాయవేత్త ఒకరు నాకు గుర్తు చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తికి వ్యతిరేకంగా దేశ సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తులు 'తిరుగుబాటు' చేస్తున్న రోజులివి. మరి వాస్తవాలకు బదులు వ్యర్థ ముచ్చటలే విన్పించడంలో ఆశ్చర్యమేముంది? జస్టిస్ చలమేశ్వర్‌ను భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు డి. రాజా కలుసుకోవడం, ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శి చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రాతో సమావేశమవ్వడం మొదలైన పరిణామాలపై సహజంగానే అత్యుత్సాహంతో ఊహాగానాలు చోటుచేసుకున్నాయి. ఆ విప్లవాత్మక శుక్రవారం నాడు దేశ న్యాయవ్యవస్థకు ఏమి సంభవించిందన్న అంశం ఈ కోలాహలంలో నిజ ప్రాధాన్యాన్ని కోల్పోయింది.

ఈ 'విప్లవం'లో నాలుగు కీలక అంశాలు ఉన్నాయి. మొదటిది–నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మున్నెన్నడు లేనివిధంగా వ్యవహరించి న్యాయబద్ధ జవాబుదారీతనంపై దేశ ప్రజల దృష్టి కేంద్రీకృతమయ్యేలా చేశారు. నిజానికి న్యాయబద్ధ జవాబుదారీతనం ఒక అనిశ్చిత అంశం. దీనిపై అనేక సదస్సులు జరిగాయి. పలు నిర్ణయాలు తీసుకున్నారు. అయితే అవి నిర్దిష్టంగా కార్యాచరణలోకి రావడం చాలా అరుదుగా మాత్రమే జరిగింది. న్యాయమూర్తుల తీరుతెన్నుల్లో న్యాయాన్యాయాలను ఎవరు నిర్ణయించాలి? అంతకంటే ముఖ్యమైన విషయం–ప్రధాన న్యాయమూర్తి వ్యవహరిస్తున్న తీరుపై ఎవరు తీర్పు చెప్పాలి? తిరుగుబాటు చేసిన నలుగురు న్యాయమూర్తులు సర్వోన్నత న్యాయస్థానపు అంతర్గత సమస్యల పరిష్కారయంత్రాంగం సమర్థతను ప్రశ్నించారు. తద్వారా కేసుల విచారణకు ధర్మాసనాలను ఏర్పాటు చేయడంలో ప్రధాన న్యాయమూర్తికిగల అధికారాలను సవాల్ చేశారు. తీర్పులను ప్రభావితం చేసేలా, మరింత స్పష్టంగా చెప్పాలంటే తాము నిర్దేశించిన విధంగా అనుకూల తీర్పులు వచ్చేలాచేసేందుకు అనుగుణంగా ధర్మాసనాలను ప్రధాన న్యాయమూర్తి ఏర్పాటు చేస్తున్నారని ఆ నలుగురు న్యాయమూర్తులు ఆరోపించారు. ధర్మాసనాలను ఏర్పాటు చేసే ప్రత్యేకాధికారం దృష్ట్యా ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)ను 'మాస్టర్ ఆఫ్ ది రోస్టర్' అంటారు. కేసుల జాబితాను నిర్ణయించే అధికారం, ఏ కేసుపై ఎప్పుడు విచారణ జరపాలో నిర్ణయించే అధికారం సీజేఐకి ఉన్నప్పటికీ ఆయన నిర్ణయాలు న్యాయబద్ధ పరిశీలనకు మినహాయింపు కాదనేది తిరుగుబాటు న్యాయమూర్తుల వాదన.

న్యాయవ్యవస్థలో అవినీతి ఆందోళనకరంగా పెచ్చరిల్లిపోవడాన్ని నిశితంగా పరీక్షించవలసిన అవసరం ఎంతైనా ఉందనేది రెండో అంశం. తిరుగుబాటు చేసిన నలుగురు న్యాయమూర్తులు ఏ ఒక్క న్యాయమూర్తిని పేరు పెట్టి ప్రస్తావించలేదు. అయితే ఒడిశాలో ఎంబిబిఎస్ అడ్మిషన్ల కుంభకోణంలో సీనియర్ న్యాయాధికారుల పాత్రపై దర్యాప్తు జరపాలని వారి విమర్శలు, ఆరోపణలు స్పష్టం చేస్తున్నాయి. సిబిఐ తన ప్రాథమిక దర్యాప్తులో ఒక న్యాయమూర్తి 'చట్టవిరుద్ధంగా లబ్ధి పొందారని' నిర్ధారిస్తే సంబంధిత జడ్జిపై ఎఫ్ఐఆర్ దాఖలుకు తప్పకుండా అనుమతినివ్వాలి. అలా ఇవ్వని పక్షంలో ఉన్నత స్థానాలలో ఉన్న నిర్దిష్ట వ్యక్తులను చట్టం నుంచి కాపాడడానికి ప్రయత్నం జరుగుతుందనే విషయమై కలవరం కలిగించే ప్రశ్నలు తలెత్తుతాయని ఆ నలుగురు న్యాయమూర్తులు స్పష్టం చేశారు.

మూడో అంశం–న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య ఉన్న సంబంధాలు. ఈ రెండు రాజ్యాంగ వ్యవస్థల మధ్య సంబంధాలలో పరస్పర అవిశ్వాసం పెరిగిపోతోంది. న్యాయ వ్యవస్థపై వస్తున్న విమర్శల విషయమై గత ఏడాది ఒక సమావేశంలో ప్రధాని మోదీ సమక్షంలో మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టిఎస్ ఠాకూర్ రోదించడమే ఇందుకు నిదర్శనం. న్యాయవ్యవస్థ తన రాజ్యాంగబద్ధ అధికారాలను కాపాడుకోవడానికి కృతనిశ్చయంతో ప్రయత్నిస్తున్నది. అయితే న్యాయవ్యవస్థ వ్యవహరిస్తున్న తీరు వల్ల శాసనవ్యవస్థ అధికారాలు క్షీణించి పోతున్నాయని రాజకీయ నాయకుల నేతృత్వంలోని కార్యనిర్వాహక వ్యవస్థ చాలాకాలంగా భావిస్తోంది. అంతేగాక కొంత మంది న్యాయమూర్తులు పదవీ విరమణ అనంతరం పదవుల పరంగా ప్రయోజనం పొందాలని ఆరాటపడుతుండడం వల్ల న్యాయ వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు గురవుతోంది. పదవీ విరమణ చేసిన ప్రధాన న్యాయమూర్తులు రాష్ట్ర గవర్నర్లుగానూ, వివిధ ఉన్నతస్థాయి ప్రభుత్వ కమిటీల ఛైర్మన్లుగానూ నియమితులతున్నారు. దీని వల్ల న్యాయమూర్తులను పాలకపక్షానికి అనుకూలంగా వ్యవహరించేలా ప్రభావితం చేయడానికి అవకాశమేర్పడుతోంది (ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులు కనీసం రెండేళ్ళ పాటు ఎటువంటి ప్రభుత్వ పదవినీ చేపట్టకూడదన్న నిబంధనను తీసుకురావల్సిన అవసరం లేదా?) హత్యానేరణానికి గురైన జడ్జి లోయా కేసు, ఈ ఏడాది విచారణకు రానున్న అయోధ్య కేసు మొదలైనవి 'రాజకీయంగా సున్నితమైన' కేసులు. ఈ కేసులలో తీర్పులు పాలకపక్షానికి అనుకూలంగా ఉండేలా న్యాయవ్యవస్థను ప్రభావితం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించగలదనే భయాందోళనలు సహజంగానే వ్యక్తమవుతున్నాయి.



న్యాయవ్యవస్థలో ప్రస్తుత సంక్షోభానికి మూలాలు కొలీజియం వ్యవస్థలో ఉన్నాయి. కోర్టు ధిక్కారం లాంటి న్యాయవిహిత చర్యలు, తీవ్ర ప్రతిబంధక ప్రక్రియ అయిన పార్లమెంటు అభిశంసన లాంటి రాజ్యాంగబద్ధ భరోసాలను ఉపయోగించుకొని తమ నిర్ణయాలను ప్రశ్నించడానికి వీలులేని పరిస్థితిని కొలీజియం సభ్యులైన న్యాయమూర్తులు సృష్టించారు. జస్టిస్ చలమేశ్వర్ నాయకత్వంలో జరిగిన తిరుగుబాటు ఈ పరిస్థితిని నిలదీసింది.

ఇక చివరి అంశం సంస్థాగత నైతిక నిష్ఠ. తిరుగుబాటు చేసిన నలుగురు న్యాయమూర్తులు తమ విమర్శలలో ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. మనస్సాక్షికి సంబంధించిన అంశాలపై ఒక సంస్థలో తీవ్ర విభేదాలు నెలకొంటే ఆ సంస్థ నైతిక, న్యాయబద్ధ పవిత్రతను లేదా ఆమోదనీయతను ఎలా నిలుపుకోగలదు? అనేది ఆ నలుగురు న్యాయమూర్తుల ప్రశ్న. మన న్యాయమూర్తులు గౌరవనీయులు, సమున్నత వ్యక్తిత్వం కలవారన్న దృఢ నమ్మకం పైన మన న్యాయవ్యవస్థలో ప్రజల విశ్వాసం ఆధారపడివున్నది. ఇటీవలి కాలంలో ఈ విశ్వాసం సడలిపోయింది. న్యాయస్థానాల్లో జరుగుతున్న అవకతవకలే ఇందుకు కారణమని చెప్పక తప్పదు. ముందుగానే నిర్దేశితమవుతున్న తీర్పులు అధికంగా వెలువడుతున్నాయి. వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేయలేని పరిస్థితి. ఈ కారణంగా ఎన్ని కష్టనష్టాలు ఎదురయినప్పటికీ కనీసం కొంతమంది న్యాయమూర్తులైనా నిజాయితీగా, ధైర్యంగా వ్యవస్థలోని లోపాలు, లొసుగులను ఎత్తి చూపవలసిన అవసరం ఎంతైనా వున్నది. న్యాయం వర్ధిల్లడానికి అవరోధంగా ఉన్న వాటికి వ్యతిరేకంగా లేచి నిలబడి తమ అభిప్రాయాలను గట్టిగా విన్పించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

న్యాయవ్యవస్థను పీడిస్తున్న రుగ్మతల మూలాలు 2014 సార్వత్రక ఎన్నికలలో బీజేపీ ఘన విజయంలో ఉన్నాయని ప్రధాని మోదీ చిత్తశుద్ధి శంకితులు భావిస్తున్నారు. న్యాయమూర్తులను తమకు అనుగుణంగా మార్చుకొని ఏ కేసులోనైనా తీర్పు ప్రభుత్వానికి సానుకూలంగా ఉండేలా చేసుకోవచ్చని ఆ విజయం మూలంగా రాజకీయ నాయకత్వం విశ్వసిస్తోంది మరి. నిజమేమిటంటే భారతీయ న్యాయవ్యవస్థలో ప్రస్తుత సంక్షోభం, న్యాయమూర్తుల నియామకాలు పారదర్శకత లోపించిన పద్ధతులలో జరగడం ప్రారంభమయినప్పటి నుంచీ ఉన్నదని చెప్పవచ్చు. ఇందిరాగాంధీ హయాంలో రాజకీయ నాయకత్వం సంపూర్ణ అధికారాలను చెలాయించడం ప్రారంభమయినప్పుడే ఈ సంక్షోభానికి బీజాలు పడ్డాయి. తరువాత న్యాయమూర్తుల నియామకాలకు కొలీజియం విధానం ఉనికిలోకి రావడంతో సంక్షోభం విషమించింది. ఎమర్జెన్సీ కాలంలో అధికార దుర్వినియోగం వల్ల పలువురు న్యాయమూర్తులు అణచివేతకు గురయ్యారు. న్యాయ వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్ళకు తీవ్రంగా లోనయింది. దీనివల్ల న్యాయవ్యవస్థ నిష్పాక్షికంగా వ్యవహరించడం కష్టమై, వివిధ దుష్పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ దుస్థితిని పునరావృతంకాకుండా నివారించి, న్యాయమూర్తులు తమ విధి నిర్వహణను నిష్పాక్షికంగా, నిర్భీతితో నిర్వర్తించేందుకై వారికి రాజ్యాంగ బద్ధమైన భరోసా కల్పించడానికే కొలీజియం వ్యవస్థ ఆవిర్భవించింది.

దురదృష్ట వశాత్తు ఈ కొలీజియం వ్యవస్థ కూడా పెడదోవపట్టింది. న్యాయవ్యవస్థ 'స్వయం ప్రతిపత్తి' పేరిట న్యాయమూర్తుల నియామకాలు, బదిలీల విషయంలో న్యాయమూర్తులే సొంత నిర్ణయాలు తీసుకోవడానికి వీలు కల్పించిన కొలీజియం వ్యవస్థలో పక్షపాత ధోరణులు చోటు చేసుకున్నాయి. నిర్ణయాలలో పారదర్శకత లోపించింది. కొలీజియంలో సభ్యులైన న్యాయమూర్తులు తమ ప్రయోజనాలకే ప్రాధాన్యమివ్వడం జరుగుతోంది. కోర్టు ధిక్కారం లాంటి న్యాయవిహిత చర్యలు, తీవ్ర ప్రతిబంధక ప్రక్రియ అయిన పార్లమెంటు అభిశంసన లాంటి రాజ్యాంగబద్ధ భరోసాలను ఉపయోగించుకొని కొలీజియం నిర్ణయాలను ప్రశ్నించడానికి వీలులేని పరిస్థితిని సృష్టించారు. జస్టిస్ చలమేశ్వర్ నాయకత్వంలో జరిగిన తిరుగుబాటు ఈ పరిస్థితిని నిలదీసింది. న్యాయబద్ధ అధికారాల అజ్ఞాత పార్శ్వాలపై కాంతులు ప్రసరింపజేసింది. ఆ నలుగురు 'తిరుగుబాటు' న్యాయమూర్తుల సాహసోపేత తెగింపు హర్షధ్వానాలకు అర్హమైనది. ఆ తిరుగుబాటు న్యాయవ్యవస్థలో నిక్కరైన సంస్కరణలకు దారి తీస్తే న్యాయానికి జయ ధ్వానాలూ సమకూరుతాయి.

తాజా కలం: సర్వోన్నత న్యాయస్థానంలో సంస్కరణలకు బిసిసిఐ ఒక త్రిసభ్య కమిటీని నియమించాలన్న జోక్ ఒకటి వాట్సాప్‌లో జోరుగా షికారు చేస్తోంది. ఒక గౌరవనీయ, ప్రతిష్ఠాకర సంస్థ పరిహాసాలకు గురవుతుండడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? సదరు సంస్థలో మరింతగా భ్రష్టాకర పరిణామాలు చోటుచేసుకోకుండా వాటికి కారణమయ్యే లొసుగులు, లోపాలను తక్షణమే తొలగించాల్సిన అవసరాన్ని ఆ పరిహాసాలు నొక్కిచెప్పుతున్నాయనే కాదూ?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ప్రైవేటీకరణ కాదు.. ఆస్తుల బదిలీ

■ వి. శ్రీనివాస్



సారాంశం

ఇలా ప్రభుత్వ ఆస్తులన్నీ ప్రైవేట్‌కు అప్పగించిన తర్వాత భవిష్యత్తులో నిధుల అవసరానికి విక్రయించడానికి ఏమీ ఉండదు. ప్రైవేట్ సంస్థలను జాతీయం చేయాలన్న డిమాండ్‌కు అనుగుణమైన పరిస్థితిని సృష్టించడం తప్ప.

ఎయిరిండియాను ప్రైవేట్ వ్యక్తులు, సంస్థల పరం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ఇప్పుడు కొలిక్కి వచ్చాయి. ప్రజలు, ఉద్యోగుల నుంచి తీవ్ర ప్రతిఘటన, నిరసనల మధ్య పుష్కరకాలం కింద మొదలైన ఈ ప్రయత్నాలు, అంతకుమించిన మార్గాంతరం లేదన్న స్తబ్ద వాతావరణంలో ముగింపునకు రావడం గమనించాల్సిన విషయం. యుపిఎ, ఎన్‌డిఎ అన్న భేదం లేకుండా గత పుష్కరకాలంలో దేశాన్ని ఏలిన ప్రభుత్వాలు ప్రదర్శించిన చమత్కారమే ఈ వాతావరణానికి కారణం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించి మోదీ ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం తీసుకున్న "విప్లవాత్మక సంస్కరణ"ల వల్ల ఎయిరిండియా ప్రైవేట్ పరమే కాదు, ఏకంగా విదేశీపరమే కాబోతున్నది. ఎయిరిండియాలో 49 శాతం వాటాను విదేశీ ఎయిర్‌లైన్స్ సంస్థలు తీసుకునేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దేశ ఆర్థిక విధానాలను వాటితోపాటు అసంఖ్యాక ప్రజల తలరాతలను తిరగరాసేందుకు ఉద్దేశించిన ఆర్థిక సంస్కరణల్లో అత్యంత కీలకమైనది ప్రైవేటీకరణ. అత్యంత విలువైన ప్రభుత్వ ఆస్తులను గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం దీని పరమార్థం. దేశంలో ప్రైవేటీకరణ లేదా నష్టజాతక సంస్థలను ప్రభుత్వం వదిలించుకోవడం అన్న పేరుతో సాగుతున్న తంతులోని ప్రమాదకరమైన కోణాలను అవగాహన చేసుకునేందుకు ఎయిరిండియా ఒక తిరుగులేని ఉదాహరణగా నిలుస్తుంది.

ఎయిర్ ఇండియాను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలించుకోవాల్సిందే. నష్టజాతక సంస్థను ఎన్నేళ్లని నెత్తిన పెట్టుకుంటాం... ఇవీ ఈ మధ్యకాలంలో నీతి ఆయోగ్ నేతలు, ప్రభుత్వ పెద్దల నుంచి తరచూ వినవస్తున్న మాటలు. కొద్ది సంవత్సరాల క్రితం మాట్లాడేందుకు జంకిన మాటలను ఇప్పుడు బాహాటంగానే మాట్లాడుతున్నారు. ఎయిరిండియా దానికది నష్టజాతక సంస్థ కాదు. వేల కోట్ల రూపాయల్లో పోగుపడిన నష్టాలు, అంతకుమించి పేరుకుపోయిన అప్పులకు సంస్థ, సంస్థ ఉద్యోగుల బాధ్యత లేదు. ప్రభుత్వ పెద్దల నిర్వాకమే దీనికి ముఖ్య కారణం. రెండు దశాబ్దాల క్రితం ఎయిరిండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్ రెండు సంస్థలు భిన్న వ్యాపార వ్యూహాలతో మార్కెట్‌లో రాణిస్తూ వచ్చాయి. ఎయిరిండియా ప్రధానంగా అంతర్జాతీయ సర్వీసుల నిర్వహణలో ఉంటే, ఇండియన్ ఎయిర్‌లైన్స్ దేశీయ సర్వీసులను నిర్వహించేది. విమానయాన రంగంలో ప్రైవేట్ సంస్థలు అడుగుపెట్టేందుకు అవకాశం ఇచ్చిన తొలి రోజుల నుంచే ఈ సంస్థలపై ఒత్తిడి మొదలైంది. యుపిఎ ప్రభుత్వ హయాంలో ముఖ్యంగా ప్రఫుల్ పటేల్ విమానయాన శాఖ మంత్రిగా ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలు సంస్థల భవిష్యత్తును ధ్వంసంచేశాయి.

విడిగా తమ వ్యాపారం తాము చేసుకుంటున్న ఈ సంస్థలను విలీనం చేయాలన్న ప్రతిపాదనను తొలుత ముందుకు తెచ్చారు. విలీనం వల్ల కార్యకలాపాల్లో మేళవింపు బాగా ఉంటుందని, ఖర్చులు కలిసివస్తాయని ప్రచారం చేశారు. విలీనం ప్రతిపాదన తెర పైకి తేవడానికి ఏడాది ముందు రెండు సంస్థల వ్యాపార విస్తరణ, ఆధునికీకరణ, పోటీని తట్టుకోవడంపై చర్చను లేవనెత్తారు. అందుకు అనుగుణంగా వందల కోట్ల రూపాయలతో రెండు సంస్థలు దాదాపు 100 కొత్త విమానాల కొనుగోలుకు ఆర్డర్లు ఇచ్చాయి. ఈ ఆర్డర్లు తీసుకున్న అతిపెద్ద సంస్థ అమెరికాకు చెందిన బోయింగ్, యూరప్‌కు చెందిన ఎయిర్‌బస్. బోయింగ్ నుంచి కొత్త విమానాలను కొనుగోలు చేసేందుకు కావల్సిన అప్పును మరో అమెరికన్ సంస్థ అమెరికా ఎగ్జిమ్ బ్యాంక్ సమకూర్చింది. ఇందుకు అవసరమైన గ్యారంటీలను భారత ప్రభుత్వం సమకూర్చింది. ఈ విమానాల కొనుగోలు ఆర్డర్ ఇచ్చిన తర్వాత హఠాత్తుగా ఈ రెండు సంస్థల విలీనం ప్రతిపాదన ముందుకు వచ్చింది. నిజానికి విలీనం తర్వాత విమానాల కొనుగోలు నిర్ణయం తీసుకొని ఉంటే పరిస్థితి వేరే విధంగా ఉండేది. కొనుగోలు చేయాలనుకున్న విమానాల సంఖ్య తగ్గి ఉండేది. బహుశా ఈ విషయం గుర్తించే విలీనం ప్రతిపాదన తెరపైకి రావడానికి ముందే కొత్త విమానాల కొనుగోలు నిర్ణయం తీసుకొని ఉంటారన్నది విమర్శకుల అనుమానం. ఈ మొత్తం వ్యవహారంలో బోయింగ్, ఎయిర్ బస్‌లు లాభపడ్డాయి. అప్పులిచ్చిన అమెరికా ఎగ్జిమ్ బ్యాంక్ బాగుపడింది. ఇండియన్ ఎయిర్‌లైన్స్–ఎయిరిండియా అప్పులపాలయ్యాయి.



నష్టాల్లో కూరుకుపోయాయి. విలీనం తర్వాత ఏర్పడిన ఎయిరిండియాను విదేశీ ఎయిర్‌లైన్స్ సంస్థల ఒత్తిడి, ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ వంటి సంస్థల సలహాల కారణంగా ప్రభుత్వం తీసుకున్న ఓపెన్‌స్కై పాలసీ మరింత దెబ్బ తీసింది. ప్రభుత్వ నిర్వాకం వల్ల, లాభాలను ఆర్జించిపెట్టే గల్ఫ్ విమానయాన మార్గాలను, కీలకమైన ఐరోపా, అమెరికా మార్గాలను విదేశీ ఎయిర్‌లైన్స్ సంస్థలకు ఎయిరిండియా అప్పగించాల్సి వచ్చింది. ఎయిరిండియా యాజమాన్యం, ఉద్యోగులు తీవ్రంగా అభ్యంతరపెట్టినా పట్టించుకున్న నాథుడే లేడు. ఇలాంటి నిర్ణయాల ఉమ్మడి ప్రభావం ఎయిరిండియా ఆర్థిక పరిస్థితి దిగజారడానికి, అప్పుల్లోనూ, నష్టాల్లోనూ కూరుకుపోవడానికి కారణం. ఆ తర్వాత నష్టజాతక సంస్థగా ముద్రవేసి గత కొన్నేళ్లుగా కోట్ల రూపాయల ప్యాకేజీలను ఇస్తున్నట్టుగా ప్రకటించడం, ప్రభుత్వం మెడకు ఈ సంస్థ అతిపెద్ద గుదిబండగా మారిందన్న ప్రచారంతో ఈ సంస్థను వదిలించుకోవడానికి సానుకూల వాతావరణాన్ని గత మూడేళ్లలో సక్సెస్‌ఫుల్‌గా సిద్ధం చేశారు. అవినీతే ప్రధాన కారణం కావచ్చు. దీనివల్ల తక్షణ లబ్ధి ప్రఫుల్ లేదా మరొకరు పొంది ఉండొచ్చు. అయితే ప్రఫుల్ పటేల్ తీసుకున్న నిర్ణయాలు వైయక్తిక నిర్ణయాలుగా చూడలేము. అలాగని యుపిఎ ఉమ్మడి నిర్ణయాలుగా కూడా చూడరాదు. ఈ నిర్ణయాలు కాంగ్రెస్‌కూ, బిజెపికీ ఆమోదయోగ్యమైన సంస్కరణల ఫలితమన్న విషయం గుర్తించాలి. ప్రపంచవ్యాప్తంగా అతి చిన్న దేశాల్లోనూ ప్రభుత్వ విమానయాన సంస్థలే అద్భుతంగా రాణిస్తున్నాయి. ఖతార్ ఎయిర్‌వేస్, ఎమిరేట్స్, గరుడా, సౌదీ ఎయిర్‌లైన్స్, సింగపూర్ ఎయిర్‌లైన్స్, మలేషియన్ ఎయిర్‌లైన్స్.... ఇవన్నీ ప్రభుత్వ సంస్థలే. పైగా ఈ సంస్థలు భారత్‌లో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో విమానయాన సంస్థలను ఏర్పాటు చేశాయి. ఇప్పుడు ఎయిరిండియానూ కొనుగోలు చేసేందుకు ఎదురుచూస్తున్నాయి.

కొన్ని వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన పబ్లిక్ సెక్టార్ సంస్థలు కారు చౌకగా ప్రైవేట్ సంస్థల పరమవుతున్నాయి. ప్రైవేట్ రంగంలో విలీనాలు కొనుగోళ్లు జరుగుతున్నప్పుడు వాల్యుయేషన్స్ అంటే అమ్మకానికి వచ్చిన కంపెనీల విలువలు కళ్లు చెదిరే స్థాయిల్లో ఉంటాయి. ప్రభుత్వ రంగ సంస్థలను మార్కెట్లో పెట్టినప్పుడు వాల్యుయేషన్స్ సాధారణ ఇ–కామర్స్ కంపెనీ స్థాయిని కూడా చేరకపోవడం విషాదం. పిఎస్‌యులు చారిత్రకంగా పోషించిన పాత్రను ఉద్దేశపూర్వకంగానే తొక్కిపెట్టి వీటిని ప్రైవేట్‌పరం చేయడంలో లాభాలపైనా, వీటిని ప్రభుత్వ రంగంలో కొనసాగించడం వల్ల సర్కారు ఖజానాకు ఒరుగుతున్న నష్టాలపైనా చర్చలను సాగిస్తున్నారు. రిలయన్స్, అదానీ గ్రూప్ లాభాలు ఆయా సంస్థల యజమానుల సంపదను, కుబేరుల జాబితాలో వారి ర్యాంకింగ్‌ను పెంచడానికి దోహదం చేస్తాయి. సెయిల్, సింగరేణి, భెల్ వంటి సంస్థల లాభాలు వాటితో ముడిపడిన వారి జీవితాలు సామాజిక గతిశీలతలో మరో ఉన్నతస్థాయికి తీసుకువెళ్లేందుకు ఉపయోగపడుతాయి. ఈ ఏడాది 90 వేల కోట్ల రూపాయలను ఆ పై ఏడాది లక్ష కోట్ల రూపాయలను ప్రభుత్వ సంస్థల విక్రయం ద్వారా సమీకరించాలన్నది మోదీ ప్రభుత్వ వ్యూహం. విత్తలోటు పూడ్చుకోవడానికి ఆర్థిక రంగంలో ఉద్దీపనకు ఈ సొమ్ము ఉపయోగపడుంది. కొన్నేళ్లలో ఇలా ప్రభుత్వ ఆస్తులన్నీ ప్రైవేట్‌కు అప్పగించిన తర్వాత భవిష్యత్తులో నిధుల అవసరానికి విక్రయించడానికి ఏమీ ఉండదు. ప్రైవేట్ సంస్థలను జాతీయం చేయాలన్న డిమాండ్‌కు అనుగుణమైన పరిస్థితిని సృష్టించడం తప్ప. ■

కరీంనగర్‌లో నిత్య జనగణమన



కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద నిత్య జనగణమనకు గురువారం శ్రీకారం చుట్టారు. టవర్ సర్కిల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సామూహిక జాతీయ గీతాలాపన చేపట్టింది. ముఖ్య అతిథులుగా మేయర్ రవీందర్ సింగ్, కమిషనర్ శశాంక హాజరయ్యారు. పలు పాఠశాలల విద్యార్థులు, వివిధ రంగాల ప్రజలు, వ్యాపార వేత్తలు జాతీయ గీతాన్ని ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. **- కరీంనగర్ కల్చరల్**

ఫలించిన సింధూరెడ్డి దీక్ష

▸▸ చిమ్నాపూర్ కు రాబోతున్న ఆర్టీసీ బస్సు

కంది, జనవరి 18 : తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కంది మండలం చిమ్నాపూర్‌కు చెందిన విద్యార్థి సింధూరెడ్డి చేపట్టిన అమరణ దీక్ష ఫలించింది. బస్సు కోసం విద్యార్థిని నిరసన అంటూ గురువారం ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. సింధూరెడ్డి దీక్షకు స్పందించిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రఘునాథ్‌రావును సంప్రదించారు. చిమ్నాపూర్‌కు బస్సు సౌకర్యం కల్పించే విషయమై మాట్లాడారు. దీంతో చిమ్నాపూర్‌ను సందర్శించిన ఆర్ఎం రెండు, మూడు రోజుల్లో గ్రామానికి బస్సు పంపిస్తామని చెప్పారు. సింధూరెడ్డిని పరామర్శించి దీక్ష విరమింపజేశారు.

న్యాయమూర్తి, న్యాయవాదుల మధ్య వివాదం



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రెండో అదనపు న్యాయస్థానంలో న్యాయమూర్తికి, న్యాయవాదులకు మధ్య వివాదం చోటు చేసుకుంది. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి శిక్షల విషయంలో ట్రాఫిక్ పోలీసులకు, న్యాయవాదులకు బుధవారం వాగ్వాదం జరగడం, న్యాయమూర్తికి న్యాయవాదులు ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన సందర్భంగా జరిగిన సంభాషణ వివాదాస్పదమైంది. న్యాయమూర్తి పర్వతపు రవి దురుసుగా మాట్లాడారంటూ న్యాయవాదులు గురువారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల సముదాయం, జిల్లా 6వ అదనపు సెషన్స్ కోర్టుల్లో విధులు బహిష్కరించారు. జిల్లా సెషన్స్ జడ్జి సాంబశివరావు నాయుడు సమక్షంలో చర్చలు జరిగినా వివాదం సమసిపోలేదు. **- కోల్‌సిటీ (గోదావరిఖని)**

నీళ్ల బకెట్‌లో పడి బాలుడి మృతి

మహబూబాబాద్ రూరల్, జనవరి 18 : ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న బాలుడు, నీళ్ల బకెట్ లో పడి కన్నుమూశాడు. మహబూబాబాద్ సమీపంలోని జమాండ్లపల్లిలో గురువారం సోహన్ తేజ్ అనే బాలుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పట్టణానికి చెందిన కాంపాటి సంధ్య, జీవన్ కుమార్ దంపతులకు ఏడాదిన్నర బాలుడు ఒక్కడే సంతానం. జీవనోపాధి కోసం జమాండ్లపల్లిలో ఓ ప్రైవేట్ స్కూల్లో జీవన్ కుమార్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ అక్కడే కుటుంబంతో సహా నివసిస్తున్నాడు. జీవన్ కుమార్ బడికి వెళ్లిన సమయంలో ఆయన భార్య సంధ్య ఇంట్లో నిమగ్నమై ఉండగా సోహన్ తేజ్ ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో నీరు ఉన్న బకెట్‌లో ఉన్న గ్లాసును అందుకోవడానికి ప్రయత్నించి అందులో పడిపోయి, ఊపిరాడక మరణించి ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



బాలయ్య (ఫైల్)

సదాశివపేట, జనవరి 18: ఆర్థిక ఇబ్బందులతో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నిజాంపూర్ గ్రామానికి చెందిన ఉడుమాల బాలయ్య (46) ఆత్మహత్య చేసుకున్నాడు. బాలయ్య తన ఎకరం భూమిలో పత్తి పంట వేశాడు. నకిలీ విత్తనాలతో ఆశించిన దిగుబడి రాక పోగా.. అప్పులు పెరిగిపోయాయి. మరోవైపు ప్రభుత్వం ఇచ్చిన 20 సబ్సిడీ గొర్రెల్లో 11 అంతుచిక్కని రోగాలతో మృతి చెందాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి పురుగు మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

యాలాల, జనవరి 18: విద్యుదాఘాతంతో వికారాబాద్ జిల్లా యాలాల మండలం పేర్కంపల్లి గ్రామానికి చెందిన కుర్వ మల్లప్ప(60) చనిపోయాడు. మల్లప్ప గ్రామ సమీపంలోని ఓ పొలాన్ని 3 ఏళ్లుగా కౌలుకు తీసుకుని పంట సాగు చేస్తున్నాడు. నారుమడికి నీరు పెట్టేందుకు గురువారం ఉదయం పొలానికి వెళ్లాడు. అక్కడ బోరు మోటారు ఆన్ చేస్తుండగా కరెంటు షాక్‌తో మృతి చెందాడు.

కదిలిపోతున్న గిరిజనం

▸▸ కవ్వాల్ అభయారణ్యంలో రెండు ఊళ్లు కనుమరుగు

▸▸ టైగర్ జోన్ కోసం ఖాళీ కానున్న గ్రామాలు

▸▸ కంటితుడుపు పరిహారంపై గిరిజనుల అసంతృప్తి



నిర్మల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ అభయారణ్యంలోని కోర్ ఏరియా పరిధిలో ఉన్న గ్రామాలన్నింటినీ ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా మొట్ట మొదట నిర్మల్ జిల్లాలోని కడెం మండలం మైసంపేట్, రాంపూర్ గ్రామాలను ఖాళీ చేయించబోతున్నారు. ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల చొప్పున పరిహారం అందించి అక్కడి నుంచి సాగనంపనున్నారు. ఇందుకు సంబంధించి సర్కారు ఒకటి, రెండు రోజుల్లో యాక్షన్ ప్లాన్ అమలు చేయబోతుంది. ఈ రెండు గ్రామాల్లో మొత్తం 142 కుటుంబాలు ఉన్నాయి. దాదాపు 500కు పైగా జనాభా ఉంది. మొదటి నుంచి అభయారణ్యం కోసం జిల్లాలోని 11 గ్రామాలను ఖాళీ చేయించేందుకు అటవీ శాఖ ప్రయత్నిస్తోంది. అయితే ప్రజలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించడం, పరిహారంపై మొండి పట్టు పట్టడంతో ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయితే మైసంపేట్, రాంపూర్ గ్రామస్థులను మాత్రం అటవీ అధికారులు ఒప్పించగలిగారు. కాగా, ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 10లక్షల పరిహారంపై సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడి గిరిజనులు విలువైన వ్యవసాయ భూములు, ఇండ్లను కోల్పోతుండగా ప్రభుత్వం కంటి తుడుపుగా పరిహారం ఇవ్వడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. పరిహారం నాలుగింతలు పెంచాలని, అలాగే ప్రభుత్వం స్వయంగా పునరావాసం కల్పించాలన్న డిమాండ్ తీవ్రమవుతోంది.



రాంపూర్ గిరిజన గ్రామం ఇదే

పరిహాసంగా పరిహారం

మొదటి దశలో భాగంగా కడెం మండలంలోని రాంపూర్, మైసంపేట్ గ్రామాలను ఖాళీ చేయించబోతున్నారు. ఈ గ్రామాలు ఖాళీ అయిన తర్వాత మిగతా గ్రామాలను తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మైసంపేట్ గ్రామంలో 105 కుటుంబాలు జీవిస్తుండగా.. జనాభా 356 మంది. దాదాపు 250 ఎకరాలల్లో వీరు సాగు చేసుకుంటున్నారు. రాంపూర్ గ్రామంలో ఉన్న 37 కుటుంబాలకు వ్యవసాయమే ఆధారం. ప్రస్తుతం ఈ భూములన్నీ కనుమరుగు కానున్నాయి. వీరు బయట భూములు కొనుగోలు చేయాలంటే సర్కారు అందించే పరిహారంతో సాధ్యం కాని పని. ఈ గ్రామాల తరలింపు ప్రక్రియ పూర్తి కాగానే మరో 9 గ్రామాలను ఖాళీ చేయించాలని లక్ష్యంగా పెట్టుకోబోతున్నారు. గండి గోపాల్‌పూర్, ఇస్లాంపూర్, మిద్దెచింద, ఎంగ్లాపూర్, దొందరి, దోస్తునగర్ తదితర గ్రామాలను ఖాళీ చేయించే ప్రయత్నాలు ఇక ఊపందుకోనున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన పునరావాస ప్యాకేజీ, పరిహారంపై సర్వత్రా వ్యతిరేరత వ్యక్తమవుతోంది. 11 గ్రామాలను తరలించడం పట్ల పలు గిరిజన సంఘాలు మొదటి నుంచి అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఒక్కో కుటుంబానికి రూ. 10లక్షల పరిహారాన్ని మాత్రమే అందించి మిగతా వ్యవహారమంతా బాధితులపైనే వేస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఒక్కో కుటుంబానికి రూ. 20లక్షల పరిహారంతో పాటు ఇళ్లు, ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని కేటాయించాలన్న డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది.

పునరావాసం కల్పిస్తే వెళతాం



మాకు పునరావాసం కల్పిస్తే కవ్వాల్ టైగర్ జోన్ నుంచి బయటకు వెళతాము. 18 సంవత్సరాలు నిండిన వారికి పరిహారం అందిస్తామని చెబుతున్నారు. ప్రతి ఒక్కరికీ పరిహారం అందించాలి. పునరావాసం కింద కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు అందజేస్తున్న పరిహారం రూ. 10లక్షలు సరిపోవు. ఇల్లు, వ్యవసాయ భూమితో పాటు అన్ని సౌకర్యాలను కల్పించాలి.

- గాదే బుచ్చవ్వ, రాంపూర్

గిరిజనులను తరలించడం దుర్మార్గం



గిరిజనులను అడవుల నుంచి టైగర్ జోన్ పేరిట తరలించే ప్రయత్నం దుర్మార్గమైన చర్య. ఆదివాసీలను బయటకు తరలిస్తే వారి సంస్కృతీ, సంప్రదాయాలకు భంగం కలుగుతుంది. ఒక వేళతరలించే ప్రయత్నం చేస్తే వారికి ఇల్లుకు బదులు ఇల్లు, భూమికి బదులు భూమి నష్ట పరిహారంగా ముందుగానే అందించాలి. ఆ తరువాతనే వారిని అడవుల నుంచి తరలించాలి.

- నంది రామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు

ప్రజా దర్బార్‌లో మంత్రి తుమ్మల



మంత్రికి సమస్యలు చెబుతున్న జక్కేపల్లి గ్రామానికి చెందిన కిషోర్

కూసుమంచి, జనవరి 18: రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పెరిక శింగారం గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాటాడారు. ఈ సందర్భంగా జక్కేపల్లి గ్రామంలో మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. ప్రజా దర్బార్ సాగిందిలా..

రమేష్: మా గ్రామంలో ఎస్సీ కాలనీలో అందరం పేదవాళ్లమే. ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఒక్కో ఇంట్లో నాలుగైదు కుటుంబాలు ఉంటున్నాం. డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరీ చేయించండి.

మంత్రి: ఇక్కడ ప్రభుత్వ స్థలం ఏమైనా ఉందా?

ప్రజలు: ఎకరం ఎండోమెంట్ భూమి ఉంది. మరో నాయకుడు ఎకరం భూమి ఇప్పిస్తామని చెప్పారు.

మంత్రి: అయితే సరే. అధికారులతో మాట్లాడి రెండెకరాల భూమిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయిస్తా. (వెంటనే స్థల సేకరణ చేయాలంటూ తహసీల్దార్ కృష్ణను ఆదేశించారు)

కిషోర్: కాలనీలో ఇంటర్నల్ సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు లేక ఇబ్బందిగా ఉంది.

మంత్రి: సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశాను. ఇక వీటితో పాటే సైడ్ డ్రెయిన్ల నిర్మాణం చేపడతాం. (వెంటనే పీఆర్ డీఈ మహేష్‌ను పిలిచి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు)

వెంకటేశ్వర్లు: కాలనీలో విద్యుత్ స్తంభాలు, లైన్లు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నాం.

మంత్రి: (విద్యుత్ శాఖ ఏడీఈ ఆనంద్‌ను పిలిచి వెంటనే అవసరమైనచోట పోల్స్ వేసి, లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు)

అంజిరెడ్డి: పాలేరు ఏటిపై రెండు చెక్‌డ్యాంలు నిర్మించాలి.

మంత్రి: (ఐబీ డిఈని పిలిపించి సీడీఎఫ్ నిధులు మంజూరు ఇస్తానని చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు.)

సునీత: శ్మశాన వాటికలో నీటి వసతి లేదు.

మంత్రి: వెంటనే రెండు శ్మశాన వాటికల్లో రెండు బోర్లు మంజూరు చేస్తున్నా (అంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు)

అంజిరెడ్డి: మల్లేపల్లి-జక్కేపల్లి, జక్కేపల్లి-చెన్నారం గ్రామాల మధ్య బీటీ రహదారి మంజూరు చేయాలి.

మంత్రి: వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా కృషి చేస్తా.

'కాకతీయ' పేరుతో సినీ అవార్డులా?

▸▸ ప్రభుత్వ సలహాదారు పాపారావు ఆగ్రహం

వరంగల్ అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సినీ నిర్మాత, ఎంపీ సుబ్బరామిరెడ్డి కాకతీయ కళా వైభవ మహోత్సవాల పేరుతో వ్యవహరిస్తున్న తీరు అభ్యంతర కరమని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ వ్యవస్థాపక ట్రస్టీ, ప్రభుత్వ సలహాదారు బీవీ పాపారావు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకతీయ కళా వైభవ మహోత్సవాల పేరుతో బుధవారం హైదరాబాద్‌లో సుబ్బరామిరెడ్డి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి సినీ ప్రముఖులకు అవార్డులు ఇచ్చారన్నారు. కాకతీయుల పేరుతో ఉత్సవాలు నిర్వహించి సినీ నటుడు మోహన్‌బాబుకు బిరుదు ఇవ్వడం ఆశ్చర్యకరం అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో తెలంగాణ సంస్కృతి, కళారూపాలను తీవ్రంగా దెబ్బ తీశారనీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా అదే ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. కాకతీయుల వారసత్వ సంపదను కాపాడేందుకు ఒక వైపు అనేక సంస్థలు పాటుపడుతుంటే సుబ్బరామిరెడ్డి సినీ పరిశ్రమతో ముడిపెట్టి దాని ప్రాశస్త్యాన్ని తగ్గించడం తగదని ఇంటాక్, వరంగల్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు అన్నారు.

కాన్పు చేసే డాక్టర్లు వచ్చేశారు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



గర్భిణీలను పరీక్షిస్తున్న డాక్టర్ వైదేహి

మహబూబాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజిస్టులు సంక్రాంతి పండుగ రోజులతో పాటు ఆ మర్నాడు కూడా విధులకు హాజరు కాకపోవడంతో గర్భిణీలు పడుతున్న ఇబ్బందులపై ఆంధ్రజ్యోతి మెయిన్‌లో గురువారం ప్రచురించిన "కాన్పు చేసే డాక్టర్లు వస్తలేరు" కథనానికి స్పందన లభించింది. ఆస్పత్రి జిల్లా కో ఆర్డినేటర్ భీం సాగర్ వైద్యులందరిని అప్రమత్తం చేశారు. దీంతో రెగ్యులర్ డాక్టర్ ఆశాదేవితో పాటు డిప్యూటేషన్‌పై పని చేస్తున్న బానోతు వీరన్న, కవితలు విధులకు హజరయ్యారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ వైదేహి కూడా ఓపీలో గర్భిణీలకు పరీక్షలు నిర్వహించారు.

కందుల రీసైక్లింగ్ దందా బట్టబయలు

▸▸ సీజ్ చేసి విచారణకు ఆదేశించిన జేసీ



మార్కెట్ యార్డులో కందులను పరిశీలిస్తున్న జేసీ

జనగామ టౌన్, జనవరి 18: ఇతర జిల్లాలో కొనుగోలు చేసిన కందులను మద్దతు ధరకు మార్క్‌ఫెడ్‌కు అమ్మేందుకు యత్నించిన ఓ వ్యాపారి దందా జనగామ మార్కెట్ యార్డులో బట్టబయలైంది. కొంతమంది వ్యాపారులు బయట ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన కందులు రీసైక్లింగ్ దందాతో తిరిగి మార్క్‌ఫెడ్‌కు అమ్ముతున్నారనే సమాచారం మేరకు జాయింట్ కలెక్టర్ వనజాదేవి అధికారుల బృందంతో కలిసి యార్డును తనిఖీ చేశారు. కందులు తరలించిన వ్యాపారి యార్డులో రాశులు పోసి రైతు పేరుతో మార్క్‌ఫెడ్‌కు గిట్టుబాటు ధర రూ.5450కి విక్రయించే ప్రయత్నం చేశాడు. అధికారులు తనిఖీలు చేసి రీసైకిల్ దందాగా నిర్ధారించి వ్యాపారి తరలించిన 400 క్వింటాళ్ల కందులను సీజ్ చేసి సమగ్ర విచారణకు మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. జనగామ మార్కెట్ యార్డులో సంతోష్ ట్రేడర్‌కు చెందిన వ్యాపారి రామిని శ్రీధర్ రంగారెడ్డి జిల్లా తాండూర్ ప్రాంతం నుంచి రెండు లారీలలో కందులు కొన్నాడు. తాండూర్ ప్రాంతంలో కందుల ధర రూ.4వేల లోపే ఉండటంతో సదరు వ్యాపారి భారీగా కొనుగోలు చేసి యార్డులోని తన గోదాంలో నిల్వ చేశాడు. గురువారం గోదాంతో పాటు లారీలలో మిగిలిన సరుకుని టాటాఏస్ వాహనాల ద్వారా రైతుల పేరుతో మార్కెట్ యార్డుకు తరలించి కందులను రాశులుగా పోశాడు. పక్కా సమాచారంతో యార్డులో తనిఖీలు చేసిన జేసీ మార్క్‌ఫెడ్‌కు అమ్మకానికి యత్నించిన కందులు వ్యాపారికి చెందినవిగా నిర్ధారించి సీజ్ చేశారు.

పోడు భూముల్లో పంటలు నాశనం

▸▸ రాత్రి వేళ గడ్డి మందు పిచికారీ

▸▸ పదిహేను ఎకరాల్లో ఎండిన పొలాలు

▸▸ అటవీశాఖ ఉద్యోగులపై అనుమానం



ఎండిపోయిన పచ్చజొన్న, బొబ్బెరతోట మిశ్రమ పంట

మహబూబాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దాదాపు నాలుగు దశాబ్దాలుగా అటవీ భూములను పోడు చేసుకుంటున్న లంబాడ గిరిజనుల పంటలను దుండగులు ధ్వంసం చేశారు. ఆరు రోజుల కిందట రాత్రి వేళ సుమారు 15 ఎకరాల్లో వివిధ పంటలపై గడ్డిమందు పిచికారీ చేశారు. మూడ్రోజులుగా పంటలు ఎండిపోతుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇది అటవీ ఉద్యోగుల పనేనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా అమనగల్ శివారు పెద్దతండాలో జరిగిన ఈ ఉదంతంపై ఓ పాఠకుడు ఉప్పందించడంతో గురువారం ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. అమనగల్ శివారు పెద్దతండాకు చెందిన లంబాడ గిరిజనులు 38 మంది రైతులు దాదాపు 25 ఎకరాల్లో సాగు చేసుకుంటూ వస్తున్నారు. తాజాగా ప్రభుత్వం చేపట్టిన భూ ప్రక్షాళన సర్వేలోనూ అవి రైతుల సాగు భూములుగా తేలింది. కాగా, కొద్ది సంవత్సరాల నుంచి ఆ భూములు తమవేనంటూ అటవీశాఖ అధికారులు ట్రెంచ్(కందకాలు) తవ్వడం, పంటలను ధ్వంసం చేస్తూ వచ్చారు. అయినప్పటికీ రైతులు నాలుగు దశాబ్దాలుగా పోడు ద్వారా సేద్యం చేసుకుంటున్న తమకు పట్టాలివ్వాలంటూ డిమాండ్ చేస్తూ సాగు కొనసాగిస్తున్నారు. ఆరు రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో పవర్‌స్ప్రేయర్‌ల ద్వారా గడ్డిని చంపే మందును ఈ తోటలపై పిచికారీ చేశారని బాధితులు వాపోయారు. విషయం మూడ్రోజుల వరకు తమకు తెలియరాలేదన్నారు. క్రమంగా పంటలు ఎండిపోతుండడంతో అనుమానం వచ్చి పంట పొలాలను పరిశీలించగా తోటలో మనిషి కాలి అడుగుల అచ్చులు, గడ్డిని చంపే మందు పిచికారి చేసిన ఆనవాళ్లు కన్పించాయని రైతులు వివరించారు. అటవీ శాఖ వాళ్లే ఈ పని చేసి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని డీఎఫ్‌వో కిష్టాగౌడ్ తెలిపారు. అటవీ భూముల్లో సేద్యం చేయకూడదని నోటీసులిచ్చామని, వచ్చే సంవత్సరం ఆ భూముల్లో ప్లాంటేషన్ చేపడతామని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
6 diksuchi@andhrajyothy.com
నిజామాబాద్ • శుక్రవారం 19 జనవరి 2018

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, వ్యాపార, వాణిజ్య రంగాల్లో వేగంగా వస్తున్న మార్పులతో చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) నిపుణులకు డిమాండ్ ఏర్పడింది. చిన్న వయసులోనే సమాజంలో హోదా, గౌరవంతోపాటు మంచి వేతనం అందుకునే అవకాశం ఉండటంతో సీఏ కోర్సు యూత్ కెరీర్స్‌లో టాప్ ప్లేస్‌లో నిలుస్తోంది. సీఏ కోర్సు పరీక్షల్లో తెలుగు విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) కోర్సు ఫైనల్ ఫలితాలను జనవరి 17న ప్రకటించింది. ఎప్పటిలాగే ఈ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు మంచి ర్యాంకులు దక్కించుకున్నారు. జాతీయ స్థాయిలో టాప్ - 50లో 4, 25, 34, 35, 36 ర్యాంకులను తెలుగు రాష్ట్రాల విద్యార్థులు సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తమ ర్యాంకుల సాధన వెనుక వారి కృషి, చేసిన సన్నాహాలు, సీఏ కోర్సును ఎంచుకోవడానికి కారణాలు తదితర అంశాలను దిక్సూచితో పంచుకున్నారు.

సీఏ ర్యాంకర్లలో తెలుగు తేజాలు

టాపర్స్ వాయిస్

మొదటి నుంచీ ఆసక్తితో...

సీఏ ఫైనల్లో 800లకు 556 మార్కులు వచ్చాయి. జాతీయ స్థాయిలో నాలుగో ర్యాంకు. ఈ విషయం చాలా ఆనందాన్ని కలిగించింది. రోజుకు 8-10 గంటలు చదివేవాణ్ని. ఈ ర్యాంకు సాధనలో మా గురువు శివరామ్ మోహన్ రావు ప్రోత్సాహం చాలా ఉంది. ఇన్‌స్టిట్యూట్ మెటీరియల్ కూడా బాగా ఉపయోగపడింది.

స్కూల్లోనే: సీఏ చేయాలని 10వ తరగతిలోనే నిర్ణయించుకున్నా. కెరీర్‌లో త్వరగా స్థిరపడే అవకాశం, సమాజంలో లభించే గౌరవం, జీవితంలో ఎదగడానికి ఎక్కువ ఆస్కారం ఉండటం.. ఇవన్నీ సీఏ దిశగా నడిపించాయి. స్కూల్లో ఉన్నప్పుడు ఉపాధ్యాయులు, తెలిసిన వారు కూడా సీఏ గురించి చెప్పేవారు. దాంతో ఈ కోర్సును తెలుసుకోవాలన్న ఆసక్తి పెరిగింది. సీఏ కోర్సును ఎంచుకోవడానికి అదే ప్రధాన కారణం.



మాదాడి ఫణీష్ రెడ్డి
4వ ర్యాంకు

కుటుంబ నేపథ్యం: మాది వరంగల్ జిల్లా. చాన్నాళ్ల క్రితమే విజయవాడలో స్థిరపడ్డాం. నాన్న శ్రీనివాస్‌రెడ్డి ప్రైవేట్ ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా చేస్తున్నారు. అమ్మ శోభారాణి. అక్క ప్రియాంక బీటెక్ పూర్తి చేసి విజయవాడలోనే ఉద్యోగం చేస్తున్నారు.

విద్యాభ్యాసం: మొదటి నుంచి చదువులో మంచి మెరిట్ స్టూడెంట్‌నే. 10వ తరగతిలో 566 మార్కులు వచ్చాయి. సీఏ లక్ష్యంతోనే ఇంటర్మీడియెట్‌లో ఎంఈసీ గ్రూపును ఎంచుకున్నాను. ఇంటర్మీడియెట్‌లో 978 మార్కులు వచ్చాయి.

కష్టమనిపించలేదు: సీఏలో మూడు దశలు ఉంటాయి. అవి.. ఫౌండేషన్, ఇంటర్మీడియెట్. ఫైనల్. సాధారణంగా సీఏను కష్టమైన కోర్సుగానే భావిస్తారు. నా విషయంలో మాత్రం కోర్సులో చేరిన మొదటి రోజు నుంచే ఆసక్తితో చదివాను. కాబట్టి ఏ దశలో కూడా సీఏ కోర్సు కష్టమనిపించలేదు. సీపీటీలో 182 మార్కులు స్కోర్ చేశాను. ఇంటర్మీడియెట్ కోర్సులో 700లకుగాను 494 మార్కులు వచ్చాయి. ఆడిటింగ్ అంటే ఆసక్తి. దాంతో కెరీర్ ఆప్షన్‌గా ఆడిటింగ్‌ను ఎంచుకున్నాను. ఇందులో ఫైనల్ ఎగ్జామ్‌లో ఈ పేపర్‌లో 100కు 70 మార్కులు వచ్చాయి. అత్యధికంగా 86 మార్కులు ఎస్ఎఫ్ఎం (స్ట్రాటజిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్) పేపర్‌లో స్కోర్ చేశాను.

లక్ష్యం: విజయవాడలోని ఎంఎన్‌రావు అసోసియేట్‌లో అక్టోబర్‌లో ఆర్టికల్‌షిప్ పూర్తి చేశాను. ఆసక్తికి అనుగుణంగా ఆడిటింగ్ కంపెనీలో పని చేయాలని ఉంది.

సలహా: కామర్స్ కోర్సుల్లో సీఏ బెస్ట్. మిగతా కోర్సులతో పోల్చితే కెరీర్‌పరంగా చక్కటి అవకాశాలు ఉంటాయి. త్వరగా స్థిరపడొచ్చు. కెరీర్‌లో ఎదగడానికి ఎక్కువ స్కోప్ ఉంటుంది. అయితే ఈ కోర్సులో ప్రవేశించాలనుకునే వారికి ప్లానింగ్, కాన్ఫిడెన్స్, కమిట్‌మెంట్ లక్షణాలు తప్పనిసరిగా ఉండాలి. కష్టపడేతత్వం కావాలి. ఇవన్నీ ఉంటే నిర్దేశించిన సమయంలోనే సీఏను పూర్తి చేయవచ్చు. సీఏను పూర్తి చేయడానికి ఎక్కువ సమయం పడుతుంది అనే మాట వినిపిస్తుంది. అది నిజం కాదు. ప్రణాళిక ప్రకారం చదువుకుంటూపోతే సీఏను సకాలంలోనే పూర్తి చేయవచ్చు.

ప్రణాళిక ప్రకారం చదివితే..

సీఏ ఫైనల్లో 800కుగాను 505 మార్కులు వచ్చాయి. జాతీయ స్థాయిలో 25వ ర్యాంకు. రోజూ కనీసం 8 గంటలు చదివేవాణ్ని. ఇంటర్న్‌షిప్ చేస్తున్నప్పుడే చదివితే ప్రిపరేషన్ సులువుగా ఉంటుంది. అయితే ఒకవైపు పని చేస్తూ, మరోవైపు చదవడం కష్టం. దాంతో ప్రిపరేషన్ కోసం ఇచ్చే నాలుగు నెలల సమయంలోనే పరీక్షలకు సిద్ధమయ్యాను. ఒక సబ్జెక్ట్‌కు ఇంత సమయం అని ఏమీ నిర్దేశించుకోలేదు. కాకపోతే ఏది చదివినా పూర్తి ఏకాగ్రతతో చదివేవాణ్ని.

కుటుంబ నేపథ్యం: మాది రంగారెడ్డి జిల్లా చేవెళ్ల. అయితే హైదరాబాద్ శివరాంపల్లిలో స్థిరపడ్డాం. నాన్న మహేశ్వర్ రెడ్డి. అమ్మ మాధవి. అన్నయ్య ఒరాకిల్‌లో జాబ్ చేస్తున్నాడు. తమ్ముడు ఇంటర్మీడియెట్. 10వ తరగతిలో 537 మార్కులు వచ్చాయి. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూపును ఎంచుకున్నా. ఇంటర్మీడియెట్‌లో 978 మార్కులు స్కోర్ చేశాను.

సీఏనే ఎందుకు: అన్నయ్య జాబ్ చేస్తుండటంతో నేను కూడా ఆ దిశలోనే స్థిరపడాలనే ఉద్దేశంతోనే ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ తీసుకున్నాను. కానీ బీటెక్‌లో చేరాలంటే పెద్దమొత్తంలో డొనేషన్లు డిమాండ్ చేస్తుండటం, అదే సమయంలో ఇంజనీరింగ్‌కు అంతగా డిమాండ్ లేకపోవడంతో, కెరీర్‌పరంగా మంచి అవకాశాలు ఉంటాయనే ఆలోచనతో సీఏ కోర్సును ఎంచుకున్నాను.

ఫైనల్ కష్టం: ఐపీసీసీలో 39వ ర్యాంకు వచ్చింది. సీఏ ఫైనల్ దశ చాలా కష్టమనిపించింది. ఎందుకంటే ప్రిపరేషన్ కోసం కేవలం పుస్తకాల మీద ఆధారపడితే సరిపోదు. ప్రాక్టికల్స్‌లో నేర్చుకున్న జ్ఞానాన్ని పరీక్షల్లో అన్వయించాల్సి ఉంటుంది. అప్పుడే మంచి స్కోర్ సాధ్యమవుతుంది. కాబట్టి ఫైనల్లో కొంచెం ఇబ్బంది పడ్డాను. సీఏ కోర్సులో ప్రాక్టికల్ సబ్జెక్ట్‌లు ఆసక్తిని కలిగించాయి. ఎక్కువగా చదవాల్సి ఉండటంతో థియరీ సబ్జెక్ట్‌లు కొంచెం కష్టంగా భావించాను.

లక్ష్యం: ప్రస్తుతం ఉమామహేశ్వర అండ్ కంపెనీలో ఆర్టికల్‌షిప్ చేస్తున్నాను. ఇది రెండు నెలల్లో పూర్తవుతుంది. భవిష్యత్‌లో ఏదైనా మల్టీనేషనల్ కంపెనీకి సీఈఓగా ఎదగాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాను.

సలహా: అనుకున్నంత సులువుగా ఉండదు. కష్టపడే తత్వం ఉండాలి. ప్రణాళిక ప్రకారం చదివితే త్వరగానే ఈ కోర్సును పూర్తి చేయవచ్చు.



కొత్తా రాజవర్ధన్ రెడ్డి
25వ ర్యాంకు

నాలుగేళ్లలో పూర్తి చేయవచ్చు...

సీఏ ఫైనల్లో 800లకుగాను 495 మార్కులు వచ్చాయి. జాతీయ స్థాయిలో 34వ ర్యాంకు సాధించాను. రోజుకు 12 గంటలు ప్రిపరేషన్‌కు కేటాయించాను. సీఏ ఫైనల్ దశలో ఆడిటింగ్ సబ్జెక్ట్ చాలా కష్టంగా అనిపించింది. సిలబస్ ఎక్కువగా ఉండేది.

కుటుంబ నేపథ్యం: మాది అనంతపురం జిల్లా తాడిపత్రి. నాన్న చౌడయ్య వ్యాపారం చేస్తుంటారు. అమ్మ హైమావతి. అన్నయ్య మధు టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్‌గా పని చేస్తున్నాడు. తమ్ముడు మహేందర్ కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

- నాకు 10వ తరగతిలో 515 మార్కులు వచ్చాయి. ఇంటర్మీడియెట్‌లో ఎంఈసీ గ్రూపును ఎంచుకున్నాను. ఇంటర్మీడియెట్‌లో 964 మార్కులు స్కోర్ చేశాను.

బెస్ట్ అనిపించి: సీఏనే ఎంచుకోవడానికి ప్రత్యేకమైన కారణమంటూ ఏమీ లేదు. అప్పుడు ఉన్న పరిస్థితుల్లో బెస్ట్‌గా అనిపించింది. దీంతో సీఏను ఎంచుకున్నాను. అంతేకాకుండా కెరీర్‌పరంగా మంచి అవకాశాలు ఉంటాయి. త్వరగా స్థిరపడొచ్చు.

అనుకున్న విధంగానే: సీఏలోని మూడు దశలూ పెద్దగా కష్టమనిపించలేదు. ఆసక్తితో చదివాను. ఐపీసీసీ దశలో జాతీయ స్థాయిలో 21వ ర్యాంకు వచ్చింది.

- సీపీటీలో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ నాదే. ప్రణాళిక ప్రకారం చదివేవాణ్ని. క్రమం తప్పకుండా ప్రిపరేషన్ సాగించాను. దాంతో నాలుగేళ్లలోనే సీఏను పూర్తి చేయగలిగాను.

లక్ష్యం: ప్రస్తుతం చెన్నైలో ఆర్టికల్‌షిప్ చేస్తున్నాను. తరవాత సీఏకు అనుబంధంగా ఉన్న కోర్సులను చేయడానికి ప్రాధాన్యం ఇస్తాను.

- అటుపై ఏదైనా ఉద్యోగంలో చేరతా. కెరీర్‌పరంగా పెద్ద బహుళజాతి కంపెనీకి సీఈఓ స్థాయికి ఎదగాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాను.

సలహా: సీఏ కోర్సు చాలా కష్టమైంది. బాగా హార్డ్‌వర్క్ చేయాలి. ఇతర వ్యాపకాలు పెట్టుకోకుండా ప్రణాళిక ప్రకారం చదువుతుండాలి. అప్పుడే నాలుగేళ్లలో సీఏను పూర్తి చేయడం సాధ్యమవుతుంది.



తోగట మహేష్‌బాబు
34వ ర్యాంకు

రివిజన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి...

సీఏ ఫైనల్లో 800లకు 494 మార్కులు వచ్చాయి. జాతీయ స్థాయిలో 35వ ర్యాంకు వచ్చింది. రోజుకు 12-15 గంటలు ప్రిపరేషన్‌కు కేటాయించాను. సీఏ ఫైనల్ దశలో ఎనిమిది సబ్జెక్ట్‌లు ఉంటాయి. అన్నీ కష్టమైనవే. ఇష్టమైన సబ్జెక్ట్‌లు ఎఫ్ఆర్ (ఫైనాన్షియల్ రిపోర్టింగ్), ఎస్ఎఫ్ఎం (స్ట్రాటజిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్). వీటిల్లో ఎఫ్ఆర్ పేపర్‌లో 68, ఎస్ఎఫ్ఎం పేపర్‌లో 75 మార్కులు వచ్చాయి. అత్యధికంగా కార్పొరేట్ అండ్ అలైడ్ లాస్‌లో 76 మార్కులు స్కోర్ చేశాను.

కుటుంబ నేపథ్యం: మాది విజయవాడ. నాన్న సాంబశివరావు ప్రైవేట్ ఉద్యోగి. అమ్మ విజయలక్ష్మి. అన్నయ్య వంశీ కృష్ణ. బీటెక్ పూర్తయింది. జాబ్ చేస్తున్నాడు. 10వ తరగతిలో 494 మార్కులు వచ్చాయి. సీఏ లక్ష్యంగా ఇంటర్మీడియెట్‌లో ఎంఈసీ గ్రూపును తీసుకున్నాను. ఇంటర్మీడియెట్‌లో 930 మార్కులు స్కోర్ చేశాను.

నాన్న సలహాతో: 10వ తరగతిలోనే సీఏ చేయాలని నిర్ణయించుకున్నా. నాన్న సలహాతోనే సీఏ కోర్సును ఎంచుకున్నా. అంతేగాక కెరీర్‌పరంగా మంచి అవకాశాలు ఉంటాయనే ఉద్దేశంతో సీఏ కోర్సును ఎంపిక చేసుకున్నా.

సీఏ కోర్సు ఇలా: రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేస్తూ, రివిజన్‌కు ప్రాధాన్యం ఇవ్వటంతో సీఏలోని మూడు దశలూ పెద్దగా కష్టమనిపించలేదు. సీఏలో ఐపీసీసీలో 364 మార్కులు, ఫౌండేషన్‌లో 140 మార్కులు వచ్చాయి.

లక్ష్యం: ప్రస్తుతానికి ఆర్టికల్‌షిప్ పూర్తయింది. ముందుగా ఏదైనా ఉద్యోగంలో చేరతా. కొంత అనుభవం గడించాక సొంతగా ప్రాక్టీస్ చేయాలనే ఆలోచనతో ఉన్నాను. కెరీర్‌పరంగా ఉన్నత స్థానాలకు ఎదగాలనే ఆకాంక్ష బలంగా ఉంది.

సీఏ ఔత్సాహికులకు ఇచ్చే సలహా ఏమిటంటే..: హార్డ్‌వర్క్ చేసే తత్వం ఉంటేనే ఈ కోర్సును ఎంచుకోవడం మంచిది. చాలా మందిలో సీఏ కోర్సును పూర్తి చేయడానికి చాలా సమయం పడుతుందనే భావన ఉంది. అది సరికాదు. ప్రతి రోజూ ప్రాక్టీస్, రివిజన్ చేస్తుంటే నాలుగేళ్లలో సీఏను పూర్తి చేయవచ్చు.



పడుచూరి రామకృష్ణ
35వ ర్యాంకు

ఆసక్తితోపాటు ఓపిక ఉండాలి...

సీఏ ఫైనల్లో 800లకుగాను 493 మార్కులు వచ్చాయి. జాతీయ స్థాయిలో 36వ ర్యాంకు సాధించాను. రోజుకు 8-10 గంటలు చదివాను. సీఏ ఫైనల్ దశలో అన్ని సబ్జెక్ట్‌లు కష్టంగానే అనిపించాయి. అన్నీ ప్రధానమైనవి. వాటిల్లో ఎస్ఎఫ్ఎం సబ్జెక్ట్ అంటే బాగా ఇష్టం. అదే సమయంలో కష్టం కూడా. ఈ సబ్జెక్ట్‌లో 100కి 82 మార్కులు వచ్చాయి.

కుటుంబ నేపథ్యం: మాది కృష్ణా జిల్లా అవనిగడ్డ సమీపంలోని పోటుమీద గ్రామం. నాన్న జరుగు వీర రాఘవయ్య. ఆటోడ్రైవర్, అమ్మ సుబ్బరామమ్మ, అన్నయ్య భానుకిరణ్.

అన్నయ్యతోపాటే: కెరీర్‌పరంగా మంచి అవకాశాలు ఉంటాయి. దాంతోపాటు అన్నయ్య కూడా సీఏనే ఎంచుకోవడంతో ఇద్దరం ఒకే దగ్గర ఉండి చదువుకోవచ్చు అనే ఉద్దేశంతో సీఏ కోర్సును తీసుకున్నాను.

మెరిట్ స్టూడెంట్: 10వ తరగతిలో 546 మార్కులు వచ్చాయి. ఇంటర్మీడియెట్‌లో ఎంఈసీ గ్రూపును తీసుకున్నా. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 488 మార్కులు వచ్చాయి. ఇది రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు. మొత్తంమీద 965 మార్కులు వచ్చాయి.

ఫైనల్ కష్టం: సీఏలోని అన్ని సబ్జెక్ట్‌లు ముఖ్యమైనవే. అయితే ఆసక్తిని బట్టి ఎక్కువ మార్కులు స్కోర్ చేసే సబ్జెక్ట్‌ను ఎంచుకున్నాను. ఈ కోర్సులో ఇంటర్మీడియెట్ దశలోని అకౌంటింగ్ చాలా సులువుగా అనిపించింది. సీపీటీలో 3వ ర్యాంకు, ఐపీసీసీలో 42వ ర్యాంకు వచ్చాయి.

లక్ష్యం: ప్రస్తుతం విజయవాడలో ఆర్టికల్‌షిప్ చేస్తున్నాను. ఏప్రిల్‌లో పూర్తవుతుంది. భవిష్యత్‌లో ఏదైనా పెద్ద కంపెనీలో ఉన్నత స్థాయికి ఎదగాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాను.

సలహా: సీఏలో విజయం సాధించాలంటే ఆసక్తితోపాటు ఓపిక కూడా ఉండాలి. ప్రణాళిక ప్రకారం చదువుకుంటూపోతే సీఏ కోర్సును మొదటి ప్రయత్నంలోనే పూర్తి చేయవచ్చు. కాకపోతే అందుకు తగ్గట్లుగా శ్రమించాలి.



జరుగు లక్ష్మీ ప్రసన్న
36వ ర్యాంకు

జాబ్ కార్నర్

సైంటిస్ట్/ ఇంజనీర్లు

ఇస్రో - నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ వివిధ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. వివరాలు...

- మొత్తం ఖాళీల సంఖ్య: **38**
- సైంటిస్ట్ / ఇంజనీర్ - ఎస్‌సీ (లెవల్ - 10): 33
- అర్హత: ఎంఎస్సీ, ఎంఈ / ఎంటెక్ (సైన్స్, ఇంజనీరింగ్ విభాగాలు).
- వయోపరిమితి: 18 - 35 సంవత్సరాల మధ్య ఉండాలి (ఫిబ్రవరి 5 నాటికి).
- సైంటిస్ట్/ ఇంజనీర్ - ఎస్‌డీ (లెవల్ - 11): 02
- అర్హత: పీహెచ్‌డీ (అట్మాస్ఫెరిక్ మోడలింగ్), ఎంటెక్/ ఎంఎస్ / ఎంఎస్సీ (ఫిజిక్స్ / మెటియోరాలజీ/ అట్మాస్ఫెరిక్ సైన్సెస్/ ఎర్త్‌సైన్స్ / మ్యాథమెటిక్స్) (లేదా) పీహెచ్‌డీతోపాటు పీజీ డిగ్రీ (మెరైన్ సైన్సెస్) ఉండాలి.
- వయోపరిమితి: ఎలాంటి వయోపరిమితి లేదు.
- సైంటిఫిక్ అసిస్టెంట్ (లెవల్ - 7): 03
- అర్హత: ప్రథమ శ్రేణిలో బీఎస్సీ డిగ్రీ (మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్)
- వయోపరిమితి: 18 - 35 సంవత్సరాల మధ్య ఉండాలి (ఫిబ్రవరి 5 నాటికి).
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: జనవరి 17, 2018
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: ఫిబ్రవరి 5, 2018.
- వెబ్‌సైట్: https://nrsc.gov.in

ఐఓసీఎల్ రిఫైనరీస్

- మొత్తం ఖాళీల సంఖ్య: **101**
- పోస్టు: అప్రెంటీస్.
- విభాగాల వారీ ఖాళీలు: సెక్రటేరియల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) - 75, అకౌంటెంట్ (ఏసీటీ) - 26.
- రిఫైనరీ డివిజన్ల వారీ ఖాళీలు: గువాహటి - 12 (ఎస్‌ఏ - 10 , ఏసీటీ - 2); బరౌనీ - 8 (ఎస్‌ఏ - 5 , ఏసీటీ - 3), గుజరాత్ - 14 (ఎస్‌ఏ - 11 , ఏసీటీ - 3), హల్దియా - 12 (ఎస్‌ఏ - 9 , ఏసీటీ - 3), మధుర - 13 (ఎస్‌ఏ - 10 , ఏసీటీ - 3), పానిపట్ - 11 (ఎస్‌ఏ - 7 , ఏసీటీ - 4), దిగ్బాయ్ - 12 (ఎస్‌ఏ - 10 , ఏసీటీ - 2), బొంగైగావ్ - 12 (ఎస్‌ఏ - 10 , ఏసీటీ - 2), పారదీప్ - 7 (ఎస్‌ఏ - 3 , ఏసీటీ - 4).
- అర్హత: సంబంధిత విభాగాలను అనుసరించి బీఏ / బీఎస్సీ / బీకామ్ ఉత్తీర్ణత.
- వయస్సు: 2018, జనవరి 1 నాటికి 18 - 24 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి రిఫైనరీ డివిజన్ చిరునామాకు గడువులోగా పంపాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 3, 2018.
- హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ: ఫిబ్రవరి 17, 2018.
- వెబ్‌సైట్: www.iocl.com

హెచ్‌పీసీఎల్

హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) - ముంబై, ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...

ఇంజనీర్ (ఆఫీసర్స్)

- విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్, సివిల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్.
- అర్హత: 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ. గేట్ - 2018 ఉత్తీర్ణత ఉండాలి.
- వయోపరిమితి: 25 సంవత్సరాలు (జూన్ 30 నాటికి).
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: ఫిబ్రవరి 12, 2018.
- వెబ్‌సైట్: http://hindustanpetroleum.com

ఎన్ఐటీలో ఫ్యాకల్టీ

పాట్నాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ).. బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీల సంఖ్య: **122**
- పోస్టు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్.
- మొత్తం ఖాళీలు: 122 (అన్‌రిజర్వ్‌డ్ - 95 , ఓబీసీ - 14 , ఎస్సీ - 5 , ఎస్టీ - 8).
- విభాగాలు: సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్.




- అర్హత: సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి పీహెచ్‌డీ / మాస్టర్స్ డిగ్రీ. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, ఉద్యోగానుభవం తదితరాలు
- దరఖాస్తు రుసుం: జనరల్ / ఓబీసీ - రూ.600; ఎస్సీ / ఎస్టీ - రూ.300; దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్ కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, ఫొటోలు, ఫీజు రిసీట్ జతచేసి 'ది డైరెక్టర్, ఎన్ఐటీ పాట్నా, అశోక్ రాజ్‌పథ్, పాట్నా - 800005, బిహార్ చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 22, 2018.
- హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ: జనవరి 31, 2018.
- వెబ్‌సైట్: http://www.nitp.ac.in/

టీచింగ్ ఫ్యాకల్టీ

అస్సాం యూనివర్సిటీ టీచింగ్ ఫ్యాకల్టీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు....

- మొత్తం ఖాళీలు: **33**
- ప్రొఫెసర్: 14
- అసోసియేట్ ప్రొఫెసర్: 12
- అసిస్టెంట్ ప్రొఫెసర్: 07
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
- దరఖాస్తుకు చివరితేది: 06.02.2018.
- వెబ్‌సైట్: www.aus.ac.in/



తెలంగాణకు

డ్రాగన్ ఫ్రూట్ రుచులు

మిర్యాలగూడ రైతు వినూత్న ప్రయోగం

తెలంగాణ గడ్డపై తొలిసారి డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన రైతు యాదగిరి. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ఈ పండును మనమే ఎందుకు పండించకూడదనుకుని ఎంతో పరిశోధన చేసి విజయం అందుకున్నారాయన.

మిర్యాలగూడకు చెందిన రైతు, ఐరన్ సిండికేట్ వ్యాపారి యాదగిరి వ్యాపార రీత్యా థాయిలాండ్ వెళ్లారు. అక్కడ డ్రాగన్‌ఫ్రూట్ రుచి చూశారు. ఎన్నో పోషకాలున్న ఈ పండును తెలంగాణ గడ్డపై పండించాలనుకున్నారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామశివారులోని తన పొలాన్ని ప్రయోగశాలగా మార్చారు. డ్రాగన్ ఫ్రూట్ విజయవంతంగా సాగు చేసి తెలంగాణ రైతాంగానికి ఆదర్శప్రాయంగా నిలిచారు. ఇందుకోసం ఎంతో శ్రమించారు యాదగిరి. థాయిలాండ్‌లో ఆ పండు గురించి ఆరాతీశారు. మెళకువలు తెలుసుకున్నారు. కోల్‌కతా, ముంబై, చెన్నై, బెంగుళూర్ వంటి నగరాల సమీపంలో సాగవుతున్న డ్రాగన్ ఫ్రూట్ తోటలను పరిశీలించారు. కోల్‌కతాలో ఫంగస్, వైరస్‌లేని డ్రాగన్ ఫ్రూట్ మొక్కల అంట్లను వ్యయప్రయాసలకోర్చి తెప్పించారు. వాటిని ప్రయోగాత్మకంగా రెండేళ్ల కిందట తన బత్తాయి తోట సమీపంలో వున్న ఎకరన్నర భూమిలో సాగు చేసి, తెలంగాణ గడ్డపై డ్రాగన్ ఫ్రూట్‌ను పండించిన ఘనత అందుకున్నారు. ఆ స్ఫూర్తితో మరో 14 ఎకరాల్లో తానే స్వయంగా అంట్లు కట్టుకొని డ్రాగన్ ఫ్రూట్ తోటను విస్తరించారు. 15 ఏళ్ల క్రితం 40 ప్రాంతాల్లో బత్తాయి తోటలను పరిశీలించి ఏరికోరి తిరుపతి యూనివర్సిటీ నుంచి బత్తాయి మొక్కలను తెచ్చి నల్లగొండ జిల్లాలోనే అత్యధిక బత్తాయి దిగుబడిని సాధించిన రైతుగా కూడా గుర్తింపు పొందారు యాదగిరి. డ్రాగన్ ఫ్రూట్ సాగు ఖర్చుతో కూడుకున్నది. ఒక ఎకరా సాగు చేయాలంటే సిమెంట్ స్తంభాలు, సిమెంట్ రింగ్ (బండిచక్రంలా), డ్రిప్పు, మొక్కకు కలిపి రూ. 1400 ఖర్చవుతుంది. ఎకరాకు నాలుగు వందల స్తంభాలు పాతి ప్రతి స్తంభానికి నాలుగు మొక్కల చొప్పున నాటాలి. డ్రిప్పు ద్వారా అడపాదడపా నీటినిస్తే సరిపోతుంది. ఏడాది తరువాత చక్రానికి పాకిన డ్రాగన్ చెట్టు చక్రం నుంచి కిందకు వేలాడుతూ పూత పూస్తుంది. ఏడాదిన్నర తరువాత మొదటి పంట చేతికందుతుంది. ఏటా ఆగస్టు నుంచి నవంబర్ మాసాల మధ్యలో పంట దిగుబడి వస్తుంది. ఎకరాకు మూడు సంవత్సరాల తరువాత నాలుగు టన్నుల చొప్పున పంట దిగుబడి వస్తుంది. ఐదు సంవత్సరాలు దాటిన తోటల్లో ఎకరాకు 6 నుంచి 8 టన్నుల డ్రాగన్ ఫ్రూట్స్ రైతు చేతికందుతాయి.



ప్రయోగం

మొక్కల సరఫరాకు సిద్ధం

తెలుగు రాష్ట్రాల రైతులకు డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను సరఫరా చేసే ఆలోచనతో నేనే స్వయంగా మొక్కల అంట్లు కట్టించే పని చేపట్టాను. విదేశాలతో పాటు మన దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పర్యటించి డ్రాగన్ ఫ్రూట్ సాగు పద్ధతుల్ని గమనించాను. ఆ అనుభవంతో ఆసక్తి వున్న రైతులకు మొక్కలు సరఫరా చేసేందుకు సిద్ధంగా వున్నాను.

- యాదగిరి, రైతు

టన్ను ధర రూ. లక్ష

డ్రాగన్ ఫ్రూట్‌కు మన మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వాటి కోసం ఇతర దేశాల మీదే ఎక్కువ ఆధారపడున్నాం. ప్రస్తుతం డ్రాగన్ ఫ్రూట్ టన్ను రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు ధర పలుకుతోంది. తెలంగాణ రైతు యాదగిరి ఎకరన్నర పొలంలో సాగు చేసిన తోటనుంచి మొదటి విడతగా రెండు టన్నుల డ్రాగన్ ఫ్రూట్‌ల దిగుబడి సాధించారు. వీటిని టన్నుకు 1.15 లక్షల చొప్పున చెన్నై, కోల్‌కతా పండ్ల వ్యాపారులకు విక్రయించారు. లాభదాయకంగా ఉండడంతో కోల్‌కతా నుంచి తాను తెచ్చి సాగు చేసిన డ్రాగన్ మొక్కలకే అంట్లు కట్టి మొక్కలు పెంచారు. ఆ మొక్కలనే తన 14 ఎకరాల పొలంలో నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు యాదగిరి. ఈ రైతు ప్రయోగాత్మకంగా సాగు చేసిన తోటను గత నెలలో తెలంగాణ హార్టికల్చర్ శాఖ కమిషనర్ వెంకట్‌రామిరెడ్డి సందర్శించారు. తెలంగాణ ప్రాంతంలో డ్రాగన్ ఫ్రూట్ తోట సాగుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ తోటలను రైతులు విరివిగా పెంచే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి రైతులను ప్రోత్సహించే విధంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, మిర్యాలగూడ



ఆహ్లాదం.. ఆరోగ్యం

ఒక మొక్క అదృష్టాన్ని మోసుకొస్తుంది. మరో మొక్క ఇంట్లో గాలిని శుభ్రం చేస్తుంది. ఇంటికి అందం తీసుకురావడంతో పాటు ఆహ్లాదాన్ని పెంచే ఈ తరహా మొక్కలకు నానాటికీ ఆదరణ పెరుగుతోంది.

కనువిందు, స్వచ్ఛమైన గాలి..

ఇంటి మొక్కలకు పెరుగుతున్న ఆదరణ

గ్రీన్ హోమ్

ఇంటి ముందు ఖాళీ స్థలంలో, పెరట్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, అందమైన పూలమొక్కలను పెంచుకునే అదృష్టం ఈ కాలంలో అందరికీ ఉండడం లేదు. ఇళ్లు చిన్నవైపోయాయి. స్థలమున్నా శ్రమకోర్చి మొక్కలను పెంచే సమయం ఉండదు. అయినా పచ్చదనాలను పంచే మొక్కలను చూస్తే చాలామందికి ప్రాణం లేచొస్తుంది. అందుకే కనువిందు చేయడంతో పాటు ఇంట్లో స్వచ్ఛమైన గాలిని అందించే అరుదైన మొక్కలను పర్యావరణ ప్రేమికులు ఆదరిస్తున్నారు. ఖాళీ స్థలం లేకపోయినా వంట ఇంట్లో, డైనింగ్ టేబుల్ మీద, టీవీ పక్కన, మెట్ల పక్కన అందమైన చిన్న కుండీలలో పెంచుకునే మొక్కలకు ఇప్పుడు మార్కెట్లో మంచి ఆదరణ లభిస్తోంది. పెద్దగా శ్రమ లేకుండా తక్కువ నీటి వినియోగంతో చీడపీడల బాధ లేకుండా ఈ మొక్కలను పెంచుకునే అవకాశం ఉండడంతో అపార్ట్‌మెంట్ వాసులు సైతం వీటినాదరిస్తున్నారు. ఇంటికి కొత్త అందాలు తెచ్చిపెట్టే అలాంటి అరుదైన మొక్కల్లో కొన్ని మొక్కల పరిచయం ఇది.

1. అలోవెరా : ఆధునిక యుగపు అద్భుతమైన మొక్కగా పేరొందిన అలోవెరా గాలిని శుభ్రం చేయడంతో పాటు కంటికి ఇంపుగా ఉంటుంది. రసాయనాలు, పెయింటింగ్ తదితర ఘాటైన వాసనలను ఈ మొక్క చాలా వరకు తగ్గిస్తుంది. ఇంట్లో కాస్త ఎండ తగిలే ప్రదేశం దీనికి ఎంతో అనుకూలం. ఈ మొక్కకు రెండు మూడు రోజులకోసారి నీరుపోస్తే సరిపోతుంది.

2. అరేకా పామ్ : పచ్చని ఆకులుండే ఈ మొక్కను ఎండ తగలని చోట ఉంచాలి. ఎండ తగిలితే దీని ఆకులు పసుపుపచ్చగా మారతాయి. ఆరేడు అడుగుల ఎత్తువరకూ ఇది పెరుగుతుంది కాబట్టి మెట్ల పక్కన, హాల్లో ఒక మూల దీన్ని అమరిస్తే అందంగా ఉంటుంది. చిన్న తొట్టెలో దీన్ని పెంచడం వల్ల వేళ్లు పరిమితంగా విస్తరించి మొక్క కుదిమట్టంగా పెరుగుతుంది.

3. స్నేక్ ప్లాంట్ : గాలిని పరిశుభ్రం చేసే మొక్కగా నాసా గుర్తించిన స్నేక్ ప్లాంట్ బాత్రూంలలో ఉంచేందుకు అనువుగా ఉంటుంది. ఈ మొక్కను పెంచడం చాలా సులభం. వారం రోజులపాటు నీళ్లుపోయడం మర్చిపోయినా పచ్చని ఆకులతో ఈ మొక్క మనలను ఆకర్షిస్తుంది.



పీస్ లిల్లీ

4. పీస్ లిల్లీ: ఇంట్లో నాలుగు గోడల మధ్య పెంచే మొక్కల్లో పీస్ లిల్లీని రారాణిగా చెబుతారు. ముదురుపచ్చని ఆకులు, తెల్లని పూలతో దృష్టిని ఆకర్షించే ఈ మొక్క ఒకటి నుంచి ఆరడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. అందమైన కుండీలో ఈ మొక్కను నాటుకుంటే హాల్లో టీవీ పక్కన, రీడింగ్ టేబుల్ చెంతన పెట్టుకునేందుకు అనువుగా ఉంటుంది. ఈ మొక్కను పెంచే కుండీలోని మట్టిని నిరంతరం కొద్దిపాటి తేమగా ఉండేట్టు చూసుకుంటే సరిపోతుంది.

5. మనీ ప్లాంట్ : గాజు బాటిల్స్, పెద్ద కప్పులు, కుండీలు... ఇలా ఎందులోనైనా మనీ ప్లాంట్ పెరుగుతుంది. ఇంటి ముఖద్వారానికి, కిటికీలకూ కూడా ఈ తీగ జాతికి చెందిన మొక్కను పాకిస్తే కనులకు ఇంపుగా ఉంటుంది. ఎలాంటి వాతావరణంలోనైనా పెరిగే ఈ మొక్క ఇంట్లో ఉంటే ఆ ఇల్లు సిరిసంపదలతో తులతూగుతుందని నమ్మకం. కొద్దిపాటి వెలుతురులో బాగా పెరిగే ఈ మొక్కకు రెండు మూడు రోజులకోసారి నీరు పోస్తే సరిపోతుంది.



వెదురు మొక్క

6. వెదురు మొక్క: అదృష్టానికి మారుపేరుగా చెప్పుకునే వెదురు మొక్క టీపాయ్‌లు, స్టడీటేబుల్స్ మీద వుంచేందుకు అనుకూలంగా వుంటుంది. చిన్న గాజుపాత్రలో వుంచి అప్పుడప్పుడూ నీరు పోస్తూ వుంటే నెలల తరబడి పచ్చదనాలను పంచుతుంది ఈ మొక్క. ఎంత చిన్న స్థలంలో అయినా ఒదిగిపోయే ఈ మొక్కకు ఆదరణ పెరగడంతో రకరకాల డిజైన్లలో ఈ మొక్కలను విక్రయిస్తున్నారు. పర్యావరణ ప్రేమికులు ఈ మొక్కలనే గిఫ్ట్‌గా ఇవ్వడం ఈ మొక్కకు పెరుగుతున్న ఆదరణకు నిదర్శనం.

- కృషి డెస్క్



అరేకా పామ్



మనీప్లాంట్



స్నేక్ ప్లాంట్

పసుపు రైతుకు వరం

స్టీమ్ బాయిలర్

రోజుకు 180 క్వింటాళ్ల కొమ్ము స్టీమ్

పసుపు రైతులకు స్టీమ్ బాయిలర్‌లు వరంగా మారాయి. కూలీల సమస్యను అధిగమించి, పండిన పసుపును తక్కువ సమయంలో ఉడికించేందుకు ఈ యంత్రం ఎంతో అనుకూలంగా వుంటున్నది. గంట పాటు ఆవిరి వచ్చేదాకా నీళ్ళను వేడి చేస్తే చాలు. 10 నిమిషాలకు ఒకసారి 3 క్వింటాళ్ళ కొమ్మును ఉడికిస్తుంది ఈ యంత్రం. 6 నుంచి 8 మంది కూలీల సాయంతో రోజులో 180 క్వింటాళ్లకు పైగా పసుపును ఉడికించుకోవచ్చు. ఈ యంత్రంలో రెండు రకాలు ఉన్నాయి. రూ.4 నుంచి రూ. 4.5 లక్షల ఖరీదు చేసే పసుపును ఉడికించే యంత్రాన్ని ప్రభుత్వం సబ్సిడీ కింద ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. నందిపేట మండలంలో ఈ ఆధునిక యంత్రాలు 50కి పైగా ఉన్నాయి. క్వింటాలు పసుపును ఉడికించేందుకు రూ.130 అద్దెగా తీసుకుంటున్నారు.

ఈ యంత్రంలో పసుపును ఉడికించడానికి నాలుగు కుక్కర్లు(బాయిలర్లు) ఉంటాయి. ఒక్కొక్క బాయిలర్‌లో 3 క్వింటాళ్ళ పసుపు ఉడుకుతుంది. స్టీమ్ వచ్చే వరకు అంటే సుమారు గంటపాటు నిప్పు పెట్టాలి. 10 నిమిషాల వ్యవధిలో 3 క్వింటాళ్ళ చొప్పున ఉడికించిన పసుపు బయటకు వస్తుంది. రోజుకు 180కి పైగా క్వింటాళ్ళ పసుపును ఉడికించుకోవచ్చు.

ఎనిమిది మంది కూలీలు ఉంటే చాలు. రెండున్నర నుంచి మూడు టన్నుల కలప అవసరం ఉంటుంది. యంత్రం ఖరీదు రూ.4.50 లక్షలు. రెండు డ్రమ్ముల యంత్రంలో రెండు కుక్కర్లు వుంటాయి. ఒక్కొక్క బాయిలర్‌లో మూడు క్వింటాళ్ళ పసుపు ఉడుకుతుంది. దీని ధర నాలుగు లక్షలు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నందిపేట

సబ్సిడీపై ఇవ్వాలి



పసుపును ఉడికించే యంత్రాన్ని ప్రభుత్వం సబ్సిడీపై అందజేయాలి. కనీసం యంత్రం కొనుగోలుకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాలి. బీమా సౌకర్యం కల్పించాలి. గ్రామానికి ఒక యంత్రాన్ని సిద్ధంగా వుంచి పీఏసీఎస్ సొసైటీల ద్వారా అద్దెకు ఇప్పించినా రైతులకు సౌకర్యంగా వుంటుంది.

- గోక శ్రీనివాస్ రెడ్డి, రైతు, డొంకేశ్వర్

నాణ్యత పెరిగింది



పసుపును ఉడికించే ఆధునిక యంత్రం రావడంతో కూలీల సమస్య తీరింది. గతంలో 180 క్వింటాళ్ళ పసుపును ఉడికించేందుకు రెండు రోజులు పట్టేది. గాడీలపై కడాయిలు పెట్టి పసుపును ఉడికించడం ద్వారా నాణ్యత తగ్గేది. స్టీమ్ ద్వారా పసుపు నాణ్యత పెరిగింది.

- జి సాయికృష్ణ, మండల వ్యవసాయ అధికారి, నందిపేట

నయా మాల్





ఇక వేసవిలోనూ టమాటా

45 డిగ్రీల సెంటీగ్రేడ్‌లోనూ పండే వంగడం సిద్ధం
అభివృద్ధి చేసిన ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు

పటాన్‌చెరు, జనవరి 18: టమాటాలను ఇక వేసవిలోనూ పండించవచ్చు. 45 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలోనూ పండించ గలిగే టమాటా వంగడాన్ని ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ప్రపంచ కూరగాయల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధనా కేంద్రంలో టమాటాలో మెరుగైన వంగడాలను అభివృద్ధి చేశారు. ఇక్రిశాట్‌లో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల శాస్త్రవేత్తలు, ప్రముఖ విత్తన కంపెనీల ప్రతినిధులు టమాటా వంగడాలను పరిశీలించారు. వర్షాకాలం, చలికాలంలోనే పండే టమాటా వేసవి కాలంలో కొండెక్కి కూర్చుంటోంది. మిగిలిన రోజుల్లో రూ.5కు లభించే కిలో టమాటా వేసవిలో రూ.100కు చేరుతోంది. ఆలుగడ్డ, ఉల్లి తర్వాత కూరల్లో తప్పనిసరి వేయాల్సి రావడంతో ప్రజలు ఎక్కువ ధరకూ కొనాల్సి వస్తోంది. దీంతో ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు టమాటా వంగడాలపై ఐదేళ్లుగా విస్తృత పరిశోధనలు చేస్తున్నారు. కూరగాయల పరిశోధనా కేంద్రం రీజినల్ డైరెక్టర్ వార్విక్ ఎస్‌డౌన్ మాట్లాడుతూ.. వాతావరణ, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చేసిన 3 రకాల టమాటా వంగడాలను రైతుల వద్దకు చేర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకుని 45 డిగ్రీల సెల్సియస్‌లోనూ అధిక దిగుబడులు ఇచ్చే ఏవీటీఓ-1424 రకాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఇక టమాటా పంటను తరచూ పీడిస్తున్న ఆకులకు వచ్చే పసుపు పచ్చ తెగులు, ఇతర వైరస్ తెగుల్లు, నల్లమచ్చలను తట్టుకునే ఏవీటీఓ-1609, ఏవీటీఓ-1617 రకాలను అభివృద్ధి చేశామన్నారు. ఇవి పరిశీలన దశలోనే ఉన్నాయని, రైతుల పొలాలకు చేరేందుకు మరింత సమయం పడుతుందన్నారు.



అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే ఏవీటీఓ-1424 టమాటా పంటను చూపిస్తున్న శాస్త్రవేత్త వార్విక్ ఎస్‌డౌన్ బృందం

వేపపిండి కలిపిన యూరియా మేలు

యాసంగిలో వరి నాట్లకు, నాట్లు పూర్తయిన పొలాల్లో కలుపు తీసేందుకు, అంతర కృషికి, సస్యరక్షణకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ తరుణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆచార్య జయశంకర్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తల సూచనలివి.

సలహా



స్వల్పకాలిక వరి రకాలకు నత్రజనిని మూడు సమభాగాలుగా చేసి, నాటడానికి ముందు దమ్ములోను, బాగా దుబ్బుచేసే దశలోను, అంకురం తొడిగే దశలోను, బురద పదునులో మాత్రమే సమానంగా వెదజల్లి 36-48 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలి. మధ్య, దీర్ఘకాలిక రకాలకు నాలుగు దఫాలుగా 15-20 రోజులకు ఒకసారి నత్రజనిని వేయాలి. నత్రజనిని చివరి దఫా అంకురం దశలో వేయాలి, ఆ తర్వాత వేయకూడదు. యాసంగిలో తెలంగాణలలో ఎకరానికి 48 నుంచి 60 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్ వాడాలి. ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న వేప పూసిన యూరియాని వాడుకోవాలి. లేకపోతే 50 కిలోల యూరియాకి 10 కిలోల వేపపిండి కలిపి 24 గంటల తర్వాత వెదజల్లితే నత్రజని వినియోగం పెరుగుతుంది. మొత్తం భాస్వరం ఎరువును దమ్ములోనే వేయాలి. ఆ తరువాత కాంప్లెక్స్ రూపంలో వేయకూడదు. పొటాష్ ఎరువును రేగడి నేలల్లో ఆఖరి దమ్ములో పూర్తిగా ఒకేసారి వేయాలి. చల్కా (తేలిక) భూముల్లో ఆఖరి దమ్ములో సగం, అంకురం ఏర్పడే దశలో మిగతా సగాన్ని వేయాలి. జింకు ధాతు లోపం వల్ల పై నుంచి మూడు లేదా నాలుగు ఆకుల్లో మధ్య ఈనె పాలిపోతుంది. ఎక్కువ లోపం ఉన్నప్పుడు ముదురాకు చివర్లలో, మధ్య ఈనెకు ఇరుపక్కల తుప్పు లేక ఇటుక రంగు మచ్చలు కనబడతాయి. ఆకులు చిన్నవిగా, పెళుసుగా మారుతాయి. మొక్కలు గిడసబారి దుబ్బు కూడా చేయవు. నత్రజని ఎరువులు వేసినప్పటికీ పైరు పచ్చబడదు. దీని సవరణకు ఒకే వరి పంట పండించే భూముల్లో ప్రతి మూడు పైర్లకు ఒకసారి లేకపోతే ప్రతి రబీ సీజన్‌లో ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేటు వేయాలి లేదా 10 కిలోల జింక్ సల్ఫేట్‌ను 200-250 కిలోల పశువుల పేడతో కలిపి వేయాలి.

సన్న రకం వరికి సుడిదోమ ప్రధాన సమస్య మారింది. గత ఖరీఫ్‌లో ఈ దోమ కారణంగా ఎంతో నష్టపోయాం. ఈ దోమను అరికట్టి వరిలో అధిక దిగుబడులు సాధించడం ఎలా?

- త్రిపురారం రైతులు

సమస్య - సమాధానం



నత్రజనితో సుడిదోమకు చెక్

యాసంగిలో వాతావరణం అనుకూలంగా లేకపోయినప్పటికీ రైతులు సన్న రకాల సాగు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు లక్షా 30వేల హెక్టార్లలో వరి నాట్లు వేశారు. యాభై శాతం విస్తీర్ణంలో సన్న రకాల సాగు అయిందని అంచనా. సన్న రకాలకు సుడిదోమ వ్యాప్తి చెందడానికి ప్రధాన కారణం నీరు అధికంగా పారించడం, వరి హైబ్రిడ్ విత్తనోత్పత్తి చేపట్టడం, పురుగు ఉధృతి తట్టుకునే రకాలు సాగు చేయకపోవడం, నత్రజని ఎరువులు అధికంగా వాడటం, తక్కువ ఉష్ణోగ్రతలు (25-30 డిగ్రీలు) ఉక్కపోత వాతావరణం, గాలిలో అధిక తేమ ఉండటం ప్రధాన కారణాలు. సన్నాలు సాగు చేసిన రైతులు వరిలో రెండు మీటర్ల వరకు ఒకసారి 20 సెంటీమీటర్ల కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి. నత్రజని ఎరువులు మూడు నాలుగు దఫాలుగా వేసుకుంటే సుడి దోమను అరికట్టవచ్చు.

- డాక్టర్ శంకర్, కెవికె శాస్త్రవేత్త

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, త్రిపురారం

పదవీ కాలం ఆర్నెల్లలోపు అయితేనే!

▸ 'ఎన్నికల మినహాయింపు'పై ఎస్ఈసీ వివరణ

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పదవీకాలం ఆర్నెల్లలోపు ఉన్న పదవులకు మాత్రమే ఎన్నికల నిర్వహణ నుంచి మినహాయింపు ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) స్పష్టం చేసింది. ప్రస్తుత గ్రామ పంచాయతీ పాలకమండళ్ల పదవీకాలం ఆగస్టు 1 వరకు ఉన్నందునే ఇటీవల సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొంది. 'ఎన్నికల ముందు ఉప ఎన్నికలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనంపై ఎస్ఈసీ స్పందించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-కె ప్రకారం తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-1994ను అనుసరించి స్థానిక సంస్థలకు ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర ఎన్నికల సంఘం రాజ్యాంగ విధి అని పేర్కొంది.

ఎస్పీడీసీఎల్‌లో 267 పోస్టులకు నోటిఫికేషన్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విభాగంలో 267 పోస్టుల భర్తీకి టీఎస్ఎస్పీడీసీఎల్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 20 నుంచి ఆయా పోస్టుల వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, అదే రోజు నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ఆ సంస్థ పేర్కొంది. మొత్తం రిక్రూట్‌మెంట్లలో 153 ఏఈ, 114 జేఈఓ పోస్టులున్నాయి.



బుక్ ఫెయిర్‌లో స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

అక్షరం లక్షల ఆయుధాల కంటే గొప్పది: జగదీశ్

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బుక్ ఫెయిర్ గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఇందిరాపార్కు వద్ద ఉన్న తెలంగాణ కళాభారతిలో ఏర్పాటుచేసిన 31వ హైదరాబాద్ బుక్ ఫెయిర్-2018ను మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'అక్షరం లక్షల ఆయుధాల కంటే ఎంతో గొప్పది. సమాజం కోసం బతకాలని చెప్పేది పుస్తకం. అలాంటి పుస్తకాలను ఆధునిక ప్రపంచంలో అందరూ ఆదరించాలి' అని పిలుపునిచ్చారు. ఈ బుక్ ఫెయిర్ కేవలం పుస్తక ప్రదర్శనగా కాకుండా విజ్ఞాన వేదికగా మారిందని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి అన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. చరిత్రను మలుపు తిప్పే శక్తి పుస్తకానికి, అందులోని అక్షరానికి ఉందన్నారు. ప్రతి జిల్లాలోనూ ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని నందిని సిధారెడ్డి అన్నారు.

పురావస్తు శాఖ.. ఇక హెరిటేజ్ తెలంగాణ

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని పురావస్తు శాఖ పేరును హెరిటేజ్ తెలంగాణగా మార్చామని మంత్రి చందూలాల్ తెలిపారు. గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రాచీన వారసత్వ సంపదను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లో అంతర్జాతీయ సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా శ్యామ్ సుందర్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ (తెలంగాణ)గా చీఫ్ ఇంజనీర్ శ్యామ్ సుందర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆయన ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డిని కలిసి లిఫ్టు స్కీంలపై చర్చించారు.

4 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సీపీఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 4 నుంచి 7 వరకు నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం తెలిపారు. టీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పేద ప్రజల ఇబ్బందులపై పలు తీర్మానాలు ఇందులో ఆమోదించనున్నట్లు చెప్పారు. మహాసభల ముగింపు రోజున పార్టీ నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా ఎన్నుకోనున్నట్లు ఆయన వివరించారు.

దళితులకు జిగ్నేష్ పాఠాలక్కర్లేదు: పిడమర్తి రవి

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని దళితులకు గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని పాఠాలు అక్కరలేదని, ఆయన మార్క్సిస్టు ముసుగు వేసుకున్న అంబేడ్కరిస్టు అని టీఆర్ఎస్ నేత, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. జైలులో ఉన్న మందకృష్ణను పరామర్శించేందుకు వచ్చిన జిగ్నేశ్ మేవానిని.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కలవడాన్ని ఒక దళితుడు మరో దళిత నేతతో భేటీ అయినట్టుగానే చూస్తామని తెలిపారు. తెలంగాణలో పోలీస్ రాజ్యం నడుస్తోందన్న జిగ్నేశ్ వ్యాఖ్యలు సరికాదని, ఆయన కాంగ్రెస్ ఏజెంట్‌లా మాట్లాడుతున్నారని విమర్శించారు.

కేసీఆర్‌ను గద్దె దించటమే లక్ష్యం : చాడ

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి శరాఘాతంలా మారిన సీఎం కేసీఆర్‌ను గద్దె దించటమే సీపీఐ మొదటి ప్రాధాన్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఇందుకు భావసారూప్యత ఉన్న బలమైన లౌకిక, వామపక్ష, ప్రజాస్వామిక శక్తులతో ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం ఆయన మగ్దూంభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పాటు చేసి సీపీఎం తొందరపడిందన్నారు.

సైనిక కుటుంబాలకు టీఎన్జీవోఏల ఒక రోజు వేతనం

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సైనికుల కుటుంబాల సంక్షేమానికి తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవోఏ), పింఛన్‌దారులు తమ ఒక రోజు మూల వేతనం రూ. 50 కోట్లను విరాళంగా ప్రకటించింది. గురువారం జరిగిన తెలంగాణ ఉద్యోగులు, పింఛన్‌దారులు, ఉపాధ్యాయులు, కార్మికుల ఐక్యకార్యాచరణ సమితి(జేఏసీ) అత్యవసర సమావేశమై ఈ మేరకు తీర్మానించింది. అదేవిధంగా హైదరాబాద్ సర్కిల్‌లోని ఎస్‌బీఐ ఉద్యోగులు చీఫ్ జనరల్ మేనేజర్ స్వామినాథన్ ఆధ్వర్యంలో రూ. 10.67 లక్షల విరాళాన్ని చెక్ రూపంలో గవర్నర్‌కు అందజేశారు.



ప్రభాకర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి హరీశ్‌రావు

జానపద కళాకారుడు ఎస్.ప్రభాకర్ మృతి

▸ నివాళులర్పించిన మంత్రి హరీశ్‌రావు, ప్రముఖులు

సిద్దిపేట, జనవరి 18: "సిద్దిపేట చీర కట్టి.. సిరిసిల్ల రైక తొడిగి" అంటూ జానపద గేయాలు పాడి రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన ఎస్.ప్రభాకర్ బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో కన్నుమూశారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. బుధవారం డయాలసిస్ చేయించుకుని ఇంటికి వెళ్లి భోజనం చేస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆయన భౌతికకాయాన్ని సిద్దిపేటలోని భారత్‌నగర్‌కు తరలించారు. మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు నాయకులు ప్రభాకర్ భౌతిక కాయానికి గురువారం నివాళులర్పించారు.

జాతీయ పార్టీలు విఫలం

▸ ఇండియా టుడే చర్చలో ఎంపీ వినోద్

▸ కేసీఆర్‌తో సంతోషంగానే ఉన్నా: అసదుద్దీన్

▸ హైదరాబాద్‌లో అసదుద్దీన్‌ను ఓడిస్తాం: లక్ష్మణ్



హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో జాతీయ పార్టీలు విఫలమవుతున్నందునే దక్షిణ భారతదేశంలో ప్రాంతీయ పార్టీలను ప్రజలను ఆదరిస్తున్నారని ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఇండియా టుడే గ్రూప్ ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశంలో కాషాయం ప్రభావం చూపుతుందా..?(సాఫ్రాన్ ఇన్ సౌత్) అన్న అంశంపై చర్చ జరిగింది. ప్రముఖ జర్నలిస్టు రాజీవ్ సర్దేశాయి సమన్వయ కర్తగా వ్యవహరించగా కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ దినేశ్ గుండురావు, కాంగ్రెస్ మాజీ నేత మణిశంకర్ అయ్యర్, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, టీఆర్ఎస్ ఎంపీ వినోద్‌కుమార్, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్దేశాయి సంధించిన పలు ప్రశ్నలకు వినోద్ స్పందిస్తూ.. దాదాపు 70 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరుతున్నాయన్నారు. కాగా, 2019 ఎన్నికల్లో ఎంపీ అసదుద్దీన్‌ను ఓడిస్తామని డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు 101 సార్లు రాజ్యాంగాన్ని సవరించగాలేనిది.. బీజేపీ ప్రభుత్వంపైనే అభ్యంతరాలెందుకు అని ప్రశ్నించారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. నేను కేసీఆర్‌తో సంతోషంగా ఉన్నానని చెప్పారు. హైదరాబాద్‌లో బీజేపీ తరఫున అమిత్‌షా పోటీ చేసినా ఆయనకు ఓటమి తప్పదన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారం కోల్పోతే ఈశాన్య రాష్ట్రాల్లోనూ ఆ పార్టీ ఉండదని అన్నారు.

హిందుత్వానికి కాదు.. మోదీ, అమిత్‌షాకే వ్యతిరేకిని



నేను హిందుత్వానికి వ్యతిరేకిని కాను. మోదీ, అమిత్‌షాను వ్యతిరేకిస్తా. భావప్రకటన స్వేచ్ఛపై దాడి చేస్తున్న కేంద్రమంత్రి అనంతకుమార్ హెగ్డే, ఇతర సంస్థలకు వ్యతిరేకిని. వాళ్లు అసలు హిందువులే కాదు. హత్యను సమర్థించే వ్యక్తి హిందువు ఎలా అవుతాడు?

\- నటుడు ప్రకాశ్‌రాజ్

రాజకీయాల్లోకి వస్తున్నా



ప్రాంతం, పరిస్థితి నన్ను రాజకీయాలపై నిర్ణయం తీసుకునేలా చేశాయి. అవును.. రాజకీయాల్లోకి వస్తున్నా. ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పంతోనే నటులు రాజకీయ నాయకులుగా మారుతున్నారు.

\- విశాల్

కోటా బాట



(మొదటి పేజీ తరువాయి)

పోలిక లేదని, ఆ రాష్ట్రం కంటే తాము చాలా చాలా ముందున్నామని చెప్పారు. తెలుగుకు అసలు గుర్తింపే లేదని, ఇరు రాష్ట్రాల సంస్కృతులు, సంప్రదాయాలు వేరని తెలిపారు. హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా చేస్తామంటే స్వాగతిస్తామన్నారు. మూర్ఖులే తనను 'న్యూ నిజాం ఆఫ్ హైదరాబాద్' అంటున్నారని మండిపడ్డారు. ప్రవాస తెలంగాణవాసులు వెనక్కి వస్తే భూములు ఇవ్వడం లేదా ఆర్థిక సహకారం అందించాలని సభికులు కోరగా.. ఎన్ఆర్ఐ పాలసీ సిద్ధమవుతోందని, సహకరిస్తామని సీఎం బదులిచ్చారు. 1969 తెలంగాణ ఉద్యమంలో జైలు పాలైన వారిని ఒక వేదికపైకి తెచ్చి సన్మానించాలని విజ్ఞప్తి చేయగా.. తప్పకుండా పరిశీలిస్తామని చెప్పారు. ప్రముఖ మీడియా గ్రూప్ ఇండియా టుడే గురువారం హైదరాబాద్‌లో 'దక్షిణాది సదస్సు 2018'ను నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రముఖ పాత్రికేయుడు, ఇండియా టుడే గ్రూప్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ సీఎం కేసీఆర్‌తో ముఖాముఖి నిర్వహించారు. వివిధ అంశాలపై కేసీఆర్ నిర్మొహమాటంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆ వివరాలు..

రాష్ట్ర విభజన తప్పిదం కాదు

రాజ్‌దీప్: రాష్ట్ర విభజనకు నేనే కారకుడిని అవుతానన్న భావన.. తప్పు చేస్తున్నానన్న భావన మీకు ఎప్పుడైనా అనిపించిందా?

కేసీఆర్: తెలంగాణ కోసం ఏడు దశాబ్దాల నుంచి సంఘర్షణ కేసీఆర్ ఒక్కరే చేయలేదు. 2001లో ఉద్యమం ప్రారంభించడానికి ముందే 3-4 వేల గంటలు కార్యాచరణపై మేధో మథనం చేశాం. ఉద్యమం ఆరంభంలోనే మా అందరికీ ఓ స్పష్టత ఉంది. 'జై తెలంగాణ' అంటూ ఊరికే రోడ్లపైకి రాలేదు. ప్రత్యేక రాష్ట్రం గురించి అందరిలోనూ ఆగ్రహావేశాలుండేవి. ఎలాంటి హింస లేకుండా శాంతియుతంగా ఉద్యమం చేశాం. రాష్ట్ర విభజన తప్పిదం కానే కాదు. దీనిపై మాకు ఎలాంటి నర్వస్‌నెస్ లేదు. తెలంగాణను పునర్నిర్మించుకునేందుకు ఓ అవకాశంగా భావించాం. ఈ దిశగా విజయవంతంగా ముందుకెళ్తున్నాం. ఇప్పుడు తెలంగాణ దేశంలోనే నంబర్-1 రాష్ట్రంగా ఉంది. గత ఏడాది కాగ్ ప్రకటించిన ఆర్థికాభివృద్ధి గణాంకాల్లో నంబరు-1 స్థానంలో ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్, గ్రీన్‌పవర్ ఉత్పత్తిలో నంబర్-1గా ఉన్నాం.

విభజన అనంతరం అనేక అనుమానాలుండేవి. తెలుగు గుర్తింపు కోల్పోతుందని. ఈ విషయంలో మీకెప్పుడైనా విచారం కలిగిందా?

విచారం ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఎందుకంటే, తెలుగుకు అసలు గుర్తింపే లేదు. ఈ విషయంలో మీరు నన్ను క్షమించాలి. ఆంధ్రా రాష్ట్రం వేరు. తెలంగాణ రాష్ట్రం వేరు. అక్కడి ఇక్కడి సంస్కృతులు, సంప్రదాయాలు వేరు. పండుగల నిర్వహణ, మాట్లాడే భాష విధానమే వేరు. 1956లో తెలంగాణను ఆంధ్రప్రదేశ్‌లో కలపడాన్ని మేధావులు, విద్యావేత్తలు, రాజకీయ పార్టీలు, నేతలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించారు. దురదృష్టవశాత్తూ కలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కలపడం అతి పెద్ద వైఫల్యం. నేడు తెలంగాణ విజయవంతమైన రాష్ట్రం. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.1,49,000 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించాం. ఆంధ్రప్రదేశ్‌లో కేపిటల్ ఎక్స్‌పెండిచర్ 15-20 వేల కోట్లు దాటలేదు. నేడు తెలంగాణలో 50 వేల కోట్లను దాటింది.

హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఏపీ ప్రజల్లో అభద్రతాభావం ఉందనేవారు. అది ఎలా దూరమైంది..?

విభజన జరిగితే ఇక్కడి ఆస్తులు కోల్పోవాల్సి వస్తుందని, హైదరాబాద్‌ను వదలాల్సి వస్తుందని ఇక్కడ స్థిరపడ్డ ఆంధ్రప్రదేశ్‌వాసుల్లో తప్పుడు, అవాస్తవ ప్రచారాలు చేశారు. జీహెచ్ఎంసీలో 150 స్థానాలుంటే.. ఎన్నికల్లో మేం చరిత్రలో ఎన్నడూలేని విధంగా మిత్రపక్షాలతో కలిసి 144 స్థానాలు గెలిచాం. దీన్నిబట్టి ఇక్కడి ఆంధ్రా ప్రజల విషయంలో చేసింది తప్పుడు ప్రచారమని తేలిపోయింది.

గతంలో అందరూ గుజరాత్ గురించి మాట్లాడేవారు. ఇప్పుడు తెలంగాణ అంటున్నారు. చిన్న రాష్ట్రం కాబట్టే తెలంగాణ అభివృద్ధి చెందుతోందా?

తెలంగాణ చిన్న రాష్ట్రం కాదు. తెలంగాణ కంటే 17 చిన్న రాష్ట్రాలున్నాయి. భూభాగంలో పశ్చిమ బెంగాల్, బిహార్ కంటే పెద్ద రాష్ట్రం. జనాభాపరంగా కూడా దేశంలో 12వ స్థానంలో ఉన్నాం. దేశంలోని ఏ రాష్ట్రంతో పోల్చినా 15, 16 అంశాల్లో మేం ముందుంటాం. త్వరలో విదేశీ ఎగుమతులపైనా దృష్టి సారించనున్నాం. ఇప్పుడు 650 లారీల గొర్రెలను ప్రతి రోజు మేం దిగుమతి చేసుకుంటున్నాం. ఈ నేపథ్యంలోనే గొర్రెల పంపిణీ ప్రారంభించాం. ఇప్పటి వరకు 38 లక్షల గొర్రెలను పంచాం. రాష్ట్రంలో 50 లక్షల గొర్రెలున్నాయి. త్వరలో గొర్రె మాంసాన్ని ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేస్తాం... అయితే, గుజరాత్ లయన్.. తెలంగాణ షీప్ అన్నమాట అని రాజ్‌దీప్ అనగా.. నో ప్రాబ్లం. లయన్, షీప్ మేటర్ కాదు. ఎవరు తొందరగా మేల్కొన్నారన్నదే మేటర్. ఆస్తులను సృష్టించడమే అసలైన మేటర్.

మరి వాస్తు కోసం సచివాలయాన్ని మార్చడం ఏమిటి..? 100 కోట్ల ప్రజాధనం వృథా ఎందుకు?

రూ.100 కోట్లు కాదు. 250 కోట్లతో అనుకుంటున్నాం. సచివాలయానికి వచ్చిన మలేసియా మంత్రి ఇంత ఇరుకుగా ఉన్నదెందుకు అన్నారు. అందుకే విశాలమైన సచివాలయం నిర్మించాలని భావిస్తున్నాం. తెలంగాణ ముఖ్యమంత్రి ఉండే భవనం విశాలంగా, అధునాతన వసతులతో నిర్మించాలని భావించడం తప్పెలా అవుతుంది.

మీ కుమార్తె ఎంపీ, కుమారుడు మంత్రి, బంధువు మంత్రి.. తెలంగాణలో కేసీఆర్ కుటుంబం పాలన సాగిస్తుందన్న ఆరోపణలున్నాయి?

ఇది సరికాదు. కేసీఆర్, కుటుంబం కూడా ఉద్యమంలో పాల్గొంది. అయినా వీరిని ప్రజలు ఎన్నుకుంటున్నారు. నామినేషన్ పదవుల్లో లేరు. ఎవరినైనా నిర్ణయించేది ప్రజలే. అయినా తెలంగాణనే నా కుటుంబంగా భావిస్తున్నా. ఢిల్లీపై నాకు ఆశల్లేవు

2020కి రైతు ఆత్మహత్యలే ఉండవు

తెలంగాణ విద్యుత్తు సమస్యను అధిగమించినట్టేనా..?

విభజన సమయంలో విద్యుత్తు సమస్య తీవ్రంగా ఉండేది. దాన్ని సవాల్‌గా తీసుకున్నాం. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే పరిశ్రమలు, గృహాలకు 24 గంటలు, వ్యవసాయానికి 10 గంటలు సరఫరా చేశాం. స్థాపిత విద్యుత్తు సామర్థ్యం ప్రారంభంలో కేవలం 6 వేల మె.వా. ఉండేది. ఇప్పుడు 14000 మె.వా. ఉత్పత్తి చేస్తున్నాం. 2020 నాటికి 28 వేల మె.వా. ఉత్పత్తి చేస్తాం. మూడున్నరేళ్లలో నిరంతర విద్యుత్తును ఇవ్వగలిగాం.

భారీ వర్షాలతో హైదరాబాద్ అతలాకుతలమైంది. నగరంపై మీ విజన్ ఏంటి..?

హైదరాబాద్ అనేక అంతర్జాతీయ సమావేశాలు, సదస్సులకు కేంద్రంగా ఉంది. ఇక్కడ విభిన్న భాషలు, సంస్కృతులు సమ్మిళితమై ఉన్నాయి. ఇది అత్యంత అందమైన నగరం. ఇతర నగరాలతో ఎందుకు పోల్చడం? ముంబైతో పోల్చవచ్చా? ఎవరి బలాలు వారివి. ఎవరి అభివృద్ధి వారిది. మద్రాస్‌కు విద్యుత్తు 1920లో వస్తే హైద్రాబాద్ రాష్ట్రానికి 1915లోనే వచ్చింది. ఎయిర్‌పోర్ట్, టెలిగ్రాం, రోడ్డు రవాణా, సొంతంగా దక్కన్ ఎయిర్‌లైన్స్ అప్పటి నుంచే ఉన్నాయి. దేశంలో ఏ నగరంలో లేనప్పుడే ఇక్కడ భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఉండేది. దీనిని ముత్యాల నగరంతోపాటు సిటీ ఆఫ్ లేక్స్‌గా పేర్కొనేవారు. తోటలు, వర్షపు నీటి కాలువలుండేవి. అన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. అందుకే ఈ పరిస్థితి నెలకొంది. చైనా బ్యాంకు చైర్మన్‌ను కలిశాం. హైదరాబాద్ పునర్నిర్మాణానికి రూ.20 వేల కోట్ల రుణం ఇస్తామన్నారు. ఈ నిధులతో నగరం సమస్యలు తీరతాయి. మేం నగరాన్ని మళ్లీ లేక్స్ సిటీగా మారుస్తాం.

మీకు, చంద్రబాబుకు మధ్య ఎలాంటి పోటీ ఉంది. హైదరాబాద్, అమరావతి మధ్య పోటీ ఉందా..?

మీరు తెలంగాణ, ఆంధ్రను పోల్చవద్దు. అలా పోల్చడం సరికాదు. మలేసియా నుంచి విడిపోయినప్పుడు సింగపూర్‌లో ఏముంది? ఇప్పుడెలా అభివృద్ధి చెందింది. అది ఇప్పుడు అభివృద్ధికి ప్రపంచానికే మంచి నమూనా. హైదరాబాద్ స్వతంత్ర రాష్ట్రంగా ఎప్పుడో అభివృద్ధి చెందింది. ఇప్పటి మూడు నాలుగు రాష్ట్రాలు కలిసి ఉన్నప్పుడే అభివృద్ధి చెందింది. ఇప్పుడు ఒక రాష్ట్రంగా అభివృద్ధి సాధిస్తోంది.

అంటే.. మీకు ఆంధ్రాతో పోటీ లేదంటారా..?

అస్సలే లేదు. మేం చాలా ముందున్నాం. ఆంధ్రప్రదేశ్ కంటే చాలా చాలా ముందున్నాం.

మీరు ఐటీలో ఇంతగా అభివృద్ధి చెందుతున్నారు.

మీరు కేంద్రంలో ఎవరుంటే వారితో సన్నిహితంగా ఉంటారన్న అపవాదు ఉంది?

కేంద్రంతో రాష్ట్రాలకు రాజ్యాంగపరమైన సంబంధాలుంటాయి. అవి పాటించాల్సిందే. ఎందుకంటే నాకు నా రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం. ఏ ముఖ్యమంత్రి అయినా కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించాల్సిందే. పార్టీల విషయంలో బీజేపీ, కాంగ్రెస్‌కు సమదూరం పాటిస్తాం.

గతంలో యూపీఏతో పొత్తు కుదుర్చుకున్నారు. ఈసారి అధికారంలో ఎన్డీయే ఉంది. ఎన్నికల్లో మీ పొత్తులు ఎవరితో?

మేం స్వతంత్రంగా ఉన్నాం. ఎవరితో వెళ్లాల్సిన అవసరం మాకు లేదు. ఎవరైనా రావచ్చు. కానీ, మేం ఎవరి వద్దకూ వెళ్లం.

మూడున్నరేళ్లలో మీరు అన్ని ఉప ఎన్నికలు, స్థానిక ఎన్నికలు గెలిచారు. విజయ రహస్యం ఏమిటి?

ప్రజలే మా బలం. ప్రజలతో కలిసి ఉండటమే మా విజయ రహస్యం. ఏ రాజకీయ పార్టీకైనా ఇది వర్తిస్తుంది. మా ఆలోచన తెలంగాణ పైనే. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. ఢిల్లీపై ఎలాంటి ఆశలు లేవు.

దేశంలోని పాలన ఢిల్లీ నుంచే సాగుతోంది. రాష్ట్రాలను పట్టించుకోవడం లేదన్న ఆరోపణ లున్నాయి?

ఒక విషయంలో ప్రధాని మోదీని అభినందిస్తున్నా. రాష్ట్రాలకు అందించే పన్నులను 30 నుంచి 42 శాతానికి పెంచారు. ఇది సరిపోదు. ఇంకా పెంచాలి. రాష్ట్రాలకు సహకరిస్తామని ప్రధాని హామీలిచ్చారు. అన్నీ నెరవేర్చలేదు. పాక్షికంగానే అమలు చేశారు. రాష్ట్రాలకు అధికారాలు, నిధులు పెంచాలి.

రైతుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర తర్వాత తెలంగాణ రెండో స్థానంలో ఉంది. 2015లో 1,358 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. హైదరాబాద్‌లో ఉన్నవారితో పోలిస్తే మీ రైతులు సంతోషంగా ఉండలేకపోతున్నారు. ఈ రంగంలో మీరు వైఫల్యం చెందారని భావించాలా..?

ఇది నా తొలి, అత్యంత ప్రాధాన్య అంశం. రైతుల ఆత్మహత్యలు చాలా బాధిస్తాయి. రైతులే కాదు.. చేనేత కార్మికులు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీటిని నిరోధించడం మా విధి. ఇందుకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. వ్యవసాయం విషయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా మారబోతోంది. నీటిపారుదల విషయానికి వస్తే.. గతంలో తెలంగాణ ప్రాజెక్టులన్నీ కాగితాల్లోనే ఉండేవి. . పనులు ఎక్కడా జరగలేదు. గోదావరి, కృష్ణా నుంచి మాకు 1350 టీఎంసీల నీరు కేటాయించారు. ఈ నీటితో అద్భుతాలు సృష్టించబోతున్నాం. ఇటీవలే కేంద్ర జలవనరుల సంఘం అధికారులు వచ్చారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను చూసి ఇలాంటి అద్భుతాలను ఎన్నడూ చూడలేదని ప్రశంసించారు. దేవాదుల, కల్వకుర్తి, నెట్టెంపాడు.. ఇలా నిర్మాణంలో ఉన్నవన్నీ పూర్తిచేస్తాం. లక్షన్నర కోట్లతో మూడు పెద్ద ప్రాజెక్టులు (కాళేశ్వరం, పాలమూరు, సీతారామ ఎత్తిపోతల పథకం) నిర్మాణంలో ఉన్నాయి. ఇవి పూర్తయితే అదనంగా కోటి ఎకరాలకు నీరందుతుంది. 2020లోగా దీన్ని వాస్తవం చేసి చూపిస్తాం. ఇది జరిగితే, ఇక రైతుల ఆత్మహత్యలే ఉండవు. మహబూబ్‌నగర్ జిల్లాలో 15-20 లక్షల జనాభా వలస వెళ్లారు. అక్కడ ఇప్పుడు 6.5 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. అలాగే, నకిలీ ఎరువులు, విత్తనాలు కూడా రైతుల ఆత్మహత్యలకు కారణాలు. వీటిని సరిదిద్దాం. ఈ ఏడాది నుంచి ఎకరానికి 8 వేలు చొప్పున ఏటా 71 లక్షల రైతులకు ఆర్థిక సహకారం అందించనున్నాం. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్తే.. ఆశ్చర్యపోయారు. రైతులకు కనీస మద్దతు ధర అందించేందుకు రైతు సమన్వయ సమితిలను ఏర్పాటు చేశాం. ఇవన్నీ రైతుల ఆత్మహత్యల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలే. ఏపీ కంటే మేం చాలా చాలా ముందున్నాం.

అంబేద్కర్ చెప్పినట్టు హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా ప్రకటించాలని మీరు ఎందుకు కోరడం లేదు.?



సొంత ఆర్థిక వనరులతో గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడుకన్నా ముందున్నాం. అద్భుతమైన అభివృద్ధిని సాధించాం. రాష్ట్ర ఆస్తి దేశ ఆస్తి అన్నది మరువకూడదు. దేశంలోని ఏ రాష్ట్రమైనా సరే రాష్ట్రానికి రావాల్సిన వాటిని కత్తిరిస్తే దేశంపై ప్రభావం చూపుతుంది. ఈ విషయాన్ని కేంద్రం అర్థం చేసుకోవాలి. మీరు కోరినట్టు రెండో రాజధానిగా హైదరాబాద్ ఉండాలనుకుంటే వెల్‌కం. దేశ ప్రజలు కోరుకుంటే మేం ఆహ్వానిస్తున్నాం. దానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.

ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామంటున్నారు. దీనిని మైనారిటీ ఓటు బ్యాంకు రాజకీయంగా భావించాలా..?

తెలంగాణలో గిరిజనుల జనాభా పది శాతం వరకు ఉంది. ముస్లింల జనాభా 14 శాతం ఉంది. జనాభాపరంగా రిజర్వేషన్లు అందించే బాధ్యత కేంద్రంపై ఉంది. తెలంగాణలో 90 శాతం ప్రజలు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, బీసీలున్నారు. వీరికి 50 శాతం ఎలా సరిపోతుంది? ఇది దేశంలోని పేదలకు అన్యాయం చేసినట్టే. ఇది సరిపోదు. జనాభాకు అనుగుణంగా దీన్ని మార్చాలి. వచ్చే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో మేం దీన్ని లేవనెత్తుతాం. తమిళనాడులో 69 శాతం ఎలా అనుమతిస్తున్నారు? మహారాష్ట్రలో 52 శాతం ఎలా అమలు చేస్తున్నారు. మరి నేను నా ప్రజలకు సమాధానం చెప్పాలి కదా. (మతపరమైన రిజర్వేషన్లు సరికాదు కదా అని రాజ్‌దీప్ ప్రశ్నించగా..) నేను మతపరమైన రిజర్వేషన్ అని అనలేదు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకే ఇస్తామన్నాను.

ముఖ్యమంత్రిని న్యూ నిజాం ఆఫ్ హైదరాబాద్ అంటున్నారు?

కొందరు మూర్ఖులు అలా అనుకుంటే నేనేమీ చేయలేను. అది ముఖ్యమంత్రి అధికారిక నివాసం. కేసీఆర్‌ది కాదు. అక్కడ నేను ప్రజలతో మాట్లాడతా. అధికారులతో సమీక్షిస్తా. మెరుగైన పాలన కోసమే అధునాతన సౌకర్యాలు కల్పించాం. వచ్చే వందేళ్ల వరకు ముఖ్యమంత్రులకు అధికారిక నివాసంగా ఉండేందుకు నిర్మించాం.

హైదరాబాద్‌ను కోల్పోవడంతో ఏపీ ఆదాయం తగ్గింది

▸ నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్



అమరావతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'హైదరాబాద్‌ను కోల్పోవడంతో ఏపీకి ఆదాయం తగ్గింది. అదే సమయంలో హైదరాబాద్‌లో వసూలయ్యే మొత్తం పన్నుల్లో 40 శాతం ఆంధ్రావారు చెల్లిస్తున్నవే. వారంతా ఏపీకి వస్తే నవ్యాంధ్రకు ఆర్థిక సమస్యలే ఉండవు. పైగా ఏపీనే మిగతా రాష్ట్రాలకు సహకారం అందించే స్థాయికి ఎదుగుతుంది.' అని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. గురువారం విజయవాడలో జరిగిన కలెక్టర్ల సదస్సులో, అనంతరం విలేకరులతో రాజీవ్ కుమార్ మాట్లాడారు. 2022 నాటికి నూతన భారత్‌ను ఆవిష్కరించే లక్ష్యంతో నీతి ఆయోగ్ పనిచేస్తోందని తెలిపారు. 2022కి దేశంలోని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. నోట్ల రద్దు అనంతరం 56 లక్షల మంది కొత్తగా పన్ను కట్టే వారి జాబితాలోకి చేరారని, మూడు వందల షెల్ కంపెనీల గుట్టు రట్టయిందన్నారు. జీఎస్టీ వల్ల 20 శాతం ఆదాయం పెరుగుతుందని అన్నారు. కాగా ఏపీ ఓ అద్భుతమని, రాష్ట్రంలో పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన నడుస్తోందని రాజీవ్‌కుమార్ ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన బాగుందని కితాబిచ్చారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న రియల్ టైమ్ గవర్నెన్స్‌ను దేశమంతా అనుసరించాల్సిందేనని, దీనిని ఒక ప్రత్యేక ప్రదర్శనగా కేంద్రానికి చూపుతానని తెలిపారు. కొత్తగా ఏర్పడిన ఏపీ లాంటి రాష్ట్రాలకు ఎదురయ్యే సమస్యలను కేంద్రంతో మాట్లాడి పరిష్కరించేందుకు నీతి ఆయోగ్ తరఫున కృషి చేస్తానని, రాష్ట్రాభివృద్ధికి వీలైనంత సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. 2040 నాటికి దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో చంద్రబాబు పాలన చేస్తున్నారని రాజీవ్ ప్రశంసించారు. ప్రతి రాష్ట్రంలోనూ ఒక ప్రత్యేక నీతి ఆయోగ్ సెల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఏపీ, తెలంగాణకు కలిపి ఓ సెల్‌ను ఏర్పాటు చేశామని, దీనికి ప్రత్యేక సలహాదారుగా అశోక్ జైన్‌ను నియమించామని తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై స్పందిస్తూ.. జాతీయ తలసరి ఆదాయం కంటే రాష్ట్ర తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్నప్పుడు ప్రత్యేక హోదా అవసరమా అని ప్రశ్నించారు. కాగా తనకు ఏపీతో అనుబంధం ఉందని, తాను విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో 1976లో చదువుకున్నానని రాజీవ్ కుమార్ చెప్పారు.

డిజిటల్ అడ్వర్‌టైజింగ్‌పై
సిల్లీ మాంక్స్ ఫోకస్

20 శాతం ప్రీమియంతో ఎన్ఎస్ ఎమర్జ్‌లో లిస్టింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ మార్కెట్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న హైదరాబాద్‌కు చెందిన సిల్లీ మాంక్స్ కంపెనీ డిజిటల్ అడ్వర్‌టైజింగ్‌లో అవకాశాలపై దృష్టి సారించనుంది. గురువారం కంపెనీ షేర్లు హైదరాబాద్ వేదికగా ఎన్ఎస్ఇ ఎమర్జ్‌లో లిస్టింగ్ అయిన సందర్భంగా కంపెనీ వ్యవస్థాపక చైర్మన్ సంజయ్‌రెడ్డి మాట్లాడుతూ ఏటా 38 శాతం వృద్ధిని సాధిస్తున్న డిజిటల్ మార్కెటింగ్ 2020 నాటికి 18 వేల కోట్ల రూపాయలకు చేరుతుందని అంచనా అని, ఆ విభాగంలో తమకు గల శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోవడం ద్వారా వాటాదారుల పెట్టుబడికి మంచి విలువను అందించడం తమ లక్ష్యమని చెప్పారు. మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో అపార అనుభవం గల తాను అనిల్ పల్లాలతో కలిసి 2013 సంవత్సరంలో ఈ కంపెనీ ఏర్పాటు చేశానని, వ్యాపార విస్తరణ కోసం పిఇ ఇన్వెస్టర్లను ఆశ్రయించకుండా నేరుగా ప్రజల నుంచే నిధులు సమీకరించాలన్నది మొదటి నుంచి తన వ్యూహమని ఆయన అన్నారు. ఈ లక్ష్యంతో మార్కెట్‌లో వర్ధిల్లే తమకు ఇన్వెస్టర్ల నుంచి మంచి ప్రోత్సాహం లభించిందని, ఇష్యూ 17 రెట్లు పైబడి ఓవర్ సబ్‌స్ర్కైబ్ కావడమే ఇందుకు నిదర్శనమని ఆయన చెప్పారు. తాము ప్రస్తుతం తెలుగు, తమిళ్, మలయాళ భాషల్లో కార్యకలాపాలు సాగిస్తున్నామని, త్వరలో బెంగాలీ, హిందీ, మరాఠీ భాషల్లో ప్రవేశించాలనుకుంటున్నామని ఆయన తెలిపారు. డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలోని అన్ని విభాగాలలోనూ ప్రవేశించడం, డిజిటల్ కంటెంట్ తయారుచేసే కంపెనీలు అందుబాటులోకి వస్తే కొనుగోలు చేయడం, ఆగ్నేయాసియా మార్కెట్‌లో అడుగు పెట్టడం తమ తొలి ప్రాధాన్యతలని సహవ్యవస్థాపకుడు, డైరెక్టర్ అనిల్ చెప్పారు.

లిస్టింగ్‌లోనే అదరగొట్టింది

సిల్లీమాంక్స్ కంపెనీ లిస్టింగ్‌లోనే దూసుకుపోయింది. ఇష్యూ ధర 120 రూపాయలపై 20 శాతం ప్రీమియంతో 144 రూపాయల వద్ద లిస్టింగ్ అయిన ఎగువ సర్క్యూట్‌ను తాకింది. ఈ నెల 5 నుంచి 10 తేదీల మధ్య మార్కెట్‌లో ఉన్న ఈ కంపెనీ ఇష్యూ 17.23 రెట్లు ఓవర్ సబ్‌స్ర్కైబ్ అయ్యింది. హెచ్ఎన్ఐల విభాగంలో 24.08 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో 12.35 రెట్లు ఓవర్ సబ్‌స్ర్కిప్షన్ వచ్చింది. ఒక్కోటి 10 రూపాయల ముఖవిలువ గల 12.60 లక్షల ఈక్విటీ షేర్లను కంపెనీ మార్కెట్‌లో విడుదల చేసింది. ఇష్యూ ద్వారా 15.12 కోట్ల రూపాయలు సమీకరించాలన్నది కంపెనీ లక్ష్యం కాగా మొత్తం బిడ్ల విలువ 260 కోట్ల రూపాయలు దాటిపోయింది.



ఎన్ఎస్ఇలో లిస్టింగ్ సందర్భంగా గంటను మోగిస్తున్న సంజయ్‌రెడ్డి

హైదరాబాద్ నుంచి నాలుగో కంపెనీ

లిస్టింగ్‌తో కంపెనీకి బాధ్యత పెరుగుతుందని, వారు కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాణాలకు కట్టుబడడంతోపాటు తమపై విశ్వాసం ఉంచిన ఇన్వెస్టర్ల విలువను పెంచే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎన్ఎస్ఇ దక్షిణ ప్రాంత హెడ్ అనిల్ జైస్వాల్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన లిస్టింగ్ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఎన్ఎస్ఇ ఎమర్జ్‌లో లిస్టింగ్ అయిన 115వ కంపెనీ, హైదరాబాద్ నుంచి నాలుగో కంపెనీ సిల్లీ మాంక్స్ అని చెప్పారు. భారత వృద్ధి క్రమంలో ఎస్ఎంఇల పాత్ర కీలకమైనదని, జిడిపిలో 20 శాతం, ఉద్యోగాల్లో 40 శాతం వాటా వాటిదేనని ఆయన అన్నారు. ఎన్ఎస్ ఎమర్జ్‌లో లిస్టింగ్ అయిన తొలి డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ కంపెనీ కూడా ఇదేనని ఆయన చెప్పారు.

సైయెంట్ లాభం రూ.109 కోట్లు

డిసెంబరు త్రైమాసిక లాభంలో 15 శాతం వృద్ధి.. ఒక్కో షేరుకు రూ.4 మధ్యంతర డివిడెండ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సైయెంట్ లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం 15.5 శాతం వృద్ధి చెంది 108.80 కోట్ల రూపాయలకు చేరుకుంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నికర లాభం 94.2 కోట్ల రూపాయలుగా ఉంది. కాగా త్రైమాసిక సమీక్ష కాలంలో కంపెనీ మొత్తం రాబడులు కూడా 7.2 శాతం వృద్ధి చెంది 917.10 కోట్ల రూపాయల నుంచి 983.4 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో 5 రూపాయల ముఖ విలువ గల ప్రతి షేరుకు రెండో సారి 4 రూపాయల మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. డిసెంబరు ముగిసే నాటికి కంపెనీ వద్ద 1,077 కోట్ల రూపాయల విలువ గల నగదు నిల్వలున్నాయి.

త్రైమాసిక కాలంలో కంపెనీకి చెందిన అన్ని బిజినెస్ యూనిట్లు వృద్ధి బాటలో పయనించడం ఎంతగానో కలిసి వచ్చిందని సైయెంట్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ కృష్ణ బోదనపు అన్నారు. ఎనిమిది బిజినెస్ యూనిట్లలో ఆరు యూనిట్లు రెండంకెల వృద్ధిని నమోదు చేశాయని ఆయన తెలిపారు. ఇఎంఇఎ, అమెరికా, ఎపిఎసిల్లో వరుసగా 16 శాతం, 10 శాతం, 10 శాతం వృద్ధిని సాధించినట్టు ఆయన పేర్కొన్నారు. ఐటి రంగంలో తృతీయ త్రైమాసికంలో తక్కువ పనిదినాల కారణంగా వృద్ధి రేటు తక్కువగా ఉంటుందని, అయితే సైయెంట్ మాత్రం ఈ సమయంలో 15.2 కోట్ల డాలర్ల రెవెన్యూను ఆర్జించి రికార్డు సృష్టించిందని కృష్ణ అన్నారు. యుటిలిటీస్, జియోస్పేషియల్ (యు అండ్ జి), ట్రాన్స్‌పోర్టేషన్, ఇండస్ట్రియల్, ఎనర్జీ, నేచురల్ రీసోర్సెస్, డిజైన్ లెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ (డిఎల్ఎం), ఏరోస్పేస్ బిజినెస్ యూనిట్లలో వ్యాపారం ఆశించిన స్థాయిలో ఉందన్నారు. కాగా ప్రస్తుతమున్న ఆర్డర్ బుక్‌తో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండంకెల వృద్ధి రేటును సాధించటమే కాకుండా మార్జిన్లు 50 బేసిస్ పాయింట్లు పెరుగుతాయని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రధానంగా డిఎల్ఎం వ్యాపారంలో 20 శాతం వృద్ధిని సాధించవచ్చునని అంచనా వేస్తున్నట్టు కృష్ణ వెల్లడించారు. సీజనల్‌గా వచ్చే అవాంతరాలను అధిగమించుకుంటూ రాబడులు, లాభాల్లో మెరుగైన పని తీరును కనబరిచినట్టు సైయెంట్ ప్రెసిడెంట్, సిఎఫ్ఒ అజయ్ అగర్వాల్ తెలిపారు. డిసెంబరు త్రైమాసికంలో ఐఎస్ఎస్ఎస్‌ను ప్రాట్ అండ్ విట్నీకి విక్రయించడం ద్వారా 90 లక్షల డాలర్ల రెవెన్యూ వచ్చి చేరటంతో నగదు నిల్వ 16.8 కోట్ల డాలర్లకు చేరుకుందని చెప్పారు. వ్యూహాత్మక పెట్టుబడులపై దృష్టి పెట్టడం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో వృద్ధి జోరును కొనసాగించవచ్చని అంచనా వేస్తున్నట్లు అగర్వాల్ వెల్లడించారు.

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	---	30,750	30,980	30,600	30,040
క్రితం ముగింపు	31,160	31,100	31,120	30,740	30,230
22 క్యారెట్లు	---	28,500	28,500	28,410	28,610
క్రితం ముగింపు	28,860	28,850	28,630	28,560	28,790
వెండి (కిలో)	---	40,300	40,000	40,000	42,000
క్రితం ముగింపు	40,200	40,400	40,200	40,200	42,400

బ్యాంకింగ్ స్టాక్‌ల జోరు

10800 పైన నిఫ్టీ, సెన్సెక్స్ 180 పాయింట్లు అప్

ముంబై : వరుసగా రెండో రోజు కూడా దేశీ స్టాక్‌మార్కెట్ దూసుకుపోయింది. బ్యాంకుల్లో ఎఫ్‌డిఐ పరిమితిని ప్రభుత్వం పెంచవచ్చన్న వార్తలు బ్యాంకింగ్ స్టాక్‌లను పరుగులు తీయించడంతో ఇండెక్స్‌లు ఇంట్రాడేలో భారీ లాభాలతో కొత్త శిఖరాలను తాకాయి. కాని చివరిలో సాగిన లాభాల స్వీకారంతో ఉదయం లాభాల్లో కొంత పోగొట్టుకున్నప్పటికీ కొత్త గరిష్ఠ స్థాయిల్లోనే ముగిశాయి. నిఫ్టీ తొలిసారిగా 10800 కన్నా పైన ముగిసింది. బుధవారం తొలిసారిగా 35000 పాయింట్లను తాకిన సెన్సెక్స్ ఇంట్రాడేలో 30500 మైలురాయిని కూడా దాటినా లాభాల స్వీకరణ వల్ల ప్రారంభ లాభాలు పోగొట్టుకుని 178 పాయింట్ల వృద్ధితో 35260.29 పాయింట్ల వద్ద మరో కొత్త గరిష్ఠ స్థాయిలో ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ నమోదు చేసిన కొత్త గరిష్ఠ స్థాయి 35507.36 పాయింట్లు. నిఫ్టీ ఇంట్రాడేలో 10887.50 పాయింట్ల వరకు దూసుకుపోయి చివరికి 10817 పాయింట్ల ఆల్ టైమ్ హైలో క్లోజయింది. క్యు3 ఆర్థిక ఫలితాలపై ఆశలు, సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు, కొత్త బడ్జెట్‌పై అంచనాలు మార్కెట్ జోరుకి ఆజ్యం పోశాయి. ఎఫ్‌డిఐ పెట్టుబడుల పరిమితిని ప్రైవేటు బ్యాంకుల్లో నూరు శాతానికి, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 49 శాతానికి ప్రభుత్వం పెంచుతుందన్న వార్తలు బ్యాంకింగ్ స్టాక్‌లలో కొత్త ఉత్తేజం నింపాయి. విదేశీ ఇన్వెస్టర్లు కూడా ప్రస్తుత ర్యాలీకి ఊతంగా నిలిచారు. సెబి గణాంకాల ప్రకారం వారు బుధవారం 625.13 కోట్ల రూపాయల విలువ గల షేర్లు కొనుగోలు చేశారు.



హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ కొత్త మైలురాయి

ప్రైవేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మార్కెట్ విలువలో ఐదు లక్షల కోట్ల మైలురాయిని దాటింది. ఆర్ఐఎల్, టిసిఎస్ తర్వాత ఆ ఘనత సాధించిన మూడో కంపెనీగా నిలిచింది. దేశంలో ఈ ఘనత సాధించిన తొలి బ్యాంకు కూడా ఇదే. గురువారం మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంకు మార్కెట్ విలువ 5,00,360 కోట్ల రూపాయలయింది. ఇంట్రాడేలో బిఎస్ఇలో ఈ షేరు 3.31 శాతం పెరిగి 52 వారాల గరిష్ఠ స్థాయి 1953.75 రూపాయలకు చేరినా చివరికి 2.15 రూపాయల లాభంతో 1931.75 రూపాయల వద్ద ముగిసింది.

- క్యు3లో ప్రోత్సాహకరమైన లాభాలు ప్రకటించడంతో మైండ్‌ట్రీ షేరు 10 శాతానికి పైగా దూసుకుపోగా నిరుత్సాహక ఫలితాలు ప్రకటించిన భారతి ఇన్‌ఫ్రాటెల్ షేరు ఆరు శాతానికి పైగా నష్టపోయింది.

న్యూజెన్‌కు 8 రెట్ల ఓవర్ సబ్‌స్ర్కిప్షన్

న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ షేరు చివరి రోజున 8.22 రెట్లు ఓవర్‌సబ్‌స్ర్కయిబ్ అయింది. 425 కోట్ల రూపాయల సమీకరణ లక్ష్యంగా 1.22 కోట్ల ఈక్విటీ షేర్లను మార్కెట్‌లో విడుదల చేయగా 10,03,90,323 కోట్ల షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. షేరు ధరల శ్రేణి 240-245 రూపాయలు.

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.60 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	402.00	చిత్తూరు	403.00
వరంగల్	404.00	చెన్నై	410.00
విజయవాడ	412.00	నమక్కల్	395.00
గోదావరి	412.00	బెంగళూరు	405.00
విశాఖపట్నం	412.00	ముంబై	447.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	85.00	విజయవాడ	85.00
కరీంనగర్	86.00	గుంటూరు	85.00
వరంగల్	85.00	ఒంగోలు	87.00
మహబూబ్‌నగర్	85.00	చిత్తూరు	77.00
కర్నూలు	85.00	నెల్లూరు	86.00
విశాఖపట్నం	77.00	అనంతపురం	82.00
గోదావరి	85.00		

గరిష్ఠ స్థాయిల్లో రియాక్షన్

టెక్ వ్యూ

నిఫ్టీ బలమైన అప్‌ట్రెండ్‌లో ప్రారంభమై 100 పాయింట్లకు పైగా లాభంతో 10900 వరకు వెళ్లి సుదీర్ఘ కన్సాలిడేషన్ సాధించింది. కాని చివరి సెషన్‌లో బలమైన రియాక్షన్ సాధించి స్వల్పలాభంతో డే కనిష్ఠస్థాయిలో క్లోజయింది. ప్రధాన ట్రెండ్ పాజిటివ్‌గానే ఉన్నా ఇంట్రాడే కరెక్షన్‌ను బట్టి డే గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తత కనిపిస్తోంది. మార్కెట్ ఓవర్‌బాట్ స్థితిలో ఉన్నందు వల్ల కన్సాలిడేషన్ లేదా కరెక్షన్‌కు ఆస్కారం ఉంది.

శుక్రవారం స్థాయిలివే...

నిరోధం : 10860 **మద్దతు :** 10780

- ఇంట్రాడే నిరోధం 10860 పైన నిలదొక్కుకుంటే తదుపరి టార్గెట్ 10900. ఆ పైన బలంగా ముగిసినట్టయితే మరో టార్గెట్ 11000.
- మైనర్ మద్దతు స్థాయి 10780కన్నా దిగజారితే మైనర్ కరెక్షన్ సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 10700, 10600.
- బ్యాంక్ నిఫ్టీ 26900 వద్ద రియాక్షన్‌తో డే కనిష్ఠ స్థాయిలో ముగిసింది.

■ వి.సుందర్ రాజా

మిడ్‌సెషన్ నిస్తేజం

ఆస్ట్రో వ్యూ

తిథి : మాఘ శుద్ధ తదియ
నక్షత్రం : ధనిష్ట

పుష్యమి, అనూరాధ, ఉత్తరాభాద్ర నక్షత్ర జాతకులు, కుంభ, మీన, రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10817.00 (+28.45)
ట్రెండ్ మార్పు వేళలు : 12 గంటలు
ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడగా ప్రారంభమై 11.30 నుంచి 2.30 గంటల వరకు నిస్తేజంగా ఉండి చివరి గంటలో మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...


ఫ్టీ ఫ్యూచర్స్ 11.45 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 2.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.30 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవచ్చు.ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10855, 10890
మద్దతు స్థాయిలు : 10775, 10740

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala stro loger.blogspot.in

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.14	67.41
పౌండ్	80.32	93.14
యూరో	70.85	82.18
ఆస్ట్రేలియా డాలర్	46.28	53.55
బహ్రెయిన్ దినార్	157.44	180.43
కువైట్ దినార్	175.75	218.93
ఒమని రియాల్	154.18	176.40
సౌదీ రియాల్	15.45	18.32
సింగపూర్ డాలర్	43.88	51.98
యుఎఇ దిరమ్	15.82	18.50

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM 7.89(8.3)1
ADITYA SPIN. 10(10.01)405
AGRO TECH FO 710.8(720.6)1922
AISHWARYA TE 10.56(11.15)46416
ALPHAGEO (I) 907.35(926.3)4482
ALU FLUORIDE 128.95(132.7)11986
AMAR RAJA BA 832.4(850)29439
ANDHRA BANK 55.7(56.95)254259
ANDHRA CEMEN 13.39(13.99)57949
ANDHRA PETRO 63.05(63.1)369510
ANJANI PORTL 242.15(255.25)734
ASTRA MICRO 115.8(119.2)121848
AUROB.PHARMA 645.85(658.7)154095
AVANTEL LTD 499.75(526.05)6963
AVANTI FEEDS 2433.55(2473.65)11008
B.N.RATHI SE 48.5(46.95)11032
BALAJI AMINE 691.35(708)21908
BAMBINO AGRO 310.55(323)4107
BARTRONICSIN 14.65(14.93)37202
BHAGIRA.CHEM 321(336.55)3831
BHAGYA INL 44.3(47.45)13908
BHARATFIN 1003.35(999.1)69977
BNR UDYOG 30.45(30.7)660
CAMBRIDGE 98.9(100.9)17709
CCHHL 16.75(17.45)73198
CCL PRODUCTS 287.15(293.35)7767
CELESTIAL 19.1(19.75)25082
CIL SECURITS 35.1(37)2604
COROM INTER 556.6(556.8)32586
CUBEX TUBING 27.5(28)3140
CYBERMATE 3.76(3.89)98553
CYIENT 580.95(589.5)14554
DANLAW TECH. 85(88.9)7450
DECAN CEMENT 603.6(623.2)793
DHAN ROTO SP 40.1(40.15)9953
DIAMONPOWER 20.25(20.45)55569
DIVI'S LAB. 1086.9(1104.6)27763
DIVYA.GRANIT 110.2(116)2425
DQ ENT 17.9(18.35)2527274
DR.REDDY'S 2465.65(2489.4)41922
EMPEE SUGARS 4.81(5.06)29806
EVEREST ORG. 160.3(163.3)1499
FACOR ALLOYS 3.78(3.89)142534
FIRSTOBJ 15.25(15.5)4458
FOURTH GEN. 1.96(1.96)15
GATI LTD. 139.4(147.9)504283
GAYATRI BIO 9.88(9.41)1000
GAYATRI PROJ 213.45(214.55)60328
GENNEX LAB 5.06(5.42)346448
GMR INFRASTR 22.75(24.1)13455584
GODAVARI DRU 37.95(39.5)6814
GOLDST INFRA 213.55(228.8)59990
GOLDSTONE EN 17.95(18.65)19850
GRANULES (I) 136.05(139.85)159954
GVK POWERINF 23.1(24.3)3141786
HBL P SYS 64.3(67.85)272847
HERITGFOOD 804.05(808.55)3340
HIND.FLUROCA 14.89(14.75)14600
HINDUSTN BIO .54(.52)200
I.C.S.A. IND 5.81(6.11)26031
INCAP LTD. 116.45(116.9)1708
IPAPPM 357.95(381.1)39107
IVRCL LTD 5.99(6.3)336738
KAKATIYA CEM 391.6(404.55)14190
KALLAM SPG. 22.7(23.65)33524
KAVERI SEED 511.95(521.55)75703
KCP LTD 150.15(150.05)57118
KERNEX MICRO 60.05(63.2)49406
KNR CONST 306.8(310.7)16300
KREBS BIOCHM 146.85(152.2)5505
LANCO INFRA 2.15(2.23)14150786
LOKESH MACH 70.8(73.65)52196
LOTUS CHOC 41.9(38.1)9923
MADHUCON PRJ 33.75(34.75)44520
MOLD-TEK TEC 71.8(74.9)15615
MOSCHIP SEMI 40.8(42.55)144737
MSR INDIA 39.5(40.15)19504
N C L IND. 279.25(272.55)96693
NACLIND 57.15(59.8)40078
NATCO PHARM 1005.75(1020.65)13784
NCC 123.2(129.65)472796
NEHA INTER. 8.7(8.75)50709
NETTLINX LTD 89.55(91)92943
NEULAND LAB. 873.8(887.75)3623
NIHAR INFO 14.5(14.49)554
NILE LTD. 968.4(961.4)17887
NTL 4.94(4.96)11761
OIL COUNTRY 54.15(57.75)17625
PADMALAYA TE 5.98(6.18)21792
PALRED 96.95(103.9)7460
PANYAM CEMEN 61.55(62.2)33267
PENNAR STEEL 64.9(66.95)159808
PFL INFOTECH 11.72(12.33)4463
PHYTOCHEM I. 70.4(74.15)15592
PITTI LAMIN. 96.15(98.35)23226
POKARNA LTD 227(230.6)7243
PRAJAY ENGS. 16.73(17.61)133048
PREMIER EXPL 444.2(454.85)4603
PRISM CEMENT 139.5(144.95)462286
RAIN 419.1(440.95)698956
RAJ PACKAGIN 40.25(41.05)6441
RAJVIR IND 44.5(42.4)112
REG.CERAMIC 8.05(8.4)708
RESTILE CER. 8.95(8.87)9174
SAGAR CEM. 1070.8(1044.2)6275
SAMKRG PIST. 340.6(344.05)8842
SAMPRE NUTRI 85.5(84.4)10907
SANGHI IND. 135.55(129)131886
SATVAH.ISPAT 31.8(34.25)40943
SAVEN TECHNO 23.6(23.15)7301
SIBAR AUTO 13.94(13.28)931
SMPL 1.66(1.74)104782
SMS PHARMACE 100.75(102.3)8146
SREE RAYALA 215.6(221.45)2225
STEEL EXCH 35.55(37.3)54300
SUJANA INDUS 1.16(1.22)223863
SURANATP 6.04(6.11)29033
SURYACHAKRA 1.62(1.7)140259
SURYAMBA SP 70.05(71.3)17271
SURYAVA SPIN 7.98(7.77)35
SURYLAK.COTT 95.55(101.05)3095
SUVEN LIFE S 200.45(204.15)113825
TAJ GVK HOTL 181.9(174.25)189763
TANLA 38.8(40.35)192482
TCI INDUS. 1010(1004)7
TRANSCORP IN 42.45(44.65)21548
TRANSGENE BI 2.49(2.62)21121
TRANSPORT CO 279.4(284)4766
USHER AGRO 8.88(8.74)16845
VICEROY HOTE 19.15(19.65)143535
VIJAY TEXTIL 54.55(57.4)70356
VIMTA LABS 173.4(176.3)9462
VIRAT CRANE 45.8(45.35)18878
VIRINCHI 130.4(135.25)108649
VISAKA IND. 773.9(795.55)50446
VISTA PHARMA 47(46.95)62726
VIVIMED LABS 96.2(101.75)138381
VST INDUS. 3030.4(3126.7)367
WATERBASE 319.25(334.9)220626
XLENERGY 4.46(4.69)12791
YBRANTDIGI 7.28(7.66)346614
ZEN TECH 127.9(135.65)190681
ZENOTECH 48.7(48.85)14313

ఎన్ఎస్ఇ-500 (NSE) షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 715.95(740.3)15230
AARTIIND 1112.85(1112.4)21356
ABAN 232.9(246)4601595
ABB 1541.9(1548.5)100083
ABFRL 165.5(167.7)561111
ABGSHIP 13(13.1)11348
ACC 1839(1840.5)733461
ADANIENT 195.25(204.55)13242809
ADANIPORTS 416.25(433.4)8794103
ADANIPOWER 36.95(40.75)43309803
ADANITRANS 227.75(231.1)2368055
AEGISCHEM 284.5(285.15)124253
AHLUCONT 386(385.1)19905
AIAENG 1581.1(1582.15)15986
AJANTPHARM 1533.2(1530.7)292989
AKZOINDIA 1856.55(1883.5)5832
ALBK 69.9(71.85)3377708
ALLCARGO 196.55(203.55)694294
ALOKTEXT 4(4.2)2327393
AMARAJABAT 832.7(850.6)261968
AMBUJACEM 275.65(277.15)1271915
AMTEKAUTO 27.1(27.95)280004
ANANTRAJ 71.9(75.85)3259320
ANDHRABANK 55.75(56.95)2840499
APARINDS 824.5(821.75)18287
APLLTD 540.85(549.25)16383
APOLLOHOSP 1116.45(1125.7)187463
APOLLOTYRE 261.85(273.85)3167641
ARVIND 450.35(458)1249341
ASHIANA 178.6(185.85)149621
ASHOKA 230.15(227.75)523536
ASHOKLEY 120.9(124.45)10351616
ASIANPAINT 1188.25(1193.75)500762
ASTRAL 837.4(841.35)16636
ASTRAZEN 1118.35(1152.75)8274
ATUL 2945(2924.15)39774
AUROPHARMA 645.85(657.25)2636988
AVANTIFEED 2436.25(2478.85)39695
AXISBANK 584.8(585.2)9466991
BAJAJ-AUTO 3201.2(3194.15)282478
BAJAJCORP 503.35(515.2)59955
BAJAJELEC 529.7(538.1)544784
BAJAJFINSV 4922.6(4964.9)211086
BAJAJHIND 14.7(15.25)5054876
BAJAJHLDNG 2724.7(2770.55)13482
BALKRISIND 1125(1143.3)177528
BALLARPUR 16.4(17.65)2171780
BALMLAWRIE 249.1(252.85)98493
BALRAMCHIN 125.95(131.25)2291404
BANKBARODA 162.35(165.2)16765567
BANKINDIA 160.5(164.7)4614200
BASF 2201.4(2181.85)62363
BATAINDIA 720.8(730.7)376905
BBTC 1579.6(1636.9)254444
BEML 1508.85(1539.1)276003
BERGEPAINT 253.1(257.95)850274
BFUTILITIE 510.6(536.6)910166
BGRENERGY 135.8(142.85)193018
BHARATFIN 1004.3(999)760269
BHARATFORG 720.9(735.15)684221
BHARTIARTL 495(499.9)7131552
BHEL 97.45(99.9)9461595
BHUSANSTL 66.45(69.4)1591884
BIOCON 539.6(551.3)1022827
BIRLACORPN 1175.95(1199.65)29905
BLISSGVS 201.05(200.35)954348
BLUEDART 4707.2(4735.8)5208
BLUESTARCO 766.9(743.45)34896
BOMDYEING 250.1(267.35)4291051
BOSCHLTD 19903.7(19954.25)9788
BPCL 470.25(479.85)3671246
BRFL 90(90.2)435935
BRIGADE 295.65(304.4)63804
BRITANNIA 4631.5(4749.8)177923
CADILAHC 437.6(440.25)335848
CANBK 349.3(354.75)3573883
CAPF 755.2(789)2654393
CARERATING 1389.25(1375.1)76432
CASTEXTECH 6.25(6.55)354600
CASTROLIND 186.45(189.95)1368563
CCL 286.7(293.95)248873
CEATLTD 1872.35(1920.65)327340
CENTRALBK 73.7(74.1)553519
CENTURYPLY 341.25(352.15)201175
CENTURYTEX 1383.9(1416.45)423433
CERA 3639.05(3714.2)32413
CESC 1106.05(1137)371383
CHAMBLFERT 157.4(155.55)910559
CHENNPETRO 437.4(446.65)356401
CHOLAFIN 1314.6(1344.9)179604
CIPLA 603.65(607.15)1028921
CLNINDIA 631.35(638.75)117665
COALINDIA 283.05(290.95)3784420
COLPAL 1159.2(1141.85)353631
CONCOR 1439.1(1429)713977
COROMANDEL 555.8(555.2)97177
CORPBANK 39.55(40.05)402264
COX&KINGS 260.5(262.05)287580
CRISIL 1960.3(1963.65)17090
CUB 176.8(175.95)570885
CUMMINSIND 906.2(932.65)692992
CYIENT 581.55(590.2)220787
DABUR 364.65(358.9)1240349
DALMIABHA 3098.3(3149.8)48506
DBCORP 355.85(371.55)946833
DBREALTY 68.4(71.5)1170128
DCBBANK 184.15(193.35)3134327
DCMSHRIRAM 568.05(566.9)187783
DEEPAKFERT 388.7(395.3)140125
DELTACORP 324.15(332.15)2708932
DEN 122.7(133.45)1221886
DENABANK 25.9(25.6)6501706
DHANUKA 774.5(774.85)16719
DHFL 590.15(608.95)1221764
DISHTV 72.75(75.3)9508981
DIVISLAB 1090.4(1107.55)582399
DLF 250.2(262.6)6764646
DREDGECORP 760.55(771.25)409383
DRREDDY 2461.5(2491.85)584198
DYNAMATECH 1988.65(2004.05)4463
ECLERX 1528.45(1525.3)15827
EDELWEISS 274.3(274.4)2176417
EICHERMOT 27954.4(28222.85)49399
EIDPARRY 357.25(364.55)92983
EIHOTEL 202.6(205.55)697018
ELECTCAST 35.85(38.15)746307
ELGIEQUIP 300.1(298.65)61590
EMAMILTD 1261.15(1236.65)167997
ENGINERSIN 178.25(187.7)2071784
EROSMEDIA 223.2(233.55)1057382
ESCORTS 757.05(795.7)953636
ESSDEE 85.85(88.9)45235
ESSELPACK 293.55(296.4)29538
EVEREADY 449(449.1)74246
EXIDEIND 222.25(226.5)1437056
FCONSUMER 67.75(68.95)3676498
FDC 238.15(236.3)60465
FEDERALBNK 102.15(105.1)20355477
FINCABLES 711.15(717.85)38020
FINPIPE 645.4(645.3)52513
FLFL 375.4(369.15)55119
FORTIS 144.1(144.05)10480554
FSL 44.65(43.2)23619170
GAIL 468.5(480.55)3484599
GATI 139.35(147.55)3006297
GDL 238.3(244.4)400882
GEPIL 929.75(940.6)42446
GESHIP 446.65(438.55)757724
GET&D 426.85(419.3)110282
GILLETTE 6606.25(6650.75)3571
GLAXO 2473.25(2486.35)14738
GLENMARK 625.75(630.9)754679
GLOBOFFS 38.25(38.95)20236
GMDCLTD 151.15(157.15)365099
GMRINFRA 22.75(24.1)169390298
GODFRYPHLP 985.45(997.95)135919
GODREJCP 1035.15(999.35)1319819
GODREJIND 609.75(624.25)254870
GODREJPROP 795.35(831.5)167214
GPPL 153.35(154.7)877634
GRANULES 135.85(140.35)1824797
GREAVESCOT 136.6(140.95)1101243
GREENPLY 364.45(379.75)54315
GRINDWELL 545.4(555.05)14750
GRUH 598.1(551.85)1316996
GSFC 150.3(158.6)3430408
GSKCONS 6625.65(6523.25)20225
GSPL 214.1(221.35)359425
GUJFLUORO 875.75(892.25)206745
GUJGASLTD 877.3(881.25)21442
GULFOILLUB 916.4(882.35)79959
GVKPIL 23.05(24.25)8717106
HATHWAY 41.8(43.8)1575847
HAVELLS 552.1(559.35)377507
HCC 36.65(38.15)19986848
HCL-INSYS 55.85(58.5)3163476
HCLTECH 954.25(952.85)934750
HDFC 1896.8(1858.35)6605642
HDFCBANK 1934.3(1890.5)4162385
HDFCBANK 1973(1920)250000
HDIL 61.6(64.95)20871728
HEIDELBERG 162.9(170)627188
HEROMOTOCO 3593.35(3566.85)345926
HEXAWARE 347(357.75)780712
HFCL 31.05(32.75)10773612
HIMATSEIDE 397.6(401.4)61216
HINDALCO 253.9(262.75)11341249
HINDCOPPER 87.2(91.55)3288069
HINDPETRO 411.75(420.3)2914389
HINDUNILVR 1356.95(1371.2)2465412
HINDZINC 308.3(323.15)2229509
HMT 39.3(40.55)25725
HMVL 254.6(259.3)12416
HONAUT 17751.95(17979.65)2669
HOTELEELA 21.45(22.3)1527144
HSIL 479.2(491.25)182972
HTMEDIA 106.65(111.35)816035
IBREALEST 230.2(240.75)6058696
IBULHSGFIN 1243.7(1209.35)4638248
ICICIBANK 346.15(343.25)31504669
ICRA 3990.2(3980.1)1254
IDBI 60.15(60.85)6589204
IDEA 101.1(103.5)14011771
IDFC 58.9(61.7)14254621
IFBIND 1423.35(1430.6)39378
IFCI 30(31.85)24395778
IGARASHI 839.35(854.6)12471
IIFL 696.85(701.15)80265
IL&FSTRANS 79.85(83.7)471028
INDHOTEL 140.6(148.65)1882304
INDIACEM 182.45(197.7)6540354
INDIANB 376.6(386.2)1170552
INDOCO 266.7(277.9)142255
INDUSINDBK 1680.1(1657.45)2327815
INEOSSTYRO 1071.35(1103.9)12753
INFRATEL 343.8(366.1)4256014
INFY 1152.7(1152.1)6602485
INGERRAND 822.7(846.35)14560
INOXLEISUR 280.45(282.25)542629
INOXWIND 135.65(141.55)298739
INTELLECT 174.85(188.6)595134
IOB 23.1(23.15)1004995
IOC 378.05(384.05)5348803
IPAPPM 358.15(380.85)144886
IPCALAB 584.75(584)89296
IRB 239.2(247.05)796718
ITC 273.4(266.05)26442702
J&KBANK 76.5(77.75)733357
JAGRAN 173.5(178.4)61571
JAICORPLTD 188(195.9)2617612
JBCHEPHARM 320.05(328.55)44894
JBFIND 203.3(209.35)83850
JCHAC 2653.75(2652.2)9141
JETAIRWAYS 791.25(821.3)3917234
JINDALPOLY 384.55(394.5)127154
JINDALSTEL 264.35(269.7)12623614
JISLJALEQS 133.1(141.3)8843609
JKCEMENT 1141.3(1148.75)170320
JKIL 321.5(335.05)68010
JKLAKSHMI 443.35(447.7)46046
JKTYRE 175.35(179.7)2635803
JMFINANCIL 159.55(165.8)974001
JPASSOCIAT 20.85(22.8)94996332
JPINFRATEC 16.55(17.4)15509060
JPPOWER 7.55(7.9)5966676
JSWENERGY 89.3(94.6)12140370
JSWHL 1768.35(1795.15)2670
JUBILANT 898.6(924.45)4556523
JUBLFOOD 1943.35(1906.25)1463218
JUSTDIAL 557.65(635.45)5280615
JYOTHYLAB 375.7(362.45)711604
KALPATPOWR 471.3(485.35)48271
KANSAINER 543.25(542.9)130253
KEC 362.05(366.45)499337
KESORAMIND 149.45(157.25)1048687
KIRLOSENG 378.75(377.15)21853
KITEX 298.5(304.45)74082
KOLTEPATIL 368.55(378.4)256281
KOTAKBANK 1046.5(1027.1)3648214
KPIT 192.3(201.35)3190786
KRBL 613.7(615.95)88564
KSCL 510.5(519.85)374187
KSK 16.45(17.3)3089735
KTKBANK 158(162.25)13640919
KWALITY 102.7(104.05)1057100
L&TFH 171.1(173.65)9428507
LAKSHVILAS 141.05(141.6)685766
LAOPALA 640.4(664.6)44875
LAXMIMACH 6081.35(6233.9)4407
LICHSGFIN 551.85(558.1)1201369
LITL 2.1(2)4440151
LT 1360.8(1353.35)4966982
LUPIN 921.05(919.35)2318124
M&M 759.25(745.35)2810014
M&MFIN 474.4(485.3)927582
MAGMA 174.85(173.4)299496
MAHINDCIE 238.65(244.4)171025
MAHLIFE 512.15(526.1)81489
MANAPPURAM 115.6(119.5)5399102
MANPASAND 430.35(447.8)48469
MARICO 311(310.75)953935
MARKSANS 43.95(45.55)6148395
MARUTI 9368.7(9313.9)686971
MAYURUNIQ 525.2(527.85)33810
MCDOWELL-N 3683.5(3684.6)407106
MCLEODRUSS 183.2(183.4)413975
MERCK 1483.65(1534.55)48323
MHRIL 364.1(374.55)48169
MINDACORP 206.95(214.8)464787
MINDTREE 684.15(624.85)6947714
MMTC 64.75(66.4)1644131
MOIL 241.25(252.6)797672
MONSANTO 2540.45(2569.75)10633
MOTHERSUMI 378.8(384.1)1941064
MOTILALOFS 1398.3(1468.55)216307
MPHASIS 794.35(762.1)494354
MRF 68804.45(70420.8)7680
MRPL 126(128.55)1329628
MTNL 26.25(27.75)2554069
MUTHOOTFIN 431.2(432.25)468250
NATCOPHARM 1010.25(1023.05)174920
NATIONALUM 75.3(80.2)14371641
NAUKRI 1364.9(1381.55)37708
NAVKARCORP 195.5(201.15)742506
NCC 123.25(129.75)6826395
NETWORK18 54.55(57.5)1835627
NHPC 29.45(30.85)10176555
NIITTECH 693.2(706.05)509696
NITINFIRE 7.25(7.6)651215
NLCINDIA 105.1(107)1531188
NMDC 143.8(149.45)6197914
NTPC 172.15(174.25)6900318
OBEROIRLTY 503.25(515)202714
OFSS 4026.65(4096.2)11688
OIL 376(380.2)290815
OMAXE 228.85(230.1)511871
ONGC 194.1(195.7)6247782
ORIENTBANK 120.85(123.4)2645726
ORIENTCEM 167.6(168.95)278807
ORISSAMINE 1929(1970.25)5277
PAGEIND 22196.25(22222.65)22538
PARSVNATH 26.15(27.5)195434
PCJEWELLER 581.1(587.05)2782492
PEL 2758.7(2853.15)149242
PERSISTENT 752.3(770.25)90333
PETRONET 235.85(234.6)4572608
PFC 119.25(122)4511605
PFIZER 2100.3(2096.25)106767
PFS 36.85(37.4)1453037
PGHH 9394.3(9309.1)3360
PHOENIXLTD 604.1(611.2)79595
PIDILITIND 893.2(896.5)274737
PIIND 994.2(987.5)224206
PNB 170.5(175.55)32923946
POLARIS 406.55(408.9)117715
POWERGRID 197(197.4)13839476
PRAJIND 113.25(117.1)1846131
PRESTIGE 309.9(320.7)163749
PRISMCEM 139.25(145.3)3118069
PTC 114.4(116.65)1525791
PUNJLLOYD 23.8(25)2487817
PURVA 148.95(156.4)527118
PVR 1457.15(1474.3)338896
RADICO 341.5(341.85)4778364
RAIN 418.8(441.3)3850553
RAJESHEXPO 830.9(848)590964
RALLIS 265.45(275.85)926751
RAMCOCEM 789.65(787.1)257663
RAMCOSYS 517.3(538.15)37444
RATNAMANI 1057.6(1059.95)23662
RAYMOND 1062(1108.9)323759
RCF 101.95(104.95)4770183
RCOM 29.35(32.35)126454099
RECLTD 152.95(155.45)4236254
REDINGTON 189.6(188.85)804237
RELAXO 650.4(650.55)8257
RELCAPITAL 526.15(566)8758762
RELIANCE 919.7(924.5)4289053
RELINFRA 506.5(543.95)4259050
RENUKA 15.85(16.1)2508180
REPCOHOME 670.75(672.75)231748
RIIL 559.75(583.2)626170
RKFORGE 801.15(825.25)12667
RNAVAL 50.1(54.15)8833026
ROLTA 70.7(74.35)1868339
RPOWER 48.7(52.3)21139555
RTNPOWER 7.45(7.85)18968956
RUCHISOYA 19.2(18.65)10193321
SADBHAV 408.4(416.35)152547
SADBHIN 142.55(146.2)163922
SAIL 92.3(96.5)16245856
SANOFI 4677.9(4682.7)7533
SBIN 303.25(307.1)40000111
SCHAEFFLER 5680.95(5702.8)13987
SCHNEIDER 122.65(127.8)145814
SCI 90.55(92.95)1080166
SHARDACROP 440.25(447.15)13637
SHILPAMED 581(585.95)35278
SHK 290.3(289.15)309978
SHOPERSTOP 516.85(522.55)250659
SHREECEM 18421.6(18975)17598
SHRIRAMCIT 2071.4(2050.9)5853
SIEMENS 1297.4(1315.05)140535
SIMPLEXINF 587(612)27619
SINTEX 23.9(24.25)4550901
SITINET 24.8(25.05)145308
SJVN 35.4(36.5)1152749
SKFINDIA 1837.25(1850.15)9172
SMLISUZU 864.95(885.6)22752
SNOWMAN 60(63.55)2921829
SOBHA 545.45(567.9)244155
SOMANYCERA 877.6(888.8)7176
SONATSOFTW 291.15(302.7)720832
SOUTHBANK 31.8(32.2)23475860
SPARC 494.9(508.8)435908
SREINFRA 99.5(102.55)5968721
SRF 1921.05(1951.5)151986
SRTRANSFIN 1456.3(1505.1)796760
STAR 802(802.4)229110
STCINDIA 165.75(169.95)16738
SUNDARMFIN 1989.4(1987.85)77233
SUNDRMFAST 542.5(556.8)98088
SUNPHARMA 576.7(583.75)3679687
SUNTV 1039(1058.15)646908
SUPREMEIND 1406.75(1389.45)111944
SUVEN 200.7(203.95)619153
SUZLON 14.85(15.35)40610391
SWANENERGY 213(221.45)1304845
SYMPHONY 1967.45(1983.2)11808
SYNDIBANK 77.15(79.95)5731472
SYNGENE 591.6(590.15)61753
TAKE 161.45(165.2)377068
TATACHEM 728.65(749.6)1019204
TATACOFFEE 156.4(159.7)774435
TATACOMM 634.1(645.6)471242
TATAELXSI 1033.3(1047.2)528131
TATAGLOBAL 305.45(313.55)3408593
TATAMOTORS 418.95(422.95)9579830
TATAMTRDVR 242.6(245.05)3063226
TATAPOWER 90.6(93.2)8188295
TATASPONGE 1139.45(1183.55)816666
TATASTEEL 751.75(774)4616814
TBZ 131.3(140.05)561782
TCS 2918.2(2888.95)1104739
TECHM 552.65(554.9)2158972
TECHNO 390.05(397.65)47508
TEXRAIL 109.25(115.6)1211107
THERMAX 1288(1335.6)103516
THOMASCOOK 247.2(254.1)643795
TIDEWATER 7080.65(7269.3)1824
TIMKEN 907.65(921.7)16666
TITAN 885.85(893.1)1285534
TNPL 441.8(461.3)137134
TORNTPHARM 1430.9(1404.65)165569
TORNTPOWER 292.95(291.45)2972725
TREEHOUSE 14.5(14.9)30777
TRIDENT 85.1(87.05)607660
TRITURBINE 134(134)102870
TTKPRESTIG 8505.6(8522.2)26008
TTML 7.2(7.55)857381
TV18BRDCST 59.7(62.7)8471249
TVSMOTOR 719.95(730)1016503
TVSSRICHAK 3646.25(3613.65)9983
TVTODAY 450.5(475.25)250688
UBL 1081.15(1131.15)277784
UCOBANK 31.05(31.25)1078048
UFLEX 464.1(476.55)102213
ULTRACEMCO 4408.65(4544.25)626579
UNICHEMLAB 361.35(361.4)247181
UNIONBANK 137.9(140.5)5396514
UNITECH 8.8(9.4)63870172
UPL 800.5(780.75)5203775
VAIBHAVGBL 711.65(717.75)37878
VAKRANGEE 436.6(449.95)1007352
VEDL 326.7(334.9)13916937
VIDEOIND 22.55(23.5)2037930
VIJAYABANK 65.1(66.95)2021970
VINATIORGA 981.85(988.3)13850
VIPIND 362.3(375.55)568485
VOLTAS 600.45(628.25)1400130
VRLLOG 408.6(424.95)92159
VSTIND 3028.5(3140)3138
VTL 1457.05(1407.9)161338
WABAG 618.5(622.6)96650
WABCOINDIA 7700.75(7337.55)12963
WELCORP 179(185.15)2481861
WELSPUNIND 72.6(75.35)4396936
WHIRLPOOL 1478.3(1496)19282
WIPRO 325.35(325.7)1770781
WOCKPHARMA 913.25(931.55)3524952
WONDERLA 390.3(383.25)49716
ZEEL 595.85(593.1)4229588
ZEELEARN 44.85(46.85)1138774
ZENSARTECH 896.4(895.9)46315
ZYDUSWELL 1112(1140.4)13091

ఐడియా భారీ క్యాష్ బ్యాక్ ఆఫర్లు

న్యూఢిల్లీ : జియోకు పోటీగా టెలికాం సంస్థ ఐడియా భారీ క్యాష్ బ్యాక్ ఆఫర్లను ప్రకటించింది. 398 రూపాయలు అంతకు మించి రీచార్జ్ చేసుకున్న కస్టమర్లు ఈ ఆఫర్లను పొందడానికి అవకాశం ఉంటుందని, మొత్తంగా 3,300 రూపాయల విలువైన క్యాష్ బ్యాక్ ప్రయోజనాలను కస్టమర్లకు అందిస్తున్నట్టు కంపెనీ తెలిపింది. 'మ్యాజిక్ క్యాష్ బ్యాక్' కింద ఫిబ్రవరి 10వ తేదీ వరకు రీచార్జ్ చేసుకునే ప్రీపెయిడ్ కస్టమర్లకు ఈ ఆఫర్ వర్తిస్తుంది. 398 రూపాయలు, అంతకు మించి ఆన్‌లైన్ ద్వారా రీచార్జ్ చేసుకుంటే 50 రూపాయల విలువైన డిస్కౌంట్ ఓచర్లు లభిస్తాయి. తర్వాతి రీచార్జ్‌ల సమయంలో వీటిని వినియోగించుకోవచ్చు. అంతేకాకుండా కస్టమర్లు 2,700 రూపాయల విలువైన ఐదు షాపింగ్ కూపన్లను పొందుతారని కంపెనీ పేర్కొంది.



ఆడి క్యూ5లో కొత్త వెర్షన్

ధర రూ.53.25 లక్షలు

న్యూఢిల్లీ : జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల కంపెనీ ఆడి తన ప్రీమియం ఎస్‌యువి క్యూ5 మోడల్‌లో సరికొత్త వెర్షన్‌ను గురువారం విడుదల చేసింది. ఇందులో రెండు వేరియంట్లు ఉన్నాయి. వీటి ధర 53.25 లక్షలు, 57.6 లక్షల రూపాయలు (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ)గా ఉంది. ఈ కారు బరువు తక్కువగా ఉంటుందని, సరికొత్త డిజైన్, ఇన్ఫోటెయిన్‌మెంట్, ఇన్నోవేటివ్ ఫీచర్లు ఇందులో ఉన్నాయని ఆడి ఇండియా హెడ్ రహిల్ అన్సారీ తెలిపారు. ఆన్‌రోడ్, ఆఫ్ రోడ్‌పై డ్రైవింగ్‌ను ఎంజాయ్ చేయాలనుకునే వారికి ఇది సరిగ్గా సరిపోతుందని ఆయన చెప్పారు. ఈ రెండో జనరేషన్ క్యూ5 ఇంధన సామర్థ్యం కూడా ఎక్కువగా ఉందని, బరువును తగ్గించడం వల్ల మరింత ఎక్కువ శక్తివంతంగా కారు మారిందని ఆయన తెలిపారు. 2 లీటర్ డీజిల్ ఇంజన్ కలిగిన ఈ ఎస్‌యువి గరిష్ఠంగా గంటకు 218 కిలో మీటర్ల వేగంతో దూసుకుపోతుంది. లీటర్ ఇంధనానికి 17.01 కిలో మీటర్ల మైలేజీని ఇస్తుందని కంపెనీ చెబుతోంది. సెవెన్ స్పీడ్ ట్రాన్స్‌మిషన్, హిల్ డిసెంట్ అసిస్ట్, త్రీ జోన్ ఆటోమెటిక్ ఎయిర్ కండీషనింగ్, 8 ఎయిర్‌బ్యాగ్స్ వంటి సదుపాయాలు ఈ కారులో ఉన్నట్టు కంపెనీ పేర్కొంది. ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా 16 లక్షలకు పైగా క్యూ5 కార్లు అమ్ముడయినట్టు ఆడి చెబుతోంది.

ఆటో ఎక్స్‌పోలో మారుతి సరికొత్త స్విఫ్ట్ విడుదల



పుణె : మారుతున్న కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దిన సరికొత్త స్విఫ్ట్‌ను వచ్చే నెలలో జరిగే ఆటో ఎక్స్‌పోలో భాగంగా మారుతి సుజుకీ విడుదల చేయనుంది. ఈ వెర్షన్‌కు ఇప్పటికే మారుతి బుకింగ్స్‌ను ప్రారంభించింది. ఈ మోడల్ పెట్రోల్, డీజిల్ ఇంజన్లతో అందుబాటులో ఉంటుంది. పెట్రోల్ వేరియంట్ 1.2 లీటర్ ఇంజన్, డీజిల్ వేరియంట్ 1.3 లీటర్ ఇంజన్‌ను కలిగి ఉంటుందని కంపెనీ పేర్కొంది. ఈ కొత్త వెర్షన్ వీల్ బేస్ కాస్త పొడుగ్గా ఉంటుందని, క్యాబిన్ , లగేజ్ ప్రదేశం కాస్త అధికంగా ఉంటుందని తెలిపింది. వీల్ బేస్ 40 ఎంఎం వెడల్పు, 20 ఎంఎం పొడవు ఉంటుందని, లగేజ్ ప్రదేశాన్ని 58 లీటర్లకు పెంచినట్టు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మార్కెటింగ్, సేల్స్) ఆర్‌ఎస్ కల్సి తెలిపారు. కొత్త స్విఫ్ట్ డిజైన్ ఆకర్షణీయంగా ఉండటమేకాకుండా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, అద్భుతమైన పనితీరు కలిగి ఉంటుందని ఆయన చెప్పారు. 2005 మే నెలలో స్విఫ్ట్ మోడల్‌ను మారుతి మార్కెట్లోకి విడుదల చేసింది. ఇప్పటి వరకు 17.8 లక్షల కార్లను విక్రయించింది.

రూ. 6 లక్షలు మించిన కొనుగోళ్లపై నిఘా !

▸ నల్లధన కట్టడికి మరిన్ని చర్యలు

న్యూఢిల్లీ: బ్లాక్ మనీతో భారీగా కొనుగోళ్లు చేయబోతున్నారా? అయితే జాగ్రత్త.. కొనుగోళ్ల విలువ రూ.6 లక్షలు దాటితే ఆ విషయం ఇక ప్రభుత్వానికి ఇట్టే తెలిసిపోతుంది. రిటైల్ వ్యాపారులు, సంస్థలు ఇలాంటి లావాదేవీల వివరాలను వెంటనే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహణలోని ఆర్థిక నిఘా యూనిట్(ఎఫ్ఐయు)కు తెలిపేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిమితి ప్రధానంగా విలాస వస్తువులు, ఆభరణాల కొనుగోళ్లకు వర్తించే అవకాశం ఉందని సమాచారం. 'అంతర్జాతీయంగా 10,000 డాలర్లకు మించిన కొనుగోళ్ల వివరాలను రిటైల్ సంస్థలు ప్రభుత్వానికి తెలియజేస్తాయి. భారత్‌లో ఈ పరిమితిని ఇంకా నిర్ణయించలేదు. అయితే రూ.6 లక్షలు ఉంటే బాగుంటుందని ఏకాభిప్రాయం వ్యక్తం అవుతోంది' అని ఒక ఉన్నతాధికారి చెప్పారు. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), ఆదాయ పన్ను శాఖ (ఐటి) అధికారుల పని మరింత సులభమవుతుం ది. అక్రమ నగదు లావాదేవీలు, ఆదాయానికి మించిన కొనుగోళ్ల వివరాలు తెలుసుకొని అలాంటి వ్యక్తుల నుంచి పన్నులు వసూలు చేయడం వీలవుతుంది. నల్లధన కట్టడి, అక్రమ నగదు లావాదేవీలను అడ్డుకునేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు అమలు చేస్తోంది. రూ.6 లక్షలకు మించిన లావాదేవీలు ఎఫ్ఐయుకి తెలపాలనే ప్రతిపాదన అమలైతే మరిన్ని రికార్డులు నిర్వహించాల్సి వస్తుందని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాజకీయ పార్టీలకు నగదు విరాళాలను అనుమతిస్తూ, లంచాలకు తెరపడనంత వరకు దేశంలో నల్లధన కట్టడి సాధ్యపడదని సిబిడిటి మాజీ చైర్మన్ ఎంఎం జోషి అంటున్నారు.

సెకండ్ హ్యాండ్ వాహనాలు చౌక

54 విభాగాల్లో 29 వస్తువులపై తగ్గిన జిఎస్‌టి.. జనవరి 25 నుంచి అమలు

వచ్చే సమావేశంలో పెట్రో ఉత్పత్తులపై నిర్ణయం

న్యూఢిల్లీ : ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ నాయకత్వంలోని జిఎస్‌టి కౌన్సిల్ 54 విభాగాలకు చెందిన 29 వస్తువులపై పన్ను రేటు తగ్గించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం ఈ నెల 25 నుంచి అమలులోకి వస్తుంది. అలాగే చిన్న వ్యాపార సంస్థలకు భారం తగ్గించే దిశగా పన్ను రిటర్న్‌ల దాఖలు మరింత సరళతరం చేసే అంశం కూడా పరిశీలించింది. అయితే క్రూడాయిల్, సహజవాయువు, పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనాలు, రియల్ ఎస్టేట్‌ను జిఎస్‌టి పరిధిలోకి తెచ్చే అంశం వచ్చే సమావేశంలో పరిశీలించనున్నట్టు ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. పన్ను రేట్లు తగ్గనున్న వస్తువుల్లో సెకండ్ హ్యాండ్ వాహనాలు, కన్ఫెక్షనరీ, బయోడీజిల్ ఉన్నాయి. అలాగే కొన్ని రకాల జాబ్ వర్క్‌లు, టైలరింగ్ సర్వీసులు, థీమ్ పార్కుల టికెట్లు కూడా చౌక కానున్నాయి. తాజా నిర్ణయం ప్రకారం సెకండ్ హ్యాండ్ ఎస్‌యువిలు, పెద్ద కార్లపై పన్నురేటు 28 శాతం నుంచి 18 శాతానికి, ఇతర వాహనాలపై 12 శాతానికి తగ్గుతుంది. అలాగే వజ్రాలు, ఇతర విలువైన స్టోన్స్‌పై పన్నురేటు 0.25 శాతం తగ్గించారు. ప్రస్తుతం వాటిపై 3 శాతం పన్ను అమలులో ఉంది. బయోడీజిల్‌పై పన్ను 18 శాతం నుంచి 12 శాతానికి, బయో ఇంధనాలతో నడిచే ప్రజారవాణా వ్యవస్థలోకి బస్సులపై 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు. ఇవి కాకుండా నీటిపారుదల వ్యవస్థకు అవసరం అయిన పరికరాలు, 20 లీటర్ల ప్యాకింగ్ వాటర్, ఎరువుల శ్రేణికి వచ్చే ఫాస్పారిక్ యాసిడ్, కోన్లలో లభించే మెహందీ పేస్ట్, ప్రైవేటు పంపిణీదారులు సరఫరా చేసే ఎల్‌పిజి, వెల్వెట్ ఫ్యాబ్రిక్, తవుడుపై కూడా పన్ను తగ్గుతుంది. ఈ పన్నుల తగ్గింపు వల్ల ఖజానాకు వెయ్యి కోట్ల రూపాయల మేరకు ఆదాయం తగ్గుతుందంటున్నారు. కొత్త పన్నుల వ్యవస్థలో రిజిస్టర్ అయిన కంపెనీలు జిఎస్‌టిఆర్ 3బి ఫారం దాఖలు చేసే విధానాన్ని కొనసాగిస్తూనే సరఫరాదారుల ఇన్‌వాయిస్ నమోదు చేసే విధానం ప్రవేశపెట్టే విషయం పరిశీలించామని ఆయన చెప్పారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను లిఖితపూర్వకంగా రాష్ట్రాల పరిశీలనకు పంపిన అనంతరం వచ్చే సమావేశంలో దాన్ని ఖరారు చేస్తామని ఆర్థికమంత్రి తెలిపారు. వచ్చే సమావేశం తేదీలు ఇంకా ఖరారు కాలేదని ఆయన చెప్పారు. 50 వేల రూపాయలకు పైబడిన విలువ గల వస్తువులను తరలించే రవాణా ఆపరేటర్లు ఎలక్ట్రానిక్ ఇ-వే బిల్లులను తప్పనిసరిగా వెంట పెట్టుకోవాలన్న నిబంధన ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తుందని ఆయన అన్నారు. ఈ విధానం అమలులోకి వస్తే 50 వేల రూపాయలకు పైబడిన విలువ గల వస్తుసేవల కదలికలకు సంబంధించిన సమాచారం ప్రభుత్వం వద్ద ఉంటుంది గనుక పన్ను ఎగవేత అసాధ్యం అవుతుందని ఆయన చెప్పారు. ఈ విధానంలో కొనుగోలుదారులు, సరఫరాదారులు కూడా ఇన్‌వాయిస్‌లు లోడ్ చేయడం తప్పనిసరి అని, వాటి మధ్య వ్యత్యాసం ఉంటే వారు దానికి సమాధానం ఇవ్వాల్సిఉంటుందని ఆయన వివరించారు. అంతర్ రాష్ట్ర వస్తుసేవల కదలికలపై దీన్ని అమలుపరచాలని 15 రాష్ట్రాలు నిర్ణయించాయని ఆయన అన్నారు. గత ఏడాది జూలై ఒకటో తేదీ నుంచి జిఎస్‌టి ప్రవేశపెట్టినప్పటికీ ఐటి నెట్‌వర్క్ సిద్ధం కాకపోవడం వల్ల ఇ-వే బిల్లుల విధానాన్ని మాత్రం వాయిదా వేస్తూ వచ్చినట్టు ఆయన తెలిపారు. పన్ను ఎగవేతలను నిరోధించే ఈ చర్యలతో జిఎస్‌టి ఆదాయం కూడా పెరుగుతుందన్న ధీమా జైట్లీ ప్రకటించారు. భారీ మొత్తంలో అందుబాటులో ఉన్న ఐజిఎస్‌టి ఆదాయం గురించి కూడా చర్చించామంటూ ఆ విధానంలో వసూలైన 35 వేల కోట్ల రూపాయలను కేంద్ర రాష్ట్రాల మధ్య విభజించాలని నిర్ణయించామని, దీని వల్ల ప్రభుత్వాల పన్ను వసూళ్ల స్థితి మెరుగుపడుతుందని ఆయన అన్నారు.


జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

పెట్టుబడులకు హైదరాబాద్ బెటర్

▸ పారిశ్రామికవేత్తల మనోభావం

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు ఇస్తూ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తోందని తెలంగాణ పారిశ్రామికవేత్తలు, అధికారులు పేర్కొన్నారు. ఇండియా టు డే సౌత్ కాంక్లేవ్-2018లో సదరన్ సన్ రైజ్- బిల్డింగ్ న్యూ గ్రోత్ అనే అంశంపై జరిగిన సమావేశంలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ కో చైర్మన్, సిఇఒ జివి ప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో ఉత్పత్తి తగ్గటంతో పారిశ్రామికవేత్తల్లో కొంత ఆందోళన నెలకొందని, అయితే రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఆ భయాలను తొలగిపోవటమే కాకుండా ప్రస్తుతం ఉత్పత్తి కూడా పెరిగిందన్నారు. ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. బెంగళూరులో ట్రాఫిక్ అధికంగా ఉండడంతో పాటు పబ్ కల్చర్, వినోద కార్యకలాపాలు ఎక్కువగా ఉండడం మూలంగా పలు కంపెనీలు హైదరాబాద్‌కు వస్తున్నాయని ఆయన చెప్పారు. అనంతరం కార్వీ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ పార్థసారథి మాట్లాడుతూ..విశాఖపట్నం కంటే హైదరాబాద్‌లోనే పెట్టుబడులు పెట్టేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారన్నారు. బెంగళూరు కంటే హైదరాబాద్ ఎంతో బెటరనీ, ఇక్కడ ట్రాఫిక్ సమస్య తక్కువనీ, మంచి వాతావరణం ఉండడం సానుకూల అంశాలని చెప్పారు. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ రజత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పరిశ్రమలకు పక్షం రోజుల్లోనే అన్ని అనుమతులు ఇచ్చి పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో సహకరిస్తుందన్నారు. అంతేకాకుండా పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేస్తూ మూడేళ్లలో కోటి 10 లక్షల మొక్కలను హైదరాబాద్‌లో నాటినట్లు చెప్పారు.

ఎయిర్‌టెల్ లాభంలో 39 శాతం తగ్గుదల

▸ డిసెంబరు త్రైమాసిక లాభం రూ.306 కోట్లు

▸ మధ్యంతర డివిడెండ్ ప్రకటన

Q3 ఆర్థిక ఫలితాలు

న్యూఢిల్లీ : ప్రైవేటు టెలికాం దిగ్గజం భారతి ఎయిర్‌టెల్ నికర లాభం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో 39 శాతం తగ్గి 306 కోట్ల రూపాయలకు చేరుకుంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ 504 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది. ప్రత్యర్థి కంపెనీల నుంచి పోటీ బాగా పెరుగుతున్న నేపథ్యంలో డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ మొత్తం రాబడి 13 శాతం తగ్గి 23,336 కోట్ల రూపాయల నుంచి 20,319 కోట్ల రూపాయలకు చేరుకుంది. దేశీయంగా ఇంటర్ కనెక్షన్ యూసేజ్ చార్జీలను తగ్గించడం, ఒక్కో వినియోగదారు నుంచి వచ్చే రాబడి తగ్గడం వల్ల మూడో త్రైమాసిక లాభాలపై ప్రభావం పడిందని భారతి ఎయిర్‌టెల్ ఎండి, సిఇఒ (భారత్, దక్షిణాసియా) గోపాల్ విట్టల్ తెలిపారు. 16 దేశాల్లో ఎయిర్‌టెల్ కస్టమర్ల సంఖ్య 39.42 కోట్లుగా ఉంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సర డిసెంబరు త్రైమాసికంతో పోల్చితే వినియోగదారుల సంఖ్య 9.2 శాతం మేర పెరిగింది. మూడో త్రైమాసికంలో భారత్‌లో రాబడులు 11.3 శాతం తగ్గి 15,294 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. కంపెనీ కన్సాలిడేటెడ్ రుణం 91,480 కోట్ల రూపాయల నుంచి 91,714 కోట్ల రూపాయలకు పెరిగింది.

ఒక్కో షేరుకు 2.84 రూపాయల మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది. గురువారం బిఎస్ఇలో భారతి ఎయిర్‌టెల్ షేరు ధర 1.17 శాతం తగ్గి 494.50 రూపాయల వద్ద ముగిసింది.

అల్ట్రాటెక్ సిమెంట్ లాభం రూ.457 కోట్లు

న్యూఢిల్లీ : ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి 456.66 కోట్ల రూపాయల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ 693.96 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం 6,858 కోట్ల రూపాయల నుంచి 8,175 కోట్ల రూపాయలకు పెరిగింది. మొత్తం వ్యయాలు 7,536.53 కోట్ల రూపాయలుగా ఉన్నట్టు కంపెనీ పేర్కొంది.

యస్ బ్యాంక్ లాభంలో 22 శాతం వృద్ధి

ముంబై : ప్రైవేటు రంగంలోని యస్ బ్యాంక్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో 6,492.56 కోట్ల రూపాయల ఆదాయంపై 1,076.87 కోట్ల రూపాయల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో 5,229.96 కోట్ల రూపాయల ఆదాయంపై 882.63 కోట్ల రూపాయల నికర లాభాన్ని బ్యాంకు ఆర్జించింది. సమీక్షా త్రైమాసిక లాభంలో 22 శాతం వృద్ధి నెలకొంది. బ్యాంకు స్థూల మొండి పద్దులు 0.85 శాతం నుంచి 1.72 శాతానికి, నికర ఎన్‌పిఎలు 0.29 శాతం నుంచి 0.93 శాతానికి పెరిగాయి.

అంతర్జాతీయ కేస్ కాంపిటీషన్‌లో ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్‌కు అవార్డులు


చేవెళ్ల : అంతర్జాతీయ కేస్ రైటింగ్‌లో ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ (ఐబిఎస్) రెండు ప్రతిష్ఠాత్మకమైన అవార్డులను గెలుచుకుందని ఐబిఎస్ డైరెక్టర్ సుధాకర్ రావు తెలిపారు. కెనడాకు చెందిన జాన్ మోల్సన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహించిన 37వ జాన్ మోల్సన్ ఎంబిఎ ఇంటర్నేషనల్ కేస్ రైటింగ్‌లో ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ రెండు అవార్డులను గెలుచుకుందని తెలిపారు. ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్‌కు చెందిన రీసెర్చ్ స్కాలర్స్, సైదా తాహిరా సాదియా, ఇందు పెరపులు.. వాల్‌మార్ట్ సంస్థపై రాసిన కేస్ పోటీల్లో ఈ బహుమతులు గెలుచుకున్నారని చెప్పారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

▸ జపాన్ పారిశ్రామికవేత్తలతో మంత్రి కెటిఆర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): జపాన్ పర్యటనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు బృందం రెండో రోజు పలువురు పెట్టుబడిదారులు, జపాన్‌లోని షిజుఒక రాష్ట్ర పాలనాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే సుజుకీ మోటార్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒసాము సుజుకీతో భేటీ అయ్యారు. ఆటోమొబైల్ రంగాన్ని తెలంగాణ రాష్ట్రం అత్యంత ప్రాధాన్యతా రంగంగా పరిగణిస్తోందని, రాష్ట్రంలో ఈ రంగంలో ఉన్న పెట్టుబడులను ఈ సందర్భంగా ఒసాము సుజుకీకి ఆయన వివరించారు. అనంతరం షిజుఒకలో ఉన్న సుజుకీ మ్యూజియాన్ని మంత్రి బృందం సందర్శించింది. తర్వాత మంత్రి బృందం షిజుఒక రాష్ట్ర గవర్నర్ కవాకాస్తు హైటాతో సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రం, షిజుఒక రాష్ట్రాల మధ్య సరస్పర సహకారం, వ్యాపారానుబంధం గురించి చర్చించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు షిజుఒక రాష్ట్ర గవర్నర్, ప్రభుత్వ ప్రతినిధులను అహ్వానించారు. షిజుఒక బ్యాంకు ప్రతినిధులతో సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలోని బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల్లో ఉన్న అవకాశాలను మంత్రి వారికి వివరించారు. ఈ రెండు రంగాల్లోని ప్రపంచ స్థాయి కంపెనీలు ఇప్పటికే హైదరాబాద్ నగరంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, ఈ రంగంలో సేవలందించేందుకు అవసరమైన నిపుణులు అందుబాటులో ఉన్నారని వివరించారు. కాగా సకురాయి లిమిటెడ్, స్టాన్లీ ఎలక్ట్రిక్ , ఎఎస్ టిఐ కంపెనీలకు చెందిన ప్రతినిధులతో సమావేశం అయ్యారు. అటోమెటివ్ భాగాలను తెలంగాణలో తయారు చేసేందుకు ముందుకురావాలని ఎఎస్ టిఐ కంపెనీని మంత్రి కోరారు.

ఇన్వెస్టర్లకు కాసుల పంట



▸ కంపెనీల అదనపు డివిడెండ్లు రూ.34,000 కోట్లు

ముంబై : స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ అయిన 92 భారీ కార్పొరేట్ సంస్థలు వాటాదారులకు భారీ ఎత్తున డివిడెండ్ల రూపంలో కనకవర్షం కురిపించనున్నాయి. ఆ కంపెనీల వద్ద భారీ నగదు నిల్వలున్నందు వల్ల అవి వాటాదారులకు నగదు రూపంలో నజరానా అందించనున్నట్టు సంస్థాగత ఇన్వెస్టర్ల సలహా సర్వీసుల సంస్థ (ఐఐఎఎస్) అధ్యయనంలో తేలింది. అవి ఇన్వెస్టర్లకు డివిడెండ్ల రూపంలో అదనంగా 34 వేల కోట్ల రూపాయల వరకు చెల్లించే ఆస్కారం ఉన్నట్లు ఆ సంస్థ తన నివేదికలో తెలిపింది. బిఎస్ఇ 500లో లిస్టింగ్ అయిన సంస్థలపై నిర్వహించిన విశ్లేషణ ప్రకారం ఈ 92 సంస్థలు 2016-17 ఆర్థిక సంవత్సరానికి 40,700 కోట్ల రూపాయల డివిడెండును ఇప్పటికే చెల్లించాయి. 2017 మార్చి 31 నాటికి వాటి వద్ద 1.85 లక్షల కోట్ల రూపాయల నగదు నిల్వలున్నాయని, అందులో 33,900 కోట్ల రూపాయలు అవి ఇన్వెస్టర్లకు అదనపు డివిడెండుగా చెల్లించవచ్చని ఆ నివేదిక అంచనా వేసింది. అదనపు డివిడెండ్లు, బై బ్యాక్‌ల రూపంలో కార్పొరేట్ కంపెనీలు ఇన్వెస్టర్లకు తమ వద్ద ఉన్న నగదు నిల్వల్లో కొంత మొత్తాన్ని రివార్డుగా అందించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ నివేదిక వెలువడడం విశేషం.

ఈ 92 కంపెనీల్లో టాప్ 5 కంపెనీలే అంచనా వేస్తున్న మొత్తంలో సగం చెల్లించగల సామర్థ్యం కలిగి ఉన్నాయని పేర్కొంది. భారీ డివిడెండ్లు చెల్లించగల సామర్థ్యం ఉన్నట్టుగా అంచనా వేసిన కంపెనీల్లో టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఆటో, ఇంద్రప్రస్థ గ్యాస్, జిఎస్‌కె కన్స్యూమర్ హెల్త్‌కేర్, జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్, నెస్లె ఇండియా ఉన్నాయి. ఇవి కాకుండా ఎంఆర్ఎఫ్, 3ఎం ఇండియా, ఐఎస్‌జిఇసి హెవీ ఇంజనీరింగ్, హనీవెల్ ఆటోమేషన్ ఇండియా, బాష్ కంపెనీలు ఒక్కో షేరుపై 100 రూపాయలు, మరో ఏడు సంస్థలు 50 నుంచి 100 రూపాయల మధ్యన డివిడెండు చెల్లించగల సామర్థ్యం కలిగి ఉన్నట్టు పేర్కొంది.

ఫిబ్రవరి 22 నుంచి హైదరాబాద్‌లో బయో ఏషియా

హైదరాబాద్ : ఫార్మా, హెల్త్‌కేర్, బయోటెక్నాలజీ రంగానికి సంబంధించిన కీలకమైన అంతర్జాతీయ సదస్సు బయో ఏషియా 2018 వచ్చే నెల 22 నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏటా గత పదిహేనేళ్లుగా ఈ సదస్సును నిర్వహిస్తున్నది. ఈసారి సదస్సుకు దాదాపు 55 దేశాల నుంచి 1500 మంది ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. ఈ సదస్సుకు ఐర్లాండ్, నెదర్లాండ్స్, సౌత్ ఆఫ్రికా అంతర్జాతీయ భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి. గుజరాత్, అసోం, రాజస్తాన్ దేశీయ భాగస్వాములుగా ఉంటాయి. హైదరాబాద్ గత కొద్ది ఏళ్లలో ఫార్మా, లైఫ్ సైన్సెస్‌కు సంబంధించి అతి పెద్ద హబ్‌గా అవతరించిందని తెలంగాణ ఐటి శాఖ మంత్రి కెటి రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జినోమ్ వ్యాలీ ప్రపంచంలోనే ఒక పద్ధతి ప్రకారం అభివృద్ధి చెందిన అతిపెద్ద ఆర్‌అండ్‌డి, క్లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రంగా జినోమ్ వ్యాలీ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నదని ఆయన అన్నారు.

వ్యవసాయానికి ఉద్దీపన కావాలి

▸ దీంతో ఫెర్టిలైజర్ కంపెనీలకు మేలు

▸ ఇక్రా నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ : అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్న వ్యవసాయ రంగానికి వచ్చే బడ్జెట్‌లో ఉద్దీపన ఇవ్వాల్సిన అవసరం ఉందని ఇక్రా పేర్కొంది. ఇందుకుగాను ప్రభుత్వం పలు విధానపరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. వ్యవసాయ రంగానికి ఉద్దీపన అందించడం వల్ల రసాయనిక ఎరువుల కంపెనీలకు కూడా ప్రయోజనం కలుగుతుందని అంటోంది. వ్యవసాయ ఉద్దీపనలో భాగంగా నీటిపారుదల, పంట బీమా, అగ్రికల్చర్ క్రెడిట్‌ను అందించాలని, వీటి ఫలితంగా రసాయనిక ఎరువుల కంపెనీలకు లబ్ధి జరుగుతుందని పేర్కొంది. ఫెర్టిలైజర్ రంగంపై నియంత్రణలు చాలా అధికంగా ఉన్నాయని, ఫలితంగా వాటి వ్యాపారంపై ప్రభావం పడుతోందని తెలిపింది. రసాయనిక ఎరువులపై ప్రభుత్వం అందించే సబ్సిడీ సకాలంలో పరిశ్రమలకు చేరడం లేదని, ఫలితంగా ఆయా కంపెనీలు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొంది. నగదు బదిలీని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని, దీని వల్ల రైతులు రసాయనిక ఎరువులు కొనుగోలు చేసిన వారంలోనే సబ్సిడీ మొత్తాన్ని కంపెనీలకు చెల్లించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపింది. బకాయి ఉన్న సబ్సిడీ మొత్తాన్ని ఏకమొత్తంగా చెల్లించడంతోపాటు సబ్సిడీలకు అవసరమైన సొమ్మును ప్రభుత్వం కేటాయించడం పరిశ్రమకు ఎంతో ముఖ్యమైన అంశాలని ఇక్రా పేర్కొంది. జిఎస్‌టి విధానాన్ని మరింత సులభతరం చేయాలని రిటైలర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అంతేకాకుండా ఈ రంగానికి పరిశ్రమ హోదా కట్టబెట్టాలని, దీని ద్వారా సులభంగా రుణాలను పొందడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి అవకాశం ఉంటుందని ఈ పరిశ్రమవర్గాలు అంటున్నాయి. మల్టీ బ్రాండ్ రిటైల్ ట్రేడ్‌కు సంబంధించిన ఎఫ్‌డిఐ నిబంధనలను సడలించాలని, వేర్‌హౌజింగ్, కోల్డ్ చెయిన్ స్టోరేజీ కేంద్రాలను ఏర్పాటు చేసే వారికి ప్రోత్సాహకాలను కల్పించాలని రిటైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (రాయ్) కోరుతోంది.

మొదటిసారి ఇళ్లు కొనేవారికి రాయితీలివ్వాలి

దేశీయంగా గృహాలకు గిరాకీ తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో మొదటిసారి ఇళ్లు కొనుగోలు చేసే వారికి అదనంగా పన్ను ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రాపర్టీ కన్సల్టింగ్ సంస్థ జెఎల్‌ఎల్ ఇండియా సూచిస్తోంది. వచ్చే బడ్జెట్‌లో ఈ పన్ను రాయితీని రెండింతలు పెంచి లక్ష రూపాయలకు చేర్చాలని పేర్కొంది. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్స్)లపై స్టాంప్ డ్యూటీ మినహాయింపు కల్పించేలా రాష్ట్రాలను ఆదేశించాలని కోరింది.

హైదరాబాద్‌లో వైఎల్‌జి సెలూన్లు

వచ్చే ఏడాది విజయవాడకు విస్తరణ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఆర్ అండ్ ఆర్ సెలూన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన వైఎల్‌జి తన వ్యాపారాన్ని హైదరాబాద్‌కు విస్తరించింది. ఈ సెలూన్ల ద్వారా అధునాతన సౌందర్య, హెయిర్ ట్రెండ్స్‌ను ఇక్కడి ప్రజలకు ముఖ్యంగా మహిళలకు అందిస్తామని కంపెనీ వ్యవస్థాపకుడు, సిఇఒ రాహుల్ బాలచంద్ర చెప్పారు. నగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్ ప్రాంతాల్లో కంపెనీ ఈ సెలూన్లు ఏర్పాటు చేసింది. 'ప్రస్తుతం హైదరాబాద్‌లో 800 నుంచి 1,000 సెలూన్లు ఏటా రూ.250 కోట్ల నుంచి రూ.300 కోట్ల వ్యాపారం చేస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే రెండేళ్లలో నగరంలో 30 వరకు వైఎల్‌జి సెలూన్లు ఏర్పాటు చేస్తాం' అని ఆయన అన్నారు. ఇప్పటికే బెంగళూరులో 45, చెన్నైలో 10 సెలూన్లను కంపెనీ నిర్వహిస్తోంది. ఈ రంగంలో ఉన్న వ్యాపార అవకాశాల్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే మూడేళ్లలో దేశంలోని ప్రధాన నగరాల్లో ముఖ్యంగా మెట్రో నగరాల్లో కొత్తగా 100 వైఎల్‌జి సెలూన్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. 'మెట్రో నగరాలతో పాటు దక్షిణ భారత నగరాలపై ప్రధానంగా దృష్టి పెట్టాం. ఇందులో భాగంగా వచ్చే సంవత్సరం విజయవాడకు విస్తరించబోతున్నాం' అని బాలచంద్ర చెప్పారు. ఒక్కో వైఎల్‌జి సెలూన్ ఏర్పాటుకు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఖర్చవుతుంది. కంపెనీ ఇప్పటికే మంచి లాభాల్లో ఉన్నందు వల్ల ఇందుకు అవసరమైన నిధుల్లో ఎక్కువ భాగాన్ని అంతర్గత వనరుల ద్వారానే సమీకరించుకోవచ్చని భావిస్తోంది. మిగతా సెలూన్ చెయిన్లకు భిన్నంగా తమ సెలూన్ల ద్వారా హోమ్ సర్వీసులు కూడా లభిస్తాయని బాలచంద్ర చెప్పారు. ఇంకా ఈ సెలూన్ల ద్వారా కొన్ని బ్యూటీ మరియు వెల్‌నెస్ ఉత్పత్తులనూ విక్రయించనున్నట్టు తెలిపారు. గత రెండేళ్లలో కంపెనీ టర్నోవర్ ఏటా 40 శాతం చొప్పున పెరుగుతోందని, ఈ ఆర్థిక సంవత్సరం టర్నోవర్ రూ.70 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందని ఆయన చెప్పారు. 2020 నాటికి ఇది రూ.170 కోట్ల నుంచి రూ.180 కోట్ల వరకు పెరుగుతుందని ఆయన తెలిపారు.

ఆవులకు అందాల పోటీలు



వనపర్తి జిల్లా పెబ్బేరులో శ్రీచౌడేశ్వరీ దేవి ఉత్సవాల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం వినూత్నంగా ఆవుల అందాల పోటీలను నిర్వహించారు. ఇందులో జూనియర్ విభాగంలో 6, సీనియర్ విభాగంలో 15 ఆవులు పోటీ పడ్డాయి. ఆవులకు ఉండే మచ్చలు, ఆరోగ్యం, రైతులు పెంచుతున్న తీరు, ఒంగోలు జాతి తదితరాలను గుర్తించి విజేతలను ఎంపిక చేశారు. సీనియర్ విభాగంలో మియ్యాపూర్‌కు చెందిన ఆవు మొదటి బహుమతిగా రూ.8వేలు, జూనియర్ విభాగంలో నాగసానిపల్లికి చెందిన ఆవు ప్రథమ బహుమతిగా రూ.6 వేలు గెలుచుకున్నాయి.

-పెబ్బేరు

కందుల టోకెన్ల కోసం బారులు తీరిన రైతులు



కందులను విక్రయించేందుకు టోకెన్ల కోసం నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో గురువారం రైతులు బారులు తీరారు. ఉదయం 6 గంటల నుంచి క్యూలైన్‌లో ఉన్నారు. స్థానిక వ్యవసాయాధికారులు ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

-కుభీర్ (నిర్మల్)



చేర్యాల వర్క్‌షాప్ గెస్ట్‌హౌజ్‌లో పులి మాస్క్ వేసుకున్న బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్

వావ్.. వాట్ ఏ వండర్ చేర్యాల పెయింటింగ్స్

చేర్యాల/సిద్దిపేట/కోహెడ, జనవరి 18: అంతర్జాతీయ ఖ్యాతి గడించిన చేర్యాల నకాశీ చిత్రకళలు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్‌ను మంత్రముగ్ధుడిని చేశాయి. చూడముచ్చట గొలిపే ఆకట్టుకునే నకాశీ పెయింటింగ్స్‌ను చూసి ఆయన వావ్.. వాట్ ఏ వండర్ అని కితాబునిచ్చారు. సిద్దిపేట జిల్లా పర్యటనలో భాగంగా గురువారం చేర్యాలలోని టూరిజం వర్క్‌షాప్ గెస్ట్‌హౌజ్‌ను ఆయన సందర్శించారు. తనకు నకాశీ పెయింటింగ్స్ అంటే ఎంతో ఇష్టమని, తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు చేర్యాలకు వచ్చానని చెప్పారు. కాగా, సిద్దిపేటలోని కలెక్టర్ కార్యాలయాన్ని, మెదక్ జిల్లా కోహెడ మండలంలోని శనిగరం ప్రాజెక్టును ఆయన సందర్శించి ఆధునికీకరణ పనులను పరిశీలించారు.

పోలీసుల కళ్లుగప్పి పరారైన భూకబ్జాదారుడు

- భూపత్రాలు తెస్తానని మస్కా
- ఉన్నతాధికారుల ఆగ్రహం.. విచారణకు ఆదేశం

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసులంతా 'సకల నేరస్థుల సమగ్ర సర్వే'లో బిజీగా ఉన్నారు. ఇంత బిజీలోనూ సైబరాబాద్ పోలీసులు ఓ భూకబ్జాదారుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు! భూపత్రాలు తెస్తానని ఇంటికి వెళ్లి గోడదూకి ఉడాయించిన కేటుగాడి కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వేట కొనసాగిస్తున్నారు. ఒక భూఆక్రమణ కేసులో మైలార్‌దేవ్‌పల్లి నివాసి జీవన్‌గౌడ్‌కి పోలీసులు నోటీసులు జారీ చేశారు. దీంతో పోలీసుస్టేషన్‌కు వచ్చిన జీవన్.. 'నాకెందుకు నోటీసులు జారీ చేశారు? ఆ భూమి నాదే. పత్రాలు కూడా నా దగ్గర ఉన్నాయి?" అని పోలీసులతో వాగ్వివాదానికి దిగాడు. ఫిర్యాదుదారుడి భూపత్రాలు సక్రమంగానే ఉన్నాయని.. తన వద్ద ఉన్న ఒరిజినల్ భూపత్రాలు తీసుకువస్తే చూస్తామని పోలీసులు జీవన్‌కు చెప్పారు. భూపత్రాలు ఇంటి వద్ద ఉన్నాయని చెప్పడంతో అతని వెంట కానిస్టేబుల్‌ను పంపించారు. ఇంట్లోకి వెళ్లిన జీవన్‌గౌడ్.. వెనకవైపున ఉన్న గోడెక్కి ఉడాయించాడు. 3రోజుల క్రితం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా బయటికి వచ్చింది. ఈ ఘటనపై సైబరాబాద్ సీపీ సందీప్ శాండిల్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై విచారణకు ఆదేశించారు.

ఏపీ అభివృద్ధికి అమ్మ ఆశీర్వదించాలి

- దుర్గమ్మను దర్శించుకున్న మహారాష్ట్ర గవర్నర్

విజయవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ముందుకు సాగుతోందని, మరిన్ని అవకాశాలతో, అన్ని విధాలా అనుకూలించేట్లుగా ఆశీర్వదించాలని దుర్గమ్మను కోరానని మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు అన్నారు. గురువారం ఆయన సతీసమేతంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధిలో ఏపీ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకుడు లక్ష్మీపతి రాజవిద్యాసాగర్‌రావు ఉన్నారు.

విపత్తులపై హెచ్చరించడం మా బాధ్యత

- ఇస్రో చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్

హైదరాబాద్ సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతికతతో భవిష్యత్తు పరిణామాలు, విపత్తుల గురించి ప్రజలకు ముందుగా తెలియజేయడమే తమ ముఖ్య ఉద్దేశమని ఇస్రో చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఇండియాటుడే ఆధ్వర్యంలో నిర్వహించిన 'రీచింగ్ ఫర్ ది మూన్- మార్స్ అండ్ స్టార్స్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇస్రో నిర్ణయించిన అంశాల ప్రకారమే తాము విధులు నిర్వహిస్తున్నామన్నారు.

యుద్ధంలా కాళేశ్వరం పనులు

దేశంలోనే ఇది పెద్ద రికార్డు: హరీశ్.. రంగనాయకసాగర్ పనుల పరిశీలన

- సొరంగంలోనే 4 గంటల పర్యటన



సిద్దిపేట జిల్లాలో నిర్మిస్తున్న రంగనాయక సాగర్ సొరంగం పనులను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణను సస్యశ్యామలం చేసే కాళేశ్వరం ప్రాజెక్టు పనులను యుద్ధంలా సాగిస్తున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న రంగనాయక సాగర్ రిజర్వాయర్‌కు సంబంధించిన సొరంగంలో మంత్రి 4 గంటలు గడిపారు. గుహలను పోలిన ఈ సొరంగంలో వాహనం ద్వారా, కాలి నడకన తిరుగుతూ ఇంజనీర్లకు సూచనలు చేశారు. టార్చిలైటు వెలుతురులో ప్రమాదకర ప్రదేశాల్లోకి సైతం వెళ్లి పనులను పరిశీలించారు. రాళ్లు, రప్పలు, బురద మయమైన సొరంగంలోని పలు ప్రాంతాల్లోనూ కాలినడకన పర్యటించారు. తన వెంట వచ్చిన ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, నాయకులకు మంత్రి హరీశ్ ఓ ఇంజనీర్‌లా వివరించారు. సొరంగంలో 70 మీటర్ల లోతులో జరుగుతున్న సర్జ్‌పూల్ పనులను ఓ యంత్రంపై నిలబడి వీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టును అధునాతన టెక్నాలజీతో నిర్మిస్తున్నామన్నారు. ఒక్కో సైటు వద్ద 2 వేల మంది కార్మికులు 3 షిఫ్టుల్లో పని చేస్తున్నారన్నారు. తెలంగాణ అంతటా నీళ్లందించే రికార్డుతో పాటు నిర్మాణపరంగానూ పెద్ద రికార్డు సాధిస్తున్నామని చెప్పారు. కాళేశ్వరం రూపంలో కొత్త చరిత్ర సృష్టిస్తున్నామన్నారు.

22 వేల కోట్లు ఖర్చు చేశాం: ఈఎన్‌సీ మురళీధర్

రూ.80వేల కోట్ల అంచనాతో తలపెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్ తెలిపారు. మేడిగడ్డ నుంచి మిడ్‌మానేరు వరకు జూలై నెలలో నీళ్లొస్తాయని, అక్కడి నుంచి రెండు పంపుల ద్వారా అనంతగిరి, రంగనాయకసాగర్‌కు నీళ్ల తరలిస్తామన్నారు. 90% సొరంగం పనులు పూర్తయ్యాయని, రిజర్వాయర్ల పనులే మిగిలి ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పురోభివృద్ధిని సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు రోజూ తెలుసుకుంటున్నారన్నారు. కేసీఆర్ కలను సాకారం చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.



గురువారం మధ్యాహ్నానికే మూసేసిన ఆస్పత్రి ప్రధాన ద్వారం

సీఎం ప్రారంభించారు.. అధికారులు వదిలేశారు

సాక్షాత్తూ ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభమైన ఆ ఆస్పత్రిలో కొద్ది గంటల్లోనే వైద్య సేవలు నిలిచిపోయాయి. 24 గంటలూ అందుబాటులో ఉండాల్సిన వైద్యులు మధ్యాహ్నానికే చేతులెత్తేస్తున్నారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో బుధవారం సీఎం కేసీఆర్ 50 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. స్థానిక పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యులతో పాటు అదనంగా మరో నలుగురినిడిప్యూటేషన్ పై నియమించారు. మొత్తం ఆరుగురు వైద్యులు విధుల్లో ఉండాల్సి ఉండగా గురువారం ఒక్క వైద్యురాలే ఆస్పత్రిలో ఉన్నారు. ఆమె కూడా మధ్యాహ్నం 12గంటల వరకు ఓపీ చూశారు. ఆ తర్వాత ఆమె వెళ్లిపోవడంతో ఎవరూ అందుబాటులో లేరు. దీంతో వైద్యం కోసం వచ్చిన రోగులు డాక్టర్లు లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

- ఆంధ్రజ్యోతి, మెదక్

ఎప్పుడైనా రెడీ

- ఎన్నికలకు సిద్ధమవుతున్న సహకార శాఖ
- ఫిబ్రవరి 4-24 మధ్య ఓటర్ల జాబితా ప్రక్రియ
- ప్రయోగాత్మకంగా జాబితాలో ఓటర్ల ఫొటోలు

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు 'సహకార' శాఖ సన్నద్ధమవుతోంది. ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం ఏ క్షణంలో నిర్ణయం తీసుకున్నప్పటికీ సన్నద్ధంగా ఉండాలన్న యోచనతో ముందుగానే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని నిర్ణయించింది. వాస్తవానికి ఇప్పటికిప్పుడు సహకార ఎన్నికలకు వెళ్లే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, పర్సన్ ఇన్‌చార్జిలను నియమించి, వారితోనే ఆరేడు నెలలు సహకార సంఘాలను నిర్వహించాలని తొలుత యోచించినట్లు సమాచారం. అయినప్పటికీ చివరి నిమిషంలో సీఎం కేసీఆర్ ఎన్నికలకే మొగ్గుచూపితే.. ముందస్తు ఏర్పాట్లు చేసుకుని ఉండటం మంచిదని సహకార శాఖాధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా వచ్చే నెల 4 నుంచి 24 మధ్య ఓటర్ల జాబితా సిద్ధం చేసే ప్రక్రియను నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్రంలో 906 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), 9 జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లు, ఒక రాష్ట్ర సహకార బ్యాంకు(టీఎస్‌కాబ్) ఉన్నాయి. వీటిల్లో మొత్తం 45 లక్షల వరకు ఓటర్లు(రైతులు) ఉన్నారు. ఇవి కాకుండా మరో 24వేల వరకు హ్యాండ్‌లూం, మత్స్యకారుల, కల్లుగీత కార్మికుల, తదితర పది కేటగిరీలకు చెందిన సహకార సంఘాలున్నాయి. అయితే పదవీ కాలాల దృష్ట్యా వీటిలో అన్ని సంఘాలకు ఒకేసారి ఎన్నికలు జరగబోవు. వీటిలో 200 వరకు మత్స్యకారుల సహకార సంఘాలకు మాత్రం పీఏసీఎస్‌లతో కలిపి ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. కాగా, పీఏసీఎస్‌లకు సంబంధించి సగం సంఘాల్లో ప్రస్తుతం ఉన్న పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 31తోనూ, రెండోదశ ఎన్నికలు జరిగిన సొసైటీల పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 3తోనూ ముగుస్తుంది. అప్పట్లో వివిధ కారణాలు, కేసులకు సంబంధించి హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో 13 సంఘాలకు వచ్చే ఏడాది ఫిబ్రవరి చివర్లో, మరికొన్నింటికి మార్చి మొదటి వారంలోనూ పదవీకాలం ముగియనుంది. కాగా పీఏసీఎస్‌ల ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలని నిర్ణయించిన సహకార సంఘాల ఉన్నతాధికారులు.. ఓటర్ల జాబితాలు సిద్ధం చేయడం, ఇతరత్రా ఏర్పాట్లు చేయడం వంటి అంశాల ప్రాతిపదికన జిల్లాల అధికారులతో గురువారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. మరోవైపు ఎన్నికల్లో అక్రమాలను నిరోధించేందుకు ఈ దఫా ఓటర్ల జాబితాల్లో ఓటర్ల ఫొటోలను కూడా ముద్రించాలని అధికారులు ఇప్పటికే నిర్ణయించారు.

పండుగకు వెళ్లి వస్తూ.. పరలోకాలకు

- రోడ్డుప్రమాదంలో అక్కాచెల్లెళ్లు మృతి
- పంతంగి వద్ద కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- పెద్దపల్లిలో అత్తాకోడళ్లను బలిగొన్న లారీ



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

చౌటుప్పల్ రూరల్/గోదావరిఖని/జన్నారం, జనవరి 18: సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి వెళ్లి సంతోషంగా గడిపిన ఓ కుటుంబానికి ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. తిరుగు ప్రయాణమైన ఆ కుటుంబాన్ని రాంగ్‌రూట్‌లో వచ్చిన ఓ ఆర్టీసీ బస్సు విషాదంలోకి నెట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కాచెల్లెళ్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన కట్టా పద్మజ(48), కట్టా లక్ష్మీప్రియాంక(25) అన్నాదమ్ముల పిల్లలు. పద్మజ నరసరావుపేటలో లెక్చరర్‌గా పనిచేస్తుంటే.. ఆమె పిల్లలు వాసంత(22), రామచందర్‌రెడ్డి(20) కర్ణాటకలో మెడిసిన్ చదువుతున్నారు. లక్ష్మీప్రియాంక మెడిసిన్ చదివి హైదరాబాద్‌లో ప్రాక్టీసు చేస్తోంది. సంక్రాంతికి లక్ష్మీప్రియాంక, పద్మజ పిల్లలు స్వగ్రామానికి వచ్చారు. తిరిగి గురువారం కారులో హైదరాబాద్‌కు బయల్దేరారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి వద్దకు చేరుకోగానే మిర్యాలగూడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాంగ్‌రూట్‌లో వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లింది. స్థానికులు కారులో ఉన్న వారిని కాపాడి ఆస్పత్రికి తరలించే క్రమంలో పద్మజ, లక్ష్మీప్రియాంక మృతిచెందారు. మరోవైపు, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ కేశోరాం రైల్వేగేటు వద్ద బుధవారం రాత్రి ఆటోను లారీ ఢీకొనడంతో కమాన్‌పూర్ మండలం సిద్ధిపల్లికి చెందిన అత్తాకోడళ్లు జాబు లక్ష్మి(55), జాబు నిర్మల(28) మృతిచెందారు. మంచిర్యాల జిల్లా దండేపల్లిలోని అటవీ ప్రాంతంలో ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతిచెందారు.

అడ్డగోలు మార్పులను అంగీకరించం

'పంచాయతీ'పై అఖిల పక్షాన్ని పిలవాల్సిందే.. మార్పులు 'మీ ఇంటి' వ్యవహారం కాదు

- సర్పంచులకు ప్రత్యక్ష ఎన్నికలే జరగాలి
- 23న గ్రామ గ్రామానికి వెళ్తున్నాం: ఉత్తమ్



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్. చిత్రంలో ఉత్తమ్, జానా, భట్టి తదితరులు

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): "చట్టంలో మార్పులు చేయడం ఎవరి ఇంటి వ్యవహారం కాదు. ఇది ప్రజలందరికీ సంబంధించింది. ఏమైనా మార్పులు చేయాలనుకుంటే అఖిల పక్షాన్ని పిలవాలి. మీడియాలో వస్తున్న వార్తలు నిజమా కాదా తేల్చాలి. మా అభిప్రాయాలు వినాలి" అని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో గురువారం టీపీసీసీ పదాధికారులు, డీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల చైర్మన్లతో 'పంచాయతీరాజ్ బిల్లు పూర్వాపరాల'పై జరిగిన సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు, సర్పంచ్ స్థానాలకు పరోక్ష ఎన్నికలు, ఆ ఎన్నికలు ముందస్తుగా జరగడం లాంటి అంశాలపై సీఎంవో కార్యాలయం నుంచి లీకులు వస్తున్నాయని.. వాటిలో వాస్తవమెంతో చర్చించడానికి, పార్టీ వైఖరిని నిర్ణయించడానికే తాము సమావేశమయ్యామని ఉత్తమ్ చెప్పారు. పంచాయతీరాజ్ చట్టంలో అడ్డగోలు మార్పులు తెస్తామంటే తాము అంగీకరించబోమన్నారు. ఇందుకోసం అఖిల పక్షాన్ని పిలవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి ప్రత్యక్ష ఎన్నికలే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అంతేగాక ముందస్తు ఎన్నికలకు వెళ్లడాన్ని కూడా కాంగ్రెస్ అంగీకరించదని స్పష్టం చేశారు. సర్పంచులు పూర్తి కాలం (ఆగస్టు 1, 2018 వరకు) అధికారంలో ఉండేలా చూడాలని, ముందస్తు ఎన్నికలకు వెళ్లడమంటే వారిని అవమానించినట్లేనని చెప్పారు. ఈ విషయాలపై తాము ప్రచార కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ నెల 23న రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రత్యక్ష ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. పరోక్ష ఎన్నికల వల్ల ధనస్వామ్యానికి ఆస్కారం ఏర్పడుతుందని, ప్రజలు తమకు ఇష్టమైన సర్పంచును ఎన్నుకునే అవకాశం కోల్పోతారని చెప్పారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులను కొనుగోలు చేయడం అలవాటైపోయిన సీఎం కేసీఆర్ తాజాగా సర్పంచులను కూడా మార్కెట్లో వస్తువుల్లా కొనేందుకు వేస్తున్న ఎత్తుగడే ఇదని ఆరోపించారు. ప్రత్యక్ష ఎన్నికల డిమాండ్‌తోనే ఈ నెల 27న అన్ని గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎమ్మార్వోలు.. ఎవరు అందుబాటులో ఉంటే వారికి వినతి పత్రం సమర్పిస్తామన్నారు. 30న ఉమ్మడి జిల్లా కలెక్టర్లకు వినతిపత్రం అందజేస్తామన్నారు. పంచాయతీ ఎన్నికలను బ్యాలెట్ ద్వారానే నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలకు ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులను కూడా విడుదల చేయలేదని, కేంద్రం నుంచి వచ్చిన నిధులను కూడా దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. 'మన ఊరు.. మన ప్రణాళిక', 'గ్రామజ్యోతి' కార్యక్రమాల ద్వారా కోట్లాది రూపాయల నిధులు ఆశ చూపి పైసా కూడా విదల్చలేదన్నారు. నాలుగేళ్లుగా నిధులు, అధికారాలు ఇవ్వకుండా పంచాయతీ చట్టానికి సవరణలు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కొత్తగా తండాలను పంచాయతీలుగా చేయాలనే నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని, అయితే ప్రతి కొత్త తండా పంచాయతీలకు రూ.50 లక్షలు విడుదల చేయాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఎల్పీ నేత జానారెడ్డి, మండలిలో విపక్ష నేత షబ్బీర్ అలీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, సీఎల్పీ ఉపనేత జీవన్ రెడ్డి, విప్ సంపత్ కుమార్, దానం నాగేందర్, మల్లు రవి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద తదితరులు పాల్గొన్నారు.

ఊరుకు కీడు సోకిందని.. వనభోజనాలకు..



ఇళ్లకు తాళాలు వేసిన దృశ్యం (ఇన్‌సెట్‌లో) వనభోజనాలు చేస్తున్న గ్రామస్థులు

లింగాలఘణపురం జనవరి 18: గ్రామానికి కీడు సోకడం వల్లనే ఒకరి తర్వాత మరొకరు వరుసగా మరణిస్తున్నారనే ఆందోళనతో ఊరి ప్రజలందరూ ఇళ్లకు తాళాలు వేసి వనభోజనాలకు వెళ్లిన ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నాగారంలో గురువారం జరిగింది. గ్రామంలో 2నెలలుగా వరుసగా 15మంది చనిపోయారు. దీంతో తమ గ్రామానికి కీడు సోకిందని, నివారణకు ఇళ్లను విడిచి కల్లాపీ కూడా చల్లకుండానే వనభోజనాలకు వెళ్లాలని గ్రామస్థులు నిర్ణయించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయబావుల వద్ద విందు నిర్వహించుకుని రాత్రి 7గంటలకు ఇళ్లకు చేరుకున్నారు. అయితే, ఉపాధ్యాయులు స్థానిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం సెలవు ప్రకటించడం గమనార్హం.



రక్తదానం చేస్తున్న భువనేశ్వరి

ఎన్టీఆర్ సేవా స్ఫూర్తి ఆదర్శం

- లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌లో నారా భువనేశ్వరి

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రక్తదానం మహాదానమని, ఎన్టీఆర్ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని ఎన్టీయార్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో ప్రారంభించిన లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌ని ఆమె స్వయంగా రక్తదానం చేసి ప్రారంభించారు. ముందుగా నారా బ్రాహ్మణి తదితరులతో కలిసి ఆమె ఎన్టీఆర్‌కి నివాళి అర్పించారు. అనంతరం భువనేశ్వరి మాట్లాడుతూ... బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌ని ఏపీలో 103 కేంద్రాల్లో, తెలంగాణలో 30, దేశంలోని ఇతర రాష్ట్రాల్లో 140 కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫేస్‌బుక్ కూడా ఈ కార్యక్రమానికి సహకరిస్తోందని తెలిపారు. లెజెండరీ బ్లడ్ డోనేషన్ డ్రైవ్‌కి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి భువనేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ నారా బ్రాహ్మణి మాట్లాడుతూ... ట్రస్ట్ సేవల్ని వివరించారు. భారతదేశంలో అవసరమున్న రక్తంలో 50% మాత్రమే అందుబాటులో ఉందని, మిగతా 50% లోటు ఉందన్నారు. దాన్ని పూరించేందుకు స్వచ్ఛంద రక్తదానం ఒక్కటే మార్గమని, అవకాశం ఉన్నవాళ్లంతా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ట్రస్ట్ సీఈవో విష్ణువర్ధన్, ఫేస్‌బుక్ ప్రతినిధి హేమ బూదరాజు మాట్లాడుతూ ఫేస్‌బుక్‌లో బ్లడ్ డొనేషన్ ఫీచర్ ద్వారా 60 లక్షల మంది స్వచ్ఛంద రక్తదాతలుగా నమోదు చేసుకున్నారని తెలిపారు.

కల్వకుర్తి కాల్వ ఎత్తును పెంచాలి

- సర్కారుకు నిపుణుల కమిటీ సూచన

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి ప్రధాన కాల్వ ఎత్తును పెంచాలని నిపుణుల కమిటీ ప్రభుత్వానికి ప్రత్యేక నివేదికను అందించనట్టు సమాచారం. కల్వకుర్తి ప్రాజెక్టు ద్వారా గతేడాది నుంచి నీటిని పంపింగ్ చేస్తున్నారు. అయితే 5మోటార్లను ఏర్పాటు చేసినా..రెండు, మూడు మోటార్ల ద్వారా మాత్రమే నీటి పంపింగ్ జరుగుతోంది. అన్నింటినీ వినియోగిస్తే.. కాల్వ సామర్థ్యం సరిపోవడం లేదు. దీంతో ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి పలు సూచనలు చేసింది. జొన్నలగడ్డ నుంచి గుడిపల్లి పంప్‌హౌస్ వరకు ఉన్న కాల్వను రెండు మీటర్ల మేర ఎత్తు పెంచాలని నిపుణులు సూచించారు. తద్వారా పంప్‌హౌస్‌కు నీటి లభ్యత పెరుగుతుందన్నారు. మిగతా కాల్వలో పూడిక, రాళ్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని పేర్కొంది. ఈ చర్యల వల్ల కాల్వ సామర్థ్యం 3,800 క్యూసెక్కుల నుంచి 4800 క్యూసెక్కులకు పెరుగుతుందని సూచించింది.



డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నీట్ ఉచితశిక్షణ ఎంపిక పరీక్షకు 652మంది హాజరు

- డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమి చైర్మన్ పారా లక్ష్మయ్య

వినుకొండ, జనవరి 18 : ఎన్టీఆర్ విద్యోన్నతి ప్లస్ ద్వారా 100 మందిని ఎంపిక చేసి నీట్ ఉచిత శిక్షణ ఇచ్చేందుకు గురువారం పరీక్ష నిర్వహించినట్టు డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమి చైర్మన్ డాక్టర్ పారా లక్ష్మయ్య తెలిపారు. వినుకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ లక్ష్మయ్య ఐఐటీ అండ్ నీట్ అకాడమి, పార్థ్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 100 మంది పేద విద్యార్థులకు ఉచిత నీట్ కోచింగ్ అందించేందుకు హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం, గుంటూరులలో డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించినట్టు, 652 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. మెరిట్ ప్రాతిపదికపై 100 మంది విద్యార్థులను వారం రోజుల లోపు ఎంపిక చేస్తామన్నారు.

తప్పుడు వార్తలకు ట్రంప్ అవార్డులు!



- తొలిస్థానంలో న్యూయార్క్ టైమ్స్ కథనం
- ట్విట్టర్‌లో జాబితా ప్రకటించిన అధ్యక్షుడు

వాషింగ్టన్, జనవరి 18: ఉత్తమ కథనాలు రాసిన పాత్రికేయులకు అవార్డులు ఇవ్వడం మనకు తెలుసు. కానీ, తప్పు(డు) వార్తలకు అవార్డులివ్వడం ఎప్పుడైనా చూశారా? అదీ ఓ దేశాధ్యక్షుడు వాటిని ప్రకటించడం ఎప్పుడైనా విన్నారా? అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదే పనిచేశారు! చెత్త వార్తలకు అవార్డులు ఇస్తానని ఏడాది కిందటే చెప్పిన ట్రంప్.. తాజాగా తనదైన శైలిలో 'ఫేక్ న్యూస్' అవార్డులను ప్రకటించారు. నిజాయతీ లేని, ముఖ్యంగా ట్రంప్‌కు సంబంధించి తప్పుడు సమాచారంతో ప్రచురితమైన వార్తా కథనాలకు ఈ అవార్డులను ట్విటర్ ద్వారా ప్రకటించారు. "2017వ సంవత్సరం చెత్త కవరేజీ, తప్పుడు వార్తలు, దారుణమైన పక్షపాతానికి వేదికగా నిలిచింది. అధ్యక్షుడు ట్రంప్‌కు సంబంధించి మీడియా చేసిన కవరేజీ 90% వ్యతిరేకమేనని పలు అధ్యయనాలు వెల్లడించాయి" అని జాబితాలో పేర్కొన్నారు. అయితే, ఫేక్ న్యూస్ అవార్డులను ప్రకటిస్తూనే అమెరికాలో ఎంతో మంది గొప్ప విలేకర్లు ఉన్నారని ట్రంప్ ప్రశంసించడం గమనార్హం.

The New York Times

ట్రంప్ అధ్యక్షుడైన తర్వాత అమెరికా ఆర్థిక వ్యవస్థ ఎన్నటికీ కోలుకోదంటూ 'ద న్యూయార్క్ టైమ్స్' ప్రచురించిన కథనానికి తొలిస్థానం ఇచ్చారు. (కానీ అది ఓపెన్ ఎడిటోరియల్‌లో రాసిన అంచనా మాత్రమే. పత్రిక విశ్లేషణ కాదు)

- ఓవల్ ఆఫీస్ నుంచి మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ విగ్రహాన్ని ట్రంప్ తొలగించారన్న టైమ్స్ కథనానికి నాలుగో స్థానం ఇచ్చారు. (ఈ వార్త రాసిన టైమ్ రిపోర్టర్ జేక్‌మిల్లర్ వెంటనే తన తప్పును సవరించుకుంటూ ఫాలోఅప్ కథనం రాశారు).
- ఫ్లోరిడాలో ట్రంప్ సభకు జనం రాలేదని.. ఖాళీగా ఉందని వాషింగ్టన్ పోస్ట్ రాసిన కథనానికి ఐదో స్థానం ఇచ్చారు. సభ ప్రారంభానికి కొన్ని గంటలముందే ఖాళీగా ఉన్న సీట్లను వాషింగ్టన్ పోస్ట్ విలేకరి డేవ్ వీగల్ ఫొటోతీసి, ఆ ఫొటోనే ప్రచురించారని ట్రంప్ వివరించారు (అయితే అది వాషింగ్టన పోస్ట్‌కు రాసిన కథనం కాదని, తన వ్యక్తిగత ట్విటర్ అకౌంట్‌లో పోస్ట్ చేశానని డేవ్ గతంలోనే వివరణ ఇచ్చారు).
- జపాన్ ప్రధానితో కలిసి ట్రంప్ ఒక ప్రత్యేక కార్యక్రమంలో చేపలకు ఎక్కువ ఆహారం వేసేశారంటూ సీఎన్ఎన్ ప్రచురించిన కథనానికి ఆరోస్థానం ఇచ్చారు. నిజానికి చేపలకు ఆహారం పెట్టడం ప్రారంభించింది జపాన్ ప్రధానేనని పేర్కొన్నారు. (ఆ విషయాన్ని సీఎన్ఎన్ కూడా తన కథనంలో పేర్కొంది).

వికీలీక్స్ నుంచి హ్యాక్ చేసిన డాక్యుమెంట్లకు ట్రంప్, ఆయన కుమారుడికి యాక్సెస్ ఉందన్న సీఎన్ఎన్ కథనానికి మూడో స్థానం ఇచ్చారు.

అధ్యక్ష ఎన్నికల సమయంలో రష్యాతో సంబంధాలు నెరపాలంటూ ట్రంప్ అమెరికా మాజీ జాతీయ భద్రతా సలహాదారు మైకేల్ ఫ్లిన్‌ను ఆదేశించారన్న ఏబీసీ న్యూస్ కథనానికి రెండో స్థానం ఇచ్చారు. (ఈ తప్పుడు కథనం వల్ల మార్కెట్లు పతనమయ్యాయని చెప్పారు).ఈ వార్త రాసిన విలేకరిని ఏబీసీ న్యూస్ నెలపాటు సస్పెండ్ చేసింది. దాన్ని ప్రచురించినందుకు క్షమాపణలు చెప్పింది.

- వైట్‌హౌస్‌కు కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా ఉన్న ఆంటోని ఒక రష్యన్‌తో సమావేశమయ్యారన్న సీఎన్ఎన్ వార్తకు ఏడో స్థానం ఇచ్చారు. (ఆ కథనంపై సీఎన్ఎన్ తీవ్రంగా స్పందించింది. ముగ్గురు రిపోర్టర్లు, ఎడిటర్లతో రాజీనామా చేయించింది).
- పోలండ్ ప్రథమ మహిళ అగాతా.. ట్రంప్‌తో కరచాలనం చేయలేదంటూ న్యూస్ వీక్ ప్రచురించిన కథనానికి ఎనిమిదో స్థానం ఇచ్చారు (ఆ వార్త ప్రచురించిన మూడుగంటల్లోనే న్యూస్‌వీక్ దాన్ని సవరించింది).
- ఎఫ్‌బీఐ మాజీ డైరెక్టర్ జేమ్స్ కామీ మీద సీఎన్ఎన్ రాసిన తప్పుడు వార్తకు తొమ్మిదో స్థానం ఇచ్చారు.
- ట్రంప్ యంత్రాంగం ఒక వాతావరణ నివేదికను దాచిపెట్టిందంటూ న్యూయార్క్‌టైమ్స్ రాసిన కథనానికి పదో స్థానం ఇచ్చారు.
- రష్యాతో ట్రంప్ సంబంధాలంటూ పత్రికలు చేసిన ప్రచారం అతిపెద్ద తప్పుడు ప్రచారం అని ట్రంప్ చివరగా పేర్కొన్నారు.

'ట్రంప్ అబద్ధాల'పై టీవీ సీరియల్!

లాస్ ఏంజెలిస్, జనవరి 18: 'ఫైర్ అండ్ ఫరీ: ఇన్‌సైడ్ ది ట్రంప్ వైట్‌హౌస్' పుస్తకం టీవీ సీరియల్‌గా రానున్నట్టు గురువారం అమెరికా మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ట్రంప్ మాట్లాడేవన్నీ అబద్ధాలే అంటూ మైకేల్ వోల్ఫ్ ఈ పుస్తకంలో పలు ఉదంతాలను ప్రచురించి సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఆ టీవీ సీరియల్‌కు వోల్ఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అని ది హాలీవుడ్ రిపోర్టర్, వెరైటీ మీడియాల్లో కథనాలు వచ్చాయి.

బ్యాంకుల ద్వారానే నోట్ల మార్పిడి?

హైదరాబాద్/ముంబై/అలీగఢ్, జనవరి 18: నోట్ల రద్దు ప్రకటించి 15 నెలలు గడిచిపోయాయి! పాత నోట్లను మార్చుకునే గడువు గత ఏడాది జూన్‌లోనే ముగిసింది!! అయినా.. దేశవ్యాప్తంగా కోట్లాది రూపాయల పాత నోట్లు బయటపడుతున్నాయి. కాన్పూర్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న దాదాపు రూ.100 కోట్లు ఇందుకు తాజా ఉదాహరణ. ఈ వ్యవహారానికి సూత్రధారి అయిన వ్యక్తికి.. నోట్ల మార్పిడి ఏజెంట్లు గత ఆరు నెలల కాలంలో రూ.15 కోట్ల దాకా మార్చి ఇచ్చినట్టు చెప్పారు! కానీ అదెలా సాధ్యం? ఏ మార్గంలో వాళ్లు పాత నోట్లను ఇంకా మార్చగలుగుతున్నారు? అంటే.. ఒక మార్గంలో మార్చడానికి అవకాశం ఉందని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆడిటింగ్ నిపుణుడు తెలిపారు. బ్యాంకుల ద్వారానే పాత నోట్లను ఇప్పటికీ మారుస్తూ ఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఆయన చెప్పినదాని ప్రకారం.. రద్దయిన నోట్ల మార్పిడికి సహకార బ్యాంకులకు కేంద్రం తొలుత అనుమతి ఇవ్వలేదు. అయినా, ఆ బ్యాంకులు వినియోగదారుల నుంచి పాత నోట్లను తీసుకున్నాయి. ఆ తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాలు, ప్రభుత్వం నుంచి వచ్చిన ఒత్తిడితో.. నోట్ల మార్పిడికి సహకార బ్యాంకులకు కూడా ఆర్బీఐ అనుమతించింది. దీంతో.. కొన్ని సహకార బ్యాంకులు తమ వద్ద జమ అయిన మొత్తాల కంటే అధిక మొత్తాలను డిపాజిట్లుగా స్వీకరించినట్టు రికార్డుల్లో నమోదు చేసి ఉంటాయి. ఆ మేరకు వాటికి కొత్త నోట్లను ఆర్బీఐ సరఫరా చేయాల్సిఉంటుంది. అదే ఇప్పుడు కొన్ని సహకార బ్యాంకులకు కలిసివస్తోందని అంచనా.

ముస్లిం సహకార బ్యాంక్ శాఖల్లో తనిఖీలు.. సీఈవోపై కేసు

రూ.40 లక్షల విలువైన పాత నోట్ల మార్పిడికి సంబంధించిన అక్రమాల కేసులో భాగంగా.. సీబీఐ గురువారం పుణెలోని ముస్లిం సహకార బ్యాంకు పరిపాలన కార్యాలయం సహా 32 చోట్ల తనిఖీలు చేసింది. బ్యాంకు సీఈవో హరూన్ సత్తార్ సయ్యద్, మరో 8 మంది ఉన్నతోద్యోగులపై సీబీఐ భారత శిక్షాస్మృతి, అవినీతి నిరోధక చట్టంలోని పలువ సెక్షన్ల ప్రకారం ప్రకారం నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ కేసులు నమోదు చేసింది. మరోవైపు రూ.50 లక్షల విలువ చేసే రద్దయిన పాతనోట్లను యూపీలోని అలీగఢ్‌లో ఒక హోటల్ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కూతుర్నో కాదో చెప్పండి!

- నా డీఎన్ఏను అమ్మతో సరిపోల్చండి
- సీసీఎంబీని సంప్రదిస్తున్న అమృత?
- వేడెక్కిన జయ వారసత్వం కేసు
- 25లోగా తమిళ సర్కారు వైఖరి చెప్పాలి

జయలలిత కూతురిగా చెప్పుకుంటున్న 'అమృత సారథి' రక్త సంబంధాన్ని నిరూపించటానికి స్వయంగా డీఎన్ఏ పరీక్షలకు సిద్ధమైంది. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ)ని సంప్రదిస్తోంది. అయితే తమకు ఇప్పటి దాకా ఎలాంటి నమూనాలూ పంపలేదని సీసీఎంబీ వర్గాలు వెల్లడించాయి. అమృత తాను జయలలిత కూతురినని నిరూపించుకొనేందుకు అవకాశం ఇవ్వాలంటూ గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు తన పరిధిలోది కాదని చెప్పింది. సుప్రీం సూచన మేరకు అమృత మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఫిబ్రవరి 2న కేసు విచారణకు రానుంది. ఈ కేసులో డీఎన్ఏ పరీక్షల మీద ఆధారపడాలని భావిస్తున్న అమృత ఒక డీఎన్ఏ నిపుణుడి ద్వారా సీసీఎంబీని సంప్రదించారు. సీసీఎంబీ అధికార ప్రతినిధి మాత్రం తమను ఇప్పటిదాకా ఎవరూ సంప్రదించలేదని, తమకు ఎటువంటి నమూనాలు రాలేదని చెప్పారు. సాధారణంగా ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన డీఎన్ఏ పరీక్షలను సీసీఎంబీ చేయదు. కోర్టులు ఆదేశిస్తే మాత్రమే చేపడుతుంది. "తల్లి, తండ్రి లేదా బంధువుల రక్తపు నమూనాల ద్వారా ఒక వ్యక్తికి




వారితో ఉన్న సంబంధాన్ని నిరూపించవచ్చు. ఈ కేసులో అమృత చెబుతున్న తల్లి, తండ్రి ఇద్దరూ లేరు. అందువల్ల వారి బంధువుల నుంచి తీసుకున్న రక్తపు నమూనాను పరీక్షించి- ఆమెకు జయలలితకు రక్త సంబంధం ఉందా? లేదా అని నిరూపించవచ్చు. వై క్రోమోజోమ్‌లను గుర్తించే వై-ఎస్టీఆర్ అనే పరీక్ష ద్వారా దీనిని గుర్తిస్తారు. ఈ పరీక్ష చేయగల సామర్థ్యం, పరికరాలు- సీసీఎంబీలో అందుబాటులో ఉన్నాయి" అని ఒక ప్రముఖ పరిశోధనాశాలలో పనిచేస్తున్న డీఎన్ఏ శాస్త్రవేత్త ఒకరు ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. "జయలలిత మరణించారు కాబట్టి ఆమె రక్త నమూనాలను సేకరించే అవకాశమే లేదు. ఆమె అస్తికల డీఎన్ఏను సేకరించడం కుదరకపోతే జయలలిత తోడబుట్టిన వారి రక్తపు నమూనాల ద్వారా డీఎన్ఏను సేకరించి, సరిపోల్చాల్సి ఉంటుంది" అని ఆ శాస్త్రవేత్త వివరించారు. ఈ కేసు చాలా సులభమైనదని, శాస్త్రరీత్యా నిరూపించటం అంత కష్టమైన విషయమేమీ కాదని ట్రూత్ ల్యాబ్స్ డైరక్టర్ గాంధీ అభిప్రాయపడ్డారు. కోర్టులు డీఎన్ఏ పరీక్షలను పరిగణనలోకి తీసుకుంటున్నాయని వివరించారు.

- స్పెషల్ డెస్క్

డీఎన్ఏ నమూనా

తాను 1980లో చెన్నైలోని మైలాపూర్‌లో ఉన్న జయలలిత నివాసంలో జన్మించానని, కొన్ని కారణాల వల్ల తనను జయలలిత సోదరి శైలజ కూతురిగా ప్రపంచానికి పరిచయం చేశారని అమృత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. జయలలిత మరణం తర్వాత- తన పిన్నిలు లలిత, రంజని ద్వారా తనకీ విషయం తెలిసిందని చెప్పారు. తాను జయలలిత కుమార్తెనని నిరూపించుకోవటానికి జయ సమాధి నుంచి డీఎన్ఏ నమూనాలను సేకరించమని ఆదేశించాలని కోర్టును కోరారు. గత నెల విచారణకు వచ్చినపుడు జయ సమాధి నుంచి డీఎన్ఏ నమూనాలు ఎందుకు సేకరించకూడదో చెప్పాలంటూ హైకోర్టు తమిళనాడు ప్రభుత్వానికి, చెన్నై మున్సిపల్ కార్పొరేషన్‌కు నోటీసులు జారీ చేసింది. అవి 25లోగా సమాధానం చెప్పాలి. ఈ నేపథ్యంలో అమృత డీఎన్ఏ నిపుణులను సంప్రదించినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి.

జయ మరణంపై విమర్శలొద్దు

- బంధువులకు శశికళ సూచన

చెన్నై, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జయలలిత మరణానికి సంబంధించి ఎవరూ నోరు విప్పరాదని, ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయొద్దని అన్నాడీఎంకే మాజీ ప్రధాన కార్యదర్శి వీకే శశికళ తన బంధువర్గాన్ని కోరారు. ఈమేరకు ఆమె వారికి లేఖ రాసినట్లు శశికళ తరఫు న్యాయవాదులు తెలిపారు. అందరూ అనుకుంటున్నట్లుగా 2016 డిసెంబరు 5వ తేదీన జయ మరణించలేదని, ఒకరోజు ముందుగానే ఆమె తుదిశ్వాస విడిచారంటూ శశికళ సోదరుడు దివాకరన్ బుధవారం ప్రకటించిన నేపథ్యంలో శశికళ ఈ సమాచారం పంపించారు. ఇకపై తమ బంధువులు ఎవరూ మీడియాతో మాట్లాడరాదని, ముఖ్యంగా జయ మరణంపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయవద్దని శశికళ ఆ లేఖలో ఆదేశించారు.

'అమ్మ' కణజాలాలు భద్రపరచండి

- అపోలోను కోరిన అమృత

చెన్నై, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జయలలిత కుమార్తెనంటూ కోర్టుకెక్కిన బెంగళూరు యువతి అమృత డీఎన్ఏ పరీక్షకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. ఇందులో భాగంగా జయలలిత కణజాలాలు భద్రం చేయాలంటూ చెన్నైలోని అపోలో ఆస్పత్రికి లేఖ రాశారు. జయ వారసురాలినని నిరూపించుకునేందుకు ఆమె కణజాలాలు అవసరమవుతాయని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. తానే జయ కుమార్తెనంటూ రాష్ట్రపతి, ప్రధానికి లేఖలు రాసిన అమృత.. ఆతర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దిగువ కోర్టుకు వెళ్లాలని సుప్రీంకోర్టు సూచించడంతో మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఎన్‌పీఎస్ ఉపసంహరణ చాన్స్ ఇక మూడేళ్లకే

- నిబంధనల సడలింపు
- విత్‌డ్రాయల్ పరిమితి 25%

న్యూఢిల్లీ, జనవరి 18: జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్) చందాదారులకు శుభవార్త. భవిష్యత్తు కోసం దాచుకోవడం ప్రారంభించిన సొమ్మును, ఎంత అత్యవసరమైనా సుదీర్ఘ కాలంపాటు ముట్టుకునే అవకాశం లేదే అని వారిక ఆందోళన చెందనక్కర్లేదు. పథకంలో చేరిన మూడేళ్ల తర్వాత కొన్ని నిర్దిష్ట అవసరాల కోసం ఎన్‌పీఎస్ నుంచి సొమ్ము తీసుకునేందుకు ఇకపై అనుమతిస్తారు. ఈనెల 10 నుంచి ఈ కొత్త నిబంధన అమల్లోకి వచ్చిందని పింఛను నిధి నియంత్రణ సంస్థ ప్రకటించింది. ఇప్పటిదాకా పదేళ్ల పథకంలో కొనసాగిన తర్వాత మాత్రమే పాక్షిక ఉపసంహరణకైనా అనుమతించేవారు. ఇలా పాక్షికంగా వాపసు తీసుకునేందుకు అనుమతించే గరిష్ఠ మొత్తం 25 శాతం మాత్రమే.

ఇవీ నిబంధనలు:

ఎన్‌పీఎస్ ఖాతాలు రెండు రకాలు. టైర్ 1 ఖాతాలో జమ చేసే సొమ్మును 60 ఏళ్ల వయసు వచ్చే వరకు ఉపసంహరించుకునే వీల్లేదు. టైర్ 2 ఖాతా తెరిచిన వారికి సేవింగ్స్ ఖాతా మాదిరి ఎప్పుడైనా ఉపసంహరణకు అనుమతిస్తారు. మొదటి తరహా ఖాతా విషయంలోనే ఉపసంహరణ నిబంధనలను ఇప్పుడు సవరించారు. చందాదారు తన పిల్లల ఉన్నత చదువులు, వివాహం కోసం సొమ్ము ఉపసంహరణ కోరవచ్చు. తాను లేక తన కుటుంబ సభ్యులు కేన్సర్, కిడ్నీ వైఫల్యం, బైపాస్ అవసరమయ్యే గుండె జబ్బు, పక్షవాతం వంటి తీవ్ర అనారోగ్య సమస్యల బారినపడ్డప్పుడూ 25 శాతం మేర విత్‌డ్రాయల్‌కు అనుమతిస్తారు. ఇల్లు, ఫ్లాటు కొనుగోలు చేసేటప్పుడు కూడా సొమ్ము ఉపసంహరణకు దరఖాస్తు చేయవచ్చు. అయితే అప్పటికే ఒక ఇల్లు లేదా ఫ్లాటు ఉన్న వారికి ఇలా సొమ్ము తీసుకునే అవకాశం ఉండదు.

ఆవిష్కర్తలదే భవిష్యత్తు

ఆవిష్కరణలపై దృష్టిసారించండి.. వ్యాపారవేత్తలకు నెతన్యాహు పిలుపు

ముంబై, జనవరి 18: ఆవిష్కరణలు చేసే వారిదే భవిష్యత్తు అని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నెతన్యాహు అన్నారు. ఆవిష్కరణలపై దృష్టి సారించాలని వ్యాపారవేత్తలకు సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌లో అయినా, ఇజ్రాయెల్‌లో అయినా వ్యాపారవేత్తలకు ఇదే అత్యంత కీలకమని చెప్పారు. భారత్‌లో పర్యటిస్తున్న నెతన్యాహు గురువారం ముంబైలో బిజీబిజీగా గడిపారు. తాజ్‌మహల్ ప్యాలస్ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన ముంబై ముట్టడి స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నారిమన్ హౌస్‌ను సందర్శించి, ఇజ్రాయెల్‌కే చెందిన 11 ఏళ్ల బాలుడు మోషేను కలిశారు. అంతకుముందు, తాజ్ హోటల్లోనే ఇరు దేశాల ప్రముఖ వ్యాపారవేత్తలతో అల్పాహార విందు ఆరగించారు. భారత్, ఇజ్రాయెల్ వాణిజ్య సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. భారత్, ఇజ్రాయెల్ భాగస్వామ్యం అద్భుతాలు సృష్టిస్తోందని చెప్పారు. "ఇజ్రాయెల్‌లో మేం భవిష్యత్తును గుప్పిట పడుతున్నాం. భారత్‌లో మీరూ అదే చేస్తున్నారు. ఇద్దరం కలిస్తే, మరింత వేగంగా, మరింత తొందరగా గమ్యాన్ని చేరుకోవచ్చు. ఆవిష్కరణ దానంతట అదే సాధ్యం కాదు. ఎవరో ఒకరు దానిని చేయాలి. దానిని ఎవరో పోషించాలి. ప్రోత్సహించాలి. మోదీ సర్కారైనా నా ప్రభుత్వమైనా చేయాల్సింది మీలోని పోటీతత్వాన్ని, ఆవిష్కరణలు చేసే శక్తిని ప్రోత్సహించడమే" అని వ్యాఖ్యానించారు. నిర్బంధ సైనిక శిక్షణ ద్వారా తమ దేశంలో ఆవిష్కరణలకు అవకాశం కలిగిందన్నారు. దాని ద్వారా ప్రజలకు వాస్తవ విద్యను అందించామన్నారు. మోదీకి, తనకు మధ్య గాఢమైన వ్యక్తిగత మిత్రత్వం



నారిమన్ హౌస్‌లో మోషేను ముద్దాడుతున్న నెతన్యాహు

ఉందన్నారు. భారత్‌తో ఇజ్రాయెల్ భాగస్వామ్యం స్వర్గంలోనే ఖరారైందని, ఇది స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, మానవత్వం పట్ల ప్రేమపై ఆధారపడిందని చెప్పారు. భారత్ పట్ల ఇక్కడి ప్రజలు, సంస్కృతిపై తనకు గాఢమైన, స్థిరమైన గౌరవం ఉందన్నారు. "భూమిపై మన రెండు సంస్కృతులు పురాతనమైనవి. రెండూ ప్రజాస్వామ్య దేశాలు. స్వేచ్ఛ, మానవత్వంపై ప్రేమను చాటుకుంటాం. మేం మీ నిజమైన భాగస్వాములం" అని అన్నారు. ఇజ్రాయెల్‌లో పెట్టుబడులు పెట్టాలని భారత వ్యాపారవేత్తలను కోరారు. భారత్‌లో మోదీ చేస్తున్నట్లుగానే ఇజ్రాయెల్‌లో వివిధ కోణాల్లో సంక్షోభంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను తాను గాడిలో పెట్టానని చెప్పారు. ప్రపంచంలో పోటీతత్వంలో ఇజ్రాయెల్‌ను టాప్ టెన్‌లో నిలపడమే తన లక్ష్యమన్నారు.



ప్రైవేటు సంస్థలకు సమాచారం ఇవ్వట్లేదా

- ప్రభుత్వానికి ఎందుకు ఇవ్వరు?
- ఆధార్ వ్యాజ్యాలపై సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ, జనవరి 18: ఆధార్ వ్యాజ్యాలపై గురువారం సుప్రీంకోర్టులో వాడివేడి వాదనలు జరిగాయి. ప్రైవేటు సంస్థలకు పౌరులు తమ వ్యక్తిగత సమాచారం ఇవ్వాలంటూ ప్రభుత్వం ఒత్తిడి చేయకూడదన్న వాదనతో సుప్రీంకోర్టు ఏకీభవించలేదు. బీమా పాలసీల కోసం, మొబైల్ కనెక్షన్ల కోసం ప్రజలే స్వచ్ఛందంగా ప్రైవేటు బీమా, మొబైల్ కంపెనీలకు వ్యక్తిగత సమాచారం ఇస్తున్న విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. ఆధార్, దానికి సంబంధించిన చట్టం రాజ్యాంగపరంగా చెల్లదని పేర్కొంటూ దాఖలైన పలు వ్యాజ్యాలపై సీజే దీపక్ మిశ్రా నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ముందు వాదనలు కొనసాగాయి. పిటిషనర్ల తరఫున న్యాయవాది శ్యాం దివాన్ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ధర్మాసనం "మీకు బీమా పాలసీ కావాలంటే ప్రైవేటు కంపెనీ వద్దకు వెళ్లి వివరాలిస్తారు. మొబైల్ కనెక్షన్ కావాలంటే ప్రైవేటు కంపెనీ వద్దకు వెళ్లి వ్యక్తిగత సమాచారం ఇస్తారు. ఆధార్ విషయంలో ప్రభుత్వం పలు రకాల అవకాశాలిచ్చింది. చిరునామాకు, ఇతర వివరాలకు సాక్ష్యాధారాలను ప్రభుత్వం అడిగితే సారీ అని అంటారు" అని వ్యాఖ్యానించింది. శ్యాం దివాన్ బదులిస్తూ.. "ఒక వ్యక్తి స్వచ్ఛందంగా తన వ్యక్తిగత సమాచారాన్ని ప్రైవేటు సంస్థలకు ఇవ్వడానికి ఇబ్బంది లేదు. ముక్కూమొహం తెలియని వాళ్లకు, ఒప్పంద సంబంధం లేని వారికి వ్యక్తిగత సమాచారం ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు" అని అన్నారు.

కన్నడ నటుడు కాశీనాథ్ కన్నుమూత



బెంగళూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కన్నడ నటుడు కాశీనాథ్(67) గుండెపోటుతో గురువారం తుదిశ్వాస విడిచారు. ఏడాది కాలంగా ఆయన క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. మూడు రోజుల నుంచి జ్వరం, శ్వాసకోస ఇబ్బందులతో బెంగళూరులోని ఆసుపత్రిలో చేరిన కాశీనాథ్‌కు హఠాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నాలుగు దశాబ్దాల సినీ ప్రస్థానంలో కాశీనాథ్ 44 సినిమాల్లో నటించారు. నటుడిగానేగాక దర్శకుడిగా, నిర్మాతగానూ వ్యవహరించారు. ఉడిపి జిల్లా కుందాపురలో మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన కాశీనాథ్ శాస్త్రవేత్త కావాలనుకుని సినీ నటుడయ్యారు. తెలుగులో వింతశోభనం, పొగరుబోతు పెళ్లాం, సుందరాంగుడు వంటి హాస్య, శృంగారభరిత సినిమాల ద్వారా ప్రాచుర్యం పొందారు. కాశీనాథ్‌కు భార్య చంద్రప్రభ, కుమారుడు అభిమన్యు, కుమార్తె అమృతవర్షిణి ఉన్నారు. కాశీనాథ్ మృతి పట్ల కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సంతాపం ప్రకటించారు.

నేరస్థుడిపై పోలీసుల కాల్పులు.. చిన్నారి మృతి

మథుర, జనవరి 18: ఓ నేరస్థుడు, పోలీసుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో చిన్నారి మృతిచెందాడు. యూపీలోని మథుర జిల్లా మోహన్‌పూర్ అడుకీ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పరారీలో ఉన్న ఓ నేరస్థుడిని పట్టుకునేందుకు నలుగురు పోలీసులతో కూడిన బృందం గ్రామంలో తనిఖీలు చేపట్టింది. నిందితుడు కాల్పులకు దిగడంతో.. ఎదురు కాల్పులు జరపాల్సి వచ్చిందని పోలీసులు తెలిపారు. పోలీసుల కాల్పుల్లో మాధవ్ (8) అనే బాలుడి తలలో తూటా దిగింది. బాధితుడిని ఆస్పత్రికని చెప్పి, సంరక్షకుడితో కలిసి బాలుడిని తీసుకెళ్లిన పోలీసులు ఇద్దరినీ మధ్యలోనే వదిలేశారు. ఆసుపత్రికి తీసుకురావడంలో ఆలస్యమవ్వడం వల్ల బాలుడు మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఆ నలుగురు పోలీసులనూ సస్పెండ్ చేసినట్టు అధికారులు తెలిపారు.

'పద్మావత్'కు సుప్రీం ఓకే!

న్యూఢిల్లీ, జనవరి 18 : వివాదాస్పద పద్మావత్ సినిమా విడుదలకు ఎట్టకేలకు చిక్కులు తొలగిపోయాయి. ఈనెల 25వ తేదీన దేశమంతటా విడుదల చేసేందుకు ఆ చిత్ర నిర్మాతలకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. 'మా రాష్ట్రాల్లో ప్రదర్శించనీయం' అంటూ గుజరాత్, రాజస్థాన్ ప్రభుత్వాలు విడుదల చేసిన ఉత్తర్వులు, ఆదేశాల అమలును అత్యున్నత న్యాయస్థానం నిలిపివేసింది. అంతేకాదు, ఈ సినిమా ప్రదర్శన సమయంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, గట్టి చర్యలు చేపట్టాల్సిందిగా గుజరాత్, రాజస్థాన్ సహా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలనూ ఆదేశించింది. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎమ్ ఖాన్‌వీల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం గురువారం ఈ కీలక ఆదేశాలను జారీచేసింది.

ద్రవిడ పతాకం కింద ఏకమవుదాం: కమల్

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వ వివక్షను ఎదురించాలంటే ద్రవిడ పతాకం కింద దక్షిణ భారతమంతా ఏకమై తమ గొంతుక వినిపించాలని యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ పిలుపునిచ్చారు. ఇప్పటికే తాను రాజకీయాల్లోకి వస్తున్నట్టు స్పష్టం చేసిన కమల్.. ఫిబ్రవరి 21న పార్టీ పేరును ప్రకటించి, రాష్ట్రవ్యాప్త పర్యటనను ప్రారంభిస్తానని వెల్లడించిన సంగతి తెలిసిందే. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం కలలుగన్న 'మంచి తమిళనాడు' కోసం ఆయన ఆలోచనలను ముందుకు తీసుకెళ్తానని చెప్పారు. రామనాథపురంలోని కలాం ఇంటి వద్ద నుంచే తన యాత్ర మొదలుపెడతానని తెలిపారు.

పాక్ కాల్పులు.. బీఎస్‌ఎఫ్ జవాను, బాలిక మృతి

జమ్మూ/చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సరిహద్దుల్లో పాకిస్థాన్ సైన్యం మళ్లీ కాల్పులకు తెగబడింది. అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ) వెంట ఉన్న గ్రామాలు, బోర్డర్ ఔట్ పోస్టు (బీవోపీ)లపై బుధవారం రాత్రి పాక్ రేంజర్లు కాల్పులు జరిపారు. జమ్మూ, సాంబా జిల్లాల్లో ఆర్ఎస్ పుర, ఆర్నియా, రామ్‌గఢ్ సెక్టార్ల పరిధిలో జరిపిన ఈ కాల్పుల్లో బీఎస్ఎఫ్ జవాను, మరో 17 ఏళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయారు. మరో బీఎస్ఎఫ్ జవాను, ఐదుగురు పౌరులకు గాయాలయ్యాయి. మృతి చెంది జవానును తమిళనాడుకు చెందిన సురేశ్ (42)గా గుర్తించారు.

బస్సులో మంటలు చెలరేగి 52 మంది మృతి

ఆస్తానా, జనవరి 18: కజకిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం చోటుచేసుకుంది. అక్టావు ప్రాంతంలో ప్రయాణిస్తున్న బస్సులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో 52 మంది ప్రయాణికులు మృతి చెందారు. బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఐదుగురు మాత్రమే ప్రాణాలతో బయటపడినట్లు కజకిస్థాన్ మంత్రి తెలిపారు.



నీటి లక్షణాన్ని చెప్పే కాగితం!

లండన్, జనవరి 18: మనం తాగే నీళ్లలో ఏమైనా విష రసాయనాలు ఉన్నాయా అని తెలుసుకోవడానికి సూక్ష్మ జీవుల ఆధారిత కాగితాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. నీటిలో ఆమ్ల గాఢతను తెలుసుకొనేందుకు తయారుచేసిన లిట్మస్ కాగితం ప్రేరణతో దీన్ని యూకేలోని వర్సిటీ ఆఫ్ బాత్ పరిశోధకులు తయారుచేశారు. ఈ కాగితంలో.. బ్యాక్టీరియా, కార్బన్ ఎలక్ట్రోడ్‌లతో అనుసంధానమై ఎలక్ట్రిక్ సిగ్నల్‌ను ఉత్పత్తి చేసే సూక్ష్మ జీవ ఇంధన కణం ఉంటుంది. దాన్ని నీటిలో ఉంచినపుడు ఎలక్ట్రిక్ సిగ్నల్ వేరేలా ఉత్పత్తి అయితే ఆ నీటిలో విష రసాయనాలున్నట్లు అర్థం.

సయీద్, సలావుద్దీన్‌పై చార్జిషీట్

- మరో 10 మంది వేర్పాటువాదులపైనా!

న్యూఢిల్లీ, జనవరి 18: లష్కరే తయబా చీఫ్ హాఫిజ్ సయీద్, హిజ్బుల్ ముజాహిదీన్ అధిపతి సయ్యద్ సలావుద్దీన్‌సహా 12మంది వేర్పాటువాదులపై ఎన్ఐఏ చార్జిషీట్ దాఖలు చేసింది. అందులో సయీద్, సలావుద్దీన్‌తోపాటు.. సయ్యద్ అలీ షా గిలానీ అల్లుడు అల్తాఫ్ అహ్మద్ షా అలియా అల్తాఫ్ ఫంతూష్, షాహిద్ ఉల్ ఇస్లాం, అజయ్ అక్బర్, నయీం ఖాన్, బషీర్ భట్ అలియాస్ పీర్ సైఫుల్లా, రాజా మెహ్రాజుద్దీన్ కల్వల్, ప్రముఖ వ్యాపారి జహూర్ అహ్మద్ షా వతాలీ, ఫొటో జర్నలిస్టు కమ్రాన్ యూసఫ్, ఫారూఖ్ అహ్మద్ దార్ అలియాస్ బిట్టా కరాటే, మహ్మద్ అక్బర్ ఖండేల పేర్లున్నాయి. ఇప్పటికే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఈ పదిమందినీ ఎన్ఐఏ కోర్టులో హాజరుపరిచింది. ప్రభుత్వంపై యుద్ధానికి కుట్ర పన్నడంతోపాటు జమ్మూకశ్మీరులో ఉగ్రవాద, విచ్ఛిన్నకర కార్యకలాపాలకు పాల్పడినట్లుగా వీరిపై అభియోగాలు నమోదు చేసింది. గురువారం ఇక్కడ ప్రత్యేక కోర్టులో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) మొత్తం 12,794 పేజీలతో కూడిన అతి భారీ చార్జిషీట్ దాఖలు చేసింది. జహూర్ అహ్మద్ షా వతాలీ అనే వ్యాపారి ద్వారా వేర్పాటువాదులకు పాకిస్థాన్ హై కమిషన్ డబ్బులు సరఫరా చేస్తోందని అందులో ఆరోపించింది. విదేశాల్లో బోగస్ కంపెనీలు పెట్టి.. అక్కడికి డబ్బు పంపి, ఆ డబ్బును జమ్మూకశ్మీర్‌లోని వేర్పాటువాద నేతలకు అందేలా చేస్తున్నట్టు ఆరోపించింది. కశ్మీరులో ఉగ్రవాదులకు నిధులు అందుతున్న తీరుపై లోతుగా దర్యాప్తును కొనసాగించేందుకు అనుమతించాల్సిందిగా ఎన్ఐఏ కోరింది. దర్యాప్తులో తాము పెద్ద సంఖ్యలో కీలక పత్రాలను, ఆధారాలను, సాంకేతికపరమైన సాక్ష్యాధారాలను సేకరించామని ఎన్ఐఏ అధికారులు తెలిపారు. 60 ప్రాంతాల్లో సోదాలు జరిపి విచారణలో కీలకంగా మారనున్న 950 డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నామని, సాక్ష్యమివ్వడానికి 300 మంది సాక్షులు సిద్ధంగా ఉన్నారని వారు చెప్పారు. కాగా పాకిస్థాన్‌లో హాఫిజ్ సయీద్ సాబ్‌పై ఎలాంటి కేసు నమోదు కానందున ఆయనపై చర్య తీసుకోబోమని దేశ ప్రధాని షాహిద్ ఖకన్ అబ్బాసీ అన్నారు.



హాఫీజ్ సయీద్



సయ్యద్ సలావుద్దీన్

న్యూజిలాండ్ X పాకిస్థాన్
ఐదో వన్డే
తెల్లవారుజామున
3.30 నుంచి
స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్ 1 లో...

అండర్-19 వరల్డ్‌కప్
భారత్ x జింబాబ్వే
ఉదయం 6.15 నుంచి
స్టార్‌స్పోర్ట్స్ 1 లో...

ఆస్ట్రేలియా X ఇంగ్లండ్
రెండో వన్డే
ఉదయం 8.50 నుంచి
సోనీ-ఈఎస్‌పీఎన్


కోహ్లీ


స్టీవ్ స్మిత్

కోహ్లీకి అవార్డుల పంట

- తొలిసారి 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా విరాట్
- వన్డేల్లో ఉత్తమ ఆటగాడు... టెస్టు, వన్డే జట్ల నాయకుడూ అతనే..
- ఉత్తమ టెస్టు క్రికెటర్‌గా స్మిత్ • ఐసీసీ వార్షిక అవార్డుల ప్రకటన

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వార్షిక అవార్డుల్లో భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లీ దుమ్మురేపాడు. ఐసీసీ తమ వార్షిక అవార్డులను గురువారం ప్రకటించింది. 2017లో విశేషంగా రాణించిన కోహ్లీ ఐసీసీ అవార్డుల్లో అత్యుత్తమంగా భావించే 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికయ్యాడు. కోహ్లీకి ఈ పురస్కారం దక్కడం ఇదే తొలిసారి. టెస్టు, వన్డే, టీ-20ల్లో అద్భుతంగా రాణించిన వారికి ఈ పురస్కారం కింద సర్ గ్యారీఫీల్డ్ సోబర్స్ పేరిట ట్రోఫీని అందిస్తారు. అంతేకాకుండా 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును కూడా తనే దక్కించుకున్నాడు. అలాగే ఐసీసీ వన్డే, టెస్టు జట్లకు నాయకుడిగా కోహ్లీ నిలవడం విశేషం. సెప్టెంబరు 21, 2016 నుంచి డిసెంబరు 2017 వరకు క్రికెటర్ల ఆటతీరును అంచనా వేసిన ఐసీసీ ఈ వార్షిక పురస్కారాలను ప్రకటించింది. ఈ మధ్య కాలంలో కోహ్లీ టెస్టుల్లో 77.80 సగటుతో 2,203 పరుగులు చేశాడు. ఇందులో 8 సెంచరీలున్నాయి. అలాగే వన్డేల్లో 82.63 సగటుతో 1,818 రన్స్, ఏడు సెంచరీలు సాధించాడు. పొట్టి ఫార్మాట్‌లో 299 పరుగులు చేశాడు. 'ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా తొలిసారి సోబర్స్ ట్రోఫీని దక్కించుకోవడంతో పాటు వన్డేల్లో రెండోసారి ఉత్తమ ఆటగాడిగా నిలిచినందుకు సంతోషంగా ఉంది. ఇది నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. దీన్ని వరుసగా రెండుసార్లు భారత ఆటగాళ్లే సాధించడం విశేషం' అని కోహ్లీ అన్నాడు. 2016లో అశ్విన్‌కు సోబర్స్ ట్రోఫీ దక్కింది. మరోవైపు టీ20ల్లో ఉత్తమ ప్రదర్శన అవార్డు లెగ్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌కు దక్కింది. గతేడాది ఇంగ్లండ్‌పై చాహల్ 25 పరుగులకు ఆరు వికెట్లు తీశాడు. ఇక టెస్టు, వన్డే జట్లలో మరో నలుగురు భారత ఆటగాళ్లకు కూడా చోటు దక్కింది. టెస్టు టీమ్‌లో పుజారా, అశ్విన్.. వన్డేలో రోహిత్, బుమ్రా ఉన్నారు.


చాహల్

ఐసీసీ వార్షిక అవార్డుల జాబితా

సర్ గ్యారీఫీల్డ్ సోబర్స్ ట్రోఫీ - విరాట్ కోహ్లీ
వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ - విరాట్ కోహ్లీ
టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ - స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా)
టీ20 పెర్‌ఫార్మెన్స్ ఆఫ్ ద ఇయర్ - యజ్వేంద్ర చాహల్
ఐసీసీ అసోసియేట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ - రషీద్ ఖాన్ (60 వికెట్లు-అఫ్ఘానిస్థాన్)
ఎమర్జింగ్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ - హసన్ అలీ (పాక్)
ఐసీసీ టెస్టు జట్టు: కోహ్లీ (కెప్టెన్), పుజారా, అశ్విన్ (భారత్), ఎల్గర్, డికాక్, రబాడ (దక్షిణాఫ్రికా), వార్నర్, స్మిత్, స్టార్క్ (ఆస్ట్రేలియా), స్టోక్స్, అండర్సన్ (ఇంగ్లండ్).
ఐసీసీ వన్డే జట్టు: కోహ్లీ (కెప్టెన్), రోహిత్, బుమ్రా (భారత్), వార్నర్ (ఆస్ట్రేలియా), బాబర్ ఆజమ్, హసన్ అలీ (పాకిస్థాన్), రషీద్ (అఫ్ఘానిస్థాన్), డివిల్లీర్స్, డికాక్ (దక్షిణాఫ్రికా), స్టోక్స్ (ఇంగ్లండ్), బౌల్ట్ (న్యూజిలాండ్).

900 పాయింట్లకు చేరుకున్న కోహ్లీ

దుబాయ్ : టెస్టు ఆటగాళ్లలో 900 పాయింట్లు సాధించిన రెండో భారత ఆటగాడిగా భారత కెప్టెన్ విరా ట్ కోహ్లీ ఘనత వహించాడు. 1979లో గవాస్కర్ 916 పాయింట్లకు చేరుకున్నాడు. అదే అతని కెరీర్‌లో అత్యుత్తమం. సౌతాఫ్రికాతో రెండో టెస్టులో సెంచరీ సాధించిన కోహ్లీ 900 పాయింట్ల మార్క్ చేరాడు. దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రావిడ్‌లవల్లకూడా సాధ్యం కాని ఈ మైలురాయిని కోహ్లీ తన 65వ టెస్టులో చేరుకున్నాడు. సచిన్, ద్రావిడ్‌లు అత్యధికంగా 898, 892 పాయింట్లు సాధించారు. ఈ ఘనతలో ఆస్ట్రేలియా లెజెండ్ డాన్ బ్రాడ్‌మన్ ఎవరికీ అందనంతగా 961 పాయింట్లతో టాప్‌లో నిలిచాడు. 900 పాయింట్ల క్లబ్‌లో స్టీవ్‌స్మిత్ (947), లెన్ హట్టన్ (945), రికీ పాంటింగ్ (942), జాక్ హాబ్స్ (942) ఉన్నారు.

టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో కోహ్లీ రెండో స్థానానికి చేరుకున్నాడు. స్మిత్ అగ్రస్థానంలో నిలవగా, జో రూట్, కేన్ విలియమ్సన్ తరువాతి స్థానాలలో కొనసాగుతున్నారు. టాప్-20లో భారత్‌కు చెందిన పుజారా (6), రాహుల్ (18) ఉన్నారు. బౌలింగ్ విభాగంలో దక్షిణాఫ్రికాకు చెందిన కగిసో రబాడ టాప్ ర్యాంకుకు చేరుకోగా భారత బౌలర్లలో అశ్విన్ (5), షమి (17) టాప్-20లో స్థానం దక్కించుకున్నారు. ఆల్‌రౌండర్ విభాగంలో తొలి ఐదు స్థానాలలో ఎలాంటి మార్పూ లేదు. బంగ్లాదేశ్‌కు చెందిన షకీబ్ అల్ హసన్ అగ్రస్థానంలో ఉండగా, జడేజా, అశ్విన్, స్టోక్స్, ఫిలాండర్ తరువాతి స్థానాలలో నిలిచారు.

బ్రూక్ సెంచరీ

- బంగ్లాపై ఇంగ్లండ్ గెలుపు

క్వీన్స్‌టౌన్ (న్యూజిలాండ్): కెప్టెన్ హ్యారీ బ్రూక్ (102 నాటౌట్) అజేయ శతకంతో అదరగొట్టడంతో అండర్-19 వరల్డ్‌కప్‌లో బంగ్లాదేశ్‌పై ఇంగ్లండ్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గ్రూప్-సిలో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లా 49.2 ఓవర్లలో 175 పరుగులకు ఆలౌటైంది. అఫీఫ్ హుస్సేన్ (63) హాఫ్ సెంచరీ చేశాడు. అనంతరం 176 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 29.3 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. గ్రూప్-సి మ్యాచ్‌లో నమీబియాపై కెనడా 4 వికెట్ల తేడాతో నెగ్గింది. నమీబియా నిర్దేశించిన 194 పరుగుల లక్ష్యాన్ని కెనడా 42 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి చేరుకుంది.

ముగిసిన భారత్ పోరు

- ప్రీ క్వార్టర్స్‌లో సాయిప్రణీత్ ఓటమి

సిబు (మలేసియా): మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆటగాళ్ల పోరాటం ముగిసింది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్స్‌లో హైదరాబాదీ సాయిప్రణీత్ 17-21, 8-21 తేడాతో ప్రపంచ చాంపియన్ విక్టర్ ఆక్సెల్సెన్ చేతిలో చిత్తయ్యాడు. 28 నిమిషాల్లోనే ముగిసిన ఈ రెండో రౌండ్ తొలి గేమ్‌లో కాస్త పోరాటం ప్రదర్శించినా ఆ తర్వాత గేమ్‌లో మాత్రం దారుణ ఆటతీరుతో సాయిప్రణీత్ టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఇక మహిళల డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో అశ్విని పొన్నప్ప-సిక్కిరెడ్డి జోడీ 15-21, 15-21 తేడాతో కమిల్లా రైటర్-క్రిస్టినా పెడర్సన్ చేతిలో పరాజయం పాలయింది.

ముగురుజ అవుట్


హలెప్

ఉదయం 5.30 నుంచి సోనీ సిక్స్‌లో...

- వావ్రింకా కూడా • మూడో రౌండ్‌లో ఫెడరర్, జొకో • భారత జోడీల శుభారంభం

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నాలుగో రోజు భానుడు బెంబేలెత్తించిన వేళ అటు పురుషులు, ఇటు మహిళల విభాగాల్లో సంచలనాలు చోటు చేసుకున్నాయి. మహిళల్లో మూడోసీడ్ గార్బిన్ ముగురుజ, 9వసీడ్ జొహానా కొంటా, 16వ సీడ్ వెస్నినా కంగుతిన్నారు. టాప్ సీడ్ హలెప్, ఆరోసీడ్ ప్లిస్కోవా, 26వసీడ్ రద్వాన్‌స్కా, అన్‌సీడెడ్ షరపోవా మూడోరౌండ్‌లోకి ప్రవేశించారు. పురుషుల్లో ఏడోసీడ్ గొఫిన్, 9వసీడ్ స్టాన్ వావ్రింకా రెండోరౌండ్‌తో తిరుగుముఖం పట్టారు. ఇక రెండో సీడ్ ఫెడరర్ సునాయాసంగా గెలుపొందగా, మాజీ చాంపియన్ జొకోవిచ్ నాలుగు సెట్లపాటు పోరాడాల్సి వచ్చింది. అలాగే ఐదోసీడ్ ఆస్ట్రియన్ డొమినిక్ థీమ్ పరాజయం అంచులనుంచి త్రుటిలో బయటపడి మూడోరౌండ్‌లో అడుగుపెట్టాడు.

సీ సూ వీ సంచలనం: తైవాన్‌కు చెందిన సీ సూ వీ పెద్దగా పేరున్న క్రీడాకారిణి కాదు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో గతంలో నాలుగోరౌండ్‌ను కూడా దాటలేదు. అలాంటి ఈసారి సీ పెను సంచలనమే సృష్టించింది. వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ఎక్కడో 88వ స్థానంలో ఉన్న ఆమె వరుస సెట్లలో 7-6 (1), 6-4 స్కోరుతో వింబుల్డన్ చాంపియన్ ముగురుజ (స్పెయిన్)ను చిత్తుచేసింది. 9వ సీడ్ కొంటా (బ్రిటన్) 4-6, 5-7 స్కోరుతో బెర్నార్డ పెరా (అమెరికా) చేతిలో ఓటమి చవిచూసింది. 16వ సీడ్ ఎలీనా వెస్నినా (రష్యా) 6-7 (4), 2-6 స్కోరుతో అన్‌సీడెడ్ నవోమి ఒసాకా (జపాన్) చేతిలో ఓడిపోయింది.

సిమోనా ముందంజ: టాప్‌సీడ్ సిమోనా హలెప్ (రుమేనియా) 6-2, 6-2 స్కోరుతో బౌచర్డ్‌పై అలవోకగా నెగ్గి మూడో రౌండ్‌కు చేరుకుంది. ఆరో సీడ్ ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) 6-1, 6-1 స్కోరుతో హడడ్ మేయా (బ్రెజిల్)పై, 26వసీడ్ రద్వాన్‌స్కా (పోలెండ్) 2-6, 7-5, 6-3 స్కోరుతో సురెంకో (ఉక్రెయిన్)పై నెగ్గి మూడో రౌండ్‌లో ప్రవేశించారు. అందాల భామ మరియా షరపోవా 6-1, 7-6 (4) స్కోరుతో సెవస్టోవా (లాత్వియా)పై రెండో రౌండ్‌లో అలవోకగా నెగ్గింది.

రోజర్ ఆడుతూ..పాడుతూ: డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్ 6-4, 6-4, 7-6 (4) స్కోరుతో జాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ)పై రెండోరౌండ్‌లో నెగ్గి ముందంజ వేశాడు. 14వ సీడ్ జొకోవిచ్ (సెర్బియా) తీవ్రమైన ఎండ ఫిట్‌నెస్‌కు పరీక్షపెట్టిన వేళ తొలి సెట్ చేజార్చుకున్నా పుంజుకొని 4-6, 6-3, 6-1, 6-3 స్కోరుతో గేల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)పై నెగ్గి మూడోరౌండ్‌కు చేరాడు. ఐదోసీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) 6-7 (8), 3-6, 6-3, 6-2, 6-3 స్కోరుతో డెనిస్ కుడ్లా (అమెరికా)పై రెండోరౌండ్ నెగ్గేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.



ముగురుజ

వావ్రింకాకు షాక్: 2014 విజేత స్టాన్ వావ్రింకా రెండోరౌండ్‌లో కంగుతిన్నాడు. అమెరికాకు చెందిన అన్‌సీడెడ్ సాండ్‌గ్రెన్ 6-2, 6-1, 6-4 స్కోరుతో వరుస సెట్లలో వావ్రింకాను షాక్‌కు గురిచేశాడు. మరో అన్‌సీడెడ్ బెనెట్యూ (ఫ్రాన్స్) 1-6, 7-6 (5), 6-1, 7-6 (4) స్కోరుతో ఏడోసీడ్ గొఫిన్ (బెల్జియం)ను కంగుతినిపించాడు.

భారత జోడీల ముందంజ: పురుషుల డబుల్స్‌లో వెటరన్ లియాండర్ పేస్, రోహన్ బోపన్న, దివిజ్ శరణ్ తమతమ జోడీలతో శుభారంభం చేశారు. పేస్-పురవ్ రాజా ద్వయం 6-2, 6-3 స్కోరుతో నొకొలోజ్-ఆండ్రియాస్ జోడీని చిత్తుచేసి రెండోరౌండ్‌లో ప్రవేశించింది. రోహన్ బోపన్న-రోజర్ వాసిలిన్ 6-2, 7-5 (5) స్కోరుతో పాస్పిల్-హారిసన్‌పై తొలిరౌండ్‌లో విజయం సాధించింది. దివిజ్ శరణ్-రాజీవ్ రామ్ 7-6 (5), 6-4 స్కోరుతో మారియస్, విక్టర్‌లపై నెగ్గి శుభారంభం చేసింది.

భానుడి భగభగలు

ఈ వేసవిలో ఆస్ట్రేలియాను ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఆటగాళ్లు ఐస్ నీళ్లను తలపై పదేపదే కుమ్మరించుకోవాల్సి వస్తోంది. భానుడి భగభగలకు ఆటగాళ్లు బెంబేలెత్తుతున్నారు. గురువారం ఉష్ణోగ్రత ఏకంగా 39 డిగ్రీలకు చేరడంతో మధ్యాహ్నం మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్లు విలవిల్లాడుతున్నారు. 'కోర్టులో చనిపోతానేమో అనిపించింది' అని జొకో చేతిలో ఓడిపోయిన గేల్ మోన్‌ఫిల్స్ అన్నాడంటే ఆటగాళ్లపై ఎండ ఎలాంటి ప్రభావం చూపుతోందో అర్థమవుతుంది. 2014లో ఎండలు భరించలేని స్థాయికి చేరడంతో నిర్వాహకులు 'హీట్ పాలసీ' అమలు చేశారు. అంటే..మ్యాచ్‌లను వాయిదా వేయడం అన్నమాట. ఈసారి 40 డిగ్రీలకు చేరుతున్నా..ఉక్కపోత, వడగాలి లేకపోవడంతో ఆ పాలసీవైపు నిర్వాహకులు మొగ్గుచూపడంలేదు.


మోన్‌ఫిల్స్

ముక్కోణపు సిరీస్ షెడ్యూల్ మార్పు

న్యూఢిల్లీ: భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్‌ల మధ్య జరిగే ముక్కోణపు సిరీస్ షెడ్యూల్‌లో మార్పు చేశారు. శ్రీలంక 70 ఏళ్ల స్వాతంత్ర వేడుకలను పురస్కరించుకుని జరిపే ఈ టోర్నీని ఇంతకుముందు ప్రకటించినట్టుగా మార్చి 8 నుంచి 20 వరకు కాకుండా 6 నుంచి 18 వరకు నిర్వహించనున్నారు. రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో ప్రతీ జట్టు మరో జట్టుతో రెండుసార్లు ఆడనుంది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు 18న కొలంబోలో జరిగే ఫైనల్లో తలపడతాయి.

బెల్జియం చేతిలో భారత్ ఓటమి



టౌరంగ: నాలుగు దేశాల టోర్నీలో భాగంగా గురువారం బ్లేక్‌పార్క్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత హాకీ జట్టు బెల్జియం చేతిలో పరాజయం పాలైంది. లభించిన నాలుగు పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచడంలో విఫలమైన భారత్ 0-2 స్కోరుతో ఓడింది. బెల్జియంకు సెబాస్టియన్ డొకీర్ (8వ నిమిషం), విక్టర్ వెగ్నెజ్ (34ని.) గోల్స్ సాధించిపెట్టారు. తొలి క్వార్టర్‌లో ఇరు జట్లు గోల్‌కోసం హోరాహోరీ తలపడ్డాయి. బెల్జియం ఫార్వర్డ్ ఆటగాళ్లు పదేపదే గోల్‌పోస్ట్‌పై దాడిచేసి భారత రక్షణ వలయాన్ని చికాకుపరిచారు. రెండో క్వార్టర్‌లో లభించిన రెండు అవకాశాలు కూడా వృథా అయ్యాయి. విరామ సమయానికి బెల్జియం 1-0తో ఆధిక్యంలో నిలిచింది. మూడో క్వార్టర్‌లో ఆరంభంలోనే ఇండియాకు పెనాల్టీకార్నర్ లభించినా బెల్జియం డిఫెండర్ దానిని వమ్ముచేశాడు. తరువాత భారత్‌కు లభించిన నాలుగో పెనాల్టీకార్నర్‌నుకూడా ప్రత్యర్థులు సమర్థంగా అడ్డుకున్నారు. నాలుగో క్వార్టర్‌లో ఇండియా గోల్‌కోసం చేసిన ప్రయత్నాలేవీ ఫలించకపోవడంతో ఓటమి తప్పలేదు. శనివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో భారత జట్టు న్యూజిలాండ్‌తో ఆడనుంది.

అక్టోబర్‌లో ప్రొ. కబడ్డీ ఆరో సీజన్

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ ఆరో సీజన్ ఈ ఏడాది అక్టోబర్ 19న ప్రారంభమవుతుందని నిర్వాహకులు వెల్లడించారు. అయిదో సీజన్‌లాగే ఆరో సీజన్ పోటీలనుకూడా 13 వారాలపాటు నిర్వహించనున్నారు. ఆరో సీజన్‌తోపాటు ఏడో సీజన్ ప్రారంభ తేదీనికూడా వెల్లడించారు. వచ్చే ఏడాది జూలై 19న ఆరంభమయ్యే ఏడో సీజన్‌ను కూడా 13 వారాలపాటు నిర్వహించనున్నారు. గత సీజన్‌లో పోటీపడే జట్లను 8 నుంచి 12కు పెంచి 138 మ్యాచ్‌లను నిర్వహించడం అభిమానులను అలరించింది. ఆ సీజన్‌లో ప్రదీప్ నర్వాల్ నేతృత్వంలోని పాట్నా పైరేట్స్ ఫైనల్లో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌ను ఓడించి వరుసగా మూడోసారి టైటిల్‌ను సాధించింది.

ఆనంద్, హారికకు డ్రా



విజ్కాన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నీలో ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్‌కు మరో డ్రా ఎదురైంది. గురువారం జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో చైనా గ్రాండ్ మాస్టర్ వీ యితో ఆనంద్ పాయింట్ పంచుకున్నాడు. తెల్లపావులతో ఆడిన ఆనంద్ 29 ఎత్తుల అనంతరం ప్రత్యర్థితో డ్రాకు అంగీకరించాడు. ఐదు గేమ్‌ల నుంచి మూడు డ్రాలు, రెండు విజయాలు సాధించిన ఆనంద్ మొత్తం 3.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇక ద్రోణవల్లి హారిక ఐదో రౌండ్ గేమ్‌ను డ్రా చేసుకుంది. తెల్లపావులతో ఆడిన హారిక 64 ఎత్తుల అనంతరం లూకాస్ వాన్ ఫోరీస్ట్‌తో పాయింట్ పంచుకుంది. ఐదు రౌండ్ల నుంచి 2 పాయింట్లు సాధించిన హారిక 11వ స్థానంలో ఉంది.

భారత పేస్ బౌలింగ్ బ్రహ్మాండం



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా పర్యటనలో భారత జట్టు నిరాశాపూరిత ప్రదర్శనతో ఇప్పటికే సిరీస్ కోల్పోయినా స్టార్ ఆటగాడు డివిల్లీర్స్ మాత్రం టీమిండియాకు ఊరటనిచ్చే ప్రయత్నం చేశాడు. కోహ్లీ సేన బౌలింగ్ తమను ఆశ్చర్యానికి గురిచేసిందని ప్రశంసించాడు. 'భారత జట్టు నిజంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా వారి పేస్ ఎటాక్ మమ్మల్ని ఆశ్చర్యపరిచింది. మేం ఊహించినదానికన్నా ఎక్కువ నైపుణ్యత వారిలో ఉంది' అని అన్నాడు. ఇక కొంత విరామం తర్వాత తిరిగి టెస్టు ఫార్మాట్‌లోకి అడుగుపెట్టి రాణించడం సంతోషాన్నిచ్చిందని అన్నాడు.



పోరాట స్ఫూర్తి కొరవడింది

(కృష్ణమాచారి శ్రీకాంత్)



రెండో టెస్టులో భారత ఓటమిని తీవ్రంగా పరిగణించాల్సిందే. సెకండ్ ఇన్నింగ్స్‌లో మన బ్యాట్స్‌మెన్ ప్రత్యర్థి బౌలర్లకు దాసోహమన్న తీరు చూస్తుంటే.. టీమిండియాలో పోరాట స్ఫూర్తే కొరవడిందనిపిస్తోంది. 287 పరుగుల లక్ష్యం అంత సులువు కాకపోయినా.. అసాధ్యమైతే కాదు. కానీ, సఫారీల ఓ మోస్తరు బౌలింగ్‌కే మన బ్యాటింగ్ కుప్పకూలడం దారుణం. పరిస్థితులకు తగ్గట్టుగా ఆడకపోవడం వల్లే ఈ పరాభవం ఎదురైంది. తొలి ఇన్నింగ్స్‌లో విరాట్ అసాధారణ పోరాటాన్ని ప్రదర్శించాడు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో పేలవంగా అవుట్ కావడం జట్టు ఆశలను కూల్చేసింది. పరువుకోసం పోరాడదామన్న స్పృహ కూడా మనోళ్లలో ఏకోశానా కనిపించలేదు. భారత బౌలర్లు కేప్‌టౌన్ తొలి ఇన్నింగ్స్‌లో కొన్ని పరుగులు ఇచ్చినా.. పరిస్థితులను వేగంగా ఆకళింపు చేసుకుని ఆతిథ్య బ్యాట్స్‌మెన్‌ను వణికించారు. టీమ్ మేనేజ్‌మెంట్.. వారి నుంచి ఇంత కంటే ఎక్కువ ఆశించక పోవచ్చు. మరోవైపు కోహ్లీ సేన పేలవ ఫీల్డింగ్‌తో అవకాశాలను జారవిడిచింది. ఈ ఓటమిని సర్దిచెప్పుకోవడానికి భారత్ వద్ద ఎటువంటి సాకులూ కనిపించడం లేదు. -(టీసీఎం)


సచిన్.. నిమ్మకాయలు కోసెన్ !

ముంబై: రిటైరయ్యాక సోషల్‌మీడియాలో ఎంతో చురుగ్గా ఉంటున్న సచిన్.. తన దైనందిన కార్యక్రమాల్లో కొన్నింటిని అప్పుడప్పుడూ అభిమానులతో పంచుకుంటూ వారిని ఉత్సాహపరుస్తున్నాడు. ఆ మధ్యన ఓసారి బ్రేక్‌ఫాస్ట్ తయారు చేసిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన సచిన్ ..తాజాగా ఓ ఫామ్‌హౌస్‌లో నిమ్మకాయలు కోస్తున్న మరో వీడియోను ఉంచాడు. షార్ట్, టీ షర్ట్ వేసుకున్న సచిన్..ఓ పొడవాటి కర్రతో చెట్టునుంచి నిమ్మకాయలు కోస్తుండగా అతడి ఫ్రెండ్ దానిని చిత్రీకరించిన వీడియో ఒకటి ఇప్పుడు సచిన్ అభిమానులను ఎంతో ఆకట్టుకుంటోంది. అయితే టెండూల్కర్ మామిడికాయ కోస్తున్నాడని అతడి ఫ్రెండ్ అన్నాడు. కానీ 'అది మామిడికాయ కాదు..నిమ్మకాయ' అని సచిన్ దాన్ని చూపించాడు.



పంజాబ్ గెలుపు

న్యూఢిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో పంజాబ్ రాయల్స్ మరో విజయాన్ని నమోదు చేయగా.. ఢిల్లీ సుల్తాన్స్ వరుసగా నాలుగో ఓటమిని చవిచూసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 6-1తో ఢిల్లీని చిత్తు చేసింది. పంజాబ్ రెజ్లర్లు జినో పెట్రియాష్‌విలి (125 కి), జితేందర్ (74 కి), ఇలియాస్ బెక్‌బులాతోవ్ (65 కి), గ్రిగర్‌జెవా అనస్టాసిజా (62 కి), పూజా దండా (57 కి), నిర్మలా దేవి (48 కి) తమ బౌట్లలో నెగ్గారు.


నిర్మలాదేవి (పంజాబ్-నలుపు)



ఆంధ్రజ్యోతి 63,54,000 రీడర్స్

ఐఆర్ఎస్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ, జనవరి 18: పాఠకాదరణలో 'ఆంధ్రజ్యోతి' దూసుకుపోతోంది. 'మా అక్షరం - మీ ఆయుధం' అనే నినాదంతో 2002 పునఃప్రారంభమైన 'ఆంధ్రజ్యోతి' పాఠకుల సంఖ్య ఇప్పుడు 63,54,000కు చేరుకుంది. మీడియా రిసెర్చ్ యూజర్స్ కౌన్సిల్ (ఎంఆర్‌యూసీ) నిర్వహించిన 'ఇండియన్ రీడర్‌షిప్ సర్వే (ఐఆర్ఎస్)-2017 ఫలితాలు గురువారం వెలువడ్డాయి. నాలుగేళ్ల విరామం తర్వాత... కొత్త విధి విధానాలు, 40 శాతం ఎక్కువ శాంపిల్‌తో ఈ సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 3.30 లక్షల మందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. గతంలో ఒక సంచికను ఎంత మంది పాఠకులు చదివే వారనే ప్రాతిపదికన పాఠకాదరణను గుర్తించేవారు. ఇప్పుడు... ఒక పత్రికను ముందురోజు, గత మూడు రోజుల్లో, వారంలో, గత నెలలో చదివారా? అనే వివరాలను రాబట్టారు. గత నాలుగేళ్లలో మొత్తంగా పత్రికలు చదివే వారి సంఖ్య 9 శాతం పెరిగినట్లు తేల్చారు. ఆంగ్ల పత్రికలు చదివే వారి సంఖ్య 10 శాతం పెరిగిందని గుర్తించారు. హిందీ పత్రికల రీడర్‌షిప్ ఏకంగా 45 శాతం పెరిగినట్లు సర్వే నివేదికలో పేర్కొన్నారు. అత్యధికంగా... ఒరియా పత్రికలు పాఠకాదరణను పెంచుకున్నాయి. ఇక్కడ దినపత్రికల పాఠకాదరణ ఏకంగా 83 శాతం పెరిగినట్లు తేల్చారు. ఎంఆర్‌యూసీ తరఫున నీల్సన్ ఇండియా సంస్థ ఈ సర్వేను నిర్వహించింది.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శిస్తున్న యూపీ సీఎం యోగీ

స్కూల్‌కు సెలవులు రావాలని బాలుడిని పొడిచింది!

- లఖ్‌నవ్ స్కూల్లో ఏడో తరగతి బాలిక దారుణం

లఖ్‌నవ్/న్యూఢిల్లీ, జనవరి 18: అచ్చంగా గుర్గావ్ రెయాన్ స్కూల్ నిందితుడి మాదిరిగానే ఆ 11 ఏళ్ల బాలికా ఆలోచించింది! తమ స్కూల్‌కు సెలవులు రావాలనే ఉద్దేశంతో ఒకటో తరగతి చదువుతున్న బాలుడిపై పదునైన ఆయుధంతో దాడికి పాల్పడింది. తీవ్ర గాయాలతో ప్రస్తుతం ఆ బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. యూపీ రాజధాని లఖ్‌నవ్‌లోని బ్రైట్‌ల్యాండ్ స్కూల్లో ఈ నెల 16న ఈ దారుణం చోటుచేసుకుంది. బాధితుడిని ఆరేళ్ల చిన్నారి రితిక్‌గా గుర్తించారు. ఎప్పటిలాగే ఆ రోజు స్కూల్‌కు వెళ్లిన రితిక్ మూత్రవిసర్జన కోసం టాయిలెట్‌కు వెళ్లాడు. అదే స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న బాలిక అక్కడ చాకులాంటి ఆయుధంతో రితిక్ ఛాతీ, పొట్ట భాగాల్లో పలుమార్లు పొడిచింది. రక్తమోడుతున్న బాలుడిని ఆస్పత్రికి తరలించారు. రితిక్‌కు ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు పాల్పడిన బాలికను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనను గుట్టుగా ఉంచేందుకు, సాక్ష్యాలను మాయం చేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై స్కూల్ ప్రిన్సిపాల్ రచిత్ మానస్‌ను అరెస్టు చేశారు. పాఠశాలకు సెలవులు రావాలనే ఉద్దేశంతోనే బాలిక ఈ చర్యకు పాల్పడిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించింది. వారంతా స్కూల్‌కు వచ్చి ఘటనపై స్కూల్ యాజమాన్యాన్ని నిలదీశారు. గత సెప్టెంబరులో గుర్గావ్‌లోని రెయాన్ స్కూల్లో చోటు చేసుకున్న దారుణాన్ని గుర్తుచేసుకున్నారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ పరామర్శించారు. ఆదివారం ఆస్పత్రికి వెళ్లిన ఆయన బాలుడి తల్లిదండ్రులను ఓదార్చారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ఢిల్లీ బడుల్లో సీసీటీవీలు

సెలవుల కోసం గుర్‌గావ్‌లో ఓ చిన్నారిని తోటి విద్యార్థి హతమార్చిన ఉదంతం.. బడుల్లో పసిమొగ్గలపై ఆకృత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో.. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీసీటీవీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఢిల్లీ సర్కారు నిర్ణయించింది. మూడు నెలల్లో పూర్తికానున్న ఈ ప్రాజెక్టులో భాగంగా ఒక యాప్‌ను రూపొందిస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే.. తరగతి గదుల్లో తమ పిల్లల తీరును తల్లిదండ్రులు మొబైల్ యాప్ ద్వారా లైవ్‌లో వీక్షించే సదుపాయం కల్పిస్తారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

పగుళ్లను పూడ్చేసుకునే కాంక్రీట్

కాంక్రీట్‌లోనే జీవ శిలీంధ్రాలు.. పగులు రాగానే మూసేస్తాయి

శరీరానికి దెబ్బతగిలినప్పుడు చికిత్స చేయించుకుంటే నయం అయిపోతుంది! ఒక్కోసారి అక్కడ గాయమైన ఆనవాళ్లు కూడా కనిపించవు! మానవ శరీరం పూర్వపు స్థితికి చేరుకోవడానికి శిలీంధ్రాలలో చైతన్యం కలిగేలా చేస్తారు వైద్యులు! ఈ విషయంలో సెల్ఫ్ హీలింగ్ (స్వీయ వైద్యం) పాత్ర ఎంతో కీలకం! వైజ్ఞానికంగా ఇదో అద్భుత ప్రక్రియ! ఈ విధానం నుంచే శాస్త్రవేత్తలకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది. భవనాల మరమ్మతుల విషయంలో కూడా ఇలా ఎందుకు చేయలేం? అని దృష్టి సారించారు. అంటే.. ఇళ్లకు పగుళ్లు (క్రాక్స్) వచ్చినప్పుడు స్వీయ మరమ్మతు చేసుకునే కాంక్రీట్‌ను అభివృద్ధి చేయడం. ఫలితంగా పగుళ్లు ఉన్న చోట్ల పాత కాంక్రీట్‌లో చిన్నపాటి కదలిక తీసుకొస్తే దానంతట అదే మూసుకుపోతుంది. భారీ వ్యయ ప్రయాసలకు తావుండదనేది శాస్త్రవేత్తల అభిప్రాయం.

ఇంతకీ ఎలా సాధ్యం?

భవనాలకు పగుళ్లు సర్వసాధారణం. పురాతన భవనాలైతే ఎప్పుడు కూలిపోతాయా అని భయపడుతుంటాం. ఒక్కోసారి సిమెంట్ రాలిపోయి, స్టీల్(ఇనుప చువ్వ) బయటకు కనిపిస్తుంది. తుప్పుపట్టి రాలిపోతూ ఉంటుంది. పగుళ్లలోకి



గాలి, నీళ్లు వెళ్లి పటుత్వం కోల్పోతుంది. అలాంటి కట్టడాల్లో ఉంటే చాల ప్రమాదం. అలా అని ఇంటిని కూల్చేసి మళ్లీ కట్టుకోవాలంటే కొందరికి సాధ్య పడకపోవచ్చు. పోనీ మరమ్మతులు చేయిద్దామంటే...చేతి చమురు వదిలిపోతుంది. ఇవన్నీ గమనించిన అమెరికాలోని బింగంటన్, రట్‌గర్స్ యూనివర్సిటీల పరిశోధకులు, మానవ శరీరం మాదిరే కాంక్రీట్‌లో కూడా స్వీయ వైద్యం చేసుకునేలా శిలీంధ్రాలను ప్రవేశపెట్టాలని భావించారు. ఇందుకు నిద్రాణమైన 'ట్రైకోడెర్మా రిస్సీ' అనే శిలీంధ్రాన్ని కనుగొన్నారు. దీని బీజాంశాలను కాంక్రీట్ మిక్సింగ్ సమయంలోనే కలుపుతారని బింగంటన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంగ్రూ జిన్ తెలిపారు.

ఎలా పనిచేస్తుంది?

మామూలుగా పగుళ్లు వస్తే సిమెంట్ లేదా లప్పం పెట్టి రంగులు వేస్తారు. ఎంత చేసినా..అక్కడేదో మరమ్మతు చేసినట్లే ఉంటుంది. ఈ కొత్త విధానంలో మాత్రం అలాంటి అవకాశం ఉండదనేది శాస్త్రవేత్తల అభిప్రాయం. 'పగుళ్లు ఏర్పడగానే గాలి, నీళ్లు అందులోకి వెళ్తాయి. సరపడా మోతాదుకు అవి చేరుకోగానే కాంక్రీట్‌లో నిద్రాణమై ఉన్న ఫంగల్ బీజాంశం చైతన్యమై మొలకెత్తుతుంది. తద్వారా కాంక్రీట్‌లోని కాల్షియం కార్బోనేట్ అవక్షేపం ఆ పగుళ్లను మూసివేస్తుంది' అని కాంగ్రూ జిన్ తెలిపారు. 'ఒకసారి పగుళ్లు మూసిపోతే..ఇక అందులోకి నీళ్లు, గాలి వెళ్లే అవకాశం ఉండదు. శిలీంధ్రాలు బీజాంశాలుగా మారుతాయి. మళ్లీ ఆ సమస్య ఎదురైతే...అక్కడి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా బీజాంశాలు మేల్కొంటాయి' అని జిన్ వివరించారు.

పరీక్షలు ఏ దశలో ఉన్నాయి?

చెప్పడానికి, వినడానికి ఈ సాంకేతిక పరిజ్ఞానం సులువుగా ఉన్నా..ఇది ప్రజలకు అందుబాటులోకి రావడానికి సమయం పట్టొచ్చు. కాకపోతే ఈ దిశగా గట్టి ప్రయత్నమే చేస్తున్నారు శాస్త్రవేత్తలు. ప్రస్తుతం పరీక్షలు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. కాంక్రీట్ ఆరిపోయిన తర్వాత చాలా గట్టిగా మారిపోతుంది. రాయిలా ఉంటుంది. అలాంటి కాంక్రీట్‌లో చనిపోకుండా శిలీంధ్రాలను చైతన్యంగా ఉంచడం ఎలా? 'ట్రైకోడెర్మా రీస్సి' శిలీంధ్రం ఎంత వరకూ సహకరిస్తుంది? ఈ ప్రశ్నలకు సమాధానం వెతికే పనిలో ఉన్నారు శాస్త్రవేత్తలు. ఇది సక్సెస్ అయితే భవన నిర్మాణంలోనే కాకుండా ఇతరత్రా భవన మరమ్మతుల లోనూ సరికొత్త విప్లవం వచ్చినట్లే!

సీజేతో రెబెల్ జడ్జీల భేటీ

- రోస్టర్‌పై ప్రతిపాదనలు ఇచ్చిన 'ఆ నలుగురు'

న్యూఢిల్లీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టులో ప్రతిష్టంభన తొలగించే దిశగా కీలక అడుగు ముందుకు పడింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాతో -తిరుగుబాటు చేసిన నలుగురు జడ్జీలు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ మదన్ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ రంజన్ గొగోయ్ గురువారంనాడు సమావేశమయ్యారు. కోర్టు పని ప్రారంభం కావడానికి ముందు -ఉదయం పదిగంటల వేళ- సీజే ఛాంబర్‌లో ఈ మీటింగ్ జరిగింది. అభిజ్ఞవర్గాల సమాచారం ప్రకారం- రోస్టర్ కు సంబంధించి- ఓ ప్రతిపాదనను -ఆ నలుగురూ సీజే ముందు ఉంచారు. ముఖ్యమైన కేసులను బెంచ్‌లకు కేటాయించే పారదర్శక వ్యవస్థ తేవాలని, ఇందుకోసం పాలనాపరంగా, సంస్థాగతంగా మార్పులు తేవాలని గట్టి ప్రతిపాదనలు చేశారు. వీటిని పరిశీలించి వచ్చే వారం ఏ విషయమూ చెబుతానని సీజే వారికి చెప్పారు. 20 నిమిషాల సేపు జరిగిన ఈ సమావేశంలో ఆ నలుగురితో పాటు జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఎన్‌వి రమణ, జస్టిస్ యూయూ లలిత్‌లు కూడా పాల్గొన్నారు. సీజే ఈ రోస్టర్ ప్లాన్‌పై తనకు అనుకూలురైన మరికొందరు సీనియర్లతో చర్చించే అవకాశం ఉంది. జస్టిస్ చలమేశ్వర్ వ్యక్తిగత పనుల మీద చెన్నై వెళ్ళారని, సోమవారం నాడు తిరిగి వస్తారని, అప్పటికి ఈ వ్యవహారం పరిశీలన పూర్తి కావొచ్చని సుప్రీం కోర్టు వర్గాలు తెలిపాయి. కానీ సంక్షోభం వచ్చేవారం సమసిపోతుందన్న గ్యారంటీ ఏమీ లేదని కూడా ఆ వర్గాలు పేర్కొన్నాయి. వివాదం ఇంకా పరిష్కారం కాలేదని ఆ నలుగురిలో ఒకరు ఆ తరువాత మీడియాకు చెప్పారు. అయితే సమావేశం సుహృద్భావ వాతావరణంలో జరిగిందని మాత్రం వెల్లడించారు. కాగా సుప్రీంకోర్టులో అన్ని కీలకమైన కేసుల విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయాలని, అవసరమైనవి వీడియో రికార్డింగ్ కూడా చేయాలని కోరుతూ సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ గురువారం నాడు ఓ పిటిషన్ వేశారు. కాగా, సుప్రీంకోర్టులో జరిగే వివాదాలను, నలుగురు జడ్జీల వ్యవహారాలను ప్రచురించకుండా, ప్రసారం చేయకుండా మీడియాను నిరోధించాలన్న ఓ పిటిషన్‌ను ఛీఫ్ జస్టిస్ తో కూడిన ఓ బెంచ్ కొట్టేసింది.

అగ్ని-5 చివరి టెస్ట్ సక్సెస్

న్యూఢిల్లీ, జనవరి 18: దూరశ్రేణి లక్ష్యాలను ఛేదించగల ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి అగ్ని-5ను భారత్ గురువారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిసాలోని అబ్దుల్ కలాం పరీక్షా కేంద్రం నుంచి ఈ అణువార్‌హెడ్ ఉన్న మిసైల్‌ను ఉదయం 9.53లకు మొబైల్ లాంచర్ నుంచి ప్రయోగించింది. దాని గమనాన్ని రాడార్ల ద్వారా పరిశీలించింది. ట్రాకింగ్ స్టేషన్లు దాని పనితీరును సమగ్రంగా రికార్డు చేసింది. ఈ క్షిపణి నిర్దేశిత లక్ష్యాన్ని ఛేదించినట్లు రక్షణశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అగ్ని-5ను ప్రయోగించడం 2012 నుంచి ఇది ఐదోసారి. అన్ని పరీక్షలూ విజయవంతమయ్యాయని, దేశ ఆయుధాల అమ్ముల పొదిలో ఇది రెండు మూడేళ్లలో చేరుతుందని అగ్ని-5 ప్రాజెక్టు డైరెక్టర్ జి. రామగురు, ప్రోగ్రామ్ డైరెక్టర్ ఎంఆర్ఎం బాబు తెలిపారు. ఇది 5880 కిలోమీటర్ల దూరంలోని అన్ని టార్గెట్లనూ సూటిగా తాకగలదు. 50 వేల కిలోల బరువున్న ఈ క్షిపణి- చైనా తూర్పు ప్రాంత నగరాలన్నింటినీ బుగ్గి చేయగలదు.



ప్రపంచంలో ఇదే తొలిసారి

ఇద్దరి ప్రాణాలు కాపాడిన డ్రోన్



సిడ్నీ, జనవరి 18: ప్రపంచంలోనే తొలిసారిగా ఓ డ్రోన్ ఇద్దరి ప్రాణాలను కాపాడింది. ఆస్ట్రేలియాలోని లెన్నాక్స్ హెడ్ ప్రాంతంలో సముద్రంలో మునిగిపోతున్న ఇద్దరు యువకులకు లైఫ్‌సేవర్లు అందించి రక్షించింది. సముద్ర తీరాల్లో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఆస్ట్రేలియా డ్రోన్లను వినియోగిస్తోంది. తాజాగా సముద్రంలో మునిగిపోతున్న ఇద్దరు స్విమ్మర్లను గుర్తించిన భద్రతాసిబ్బంది డ్రోన్ పైలెట్‌కు సమాచారం అందించారు. క్షణాల్లో ప్రమాదంలో ఉన్న వారిని గుర్తించిన డ్రోన్.. వారికి లైఫ్‌సేవర్లు అందించి ప్రాణాలు కాపాడింది.

ఈ ఏటి మేటి సాహసి నాజియా

- యూపీలో గ్యాంబ్లర్ల ఆటకట్టించిన బాలిక
- బాలల సాహస అవార్డు 'భరత్'కు ఎంపిక
- మొత్తం 18మంది బాల బాలికలకు అవార్డులు



న్యూఢిల్లీ, జనవరి18: ఉత్తరప్రదేశ్‌కు చెందిన నాజియా వయస్సు 18 సంవత్సరాలు! అయితేనేం కొమ్ములు తిరిగిన నేరగాళ్లను సైతం గడగడలాడించింది. ప్రాణాలకు ముప్పుందని తెలిసినా పోలీసులకు సహకారమందించింది. దశాబ్దాలుగా జూదాలు, గ్యాబ్లింగ్‌కు పాల్పడే వారి ఆటకట్టించింది. నాజియా చూపించిన ఈ తెగువ.. దేశంలో సాహస బాలలకిచ్చే అత్యున్నత పురస్కారం 'భరత్' అవార్డు ఆమెకు దక్కేలా చేసింది. ప్రతి సంవత్సరం అత్యుత్తమ ధైర్యసాహసాలు ప్రదర్శించే బాలలకు భారత శిశుసంక్షేమ మండలి ఐదు విభాగాలలో అవార్డులిస్తుంది. గీతా చోప్రా అవార్డు.. కర్ణాటకకు చెందిన నేత్రావతి ఎం చవాన్‌కు మరణానంతరం లభించింది. ఓ చెరువులో మునిగిపోతున్న ఇద్దరిని కాపాడేందుకు 14 ఏళ్ల నేత్రావతి ప్రయత్నించి.. ఒకరిని కాపాడింది. మరొక బాలుడిని కాపాడబోయి, అతనితోపాటు అసువులు బాసింది. మణిపూర్‌కు చెందిన 17 ఏళ్ల లాల్చాన్‌దామా, 15 ఏళ్ల లౌకురాక్పం రాజేశ్వరీ చాను (మిజోరాం)లకు కూడా మరణానంతరం గీతాచోప్రా అవార్డు దక్కింది. ఓ బస్సు ప్రమాదం నుంచి 16 మంది చిన్నారులను తప్పించిన 17 ఏళ్ల కర్నబీర్ సింగ్ (పంజాబ్)కు సంజయ్ చోప్రా అవార్డు లభించింది. 14 ఏళ్ల బెట్షాజాన్ పీన్ లాంగ్ (మేఘాలయ), ఏడేళ్ల మమతా దలై(ఒడిసా), కేరళకు చెందిన సెబాస్టియన్ విన్సెంట్(13) బాపు గైధానిలు అవార్డుకు ఎంపికయ్యారు. ఈ ఏడాది 18 మందికి అవార్డులు దక్కగా అందులో ఏడుగురు బాలికలున్నారు. వీరందరికీ 24న ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డులందిస్తారు. వీరు 26న జరిగే గణతంత్ర వేడుకల్లో ప్రత్యేకంగా పాల్గొంటారు. వీరితోపాటు.. లక్ష్మీయాదవ్(16), మన్షా(13), షాంగ్‌పన్ కోన్యాక్ (18), యోక్నీ(18), చింగాయ్ వాంగ్సా(18), సమృద్ధి సుశీల్ శర్మ(17), జోనున్‌తలుంగా(16), పంకజ్ సోమ్‌వాల్(16), అబ్దుల్ రవూఫ్(17), పంకజ్ కుమార్ మహంత(15)లకు సాహస బాలల అవార్డులు లభించాయి.

ఈశాన్యంలో ఎన్నికల నగారా

- త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్‌కు షెడ్యూల్ విడుదల
- వచ్చే నెల 18, 27న పోలింగ్

న్యూఢిల్లీ, జనవరి 18: ఈశాన్య రాష్ట్రాలు త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏకే జ్యోతి గురువారం ప్రకటించారు. మార్చి 6న మేఘాలయ, 13న నాగాలాండ్, 14న త్రిపుర అసెంబ్లీల కాల



ఏకే జ్యోతి

పరిమితులు ముగుస్తాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియపై ఈసీ దృష్టి పెట్టింది. త్రిపురలో మాణిక్ సర్కార్ నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం ఉండగా, మేఘాలయలో ముకుల్ సంగ్మా నేతృత్వంలోని కాంగ్రెస్, నాగాలాండ్‌లో టీఆర్ జెలియాంగ్ నేతృత్వంలోని ఎన్‌పీఎఫ్ ప్రభుత్వంలో ఉన్నాయి. అయిదు పర్యాయాలుగా త్రిపురలో కొనసాగుతున్న వామపక్ష కూటమి ప్రభుత్వాన్ని ఓడించాలని బీజేపీ, తృణమూల్ చూస్తున్నాయి. మేఘాలయలో అంతర్గత తిరుగుబాటులు కాంగ్రెస్‌ను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. ఈశాన్య రాష్ట్రమైన అసోంను తమ నుంచి ఇప్పటికే బీజేపీ కైవసం చేసుకోవడంతో... మేఘాలయను నిలుపుకోవాలని కాంగ్రెస్ చూస్తోంది. నాగాలాండ్‌లో స్థానిక ఎన్‌పీఎఫ్ బలంగా కనిపిస్తోంది. కాగా, ఎన్నికల్లో పారదర్శకత కోసం ఎలక్టోరల్ బాండ్స్ వినియోగం ఓ సానుకూల పరిణామం కాగలదని ఈసీ ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రత్యేకంగా పేర్కొన్న ఎస్‌బీఐ బ్రాంచీల్లో ఈ బాండ్లను ఇష్టమైన రాజకీయ పార్టీకి విరాళంగా ఇవ్వడానికి ఎవరైనా కొనుగోలు చేయొచ్చు. ఈ బాండ్లను తిరోగమన చర్యగా ఈసీ గతేడాది పేర్కొంది. కానీ, తాజాగా ఓ సానుకూల చర్య కాగలదని పేర్కొంది. పారదర్శకత విషయంలో అన్ని సమస్యలకూ వీటితో పరిష్కారం లభించదని ఏకే జ్యోతి వ్యాఖ్యానించారు.

ఎన్నికల ప్రక్రియ ఇలా....

	త్రిపుర	మేఘాలయ	నాగాలాండ్
నోటిఫికేషన్	జనవరి 24	జనవరి 31	జనవరి 31
మొత్తం సీట్లు	60	60	60
మొత్తం ఓటర్లు	2569216	1830104	1189264
ఎన్నికలు	ఫిబ్రవరి 18	ఫిబ్రవరి 27	ఫిబ్రవరి 27
ఓట్ల లెక్కింపు	మార్చి 3	మార్చి 3	మార్చి 3

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

సూపర్ స్లింగ్



హ్యాండ్ బ్యాగ్ లేకుండా ఇంట్లో నుంచి అడుగు బయట పెట్టలేం! లిప్‌స్టిక్ మొదలుకుని, ల్యాప్‌టాప్ వరకూ అవసరమైన వస్తువులను వెంట తీసుకెళ్లగలిగే హ్యాండ్ బ్యాగ్స్‌లో మరీ ముఖ్యంగా 'స్లింగ్ బ్యాగ్స్' లేటెస్ట్ ట్రెండ్. కాలేజీకి, షాపింగ్‌కి, ఆఫీసుకి... సందర్భానికి తగిన స్లింగ్ బ్యాగ్స్‌లో మీకు అనువైనవి ఎంచుకుంటే ఫ్యాషన్ ఐకాన్ మీరే కావొచ్చు.

ఫంకీ స్లింగ్ బ్యాగ్

టీనేజ్‌లోకి అడుగుపెట్టే పిల్లల కోసమే ఈ ఫంకీ స్లింగ్ బ్యాగ్. పిల్లులు, కుక్కలు మొదలైన జంతువుల బొమ్మలు ప్రింట్ అయి ఉండే ఈ ఫంకీ బ్యాగ్‌లు చాలా ఎట్రాక్టివ్‌గా ఉంటాయి. సో...పిల్లలూ! ఈ ఫంకీ బ్యాగ్‌లను ట్రై చేయండి.

కాన్వాస్ స్లింగ్ బ్యాగ్

టీనేజర్ల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన బ్యాగ్ ఇది. జీన్స్, ఫ్రాక్, షార్ట్స్...ఇలా ఏదైనా ఇట్టే మ్యాచ్ అయిపోతుంది. పొడవాటి స్లింగ్ చివరన ముచ్చటగా వేలాడే ఈ బ్యాగ్ బరువు కూడా తక్కువే!

బకెట్ స్లింగ్ బ్యాగ్

ఉద్యోగినులకు, పిల్లాపాపలతో షాపింగ్‌కి వెళ్లే గృహిణులకూ ఉపయోగపడే బ్యాగ్ ఇది. ఎక్కువ వస్తువులు పట్టే వీలుండటంతో పాటు స్టయిలిష్‌గా కూడా కనిపిస్తుంది! చటుక్కున అవసరమైన వస్తువు చేతికందేలా డిజైన్ చేసి ఉండటం ఈ బ్యాగ్ ప్రత్యేకత.

క్రొషెట్ స్లింగ్ బ్యాగ్

ఊలు, జూట్, కొబ్బరి పీచు, అరటి నార....ఇలా ప్రకృతిసిద్ధమైన వస్తువులతో తయారుచేసిన హ్యాండ్ బ్యాగ్స్ ఇవి. పర్యావరణ ప్రేమికుల కోసం ప్రత్యేకంగా తయారయ్యే ఈ బ్యాగ్‌లు ఆకర్షణీయంగా కనిపించంతోపాటు హ్యాండిల్ చేయటానికి తేలికగా ఉంటాయి.

క్రాస్ బాడీ స్లింగ్ బ్యాగ్

భుజం మీద నుంచి నడుము దగ్గరికి వేలాడేసుకునే వీలుండే ఈ క్రాస్ బాడీ స్లింగ్ బ్యాగ్ మొత్తం లుక్‌నే మార్చేస్తుంది. ఎలాంటి మోడర్న్ డ్రస్‌కైనా భలేగా మ్యాచ్ అయిపోతుంది. అరలఅరలుగా కనిపిస్తూ కొత్త లుక్‌తో అదరగొడుతుంది.

కౌన్సెలింగ్ కార్నర్

అక్కను మార్చడం ఎలా?

మా అక్కకి పెళ్లయి ఒక పాప ఉంది. గతంలో ఆమె ఒకతన్ని ప్రేమించింది. ఇంట్లో తెలిసి గొడవ అయ్యాక, ఒప్పించి అక్కకి వేరే అతనితో పెళ్లి చేశారు. కానీ అక్క పెళ్లి అయ్యాక కూడా ప్రియుడితో మాట్లాడుతూనే ఉంది. వాళ్ళ బావగారికి ఈ విషయం తెలిసి మందలించారు. అయినా వినలేదు. దాంతో ఆయన అమ్మకు చెప్పారు. అందరం కలిసి అక్కకు ఎంతగానో చెప్పాం. సరే అంది కానీ కథ మళ్ళీ మొదటికే వస్తోంది. అక్కను మార్చడం ఎలా?

- కిరణ్



మారాల్సింది మీ అక్క మాత్రమే కాదు... మీరు కూడా! మొదటే మీ అక్క మనసు తెలుసుకోకుండా తప్పు చేశారు. సరే... పెళ్లి చేశాకయినా ఆమె అత్తవారింట్లో సరిగ్గా ఉందో లేదో గమనించారా? పాప పుట్టాక సాధారణంగా ఎవరైనా ప్రేమ గురించి ఆలోచించరు. ఇంకా మీ అక్క అలాగే ఉందంటే భర్తతో ఏమన్నా సమస్యలున్నాయేమో తెలుసుకున్నారా? ఇక్కడ కావలసింది కోపం, దండన కాదు. మీ అక్కను అర్థం చేసుకోడానికి కాస్తంత ఓర్పు! ఆమె మనసులో ఏముందో తెలుసుకోండి. మీ తప్పు ఒప్పుకోండి. పాప కోసం సర్దుకోమని చెప్పి చూడండి. కన్నవారి కోసం ఒకసారి ప్రేమను వదులుకున్న ఆమెకు బిడ్డ కోసం రాజీ పడడం అంత కష్టం కాకపోవచ్చు!

● **కె.శోభ,** ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com

'ఈ సమాజంలో బతకాలని లేదు'

రెండు కాళ్లూ లేవు... కానీ తన కాళ్లపై తాను నిలబడింది. దివ్యాంగుల భుజం తట్టి... సమాన అవకాశాలు కల్పించాలని ఏడేళ్లుగా కృషి చేస్తోంది. లక్ష్యం పెద్దది... ఆశయం గొప్పది. కానీ... అందుకు సహకరించేవారే కరువయ్యారనే నిర్వేదం. 'పవన్‌కల్యాణ్- కత్తి మహేశ్' (పీకే-ఎంకే)ల రాద్ధాంతానికిచ్చిన ప్రాధాన్యంలో కనీసం ఒకటో వంతు కూడా తమ సమస్యలకు ఇవ్వడంలేదన్న మనస్తాపం. 'ఈ హృదయం లేని సమాజంలో నేను బతకలేను' అంటూ 'ఫేస్‌బుక్'లో కొప్పుల వసుంధరా చౌదరి పెట్టిన పోస్టు వైరల్ అయింది. దీని వెనుక కథేంటని వసుంధరను కదిలిస్తే ప్రతి గుండెనూ తాకే ఆమె అంతరంగం ఆవిష్కృతమైంది.

వివాదాలు తప్ప జీవితాలకు విలువ లేకుండా పోయింది ఈ సమాజంలో. పీకే-ఎంకేల ఎపిసోడ్ ఇంతగా వైరల్ అవ్వడానికి ఏముంది అందులో? కాళ్లు లేకపోయినా ఎవరిపై ఆధారపడకుండా జీవిస్తున్నా. నాలాంటి ఎంతో మంది జీవితాల్ని నిలబెట్టాలని ప్రయత్నిస్తున్నా. అలాంటి వారి కోసమే ఈవెంట్లు చేస్తున్నా. నా ప్రయత్నాలకు 'మాట సాయం చేయండి చాలంటే' స్పందించిన వారు లేరు. ఇది హృదయం లేని సమాజం. ఇలాంటి మనుషుల మధ్య బతికి ప్రయోజనం లేదనిపించి ఆత్మహత్య చేసుకోవాలన్నంత బాధ కలిగింది. అందుకే ఆ పోస్టు పెట్టాను.

నేనేంటో నిరూపించుకున్నా...

మాది అనంతపూర్. 2011లో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్‌లో పీజీ డిప్లమో చేశాను. పీజీ అయిపోయిన తరువాత కొంత కాలం టీవీ చానళ్లలో న్యూస్ ప్రెజెంటర్‌గా, ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్‌గా చేశాను. వీల్‌చైర్‌లోనే తిరుగుతూ రోజుకు పది గంటలు పనిచేశాను. వైకల్యం శరీరానికే కాని... ప్రతిభకు కాదని చూపించాను. 2013లో జరిగిన తొలి 'మిస్ వీల్‌చైర్ ఇండియా' అందాల పోటీలకు నాటి ఉమ్మడి ఏపీ నుంచి ఎంపికయ్యా. అందులో నాకు 'మోస్ట్ వోటెడ్ గర్ల్' టైటిల్ వచ్చింది. కానీ... స్పాన్సర్లు లేరని నిర్వాహకులు నన్ను ఫైనల్స్‌కు ఆహ్వానించలేదు.

వారికీ ఒక వేదిక...

ప్రస్తుతం 'వీవ్ మీడియాస్' అనే ఈవెంట్ మేనేజ్‌మెంట్



ఆవేదన

సంస్థను నిర్వహిస్తున్నా. తొలిసారిగా దివ్యాంగ అమ్మాయిలతో 'మిస్ ఎబిలిటీ' అందాల పోటీలు నిర్వహించాలని నిర్ణయించాను. మార్చి 10న నగరంలో ఈవెంట్. రూ.50 లక్షలు ఖర్చవుతుంది. వాళ్లలో ఉన్న ప్రతిభను గుర్తించి, దాన్ని బయటకు తీసే ప్రయత్నం ఇది. ఇందులో గాయకులు, డ్యాన్సర్లు, పెయింటర్ల వంటి విభిన్న కళల్లో ప్రావీణ్యమున్న వాళ్లు ఎందరో ఉన్నారు. ఉదాహరణకు శ్రీలేఖ (హైదరాబాద్). ఆమెకు శరీరంలో తల తప్ప ఏ అవయమూ పనిచేయదు. కానీ... తను నోటితో కుంచె పట్టి అద్భుతంగా పెయింటింగ్స్ వేయగలదు. 'ఇంటర్నేషనల్ మౌత్ పెయింట్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్'లో సభ్యత్వం ఉన్న ఇద్దరు ముగ్గురు భారతీయ మహిళల్లో తనూ ఒకరు. ఇలాంటి టాలెంట్‌ను బయటకు తీసుకొచ్చి, వారికి ప్రావీణ్యం ఉన్న రంగంలో అవకాశాలు కల్పించాలన్నదే ఈవెంట్ లక్ష్యం. ఫేస్‌బుక్‌లో ఇలాంటి వాటి గురించి పోస్ట్ చేస్తే భుజం తట్టడం మాట అటుంచి, కనీసం స్పందించే వారే లేకపోవడం బాధ కలిగిస్తోంది.

ఏ సెలబ్రిటీ తలుపు తట్టినా తిరస్కారమే!

నేను చేయబోయే ఈవెంట్‌ను స్పాన్సర్ చేయమని అడిగితే... 'సెలబ్రిటీలు ఎంతమంది వస్తున్నారు' అని అడుగుతున్నారు. సెలబ్రిటీల దగ్గరికి వెళితే 'ఎంతిస్తారు' అంటూ మధ్యవర్తులు అడుగుతున్నారు. అసలు సెలబ్రిటీలనే కలవనివ్వడం లేదు. సాయం కోసం గత నెలలో పవన్‌కల్యాణ్ ఇంటికి వెళితే... గేటు బయటే ఆపేశారు. హైదరాబాద్‌లో నేను ప్రయత్నించని సెలబ్రిటీ లేరంటే నమ్ముతారా? ఫైనాన్షియల్‌గా వాళ్లను తృప్తి పరిస్తేనే అవకాశం ఇస్తారు. మీడియాలో అనవసర విషయాలకు ఇచ్చిన ప్రాధాన్యం మాలాంటి వారికి ఎందుకు ఇవ్వరు? తెలంగాణలో 40 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారు. ఏపీలోనూ ఇంచుమించు అదే సంఖ్యలో ఉంటారు. అనవసర రాద్ధాంతాలపై ఎనలేని ఆసక్తి చూపినవారు నా ప్రయత్నాన్ని ఒక చిన్న మాటతో ఎందుకు ప్రోత్సహించరు? ఇలాంటివన్నీ చూసినప్పుడే నాకు నిజంగా చచ్చిపోవాలనిపించింది. నేను కోరేదొక్కటే... మాలో అవయవ లోపాలను కాకుండా ప్రతిభను చూడమని. మాపై జాలి చూపవద్దు... నిజమైన అవకాశాలిచ్చి ప్రోత్సహించమని!

● **హనుమా**



24న
రథసప్తమి



22న
వసంత పంచమి

సందర్భం

చదువుల తల్లికి వందనం!

జ్ఞాన ప్రదాయిని సరస్వతీదేవి. చదువుల తల్లిగా భారతీయ సంప్రదాయం ఆ వాగ్దేవిని ఆరాధిస్తుంది. వాక్కుకు ఆమె అధిష్ఠాన దేవత. సరస్వతీ పూజతో అక్షరాభ్యాసం చేసి విద్యాభ్యాసాన్ని ఆరంభించడం తరతరాల నుంచి వాడుకగా వస్తున్న ఆచారం. ఎన్ని సంపదలు నశించినా నశించిపోనిది విద్యా సంపద. అలాంటి సంపదను ప్రసాదించే సరస్వతిని 'విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతుమే సదా!' అనీ, 'సరస్వతీ త్వయం దృష్ట్వా వీణాపుస్తకధారిణీ!

హంసవాహ సమాయుక్తా విద్యాదానకరీ మమ!!' అనీ విద్యా సిద్ధి కోసం ప్రార్థించాలని చెబుతారు పెద్దలు. శ్రద్ధాభక్తులతో సరస్వతిని ఆరాధించి, ఏకాగ్రతతో అభ్యాసం చేస్తే ఏ కళలోనైనా ప్రావీణ్యాన్ని ఆ చదువులమ్మ అతి సులభంగా ప్రసాదిస్తుందని నమ్మిక!

మాఘ శుద్ధ పంచమిని సకల కళలకూ ఆదిదేవత అయిన సరస్వతి పుట్టినరోజైన "వసంత పంచమి'గా జరుపుకొంటారు. రాబోయే వసంతకాలాన్ని స్వాగతించే రోజుగా దీన్ని పరిగణిస్తారు. వసంత పంచమినాడు అక్షరాభ్యాసం చేస్తే విద్యల్లో రాణిస్తారనీ, ఈ రోజున సరస్వతీదేవిని ఆరాధిస్తే విద్యార్థులు ఉత్తమమైన ఫలితాలు పొందుతారనీ, విజ్ఞాన వికాసాలు పొందితారనీ విశ్వాసం ఉంది. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో వసంత పంచమిని ఒక ప్రధాన పర్వదినంగా జరుపుకొంటారు..

బాసరలో...

తెలంగాణలోని నిర్మల్ జిల్లా బాసర తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సరస్వతీ క్షేత్రం. పవిత్ర గోదావరి తీరంలో జ్ఞాన సరస్వతిగా ఆమె కొలువై ఉంది. ప్రతి సంవత్సరం "వసంత పంచమి' సందర్భంగా బాసరలో వేడుకలు నిర్వహిస్తారు. అక్షరాభ్యాసాల కోసం, ప్రత్యేక పూజల కోసం పెద్ద ఎత్తున భక్తులు బాసరకు తరలివస్తారు. హైదరాబాద్‌కు 210 కిలోమీటర్లు, నిజామాబాద్‌కు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాసరకు రోడ్డు, రైలు మార్గాల ద్వారా చేరుకోవచ్చు.

తం సూర్యం ప్రణమామ్యహం!

దేవతలు ఎందరైనా ఉండొచ్చు. కానీ ప్రత్యక్షదైవం మాత్రం ఒక్కడే. ఆయనే సూర్యుడు. ఆధ్యాత్మికవాదులు దేవుడిగా కొలిచినా, జ్యోతిష శాస్త్రం గ్రహంగా పరిగణించినా, ఖగోళశాస్త్రం నక్షత్రం అని పేర్కొన్నా విస్మరించలేని ఉనికి సూర్యుడిది. అనాదికాలం నుంచీ అన్ని నాగరికతలూ సూర్యుడిని ఆరాధించాయి. మన వేదాలూ, పురాణాలూ ఆయనను ప్రస్తుతించాయి.


పురాణ కథనాల ప్రకారం- అదితి, కశ్యపుల కుమారుడు సూర్యుడు. అందుకే ఆదిత్యుడు, కాశ్యపేయుడు అనే పేర్లు ఆయనకు ఉన్నాయి. మాఘ శుద్ధ సప్తమినాడు ఆయన జన్మించాడు. కనుక ఈ రోజును సూర్యజయంతిగా జరుపుకొంటారు. అలాగే విశ్వానికి వెలుగునిచ్చే బాధ్యతలను స్వీకరించి, సప్తాశ్వాలు పూన్చిన రథాన్ని సూర్యుడు అధిరోహించినది కూడా ఈ రోజేనని చెబుతారు. కాబట్టే ఇది రథ సప్తమి అయింది. రథసప్తమి రోజున చేసే దానాలూ విశేషమైన ఫలితాలను ఇస్తాయనీ, ఆవు పిడకలపై ఆవు పాలతో పరమాన్నం చేసి నివేదిస్తే సూర్యానుగ్రహం కలుగుతుందనీ పెద్దలు చెబుతారు. ఆరోగ్యప్రదాతగా, జగద్రక్షకుడిగా పూజలందుకొనే సూర్యుడు నిత్యచైతన్య స్వరూపం. ఆయన సాక్షాత్తూ త్రిమూర్తి స్వరూపమేనని ఇతిహాసాలు అభివర్ణించాయి. రణరంగంలో క్లేశానికి గురై, అగస్త్యుడి ప్రబోధం మేరకు శ్రీరాముడు సూర్యుడిని ఆరాధించి యుద్ధంలో విజయం సాధించినట్టు రామాయణం చెబుతోంది. 'ఆదిత్య హృదయం' ఆ సందర్భంలోనిదే.

అరసవిల్లిలో...

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా అరసవిల్లిలో అతి ప్రాచీనమైన సూర్య దేవాలయం ఉంది. దేశంలోని ఉన్న అతి కొద్ది సూర్య దేవాలయాల్లో ఇదొకటి. రథసప్తమి సందర్భంగా అర్ధరాత్రి నుంచీ ఈ ఆలయంలో పూజా కార్యక్రమాలు, స్వామికి క్షీరాభిషేకాలూ మొదలవుతాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచీ భక్తులు లక్షల సంఖ్యలో వచ్చి సూర్యనారాయణుడిని దర్శించుకుంటారు. శ్రీకాకుళం పట్టణాన్ని అరసవిల్లి ఆనుకొని ఉంటుంది. బస్సు, రైలు మార్గాల్లో శ్రీకాకుళం వెళ్ళి, అక్కడినుంచి అరసవిల్లి చేరుకోవచ్చు.

సందేశం

సమాధి చెబుతుంది!



ఒక రోజు మహా ప్రవక్త నమాజ్ చెయ్యడానికి మసీద్‌లోకి ప్రవేశించారు. అక్కడ కొందరు విరగబడి నవ్వుతుండగా చూశారు. అప్పుడు ఇలా బోధించారు. "కోరికల్ని హరించి వేసే దాన్ని మీరు అధికంగా స్మరిస్తూ ఉన్నట్టయితే అది మిమ్మల్ని ఇలా నవ్వనిచ్చేది కాదు. అది మృత్యువు! మృత్యువును అధికంగా స్మరించండి. అది సమస్త వాంఛలనూ చంపివేస్తుంది. సమాధి ప్రతి దినం చాటుతూ ఉంటుంది... నేను సత్రం లాంటి గృహాన్ని, ఏకాంత కుహరాన్ని. బురదమట్టి నిలయాన్ని, పురుగులకు పుట్టిల్లును అని".

ఒక విశ్వాసిని సమాధిలో పూడ్చినప్పుడు సమాధి అతనికి స్వాగతం పలుకుతుంది- "నా వెన్ను (భూమి)పై నడిచిన వారిలోకెల్లా నువ్వు నాకు ఎంతో ప్రియమైనవాడవు. ఈవేళ నువ్వు నాకు అప్పగించబడ్డావు. నీ పట్ల ఎంత మంచిగా ప్రవర్తిస్తానో చూస్తావుగా!" అని! మహా ప్రవక్త ఇలా అన్నారు- "అతని కోసం సమాధి విశాలం అవుతుంది. అక్కడ స్వర్గం వైపు ఒక ద్వారం తెరుచుకుంటుంది". అలాగే ఒక దురాచారపరుడు, దుర్మార్గుడు లేక అవిశ్వాసిని పూడ్చినప్పుడు అతనికి భూమి స్వాగతం పలకదు. సమాధి ఇలా అంటుంది- "నా వెన్నుపై నడిచిన వారిలోకెల్లా నువ్వు నాకు అమితంగా అయిష్టమైనవాడివి. ఇప్పుడు నువ్వు నాకు అప్పగించబడ్డావు. ఇక నిన్ను ఎలా సాధిస్తానో చూద్దువుగాని!" అని.

మహా ప్రవక్త ఇలా అన్నారు- "అతనికి ఆ సమాధి ఇరుకైపోతుంది. ఎంత ఇరుకవుతుందంటే అతని పక్కటెముకలు ఒకదానిలో ఒకటి చొచ్చుకుపోతాయి". ఈ మాట చెబుతూ మహా ప్రవక్త ఒక చేతి వేళ్ళను మరో చేతి వేళ్ళలో వేసి చూపించారు. ఇంకా ఇలా అన్నారు- "ఆ తరువాత అతని మీద డెబ్భై విష సర్పాలు వదలబడతాయి. అవి ఎంతో విషపూరితమై ఉంటాయి. వాటిలో ఏ ఒక్కటి పృథ్విపై ఒక్కసారి బుసకొట్టినా భూమి శాశ్వతంగా బీడువారిపోతుంది. ఇలాంటి విషసర్పాలు అతన్ని కాటు వేస్తాయి. తీర్పు దినం వచ్చేవరకూ ఇది కొనసాగుతూనే ఉంటుంది. మనిషికి స్వర్గపు ఉద్యానవనాల్లో ఒకటిగానో, నరక కూపాల్లో ఒకటిగానో సమాధి రూపొందుతుంది". (హదీస్ గ్రంథం- తిర్మిజీ)


హదీసులో ఇహలోక జీవితం- పరలోక జీవితం మధ్యనుండే మరణావస్థకు సమాధిని సంకేతంగా ప్రయోగించడం జరిగింది. ఒక వ్యక్తి ప్రపంచంలో తనకు సాధ్యపడినంతవరకు చెడుతో పోరాడుతూ, మంచిని ఆచరిస్తూ పరలోక సాఫల్యం కోసం కృషి చేస్తూ తన జీవితాన్ని చాలించుకున్నాడంటే సమాధిలో అతని ఎడల ప్రేమపూర్వకంగా వ్యవహరించడం జరుగుతుంది. అలాకాక ఒక వ్యక్తి జీవితాంతం చెడును ఆచరిస్తూ పశ్చాత్తాపపడకుండా క్షమాపణ వేడుకోకుండా మరణిస్తే సమాధిలో శిక్షాపూరితమైన వాతావరణంలో ఉండవలసి ఉంటుంది. అంటే సమాధిలోని జీవితాన్ని తన ఆచరణ మూలంగానే మార్చుకోగలడన్నమాట! అదే మాటను హదీసు చివరిలో చెప్పడం జరిగింది.

• మహమ్మద్ వహీదుద్దీన్

శ్రీరమణకథామృతం

స్వామి రంగనాథానంద

(గత సంచిక తరువాయి)



శ్రీరామకృష్ణమిషన్‌కి చాలా కాలం అధ్యక్షునిగా వ్యవహరించిన స్వామి రంగనాథానంద శ్రీరమణులను దర్శించుకున్న వారిలో ఒకరు. శ్రీభగవాన్ గురించి ఆయన చెప్పిన విషయాలివి.

"నేను శ్రీరమణాశ్రమానికి రెండు సార్లు వెళ్లాను. 1936లో మొదటిసారి వెళ్లాను. ఆశ్రమానికి చేరిన తరువాత అక్కడ మూడు రోజులుండి ఆ తరువాత రైలులో వెళ్లిపోతానని వారికి చెప్పాను. కాని ఆ విషయం మరచిపోయాను. సరియైన వేళకి వారు నా వైపు చూసి నీవు వెళ్లవలసిన వేళ అయింది. నీకోసం బండిని ఏర్పాటు చేశామన్నారు. అంత మంది సందర్శకుల మధ్య ఈ విషయాన్ని వారెట్లా గుర్తుపెట్టుకున్నారో ఆశ్చర్యం వేసింది. వారి గురించి ఏమి చెప్పినా అది అసంపూర్ణంగానే ఉంటుంది. అయినా నాకు తోచినదిది.

భాగవతంలో ఒక శ్లోకంలో పుణ్యాత్ముల లక్షణాలు వివరించి ఉంటాయి. పుణ్యాత్ముని పట్ల మమకారం కలిగి ఉండటమే విమోచనం కలిగించ గల శక్తి. అంటే అటువంటి వారు శాంత చిత్తులు, నిశ్చలమైన సముద్రం వంటిది వారి మనస్సు, కరుణాపూరితులు, సకల జీవరాశులకూ హితులు. ఈ అందమైన వర్ణన శ్రీభగవాన్‌కి సరిపోతుంది. వారు అమరులు, నిత్యులు, పరమోన్నతులు అయినా అతి సాధారణుని వలె మనతో మసలేవారు. అరుణాచలంలో వెలసిన జ్యోతికి ఆద్యంతాలు కనుగొనడం అసాధ్యం. అలాగే శ్రీభగవాన్‌ని కూడా అంచనా వేయడం వారు ఎంత ఉన్నతులో, ఎంత గంభీరులో చెప్పలేం. నిత్య సత్యానికి మానవరూపం శ్రీభగవాన్. ఒంటరిగా కూర్చున్నా, మౌనముద్రలో ఉన్నా, పేపరు చదువుతున్నా, కూరలు తరుగుతున్నా వారు సంతోషభరితులై ఉండేవారు. "అహంబ్రహ్మాస్మి" అనే వాక్యానికి ప్రత్యక్ష నిదర్శనం వారు. ఆ అనుభవం కలగడం తేలికే అంటారు వారు. నిజమే. దాని కోసం ఏమీ ఆసనాలు వేయక్కర్లేదు. మన భావనల కేంద్రాన్ని మరల్చుకోవాలి. అంతే!

రమణమహర్షిని దర్శించాం. భాగవతంలో శుకుని గురించి విన్నాం. ఇద్దరికీ ఎంతో పోలిక ఉంది. వారిద్దరూ ఆత్మనిష్ఠులై, ఏ బంధమూ లేక, నిరంతరానంద ముగ్ధులై ఉండేవారు. ఇద్దరిలోనూ అవ్యాజమైన ప్రేమ ఉండేది. వారు కడు నిరుపేద కాని ఆనందభరితులు. వారి వెనక ఏ బలగమూ లేదు కాని అపరిమితమైన బలాఢ్యులు వారు. అనన్యసములు వారు కాని అందరూ తమకి సమానులే అనుకుంటారు.

శ్రీకృష్ణుని గురించి, శ్రీభగవాన్ గురించి వింటున్న కొద్దీ ఇంకా వినాలనిపిస్తుంది. మనకి తెలియకుండానే మనలో ప్రవేశించే ఆ ఆధ్యాత్మిక శక్తి స్వరూపానికి అర్హులమగుదుము గాక!" (సశేషం)

• పింగళి సూర్యసుందరం

నవజీవనవేదం

వ్యామోహాల్లో చిక్కకూడదు



మనస్సు ఏ విధంగా వ్యామోహాలకు లోనవుతుందో, మనస్సును అడ్డం పెట్టుకుని ఏవి మనను పతనం చేసేస్తున్నాయో శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. మనస్సును అదుపులో పెట్టుకోవడం ఎలాగో ఈ భాగం వింటే అర్థమవుతుంది. చాలా మంది అంటుంటారు.. "మనసు చెప్పినట్లు వినడం లేదు, కాసేపు ధ్యానం చేద్దామనుకున్నా కుదరడం లేదు" అని. దానికి సమాధానం ఇందులో దొరుకుతుంది.

శ్రోత్రం చక్షుః స్పర్శనంచ రసనం ఘ్రాణమేవచ
అధిష్ఠాయ మనశ్చాయం విషయానుపసేవతే!


శ్రోతం అంటే చెవి, చక్షుః అంటే కన్ను, స్పర్శనం - చర్మం, రసనం - నాలుక, ఘ్రాణం - ముక్కు.... ఇవి పంచేంద్రియాలు. మొత్తం మోసం చేస్తున్నది ఇవే. అయితే ఇవి వాటంతట అవే మోసం చేయలేవు. వాటంతట అవి ప్రవర్తించవు. మరి ఈ ఐదు వేటిని ఆధారంగా చేసుకుని పని చేస్తున్నాయి? అంటే... మనస్సును ఆధారంగా చేసుకుని పనిచేస్తున్నాయి. ఈ మొత్తం ఇంద్రియ సముదాయం మనస్సును అధిష్ఠానంగా చేసుకుని విషయాలు బోధిస్తున్నాయి. మనస్సు లేకపోతే ఇంద్రియాలు ఏం చేయలేవు. శవంలో లేనిది ఆ మనస్సే. ఆ మనస్సే జీవుడు. ఆ మనస్సే సంకల్పం. ఆ మనస్సుకు మూలమే ప్రాణం.

***

ఇంద్రియాలు కోరే వ్యామోహాల్ని మనం ఆశించి ఎన్ని వంకర పనులు చేస్తామండీ! దాన్నే ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకంలో ఇలా చెబుతున్నాడు. "ఏముందయ్యా ఇందులో! ఎందుకంత డబ్బు ఆశిస్తున్నావు. ఎందుకా పదవులు? ఎందుకా తప్పుడు పనులు?" అంటున్నాడు ధూర్జటి.

జాతుల్సెప్పుట, సేవచేయుట, మృషల్ సంధించుట న్యాయాప
ఖ్యాతిం పొందుట, కొండెగాడవుట, హింసారంభకుండౌట, మి
ధ్యాతాత్పర్యములాడుటిన్నియు పరద్రవ్యంబునాశించి, యా
శ్రీ తానెన్ని యుగంబులుండగలదో శ్రీకాళహస్తీశ్వరా!

"జాతి, వంశం గురించి గొప్పగా చెప్పుకోవడం, ఇష్టం లేకపోయినా సేవలు చేయడం, అబద్దాలు ఆడటం, అన్యాయంగా ఖ్యాతిని పొందడం, చాడీలు చెప్పడం, హత్యలు చేయడం, ఏ ఆధారమూ లేనివి చెప్పడం... ఇంత చేసి సంపాదించిన డబ్బులు ఎంత కాలం ఉంటాయి?" అని అర్థం. ఆ డబ్బు ఉన్నా నువ్వు ఎంత కాలం ఉంటావు? ఎందుకీ పనిచేస్తున్నావు? నిజమైన ఖ్యాతి పొందే ప్రయత్నం చేయి. నిజాయితీగా ఉండు, చిత్తశుద్ధిగా ఉండు. ఆ చిత్తశుద్ధి నీ జీవితాన్ని బాగు చేస్తుంది.



• డా. గరికిపాటి నరసింహారావు

ధర్మపథం

దానానికీ అభ్యాసం కావాలి!

అజ్ఞాతుడు శ్రావస్తి పొలిమేరలో జీవించే ఒక గ్రామవాసి. ఆ గ్రామానికి కొద్దిదూరంలో ఒక మంచి నీటి చెరువు ఉండేది. భిక్ష తెచ్చుకున్న భిక్షువులు మధ్యాహ్నం ఆ చెరువు గట్టు మీద కూర్చొని, తిని, కొద్దిసేపు అక్కడే విశ్రమించేవారు. అది చూసిన అజ్ఞాతునికి ఒక ఆలోచన వచ్చింది. వెంటనే వెళ్ళి ఆ ప్రదేశాన్ని చదును చేసి, కూర్చోడానికి వీలుగా రాళ్ళు పరచాడు. భిక్షువులు అజ్ఞాతుణ్ణి అభినందించారు. ఆ ప్రదేశం ఒక పెద్ద మర్రి చెట్టు కింద ఉంది. ఎండ ఎంత తీవ్రంగా వేసినా భిక్షువులకు ఇబ్బంది ఉండదు. కానీ, ఒక రోజున జోరుగా వర్షం పడింది. భిక్షువులు ఆ వర్షంలోనే తడుస్తూ ఆ చెట్టు క్రిందే తల దాచుకున్నారు. అది చూసిన అజ్ఞాతుడు వెంటనే కలప, ఆకులు, కర్రలు పోగు చేసి తెచ్చాడు. నిట్టాళ్ళు పాతాడు. గాలికీ, వానకీ చెక్కు చెదరని ఒక పర్ణశాల నిర్మించాడు. భిక్షువులు కొన్నాళ్ళు అక్కడే ఉన్నారు. క్రమేపీ భిక్షువుల సంఖ్య పెరిగింది. అప్పటికే ఆ రాజ్యంలో అనాథపిండికుడు, ఆమ్రపాలి, విశాఖలు పెద్ద పెద్ద ఆరామాలు కట్టించారు. ఈ విషయం అజ్ఞాతునికి తెలిసింది. ఆయన వారంతటి ధనవంతుడు కాడు. అయినా తన 'శక్తి కొలది ఆరామం కట్టించాలి' అనుకున్నాడు. ఆ చుట్టూ ఉన్న ప్రాంతాన్నంతా చదును చేసాడు. గడ్డి పాకలు ఏర్పాటు చేసి, చక్కని ఆరామాన్ని నిర్మించాడు. ఆరామం అంటే విద్యా ధ్యాన విషయాలు శిక్షణ ఇచ్చే ప్రదేశం, బౌద్ధ గురుకులం. అజ్ఞాతుని దాతృత్వం వల్ల మార్గమధ్యంలో ఉన్న ఒక విశ్రాంతి ప్రదేశం చివరికి విహారంగా మారింది. ఈ విషయం తెలిసి స్వయంగా బుద్ధుడే అక్కడికి వచ్చాడు. "మనస్సును ప్రశాంతపరిచే అంశాల్లో దానం ఒకటి. దాన గుణం మనలోని దోషాల్ని సైతం క్రమేపీ తుడిచివేస్తుంది. శుద్ధి చేస్తుంది. మొదటిగా గడ్డిపోచతో మొదలుపెట్టి దానగుణాన్ని అభ్యాసం చేస్తే క్రమేపీ అది మనల్ని మహా దాతలుగా మలుస్తుంది. దానం మనకు సహజ నైజంగా రూపొందుతుంది!!" అని కొనియాడాడు.

• బొర్రా గోవర్ధన్

నేడు ఓషో వర్ధంతి

విలక్షణ గురువు



ఆధ్యాత్మిక గురువుల్లో ఓషో(ఆచార్య రజనీష్)ది విభిన్న శైలి. విప్లవాత్మక ఆలోచనలతో అంతర్జాతీయంగా సంచలనం సృష్టించిన ఓషో యోగా, ధ్యానం, జెన్, టావోయిజం, తంత్ర, సూఫిజం తదితర అంశాలపై అనేక ప్రసంగాలు చేశారు. బుద్ధుడిని అమితంగా ఇష్టపడే ఓషో తన ప్రసంగాలలో ఎక్కువగా బుద్ధిజం గురించి పేర్కొనేవారు. ఆయన ప్రసంగాలు 600 సంపుటాలుగా రూపొందాయి. ప్రపంచంలోని 50 భాషల్లోకి అనువాదం అయ్యాయి. 'నా ప్రసంగాలు, రచనలు భవిష్యత్తరాల కోసం' అని చెప్పిన ఓషో వివిధ అంశాలపై విస్పష్టమైన అభిప్రాయాలు ప్రకటించారు. వాటిలో కొన్ని:

స్వాధీనంతో ప్రేమ వికసించదు

"నువ్వొక పుష్పాన్ని ప్రేమిస్తే ఆ పువ్వు అందాన్ని, పరిమళాన్ని ఆస్వాదించాలి.. అంతేకాని పువ్వును కోసుకోవాలని చూస్తే మరుక్షణం ఆ పువ్వు మరణిస్తుంది. పరిమళం అదృశ్యమౌతుంది. దేన్నైనా స్వాధీనం చేసుకోవాలని మనం చేసే ప్రయత్నాలు అంతిమంగా- అవి మన నుంచి దూరం కావటానికే దోహదం చేస్తాయి. ప్రేమ కూడా అంతే. ఒక యువతితో పీకల్లోతు ప్రేమలో కూరుకుపోతావు. నువ్వే ప్రపంచమంటావు. మరుక్షణం ద్వేషిస్తావు. ఇది ప్రేమ ఎలా అవుతుంది? అది ప్రేమ కాదు. స్వాధీనం చేసుకునే ఒక ప్రక్రియ. ఆ ప్రక్రియలో ప్రేమ వికసించదు".

ఓషో గురించి...

ఓషో 1931 డిసెంబర్ 11న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని హోషంగాబాద్ జిల్లాలోని కుచ్‌వాడ గ్రామంలో జన్మించారు. అసలు పేరు చంద్రమోహన్‌జైన్. 1956లో ఫిలాసఫీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశారు. 1958లో జబల్‌పూర్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. ఆ సమయంలోనే అనేక ప్రాంతాల్లో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. 1974లో పుణేలో ఆశ్రమాన్ని నెలకొల్పారు. తన పేరును 'ఆచార్య రజనీష్'గా, అనంతరం 'ఓషో'గా మార్చుకున్నారు. ఆయనకు వేలమంది శిష్యులు ఏర్పడ్డారు. ఓషో 'డైనమిక్ మెడిటేషన్' విశేష ప్రాచుర్యం పొందింది. విదేశాల నుంచి కూడా భక్తులు అసంఖ్యాకంగా తరలివచ్చేవారు. 1981లో అమెరికా దేశానికి చెందిన ఓషో భక్తులు 64వేల ఎకరాల్లో రజనీష్ పురాన్ని నిర్మించారు. ఓషో భారతదేశాన్ని వీడి అమెరికాలో తన కార్యక్రమాలను విస్తరింపజేశారు. అక్కడ నెలకొన్న వివాదాల కారణంగా 1987లో తిరిగి స్వదేశానికి వచ్చి పుణే ఆశ్రమంలో తన కార్యక్రమాలను కొనసాగించారు. 1990 జనవరి 19న ఆయన పరమపదించారు.


డబ్బుకు వ్యతిరేకిని కాదు!

"డబ్బు సంపాదనకు మతాలన్నీ వ్యతిరేకమే. ఎందుకంటే అవి జీవితాలకు కూడా వ్యతిరేకమే గనుక. కాని నేను డబ్బుకు వ్యతిరేకం కాదు. సంగీతం వినాలన్నా, కవిత్వం రాయాలన్నా, మంచి పుస్తకం చదవాలన్నా ఆర్థిక బాధలు ఉంటే అవన్నీ దూరమైనట్లే. అందుకే నా దృష్టిలో డబ్బు సంపాదన అవసరమే. కాని కొందరు ఎంత డబ్బు ఉన్నా నిరంతరం అసంతృప్తితో జీవిస్తుంటారు. కానీ... డబ్బుతో అన్ని సౌకర్యాలూ పొందవచ్చు- ఒక్క ప్రేమ, జ్ఞానం, స్వేచ్ఛ, కరుణ తప్ప."

• పుట్టా శ్రీనివాసరావు

దైవమార్గం

ఆగ్రహంలోనూ ఆదరణ



'ఆగ్రహించి నిన్ను నేను కొట్టాను. కానీ కటాక్షించి నీ మీద జాలిపడుతున్నాను.' అంటాడు విశ్వాసితో దేవుడు (యెషయా 60: 10). జాలి, కటాక్షం, కరుణ, ప్రేమ ఉన్న చోట ఆగ్రహం ఉంటుందా అన్నది ప్రశ్న. అవతలి వ్యక్తి మీద పగ తీర్చుకోవడానికి పురికొల్పే ఆగ్రహానికి దేవుడు విశ్వాసుల్లో అనుమతినివ్వలేదు. బైబిల్ ఈ విషయాలన్నీ స్పష్టం చేస్తోంది. 'పగతీర్చుకోవడం నా పని. మీ పని కాదు' అన్నది దేవుని ఆజ్ఞ!! (రోమా 12: 19-20). మన పట్ల తప్పుగా, అన్యాయంగా ప్రవర్తించిన వారి మీదే కాదు, బద్ధశత్రువుల పట్ల కూడా ఆగ్రహం పనికి రాదనీ, వారితో ఎలా వ్యవహరించాలన్నది తనకు వదిలేసి వారందరినీ క్షమించడమే విశ్వాసి చేయవలసిన పని అనీ దేవుడు స్పష్టం చేస్తున్నాడు. ప్రతీకారేచ్ఛతో రగిలిన వివిధ చక్రవర్తులు, పక్షాలు, సైన్యాలు ఈ మానవచరిత్రను రక్తసిక్తంగా మార్చితే దానికి విరుగుడును దేవుడు తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా పంపిన అసమానమైన శాంతి సందేశమిది.

'దేవుని కోపం నిమిషం మాత్రమే! కాని ఆయన దయ ఆయుష్కాలం కొనసాగుతుంది' అన్నది బైబిల్ వివరణ (కీర్తన 30:5). కొన్ని సార్లు ఆయన చూపించే క్షణకాలపు కోపానికే మన జీవితాలు అస్తవ్యస్తమవుతాయి. అయితే ఆయన దయపొందిన జీవితాల్లో ఆశీర్వాదాలు కూడా అంతే ఘనంగా, అపారంగా, అనూహ్యంగా ఉంటాయి. 'ఆయనది ప్రతీకారేచ్ఛతో కూడిన ఆగ్రహం కాదు. మనల్ని సరిదిద్దే కోపం' అన్నది విశ్వాసి జీవితంలో అర్థం చేసుకునే స్థాయికి చేరుకుంటే అసలైన ఆదరణ మనకు లభ్యమవుతుంది. ఆయన సృష్టించిన విశ్వమంతటిలో మనిషే దేవునికి కేంద్ర బిందువు. అందుకే మనిషి తనను తాను సంస్కరించుకొని దేవునికి విధేయుడై మారు మనసు పొందిన ప్రతిసారీ దేవుడు వసించే పరలోకం సంతోషంతో దద్దరిల్లిపోతుందని యేసు ప్రభువే స్వయంగా చెప్పాడు (లూకా 15 :10). మనిషితో దేవుని అనుబంధం అంత గాఢమైనది. దేవుని బాధ, ఆనందం, మనిషితోనే ముడిపడిన అరుదైన హృదయస్పందన ఆ దేవునిది. దేవుడు దండించినప్పుడు తల వంచిన విశ్వాసి, మరోవైపు ఆశీర్వాదాల వరదలో తడిసి ఆనందిస్తాడు.

• సుశీల్‌సందేశ్

డైలీ సుడోకు - 81

7				5	1	4		
			9			6	2	
1	2			3				
	5	2				3		9
3		6				7	4	
				9			3	6
	3	5			2			
		4	3	7				5

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.


నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 80 సమాధానం

[illegible]


VKA FILMS
WITH THE BLESSINGS OF
MAA TULJA BHAVANI
నేడే
విడుదల
PRODUCERS VIJAY KARAN KAUSHAL KARAN ANIL KARAN
WRITTEN & DIRECTED BY SUBRAHMANYAM RV
MUSIC SAI KARTHEEK DOP PRASAD GK EDITOR SIVA Y.PRASAD ART RK REDDY STUNTS NANDU
U/A
VKA FILMS RELEASE: 93926 80706 / 98480 54706


వడ్డేపల్లి సత్యనారాయణ గారి ఆశీస్సులతో
EMVE STUDIOS
REWON YADHU
హౌరా బ్రిడ్జ్
Connecting Love
PRODUCER EMVE STUDIOS PVT.LTD
EDITOR KOTAGIRI VENKATESWARARAO MUSIC SEKHAR CHANDRA CINEMATOGRAPHY VIJAY MISHRA
REPUBLIC DAY
RELEASE



మళ్లీ కలుస్తారా?

బాలీవుడ్ జంట హృతిక్ రోషన్, సుశానే విడిపోయి మూడేళ్లు కావస్తోంది. సాధారణంగా విడాకులు పొందిన తర్వాత ఏ జంట అయినా ఎడమొహం, పెడమొహంగా ఉంటూ ఒకరంటే మరొకరి పడనట్టు ఉంటుంటారు. కానీ హృతిక్, సుశానే విషయం అలా కాదు. వాళ్లు భౌతికంగా విడిపోయినప్పటికీ పుట్టిన ఇద్దరు పిల్లల కోసం అప్పుడప్పుడు కలుస్తుంటారు. కలసి ఉన్న కాసేపు ఆప్యాయంగా మాట్లాడుకొంటుంటారు. ఇప్పటికీ హృతిక్ గురించి ఎవరన్నా కామెంట్ చేస్తే సుశానే తనకేమీ పట్టనట్లు ఊరుకోదు. అతన్ని వెనకేసుకొని వస్తూ వాదిస్తుంటుంది. ఆమధ్య కంగనా రనౌత్ హృతిక్ గురించి తీవ్ర విమర్శలు చేసినప్పుడు కూడా మాజీ భర్తకు అండగా నిలిచి కంగనాను కడిగేసింది.

స్నేహితుల్లా ఎంతో సన్నిహితంగా మెలిగే వీరిద్దరినీ చూస్తే విడాకుల్ని రద్దు చేసుకొని మళ్లీ ఒకటవుతారేమోననే వార్తలు వినిపిస్తున్నాయి. ఓ ఆంగ్ల దినపత్రిక ఈ విషయాన్ని పేర్కొంది కూడా. 'తిరిగి మళ్లీ కలుసుకోవాలనే అంశాన్ని హృతిక్, సుశానే తీవ్రంగా పరిశీలిస్తున్నారు. కానీ దానికి కొంత టైమ్ పడుతుంది' అని వీరి సన్నిహిత వర్గాలు చెప్పినట్లు ఆ పత్రిక పేర్కొంది.

గురి చూసి కాల్చేయ్!

చేతిలో గన్నుంది. కొంచెం దూరంలో టార్గెట్ కనిపిస్తోంది. కరెక్టుగా గురి చూసి ట్రిగ్గర్ నొక్కడమే తాప్సీ చేయవలసిన పని. ఇంతకీ టార్గెట్ ఎవరు? అంటే... ఎవరూ కాదు. కాంపిటీషన్ (గేమ్)లో డిసైడ్ చేసిన డిస్టెన్స్. ఎందుకంటే... తన తదుపరి హిందీ సినిమాలో తాప్సీ ప్రొఫెషనల్ షూటర్‌గా కనిపించనున్నారు. విభిన్న చిత్రాల దర్శకుడు అనురాగ్ కశ్యప్ నిర్మించనున్న 'వుమనియా'లో తాప్సీ ఈ క్యారెక్టర్ చేయనున్నారు. ఇందులో తాప్సీతో పాటు మరో హీరోయిన్‌కు చోటుంది. ఆమెను త్వరలో ఎంపిక చేసి జూలైలో చిత్రీకరణ ప్రారంభించాలనుకుంటున్నారు. ఈలోపు హీరోయిన్లు ఇద్దరికీ రైఫిల్ షూటింగ్‌లో ట్రయినింగ్ ఇస్తారట. 'బేబి', 'నామ్ షబానా' చిత్రాల్లో తాప్సీ డేరింగ్ అండ్ డాషింగ్ పాత్రలో నటించారు. 'పింక్'తో ఎమోషనల్ క్యారెక్టర్‌లోనూ నటించగలనని నిరూపించుకున్నారు. ఈ 'వుమనియా'లో క్యారెక్టర్ ఆల్ రౌండర్ అనేలా ఉంటుందట. ఇండియాలోని వుమెన్ ప్రొఫెషనల్ షూటర్స్‌కి ట్రిబ్యూట్‌లా ఈ చిత్రం ఉంటుందని చిత్రబృందం తెలిపింది.


తాప్సీ


దీపిక

ముగ్గురిలో ఎవరు?


అలియా
కత్రీనా


ప్రభాస్

దీపికా పదుకోన్, కత్రీనా కైఫ్, అలియా భట్.... ఈ ముగ్గురిలో ప్రభాస్ పక్కన నటించబోయే కథానాయిక ఎవరు? ముంబయ్‌లో ఇప్పుడిదే హాట్ టాపిక్! ప్రస్తుతం ప్రభాస్ ఏం చేస్తున్నారు? సుజిత్ దర్శకత్వంలో యువి క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న 'సాహో'లో హీరోగా నటిస్తున్నారు. దీని తర్వాత హిందీలో ప్రేమకథా చిత్రం చేయనున్న సంగతి తెలిసిందే. ధర్మ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ హిందీ దర్శక-నిర్మాత కరణ్ జోహార్ నిర్మించనున్న ఆ చిత్రంలో కథానాయిక పాత్రకు దీపిక, కత్రీన, అలియా పేర్లు పరిశీలనలో ఉన్నాయట! చిత్రబృందం కన్ను మాత్రం దీపికపై ఉందట! ఒకవేళ దీపిక డేట్లు అడ్జస్ట్ కాకపోతే... కత్రీన, అలియాల్లో ఎవరో ఒకర్ని ఎంపిక చేయాలనే ఆలోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది. "మూడేళ్ల క్రితమే హిందీలో సినిమా చేయడానికి ఒక కథను అంగీకరించా. 'సాహో' తర్వాత ఆ సినిమా చేస్తా" అని ఇటీవల ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రభాస్ పేర్కొన్నారు.


భావన

పెళ్లికి వచ్చేవాళ్లు తక్కువే!

మరో రెండు రోజుల్లో నటి భావన పెళ్లి. ఇండస్ట్రీలో ఎక్కువమందికి ఆహ్వానాలు వెళ్లలేదు. ఆల్రెడీ ఒకసారి పెళ్లి వాయిదా పడింది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే పెళ్లి జరుగుతుందా? లేదా? అనే అనుమానాలు వస్తున్నాయనుకునే వారికి భావన షాకిచ్చింది. ఆమె స్నేహితులు "కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులను మాత్రమే భావన ఆహ్వానించింది. చిత్రపరిశ్రమలో కొందరు వీఐపీలకు ఆహ్వానాలు వెళ్లాయి. త్రిసూర్‌లోని జవహర్‌లాల్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం పెళ్లి జరుగుతుంది. పెళ్లికుమారుడు తల్లి మరణించడంతోనే గతేడాది మార్చిలో నిశ్చితార్థం జరిగినా ఏడడుగులు వేయడానికి ఆలస్యమైంది" అని చెబుతున్నారు. నాలుగేళ్ల క్రితం కన్నడ నిర్మాత నవీన్‌తో భావనకు పరిచయమైంది. నవీన్ నిర్మించిన కన్నడ చిత్రం 'రోమియో'లో భావన హీరోయిన్‌గా నటించారు. ఆ పరిచయం ప్రేమగా మారి, ఇదిగో ఇలా పెళ్లి పీటల వరకూ తీసుకొచ్చింది. మధ్యలో భావనకు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నవీన్ అండగా నిలబడ్డారు.